www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

'కాళేశ్వరం కమిషన్' నివేదిక పరిస్థితి ఏమిటి?

అసెంబ్లీలో ప్రవేశపెట్టిన తర్వాత చర్యలా?

చర్యలు తీసుకున్న తర్వాత అసెంబ్లీలోనా?

హైకోర్టు ప్రశ్న.. నేడు వెల్లడిస్తానన్న ఏజీ

11

నీటిపారుదల గౌరవ సలహాదారుగా రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ హర్పాల్ సింగ్

శుక్రవారం | 22-8-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 145 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, బహుళపక్షం; తిథి: చతుర్దశి ఉ.11.56 తదుపరి అమావాస్య; నక్షత్రం: ఆశ్లేష రా.12.17 తదుపరి మఖ; వర్జ్యం: మ.1.01-2.37; దుర్ముహూర్తం: ఉ.8.33-9.23, మ.12.42-1.32; అమృతఘడియలు: రా.10.40-12.17; రాహుకాలం: ఉ.10.30-12.00; సూర్యోదయం: 6.03; సూర్యాస్తమయం: 6.32 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

బీమాపై ధీమా!

ఆరోగ్య, జీవిత బీమాపై జీఎస్టీ పూర్తిగా మినహాయింపు

జీఎస్టీ కౌన్సిల్‌కు మంత్రుల బృందం సిఫారసు

పాలసీల ప్రీమియం ఒక్కసారిగా 18% తగ్గే చాన్స్

మధ్యతరగతి ప్రజలకు భారీ ఊరట

ఆరోగ్య, టర్మ్ పాలసీలకు పూర్తి ప్రయోజనం

పెట్టుబడుల తరహా సాధారణ, యులిప్ పాలసీల విషయంలో 'రిస్క్' మేరకే మినహాయింపు

జీఎస్టీలో ఇకపై రెండు శ్లాబులే!

ప్రస్తుత 4 పన్ను శ్లాబులను 5%, 18%కు కుదించే ప్రతిపాదనలకు మంత్రుల బృందం ఓకే

జీఎస్టీ కౌన్సిల్ తుది నిర్ణయమే తరువాయి

90 శాతం నిత్యావసరాల ధరలు తగ్గే అవకాశం

దిగిరానున్న గృహోపకరణాలు, వాహనాల ధరలు

దీపావళికల్లా అమల్లోకి తెచ్చేలా కేంద్రం చర్యలు



న్యూఢిల్లీ, ఆగస్టు 21: అడ్డగోలు వైద్య ఖర్చులతో కుటుంబాలు కుదేలవకుండా తక్కువ ప్రీమియంతోనే ఆరోగ్య బీమా అందబోతోంది. అనుకోనిదేదైనా జరిగితే కుటుంబాలు రోడ్డునపడకుండా ఆదుకునే జీవిత బీమాకు అయ్యే వ్యయం తగ్గబోతోంది. ఏళ్ల నుంచీ ఉన్న బీమా ప్రీమియంలపై వస్తుసేవల పన్ను (జీఎస్టీ) మినహాయింపు డిమాండ్ తీరబోతోంది. మధ్య తరగతి జీవితాలకు ఊరట కలగబోతోంది. దేశంలో బీమా ప్రీమియంలపై జీఎస్టీని పూర్తిగా తొలగించాలని జీఎస్టీ హేతుబద్ధీకరణపై ఏర్పాటైన మంత్రుల బృందం తాజాగా సిఫారసు చేసింది. ఇది అమల్లోకి వస్తే దేశంలో ఆరోగ్య, జీవిత బీమా ప్రీమియంలు ఒక్కసారిగా 18శాతం వరకు తగ్గేందుకు అవకాశముంది. దీనికి తోడు జీఎస్టీ నుంచి పేద, మధ్యతరగతి వర్గాలకు ఉపశమనం లభించేదిశగా మరో ముందడుగు పడింది. జీఎస్టీ నాలుగు పన్ను రేట్లను రెండు శ్లాబుల (5%, 18%)కు కుదించే ప్రతిపాదనలను మంత్రుల బృందం ఆమోదించింది. దీనిపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో కూడిన జీఎస్టీ కౌన్సిల్ తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. వచ్చే నెలలో జీఎస్టీ కౌన్సిల్ సమావేశం జరగనుంది. పన్ను రేట్ల హేతుబద్ధీకరణ, బీమా ప్రీమియంలపై పన్ను మినహాయింపు ప్రతిపాదనలపై చర్చించి.. అవసరమైన మార్పు చేర్పులు చేసి, ఆమోదించనుంది. దీపావళికి ప్రత్యేక బహుమతి ఇస్తానన్న ప్రధాని మోదీ ప్రకటనకు అనుగుణంగా.. ఆలోగానే ఈ మార్పులన్నీ అమల్లోకి తీసుకువచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం కసరత్తు ముమ్మరం చేసింది. దేశంలో సాధారణ ప్రజలపై పన్ను భారం తగ్గించడం, జీఎస్టీ పన్ను రేట్ల హేతుబద్ధీకరణ చేపట్టనున్నట్టు ప్రధాని మోదీ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రకటించిన విషయం

మిగతా 2వ పేజీలో...

రాష్ట్రాల రాబడి తగ్గకుండా చూడాలి

13

వాటాకు తగినట్టు దక్షిణాది రాష్ట్రాలకు నిధులివ్వాలి

ఢిల్లీలో మంత్రుల బృందం భేటీలో ఉప ముఖ్యమంత్రి భట్టి

యంగ్ ఇండియా స్కూళ్లకు ఆర్థిక సాయం.. నిర్మలకు విజ్ఞప్తి

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్



కోర్టులు చేతులు కట్టుకుని కూర్చోవాలా?

గవర్నర్లు బిల్లుల్ని నిరవధికంగా నిలిపివేస్తే చట్టసభలు నిర్వీర్యమవుతాయి

రాజ్యాంగ విధులు నిర్వర్తించాల్సిన వారు ఆ పని చేయనప్పుడు మేం జోక్యం చేస్కోవద్దా?

సొలిసిటర్ జనరల్‌ను నిలదీసిన సీజేఐ

బిల్లుల ఆమోదానికి గవర్నర్‌కు, రాష్ట్రపతికి రాజ్యాంగంలో కాలపరిమితి లేదు: ఎస్‌జీ

అయితే తప్పు జరిగినప్పుడు దిద్దుబాటు ఉండాల్సిందేనని సీజేఐ స్పష్టీకరణ

తదుపరి విచారణ 26వ తేదీకి వాయిదా

న్యూఢిల్లీ, ఆగస్టు 21: అసెంబ్లీ ఆమోదించి పంపిన బిల్లులను ఆమోదించకుండా గవర్నర్లు నిరవధికంగా నిలిపివేస్తే చట్టసభలు నిర్వీర్యమైపోతాయని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ స్పష్టంచేశారు. ఆ పరిస్థితుల్లో జోక్యం చేసుకునే అధికారం కోర్టుకు ఉండదా అని ప్రశ్నించారు. రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు తమ విధులు నిర్వర్తించకపోతే న్యాయస్థానాలు చేతులు కట్టుకుని కూర్చోవాలా అని కేంద్రం తరఫు సీనియర్ న్యాయవాది, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను నిలదీశారు. బిల్లుల ఆమోదానికి రాష్ట్రపతి, గవర్నర్లకు నిర్దిష్ట కాలవ్యవధిని సుప్రీంకోర్టు నిర్దేశించవచ్చా అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాజ్యాంగంలోని 143(1) అధికరణ కింద సర్వోన్నత న్యాయస్థానం

మిగతా 2వ పేజీలో...



ఆరు అంశాల ఆధారంగా ఫీజులు

ప్రైవేటు ఇంజనీరింగ్, వృత్తివిద్యా కాలేజీల్లో ఫీజుల నిర్ధారణకు కొత్త నిబంధనలు

బోధనలో నాణ్యత, ప్రాంగణ నియామకాలు, ఫీజుల్లో పారదర్శకత

పరిశోధనలకు ప్రోత్సాహం

జాతీయ, అంతర్జాతీయ ర్యాంకుల్లో సత్తా

రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల అమలు

ఫీజులను సవరించే అధికారం ఎఫ్‌ఆర్‌సీకి

25 నుంచి ఫీజుల పెంపు దరఖాస్తులు

హైదరాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): "ఇంజనీరింగ్ కాలేజీలంటే నాలుగేళ్లు బోధించి, పట్టాలు ఇవ్వడానికే పరిమితం కాకూడదు. కొలువులు దక్కేలా విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచాలి"... ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యాశాఖ ఉన్నతాధికారులతో నిర్వహించే ప్రతి సమీక్షలో చెప్పే మాటలివి. విద్యా శాఖ బాధ్యతలు కూడా నిర్వర్తిస్తున్న సీఎం సూచనల మేరకు.. అధికారులు మూడు నెలలుగా కసరత్తులు చేశారు. ఇంజనీరింగ్ కాలేజీల్లో ఫీజుల ఖరారుకు కొత్త మార్గదర్శకాలను సిద్ధం చేశారు. మూడేళ్లకోసారి ప్రైవేటు ఇంజనీరింగ్, వృత్తి విద్య కాలేజీల్లో ఫీజులను ప్రభుత్వం నిర్ణయిస్తుంది. ఈ ఏడాది

మిగతా 13వ పేజీలో...

ప్రశ్నించడమే తప్పన్నట్టుగా.. నాపై కక్ష గట్టారు



గతంలో నా లేఖను బయటపెట్టిన కుట్రదారులే వివిధ రూపాల్లో నన్ను వేధింపులకు గురి చేస్తున్నారు

రాజకీయ కారణాలతోనే టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షుడిగా కొప్పుల ఈశ్వర్ నియామకం

కార్మిక చట్టాలకు విరుద్ధంగా పార్టీ ఆఫీసులో ఎన్నిక

కార్మికుల సంక్షేమానికి పోరాడుతున్న నాపై కుట్రలు

పదవి ఉన్నా.. లేకున్నా.. కార్మికుల వెంటే ఉంటా

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బహిరంగ లేఖ

గోదావరిఖని/హైదరాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్‌లో జరుగుతున్న వ్యవహారాలను ప్రశ్నించడమే తప్పు అన్నట్టుగా తనపై కక్ష గట్టారని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ఆడబిడ్డగా పార్టీ మంచి కోరి రాసిన లేఖలను లీక్ చేసిన కుట్ర దారులెవరో బయట పెట్టాలని కోరినందుకు.. ఆ కుట్రదారులే వివిధ రూపాల్లో తనను వేధింపులకు గురి చేస్తున్నారని విమర్శించారు. టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలిగా కొనసాగుతున్న కవితను తొలగించి కొప్పుల ఈశ్వర్‌ను నియమించడంపై ఆమె స్పందించారు. గురువారం సింగరేణి కార్మికవర్గానికి అమెరికా నుంచి బహిరంగ లేఖ రాశారు. కార్మిక చట్టాలకు విరుద్ధంగా పార్టీ కార్యాలయంలో ఈ ఎన్నిక నిర్వహించడం సాంకేతికంగా తప్పా, ఒప్పా అనే విషయాన్ని పక్కన పెడితే రాజకీయ కారణాలతోనే ఈ ఎన్నిక జరిగినట్టుగా

మిగతా 13వ పేజీలో...



మహబూబాబాద్ జిల్లా మరిపెడ హైవేపై రైతుల ఆందోళన

ఎరువు దొరికేదెప్పుడు?

కొనసాగుతున్న రైతుల అవస్థలు

భారీగా లైన్లు.. తోపులాటలు

3

ఆగ్రహంతో ఎరువుల కేంద్రాల సిబ్బందిపై తిరగబడుతున్న వైనం

రోడ్లపై ధర్నాలు.. రాస్తారోకోలు

కేంద్రం మెడలు వంచైనా తీసుకొస్తాం



చైనా నుంచి యూరియాను తెప్పించడంలో కేంద్రం పూర్తిగా విఫలం

అంతర్జాతీయ పరిస్థితుల గురించి చెప్పకుండా గందరగోళం సృష్టిస్తోంది

దేశవ్యాప్తంగా యూరియా సమస్యలు

రాష్ట్ర ప్రభుత్వాన్ని బీజేపీ బద్నాం చేస్తోంది

ఆందోళనల వెనక రాజకీయ పార్టీలు

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల

హైదరాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సాగుకు సరిపడా యూరియా కేటాయించాలని వానాకాలం సీజన్ మొదలైనప్పటి నుంచి లేఖలు రాస్తున్నా, ఢిల్లీ వెళ్లి విజ్ఞప్తులు చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అరకొరగానే యూరియాను సరఫరా చేస్తోందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. అయితే కేంద్రం మెడలు వంచైనా సరే... రాష్ట్రానికి యూరియా తీసుకొస్తామన్నారు. హైదరాబాద్‌లో గురువారం ఆయన మీడియాతో

మిగతా 3వ పేజీలో...

ఇంట్లో ఐదుగురి అనుమానాస్పద మృతి

హైదరాబాద్‌లోని మియాపూర్‌లో దారుణం

దంపతులు, కొడుకు, కూతురు, అల్లుడు, మనుమడు దుర్మరణం

పడుకున్న చోటే మృతి.. భోజనంలో విషం కలిపారంటూ ప్రచారం

సామూహికంగా ఆత్మహత్యలు చేసుకున్నారంటూ మరో వాదన

ఆస్తి పరమైన తగాదాలే ఘటనకు కారణమా?.. పోలీసుల దర్యాప్తు



దంపతులు లక్షప్ప, వెంకటమ్మ (ఫైల్)

మియాపూర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఆ ఇంట్లో ఉంటున్న ఐదుగురు రాత్రి భోజనం చేసి పడుకున్నారు. తెల్లారి చూసేసరికి పడుకున్నవారు పడుకున్నచోటే ప్రాణాలు విడిచారు. మియాపూర్‌లో జరిగిన ఈ ఘటన స్థానికులను ఉలిక్కిపడేలా చేసింది. భోజనంలో ఎవరైనా విషం కలిపారా? లేదంటే అంతా కలిసి ఆత్మహత్య చేసుకున్నారా? అనేది సస్పెన్స్‌గా మారింది. మృతుల్లో రెండేళ్ల బాబు ఉన్నాడు. మృతుల స్వస్థలం కర్ణాటక. లక్షప్ప (60), వెంకటమ్మ (55) అనే దంపతులకు కూతుళ్లు లక్ష్మి, కవిత, సవిత, కుమారుడు భగవత్ (25) ఉన్నారు. కూతుళ్లకు పెళ్లిళ్లయ్యాయి. కుమారుడికి కాలేదు. వీరంతా ఏడాది క్రితం మియాపూర్‌లోని మక్తా మహబూబ్‌పేటకొచ్చి నివసిస్తున్నారు. లక్షప్ప, వెంకటమ్మ, వారి రెండో కూతురు కవిత, అల్లుడు అనిల్, మనుమడు యువాన్ష్ (2) కలిసి

మిగతా 14వ పేజీలో...

తాతను ఏం 'మాయ' చేశావే!

81 ఏళ్ల వృద్ధుడిపై వలపువల

రూ.7.11 లక్షల చోరీ

14

హైదరాబాద్‌లో ఘటన

ఆరోగ్య శాఖలో మళ్లీ కొలువుల జాతర

1623 స్పెషలిస్టు డాక్టర్ పోస్టుల భర్తీకి నేడు నోటిఫికేషన్

వైద్యుల భర్తీ ప్రక్రియలో రాష్ట్ర చరిత్రలోనే అతిపెద్దది

11

కేటీఆర్‌ను మద్దతు ఎవరడిగారు?



ఆయన మద్దతు మాకు అవసరం లేదు

కేంద్రంలో ఉన్నాడా? రాష్ట్రంలో ఉన్నాడా?

చిన్నపిల్లల ఆటలా వ్యవహరించవద్దు

రైతుల పట్ల ఆయన ఒక్కరికే ప్రేమ ఉందా?

ఉప రాష్ట్రపతి ఎన్నిక అంశంపై కిషన్‌రెడ్డి

దేశంలో యూరియా విషయంలో కొంత ఇబ్బందులున్నాయి.. సహకరించాలి

రాష్ట్ర ప్రభుత్వం వద్ద యూరియా స్టాక్ పెట్టాం.. అదేమైందో తెలియదని వ్యాఖ్య

జస్టిస్ సుదర్శన్‌రెడ్డి నామినేషన్ దాఖలు

వెంట వచ్చిన సోనియా, రాహుల్, పవార్

ఎన్డీఏ అభ్యర్థికే మద్దతు: వైసీపీ నేత బొత్స

న్యూఢిల్లీ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థికి మద్దతివ్వాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఎవరడిగారని కేంద్ర బొగ్గు, గనుల మంత్రి కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. తమకు కేటీఆర్ మద్దతు అవసరం లేదని వ్యాఖ్యానించారు. రైతుల పట్ల కేటీఆర్‌కే ప్రేమ ఉన్నట్టుగా మాట్లాడుతున్నారని విమర్శించారు. గురువారం ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రానికి యూరియా తెచ్చిన పార్టీ

మిగతా 13వ పేజీలో...



హైటెక్ ట్రాఫిక్ పోలీస్!

మైక్రో ఫోన్, డ్యాష్ బోర్డు కెమెరా, జీపీఎస్ ట్రాకర్‌తో పెట్రోలింగ్

బైక్ దిగకుండానే ఉల్లంఘనలను రికార్డు చేసి చలానాలు

11

హైదరాబాద్‌లో వినూత్న ప్రయోగం

50 బైక్‌లను ప్రారంభించిన సీపీ

హైదరాబాద్ పరిధిలో.. 100 మంది ట్రాఫిక్ మార్షల్స్

రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణే వారి పని

శిక్షణ ఇచ్చి విధుల్లోకి

11

సీఎస్ఆర్‌లో భాగంగా జీతం ఇవ్వనున్న కార్పొరేట్ సంస్థలు

కేంద్రంలో మూడోసారి ప్రధానిగా గెలిచిన మోదీ.. ప్రజలకు మంచి చేయడానికి అధికారంలోకి వచ్చారో, లేక మైనారిటీ ప్రజలకు వ్యతిరేకంగా కుట్రలు, కుతంత్రాలు పన్నేందుకు వచ్చారో అర్థం కావడం లేదు.

- విజయ్



మా సైద్ధాంతిక శత్రువు బీజేపీ

ఏకైక రాజకీయ శత్రువు డీఎంకే.. ఈ రెండు పార్టీలను తరిమికొట్టడమే లక్ష్యం



స్టాలిన్.. వెరీ వెరీ వరస్ట్ అంకుల్

అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ

ఏ పార్టీతోనూ పొత్తులు ఉండవు

రాజకీయాల్లో తేల్చుకునేందుకే వచ్చా

మదురై సభలో టీవీకే అధినేత విజయ్

నీట్ పరీక్షలు రద్దు చేయాలని డిమాండ్

సభకు భారీఎత్తున వచ్చిన ప్రజానీకం

చెన్నై, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): తమ సైద్ధాంతిక శత్రువు బీజేపీ అని, ఏకైక రాజకీయ శత్రువు డీఎంకే అని 'తమిళగ వెట్రి కళగం'(టీవీకే) అధినేత, సినీనటుడు విజయ్ ప్రకటించారు. వచ్చే ఏడాది జరిగే తమిళనాడు శాసనసభ ఎన్నికల్లో ఈ రెండు పార్టీలను తరిమికొట్టడమే తన ప్రధాన లక్ష్యంగా పేర్కొన్నారు. గురువారం మదురై సమీపంలో జరిగిన పార్టీ ద్వితీయ మహానాడుకు భారీగా తరలివచ్చిన జనసందోహాన్ని ఉద్దేశించి

మిగతా 2వ పేజీలో...

మహిళల ఓట్లకు ఎసరు?

ఊరి నుంచి శాశ్వతంగా వెళ్లిపోయిన క్యాటగిరీలో భారీగా మహిళల ఓట్ల తొలగింపు

- వలస రాష్ట్రంలో ఓటరుగా నమోదయ్యారో లేదో చూడకుండా ఊళ్లో ఓటుకు ఎసరు
- బిహార్ ఓటర్ల జాబితా ప్రక్షాళనలో జరిగిందిదే

న్యూఢిల్లీ, ఆగస్టు 21: బిహార్‌లో ఇటీవల ఎన్నికల సంఘం నిర్వహించిన ఓటర్ల జాబితా ప్రత్యేక పరిశీలన కార్యక్రమం(ఎస్ఐఆర్)లో చిరునామా నుంచి శాశ్వతంగా వెళ్లిపోయిన విభాగంలో పురుషుల ఓట్ల కన్నా మహిళల ఓట్లను ఎక్కువగా తొలగించినట్లు తేలింది. 40 ఏళ్లకన్నా తక్కువ వయసు ఓటర్లలో ఈ పరిస్థితి ఉందని హిందూ పత్రిక నిర్వహించిన అధ్యయనంలో వెల్లడైంది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎస్ఐఆర్ ద్వారా తొలగించిన 65 లక్షల ఓటర్ల వివరాలను, కారణాలను ఎన్నికల సంఘం ప్రజలకు అందుబాటులో ఉంచింది. అత్యధికంగా ఓట్ల తొలగింపు జరిగిన తొమ్మిది నియోజకవర్గాల వివరాలను అధ్యయనం చేసిన హిందూ పత్రిక పలు సంచలన విషయాలను వెల్లడించింది. ఈ ఏడాది జనవరి 1న సిద్ధం చేసిన ఓటర్ల జాబితా నుంచే కొత్తగా ఏడు లక్షల మహిళల ఓట్లను తొలగించినట్లు తెలిపింది. 18-39 మధ్య వయస్సులో చిరునామా నుంచి శాశ్వతంగా వెళ్లిపోయిన విభాగంలో పురుషుల కన్నా మహిళలను 2-3 రెట్లు ఎక్కువ మందిని తొలగించారు. ఇలా తొలగించిన వారు మొత్తం మీద మహిళలు 62.6 శాతం ఉంటే, పురుషులు 37.4 శాతం ఉన్నారు. ఇంత భారీ సంఖ్యలో మహిళల తొలగింపులు ఉన్నాయంటే వివాహం అయి, వేరే రాష్ట్రాలకు వెళ్లిన మహిళలను తొలగించి ఉంటారని భావిస్తున్నారు. కనిపించలేదు, మరణించారు, ఇతర ప్రాంతాల్లో ఓటరుగా నమోదయ్యారు అనే కారణాలతో తొలగించిన విషయంలో మహిళలు, పురుషుల మధ్య గణాంకాల్లో భారీ తేడా లేదు. అక్షరాస్యత తక్కువగా ఉండటం వల్ల మహిళలు ఎన్యూమరేషన్ ఫారాలు నింపకపోవడం వల్ల ఇలా జరిగిందని కూడా చెప్పడానికి లేదు. అక్షరాస్యత అధికంగా ఉన్న ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

పురుషుల ఓట్లను ఎప్పుడో తొలగించారా?

2011 జనాభా లెక్కల ప్రకారం చూస్తే 38.5 లక్షల మంది పురుషులు, 36.02 లక్షల మంది మహిళలు వివాహం, ఉపాధి, కుటుంబం ఇతర కారణాలతో బిహార్ విడిచి ఇతర రాష్ట్రాలకు వెళ్లారు. స్త్రీ పురుషుల వలస విషయంలో అంతరం 14 ఏళ్లలో మరింత పెరిగి ఉండాలి. కానీ, మహిళల పేర్లే ఎక్కువగా చిరునామా నుంచి శాశ్వతంగా వెళ్లిపోయిన జాబితాలో ఉన్నాయి. ఎస్ఐఆర్ గణాంకాలు నిజమని నమ్మితే ఇతర రాష్ట్రాలకు తరలిపోయిన బిహారీ పురుష ఓటర్లను గతంలోనే భారీ ఎత్తున తొలగించి ఉంటారని, మహిళలను ఇప్పుడు తొలగించి ఉంటారని భావించాల్సి వస్తుంది. వాళ్లు ఇతర రాష్ట్రాల్లో ఓట్లు పొందారో లేదో చూడకుండా ఓట్లు తొలగించి ఉండటం ఎంతవరకు సమంజసం అనే ప్రశ్న కూడా ఉద్భవిస్తుంది.

లోకం తీరు



ఐదేళ్లలో భారత్-రష్యా వాణిజ్యం
రూ.8.72 లక్షల కోట్లకు పెంపు

- ద్వైపాక్షిక సమావేశంలో ఇరు దేశాల నిర్ణయం

మాస్కో, ఆగస్టు 21: అమెరికా సుంకాల నేపథ్యంలో భారత్-రష్యా కీలక నిర్ణయం తీసుకున్నాయి. రానున్న ఐదేళ్లలో ఇరు దేశాల మధ్య వాణిజ్యాన్ని రూ.8.72 లక్షల కోట్ల(100 బిలియన్ డాలర్లు)కు పెంచాలని నిర్ణయించాయి. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య జరుగుతున్న వాణిజ్య విలువతో పోలిస్తే.. ఇది 50% ఎక్కువ అని భారత విదేశాంగశాఖ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం భారత్‌కు రష్యా 4వ అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉంది. రష్యాకు భారత్ రెండో అతిపెద్ద వాణిజ్య భాగస్వామి. బ్రిక్స్ దేశాలపై అమెరికా సుంకాల నేపథ్యంలో భారత విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ రష్యాలో మూడ్రోజుల పాటు పర్యటిస్తున్న విషయం తెలిసిందే..! ఈ సందర్భంగా మాస్కోలో జరిగిన 'భారత్-రష్యా బిజినెస్ ఫోరం'లో, గురువారం రష్యా అధ్యక్షుడు పుతిన్, ఆ దేశ విదేశాంగ మంత్రి సెర్గే లావ్రోవ్‌లతో వేర్వేరుగా జరిగిన ద్వైపాక్షిక సమావేశాల సందర్భంగా జైశంకర్ మాట్లాడారు. ప్రస్తుతం సంక్లిష్టంగా మారిన భౌగోళిక రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో 'పరస్పరం ఆధారపడిన సుస్థిర భాగస్వాముల' అవసరం ఏర్పడిందన్నారు. అమెరికాను.. ట్రంప్ సుంకాలను నేరుగా ప్రస్తావించకుండా.. "ఈ పరిస్థితులను అధిగమించేందుకు మన(బ్రిక్స్ దేశాల) నాయకులు నిత్యం చర్చలు జరపాలి. మన మధ్య సుంకాల భారం తగ్గాలి" అని అభిప్రాయపడ్డారు.

చైనా మార్కెట్లలో భారత్‌కు స్వాగతం

- భారత్‌పై ట్రంప్ 50% సుంకాలు దారుణం
- చైనా రాయబారి ఫేయ్‌హోంగ్ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, ఆగస్టు 21: ట్రంప్ సుంకాల నేపథ్యంలో భారత్‌కు చైనా అండగా నిలిచింది. ఇప్పటికే వాణిజ్యాన్ని రెట్టింపు చేయాలని భారత్-రష్యా నిర్ణయించగా.. ఇప్పుడు చైనా కూడా తమ మార్కెట్లలోకి భారత్‌కు స్వాగతం పలికింది. భారత్‌లోని చైనా రాయబారి షూ ఫేయ్‌హోంగ్ ఈ విషయాన్ని వెల్లడించారు. గురువారం న్యూఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఫేయ్‌హోంగ్.. భారత్‌పై అమెరికా 50% సుంకాలను విధించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ సుంకాలు దారుణమన్నారు. "భారత్-చైనా ఇప్పుడు పరస్పర అనుమానాస్పద ధోరణిని వీడి.. వ్యూహాత్మక విశ్వాసాన్ని నెలకొల్పాలి. అభివృద్ధి వ్యూహాలను పెపొందించుకోవాలి. ఇరుదేశాలు శత్రువుల్లా కాకుండా.. భాగస్వాముల్లా పనిచేయాలి. ఇరుదేశాల మధ్య ఉన్న వివాదాలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలి" అని ఆయన వ్యాఖ్యానించారు. భారత్‌లో ఉత్పత్తి అయ్యే నిత్యావసరాల కోసం చైనా మార్కెట్ల తలుపులను తెరుస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ప్రధాని మోదీ చైనా పర్యటన గురించి విలేకరులు ప్రస్తావించగా.. షాంఘై సహకార సంస్థ(ఎస్‌సీవో) శిఖరాగ్ర సమావేశం నేపథ్యంలో మోదీ పర్యటనకు తాము ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. ఆసియాలోనే చైనా, భారత్ డబుల్ ఇంజన్ ఆర్థిక వ్యవస్థలుగా ఉన్నాయని, ఇరు దేశాల ఐక్యత ప్రపంచానికి లబ్ధి చేకూరుస్తుందన్నారు.

ఇజ్రాయెల్‌తో సంబంధాలు తెంచుకోవాలి

- అమెరికాలో మైక్రోసాఫ్ట్ ప్రధాన కార్యాలయం వద్ద నిరసనలు

వాషింగ్టన్, ఆగస్టు 21: అమెరికా వాషింగ్టన్‌లోని రెడ్‌మండ్ మైక్రోసాఫ్ట్ ప్రధాన కార్యాలయం ప్రాంగణంలో పాలస్తీనీయన్లకు మద్దతుగా నిరసనకు దిగిన ఆ కంపెనీకి చెందిన 18 మంది ఉద్యోగులను పోలీసులు అరెస్టు చేశారు. మైక్రోసాఫ్ట్ రూపొందించిన సాంకేతికతను వాడుకొనే గాజాలో ఇజ్రాయెల్ మారణహోమానికి పాల్పడుతోందంటూ 35మందితో కూడిన బృందం రెండు రోజులుగా ఈ ఆందోళనలు చేపట్టింది. ఇజ్రాయెల్‌తో మైక్రోసాఫ్ట్ వ్యాపార సంబంధాలు తెంచుకోవాలని డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలోనే కంపెనీ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. అక్కడికి చేరుకున్న పోలీసులు వారిని వెళ్లిపోవాలని సూచించినా వెనక్కి తగ్గలేదు. మైక్రోసాఫ్ట్ బోర్డుపై రంగులు పూసి నినాదాలతో హోరెత్తించారు. దీంతో 18 మంది ఉద్యోగులను పలు అభియోగాల కింద పోలీసులు అరెస్టు చేశారు.

ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడి

- 574 డ్రోన్లు, 40 క్షిపణులతో దాడి.. ఒకరి మృతి

కీవ్, మాస్కో, ఆగస్టు 21: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్యవర్తిత్వంలో శాంతి చర్చలకు యత్నాలు కొనసాగుతున్న వేళ రష్యా ఉక్రెయిన్‌పై భీకర దాడి చేసింది. 574 డ్రోన్లు, 40 క్షిపణులతో భారీ స్థాయిలో విరుచుకుపడింది. ఉక్రెయిన్ పశ్చిమ ప్రాంతంలోని ల్వీవ్ నగరంతో సహా పలు చోట్ల జరిపిన ఈ దాడిలో ఒకరు మృతి చెందగా, 22 మందికి గాయాలయ్యాయి. 26 భవనాలు దెబ్బతిన్నాయి. పౌరులే లక్ష్యంగా రష్యా ఈ దాడులు జరిపిందని ఉక్రెయిన్ ఆరోపించింది.

చైనాను ఎదుర్కోవాలంటే భారత్ లాంటి మిత్రుడు ఉండాలి: నిక్కీ హేలీ

న్యూఢిల్లీ, ఆగస్టు 21: చైనాను ఎదుర్కోవాలంటే అమెరికాకు భారత్ వంటి ఒక మిత్రుడు తప్పనిసరిగా ఉండాలని అమెరికా మాజీ దౌత్యవేత్త నిక్కీ హేలీ స్పష్టం చేశారు. 2024 అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష రేసులో ట్రంప్‌పై పోటీ చేసిన ఆమె ఈ మేరకు తాజాగా రాసిన ఆర్టికల్ బుధవారం ఒక ఆంగ్ల మేగజైన్‌లో ప్రచురితమైంది. భారత్‌తో సంబంధాల విషయంలో తిరోగమన వైఖరిని వీడాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను ఆమె కోరారు. ఆసియాలో చైనా ఆధిపత్యానికి అడ్డుకట్ట వేయగల ఏకైక దేశంతో వాణిజ్య వివాదాలు పెట్టుకోవడం వ్యూహాత్మక తప్పిదం అవుతుందని తేల్చిచెప్పారు. భారత్ చేస్తున్న చమురు కొనుగోళ్లు ఉక్రెయిన్‌పై రష్యా దాడికి నిధులు సమకూరుస్తున్నాయనే ట్రంప్ వాదనను ఆమె సమర్థించారు. అయితే, భారత్‌ను విలువైన స్వేచ్ఛాయుత, ప్రజాస్వామిక భాగస్వామిగా మాత్రమే పరిగణించాలని, చైనాలాంటి శత్రువుగా భారత్‌ను పరిగణించకూడదని ఆమె సూచించారు.

సైబర్ నేరాల్లో సీబీఐ దర్యాప్తునకు రాష్ట్రాల అనుమతి అవసరం లేదు!

- కేంద్రానికి పార్లమెంటరీ స్థాయీసంఘం సిఫారసు

న్యూఢిల్లీ, ఆగస్టు 21: సైబర్ నేరాల్లో సీబీఐ దర్యాప్తునకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వాల సమ్మతి అవసరం లేకుండా, 'ఢిల్లీ ప్రత్యేక పోలీసు చట్టం, 1946'ను సవరించాలని (ఈ చట్టం ప్రకారమే సీబీఐ ఏర్పాటైంది) హోంశాఖ వ్యవహారాలపై ఏర్పాటైన స్థాయీ సంఘం కేంద్రప్రభుత్వానికి సిఫారసు చేసింది. సంబంధిత నివేదికను బుధవారం పార్లమెంటు ఉభయ సభల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టింది. విచారణలో భాగంగా తమకు సీబీఐ సమర్పించిన వాదనలను స్థాయీసంఘం తన నివేదికలో ఉటంకించింది. సైబర్ నేరాల్లో దర్యాప్తు ప్రారంభించినప్పుడు వెలుగులోకి వచ్చే ప్రాథమిక సాక్ష్యాధారాలపై లోతైన పరిశోధన జరపాల్సి వచ్చినప్పుడు.. రాష్ట్రాల అనుమతి తీసుకోవటం, వేర్వేరు రాష్ట్రాల్లో వేర్వేరు నిబంధనలు, చట్టాలు ఉండటం దర్యాప్తునకు తీవ్ర అవరోధంగా నిలుస్తున్నాయని సీబీఐ పేర్కొంది. ప్రస్తుతం దేశంలో సీబీఐ దర్యాప్తునకు 8 రాష్ట్రాలు అనుమతి నిరాకరించాయని, అందుకు కారణాలేమిటో ఆయా రాష్ట్రాలను సంప్రదించి తెలుసుకోవాలని కేంద్రానికి స్థాయీసంఘం సూచించింది. ఓవైపు ఈ సూచన చేస్తూనే.. మరోవైపు, రాష్ట్రాల అనుమతి ప్రసక్తే లేకుండా సంబంధిత చట్టాన్ని సవరించాలని సిఫార్సు చేసింది.

బీమాపై ధీమా!

(మొదటి పేజీ తరువాయి)



తెలిసిందే. దీనికి సంబంధించి బిహార్ ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి కన్వీనర్‌గా ఏర్పాటు చేసిన ఆరుగురు మంత్రుల బృందం పలు ప్రతిపాదనలను పరిశీలించి, ఆమోదించింది. ప్రస్తుతం జీఎస్టీలో 5%, 12%, 18%, 28% శ్లాబులు ఉండగా.. ఇందులో 12%, 28% శ్లాబులను పూర్తిగా ఎత్తివేసి, వాటి పరిధిలో ఉన్న వస్తుసేవలను 5%, 18% పన్ను రేట్లలోకి సర్దుబాటు చేయనున్నారు. ఇక కొన్నిరకాల విలాసవంతమైన, హానికరమైన వస్తువులపై 40శాతం ప్రత్యేక పన్నును వసూలు చేస్తారు.

బీమా పాలసీలపై పూర్తిగా పన్ను ఎత్తివేత..!

జీఎస్టీ శ్లాబులను రెండుకు కుదించే కేంద్ర ప్రతిపాదనలను మంత్రుల బృందం ఆమోదించిందని సామ్రాట్ చౌదరి వెల్లడించారు. వ్యక్తిగత ఆరోగ్య బీమా, జీవిత బీమా పాలసీలపై జీఎస్టీని పూర్తిగా మినహాయించాలని జీఎస్టీ కౌన్సిల్‌కు సిఫార్సు చేశామని తెలిపారు. దీనిపై జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. ప్రస్తుతం ఆరోగ్య, జీవిత బీమా పాలసీల ప్రీమియంపై 18శాతం జీఎస్టీ వసూలు చేస్తున్నారు. దీనిని పూర్తిగా ఎత్తివేస్తే పాలసీల ప్రీమియం ఖర్చు ఒక్కసారిగా దిగివస్తుందని, మధ్యతరగతి వర్గాలకు ఆరోగ్య భద్రత, ఆర్థిక భద్రత కలుగుతాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఇక విలాసవంతమైన కార్లు, సిగరెట్లు వంటి హానికర ఉత్పత్తులను 40శాతం పన్ను రేటులో చేర్చాలని ప్రతిపాదించినట్టు యూపీ ఆర్థిక మంత్రి సురేశ్‌కుమార్ ఖన్నా తెలిపారు. పన్ను రేట్లలో మార్పుల వల్ల రాష్ట్రాలకు ఆదాయం తగ్గిపోయి, తిరిగి ప్రజల సంక్షేమంపై ప్రభావం పడుతుందని.. తగ్గే ఆదాయాన్ని కేంద్రం భర్తీ చేయాలని కోరుతున్నామని బెంగాల్ ఆర్థిక మంత్రి చంద్రిమ భట్టాచార్య వెల్లడించారు.

90శాతం నిత్యావసరాలు చవక!

ప్రస్తుతం 12శాతం శ్లాబులో ఉన్న నిత్యావసరాల్లో 90శాతానికిపైగా 5శాతం పన్నురేటుకు మారుతాయని, దీనితో నిత్యావసరాల ధరలు తగ్గుతాయని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం 28శాతం శ్లాబులో ఉన్న గృహోపకరణాలు, వాహనాల్లో చాలా వరకు 18శాతం పన్ను రేటుకు మారుతాయని, దీనితో వాటి ధరలూ తగ్గే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.

బీమాపై జీఎస్టీ మినహాయింపుతో ప్రయోజనమెంత?

ప్రస్తుతం బీమా పాలసీల ప్రీమియంపై 18శాతం జీఎస్టీ ఉంది. బీమా కంపెనీలు ఈ పన్ను మొత్తాన్ని కలిపి ప్రీమియం చార్జీలను నిర్ధారించి, వసూలు చేస్తున్నాయి. ఇప్పుడు జీఎస్టీ మినహాయిస్తే.. ఆ మేరకు ప్రీమియం చార్జీలను తగ్గించాల్సి ఉంటుంది. ఉదాహరణకు రూ.ఐదు లక్షల ఆరోగ్య బీమా పాలసీకి ఏడాది ప్రీమియం రూ.20 వేలు అయితే.. కంపెనీలు జీఎస్టీ కలిపి రూ.23,600 వినియోగదారు నుంచి వసూలు చేస్తాయి. రూ.3,600 జీఎస్టీని ప్రభుత్వానికి జమ చేస్తాయి. ఇప్పుడు జీఎస్టీని పూర్తిగా మినహాయిస్తే.. వినియోగదారుల నుంచి రూ.20 వేలు ప్రీమియం మాత్రమే వసూలు చేయాల్సి ఉంటుంది. అయితే బీమా కంపెనీలు పన్ను మినహాయింపు మొత్తాన్ని వినియోగదారులకు అందిస్తాయా? లేక ఏదో ఒక అదనపు సేవ అనో, బీమా మొత్తాన్ని పెంచుతామనో చెప్పి ప్రీమియం తగ్గించుకుండా ఉంటాయా? అన్న సందేహాలు నెలకొన్నాయని పన్నుల నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే బీమా కంపెనీలు పన్ను మినహాయింపు మొత్తాన్ని తప్పనిసరిగా వినియోగదారులకు బదలాయించేలా కేంద్ర ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే విజ్ఞప్తి చేశాయి. కాగా, ఎల్ఐసీలోని ఎండోమెంట్, యాన్యుటీ, పెన్షన్‌తో కూడిన బీమా పథకాలకు జీఎస్టీ రేట్లు విడిగా, వేర్వేరుగా (4.5%, 2.5%, 1.8%) ఉన్నాయి. వాటి విషయంలో ఎలా వ్యవహరించాలన్నది జీఎస్టీ కౌన్సిల్ చర్చించి నిర్ణయం తీసుకుంటుంది.

సాధారణ పాలసీలకు మినహాయింపు ఉండదా?

మరోవైపు ఆరోగ్య బీమా, టెర్మ్ పాలసీల (కట్టిన సొమ్మును తిరిగివ్వకుండా, తక్కువ ప్రీమియంతోనే అత్యధిక బీమా కల్పించే పాలసీల)కు మాత్రమే మినహాయింపును వర్తింపజేయవచ్చని.. పెట్టుబడుల తరహాలో చేసే సాధారణ జీవిత బీమా, యూలిప్‌ల వంటి పాలసీలకు వర్తింపజేయకపోవచ్చని పన్నుల నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఒకవేళ వర్తింపజేసినా.. ఆ పాలసీల ప్రీమియంలో పెట్టుబడికి కాకుండా 'రిస్క్' కవరేజీ కింద ఉండే మొత్తాన్ని మాత్రమే మినహాయించవచ్చని ధ్రువ అడ్వైజర్స్ పార్ట్‌నర్ నిపుణుడు జిగ్నేష్ ఘెలాని తెలిపారు. ఇక బీమా కంపెనీలు పూర్తిగా 18శాతం మినహాయింపును వినియోగదారులకు బదిలీ చేయకపోవచ్చని.. పాలసీ నిర్వహణ వ్యయాలు, కమీషన్లపై చెల్లించే జీఎస్టీ భారాన్ని వినియోగదారులపైనే వేయవచ్చని ఈవై ఇండియా ట్యాక్స్ పార్ట్‌నర్ సంస్థ నిపుణుడు సౌరభ్ అగర్వాల్ పేర్కొన్నారు. కంపెనీలు చెల్లించే పన్నులకు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ ఇస్తే.. ప్రీమియంలపై జీఎస్టీ మినహాయింపు పూర్తి ప్రయోజనం వినియోగదారులకు అందుతుందని తెలిపారు. అలాకాకున్నా కనీసం 15శాతం వరకు ప్రీమియం చార్జీలు తగ్గే అవకాశం ఉంటుందని వెల్లడించారు.

ఆ యువ నేతలతో
రాహుల్‌కు ఇబ్బంది

- అందుకే పార్లమెంటులో వారికి చాన్స్ ఇవ్వడం లేదు: మోదీ



న్యూఢిల్లీ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రతిభ కలిగిన యువ నాయకులు కాంగ్రెస్ పార్టీలో ఉన్నా, ఒక కుటుంబం అభద్రతకు గురవుతుండటం వల్ల వారికి పార్లమెంటులో మాట్లాడే అవకాశం రావడం లేదంటూ.. సోనియా గాంధీ పరివారాన్ని ఉద్దేశించి ప్రధాని నరేంద్రమోదీ పరోక్షంగా వ్యాఖ్యానించారు. వారిలోని చురుకుదనం రాహుల్‌గాంధీని అభద్రతకు, ఇబ్బందికి గురిచేస్తున్నదన్నారు. పార్లమెంటు సజావుగా సాగేందుకు ప్రతిపక్షాలు సుముఖంగా ఉన్నప్పటికీ కొంతమంది వ్యక్తుల మూలంగా మొత్తం వర్షకాల సమావేశాలు భగ్నమయ్యాయని మోదీ అన్నారు. గురువారం ఉభయసభల సమావేశాలు నిరవధికంగా వాయిదా పడిన తర్వాత ఆయన ఎన్డీయే పార్టీల నేతలకు తేనీటి విందు ఇచ్చా రు. కీలకమైన బిల్లులు ఆమోదం పొందేలా చేసినందుకు మిత్రపక్షాల నేతలను మోదీ అభినందించారు.

మేక్రాన్‌తో మోదీ చర్చలు

ఉక్రెయిన్, పశ్చిమాసియాల్లో యుద్ధ పరిస్థితులపై ప్రధాని మోదీ గురువారం ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మేక్రాన్‌తో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా మోదీ ఎక్స్‌లో పోస్టు పెడుతూ "నా మిత్రుడు అధ్యక్షుడు మేక్రాన్‌తో చాలా మంచి సంభాషణ జరిగింది. ఉక్రెయిన్, పశ్చిమ ఆసియాల్లోని ఘర్షణలకు శాంతియుత పరిష్కారాలు కనుక్కొనే దిశగా అభిప్రాయాలు పంచుకున్నాం. భారత్-ఫ్రాన్స్‌ల వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు కట్టుబడి ఉన్నాం" అని పేర్కొన్నారు.

పార్లమెంటు నిరవధిక వాయిదా

ముగిసిన వర్షాకాల సమావేశాలు

- 12 బిల్లులకు లోక్‌సభ, 15 బిల్లులకు రాజ్యసభ ఆమోదం

న్యూఢిల్లీ, ఆగస్టు 21: బిహార్‌లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్), ఆపరేషన్ సిందూర్ సహా పలు అంశాలపై అధికార, విపక్షాల నడుమ వాగ్యుద్ధాలతో అట్టుడికిన పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ముగిశాయి. ఉభయసభలూ నిరవధికంగా వాయిదా పడ్డాయి. గురువారం ఉదయం 11 గంటలకు లోక్‌సభ ప్రారంభం కాగానే విపక్షాలు తీవ్ర గందరగోళం సృష్టించడంతో స్పీకర్ ఓంబిర్లా సభను 12 గంటలకు వాయిదా వేశారు. అప్పుడు కూడా అదే పరిస్థితి నెలకొనడంతో సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. ఈ సమావేశాలు జరిగినన్నాళ్లూ విపక్షసభ్యులు సభ కార్యకలాపాలకు పదేపదే అంతరాయం కలిగించారని ఆయన మండిపడ్డారు. అటు రాజ్యసభ కూడా.. విపక్షాల నిరసనలతో తొలుత మధ్యాహ్నం 2 గంటల వరకూ వాయిదా పడింది. మళ్లీ సమావేశమైన అనంతరం ఆన్‌లైన్ గేమింగ్ బిల్లును ఆమోదించి సభను నిరవధికంగా వాయిదా వేశారు. రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివన్ష్.. సభలో అర్థవంతమైన చర్చ జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా.. ఈ సెషన్‌లో లోక్‌సభలో 14 బిల్లులను ప్రవేశపెట్టగా.. 12 బిల్లులను ఆమోదించారు. రాజ్యసభలో 15 బిల్లులను ఆమోదించారు.

సగం మందికి పెన్షన్ రూ.1,500 కంటే తక్కువే

న్యూఢిల్లీ, ఆగస్టు 21: ఉద్యోగుల పింఛను పథకం (ఈపీఎస్-95)లో సగానికి పైగా పింఛనుదారులకు నెలకు రూ.1,500 కంటే తక్కువే లభిస్తోంది. కేవలం 0.65% మందికి మాత్రమే నెలకు రూ.6 వేల కంటే ఎక్కువ పెన్షన్ దక్కుతోంది. ఈ వివరాలను కేంద్రం పార్లమెంటుకు తెలిపింది. నెలవారీ పెన్షన్ కనీసం రూ.9 వేలు ఉండాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కార్మిక, ఉపాధి శాఖ మంత్రి శోభా కరంద్లాజే రాజ్యసభకు లిఖితపూర్వకంగా వివరాలు తెలిపారు.

నటి ఆరోపణ.. కేరళ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడి రాజీనామా

పతనంతిట్ట/కోచి, ఆగస్టు 21: ఓ రాజకీయ పార్టీకి చెందిన యువ నాయకుడు ఒకరు తనపట్ల అసభ్యంగా ప్రవర్తించారంటూ మలయాళ నటి, మాజీ జర్నలిస్ట్ రినిఆన్ జార్జ్ చేసిన ఆరోపణలు కేరళ కాంగ్రెస్‌లో ప్రకంపనలు రేపాయి. ఆయన పలు సందర్భాల్లో అసభ్యకరమైన సందేశాలు పంపారని, హోటల్‌కు రమ్మన్నారని ఆమె తీవ్ర ఆరోపణలు చేశారు. అయితే ఆ నేత ఎవరన్నది మాత్రం ఆమె వెల్లడించలేదు. ఈ ఆరోపణల నేపథ్యంలో పాలక్కడ్ కాంగ్రెస్ ఎమ్మెల్యే, కేరళ కాంగ్రెస్ యువజన విభాగం అధ్యక్షుడు రాహుల్ మామ్‌కూటతిల్‌ను లక్ష్యంగా చేసుకుని బీజేపీ, సీపీఎం శ్రేణులు నిరసనలు చేపట్టాయి. ఈ పరిణామాలతో మామ్‌కూటతిల్.. యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్టు గురువారం ప్రకటించారు. తాను ఎలాంటి తప్పు చేయలేదని ఆయన అన్నారు.

కోర్టులు చేతులు కట్టుకుని కూర్చోవాలా?

(మొదటి పేజీ తరువాయి)

అభిప్రాయాన్ని కోరిన అంశంపై జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ ఏఎస్ చందూర్కర్‌లతో కూడిన ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం గురువారం కూడా తన విచారణ కొనసాగించింది. రాష్ట్రపతి, గవర్నర్ తప్పనిసరిగా తన ఉత్తర్వులు పాటించేలా న్యాయవ్యవస్థ ఆదేశాలు ఇవ్వజాలదని మెహతా ఈ సందర్భంగా పేర్కొన్నారు. కొందరు గవర్నర్లు బిల్లులను నిలిపివేస్తే.. రాష్ట్రప్రభుత్వాలు కోర్టులకు రావడం కాకుండా రాజకీయ పరిష్కారాలు కనుక్కోవాలని సూచించారు. దీనిపై జస్టిస్ గవాయ్ స్పందిస్తూ.. ఎక్కడైనా తప్పు జరిగితే దిద్దుబాటు ఉండి తీరాలన్నారు. 'రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు అకారణంగా తమ విధులు నిర్వహించకపోతే.. కోర్టులు చేతులు కట్టుకుని కూర్చోవాలా' అని మెహతాను ప్రశ్నించారు. ఆయన జవాబిస్తూ.. అన్ని సమస్యలకూ కోర్టులే పరిష్కారం కాదని.. ప్రజాస్వామ్యంలో చర్చలకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. గవర్నర్ నిష్క్రియగా వ్యవహరిస్తే.. బాధిత రాష్ట్రం కోర్టును ఆశ్రయిస్తే.. ఆ నిష్క్రియాపరత్వంపై న్యాయ సమీక్ష జరపకుండా సంపూర్ణంగా నిషేధించాలా అని జస్టిస్ సూర్యకాంత్ అడిగారు. అయితే ఈ వ్యవహారంలో కొన్ని వెసులుబాట్లు అవసరమని మెహతా అభిప్రాయపడ్డారు. 'గవర్నర్ బిల్లులు నిలిపివేస్తే ప్రతి చోటా ముఖ్యమంత్రి కోర్టుల వద్దకు పరుగెత్తడం లేదు. చర్చలు జరిపిన సందర్భాలు ఉన్నాయి. సీఎం వెళ్లి గవర్నర్‌ను కలవడం.. ప్రధాని, రాష్ట్రపతిని కూడా కలిసి పరిష్కారాలు కనుక్కోవచ్చు, వారి నడుమ ఫోన్ సంభాషణలు జరిగిన సందర్భాలూ చాలానే ఉన్నాయి. వివాదాల పరిష్కారానికి దశాబ్దాలుగా ఈ సంప్రదాయం నడుస్తోంది. రాష్ట్రప్రభుత్వ ప్రతినిధి బృందాలు గవర్నర్‌ను, రాష్ట్రపతిని కలవొచ్చు. మధ్యేమార్గాన్ని కూడా కనుక్కోవచ్చు. కేంద్ర ప్రభుత్వ ప్రతినిధి అయిన గవర్నర్, రాష్ట్రప్రభుత్వం మధ్య సంక్షోభ పరిష్కారానికి రాజనీతిజ్ఞత, రాజకీయ పరిపక్వత చూపాల్సిన అవసరం ఉంది. ప్రతి సమస్యకు కోర్టులో పరిష్కారాలు ఉండకపోవచ్చు. ఎక్కువ సమస్యలకు వ్యవస్థలోనే పరిష్కారాలు దొరుకుతాయి. బిల్లుల ఆమోదానికి గవర్నర్‌కు, రాష్ట్రపతికి రాజ్యాంగంలో ఎక్కడా నిర్దిష్ట కాలపరిమితిని నిర్దేశించలేదు' అని మెహతా తెలిపారు. సీజేఐ స్పందిస్తూ.. తప్పు జరిగినప్పుడు దిద్దుబాటు ఉండాల్సిందేనని.. సుప్రీంకోర్టు రాజ్యాంగ పరిరక్షకురాలని.. వాస్తవ అర్థం ఇవ్వడం ద్వారా రాజ్యాంగానికి భాష్యం చెప్పాల్సి ఉంటుందని తేల్చిచెప్పారు. ఆయనతో జస్టిస్ సూర్యకాంత్ కూడా ఏకీభవించారు. మెహతా స్పందిస్తూ.. న్యాయబద్ధత వేరు.. రాజ్యాంగానికి ఇతరమేదైనా జోడించడం వేరని తెలిపారు. 'ఇదే న్యాయస్థానం తన తీర్పుల్లో ప్రస్తావించకుండా.. నిర్దిష్ట విధి నిర్వహించాల్సిందిగా సొలిసిటర్ జనరల్‌ను పలుసార్లు ఆదేశించిన సందర్భాలున్నాయి. అలాగే.. ఫలానా గడువులోగా గవర్నర్ బిల్లులను ఆమోదించేలా చట్టం చేయాలని కోర్టు పార్లమెంటును నిస్సందేహంగా కోరవచ్చు. కానీ తీర్పు ద్వారా కాలవ్యవధిని నిర్ణయించరాదు' అని పేర్కొన్నారు. రాష్ట్రపతి సుప్రీంకోర్టు అభిప్రాయాన్ని కోరడానికి కారణమైన తీర్పును మెహతా ఈ సందర్భంగా ప్రస్తావించారు. రాజ్యాంగంలోని 200వ అధికరణ ప్రకారం.. బిల్లుకు ఆమోదాన్ని నిలిపివేయడం గవర్నర్ స్వతంత్ర అధికారమని.. ఇది పరిపూర్ణ విధి కూడా అని తెలిపారు. అయితే గవర్నర్ ప్రజలకు జవాబుదారీ కాదని, ఆయన్ను ఏ కారణం లేకుండానే తొలగించవచ్చని సీజేఐ గుర్తుచేశారు.

న్యాయవ్యవస్థ క్రియాశీలత.. న్యాయ ఉగ్రవాదం కారాదు: సీజేఐ

విచారణ సందర్భంగా చీఫ్ జస్టిస్ గవాయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. న్యాయవ్యవస్థ క్రియాశీలత.. జ్యుడీషియల్ ఉగ్రవాదం కారాదని స్పష్టంచేశారు. చట్టసభలకు ఎన్నికైన ప్రజాప్రతినిధులు చాలా అనుభవజ్ఞులని.. వారిని తక్కువ చేయడానికి వీల్లేదని సొలిసిటర్ జనరల్ అన్నప్పుడు ఆయనీ వ్యాఖ్యలు చేశారు. 'ఎన్నికైనవారి గురించి మేమెప్పుడూ ఏమీ అనలేదు. న్యాయవ్యవస్థ క్రియాశీలత.. జ్యుడీషియల్ ఉగ్రవాదం లేదా సాహసకృత్యంగా మారకూడదని నేనెప్పుడూ చెబుతాను' అని స్పష్టంచేశారు. రాజ్యాంగ ధర్మాసనం తదుపరి విచారణ 26వ తేదీన జరుగుతుంది.

మా సైద్ధాంతిక శత్రువు బీజేపీ

(మొదటి పేజీ తరువాయి)

ఆయన ప్రసంగించారు. బీజేపీ, డీఎంకేకు వ్యతిరేకంగా తమ పార్టీ ఎన్నికల బరిలోకి దిగనుందని, ఈ విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అవినీతి, అక్రమాలకు పాల్పడిన రాజకీయ నాయకుల తరహాలో బీజేపీతో బలవంతంగా పొత్తు పెట్టుకునే సాదాసీదా నాయకుడిని కాదని పరోక్షంగా అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామిని ఉద్దేశించి ఆయన విమర్శించారు. విజయ్ తనను తాను సింహంతో పోల్చుకున్నారు. 'సింహానికి గుంపులో ఎలా జీవించాలో తెలుసు. ఒంటరిగా ఎలా జీవించాలో కూడా తెలుసు. సింహం వేటాడేందుకు మాత్రమే వస్తుంది. వినోదం కోసం కాదు. అది ఎప్పుడూ బతికున్న జంతువునే వేటాడి ఆహారంగా తీసుకుంటుంది. అలాగే నేనూ రాజకీయాల్లో తాడోపేడో తేల్చుకునేందుకే వచ్చా' అని ఆయన వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో తాము ఒంటరిగానే పోటీ చేస్తామని, ఏ పార్టీతోనూ పొత్తులు పెట్టుకోమని విజయ్ స్పష్టం చేశారు. కేంద్రంలో మూడోసారి ప్రధానిగా గెలిచిన మోదీ.. ప్రజలకు మంచి చేయడానికి అధికారంలోకి వచ్చారో, లేక మైనారిటీ ప్రజలకు వ్యతిరేకంగా కుట్రలు, కుతంత్రాలు పన్నేందుకు వచ్చారో తెలియడం లేదన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో తమిళనాట ఒక్క సీటు కూడా గెలుచుకోలేకపోయామన్న అక్కసుతో రాష్ట్రాభివృద్ధిని విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పార్టీని గెలిపించలేదన్న ఆగ్రహంతోనే కీళడి పురావస్తు తవ్వకాల్లో బయల్పడిన తమిళుల ప్రాచీన నాగరికతకు సంబంధించిన పరిశోధనలను ఆమోదించడం లేదని ఆరోపించారు. తమిళ జాలర్ల శాశ్వత పరిష్కారం కోసం కచ్చాదీవిని మళ్లీ భారత్‌లో విలీనం చేయాలని, ఇక ఏమాత్రం మొండి వైఖరి ప్రదర్శించకుండా నీట్ పరీక్షలు రద్దు చేయాలని విజయ్ డిమాండ్ చేశారు.



> సింహానికి గుంపులో ఎలా జీవించాలో తెలుసు. ఒంటరిగా ఎలా జీవించాలో కూడా తెలుసు. సింహం వేటాడేందుకు మాత్రమే వస్తుంది. వినోదం కోసం కాదు... అది ఎప్పుడూ బతికున్న జంతువునే వేటాడి, ఆహారంగా తీసుకుంటుంది. అలాగే నేనూ రాజకీయాల్లో తాడోపేడో తేల్చుకునేందుకే వచ్చా. వచ్చే ఏడాది జరిగే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, డీఎంకే పార్టీలను తరిమికొట్టడమే లక్ష్యం.
>
> - విజయ్, తమిళగ వెట్రి కళగం(టీవీకే) అధ్యక్షుడు, సినీ నటుడు

స్టాలిన్... వెరీ వెరీ వరస్ట్ అంకుల్

తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్‌ను ఉద్దేశించి విజయ్ మాట్లాడుతూ.. 'స్టాలిన్ అంకుల్! టాస్మాక్‌లో రూ.1,000 కోట్లకు పైగా అవినీతి, అక్రమాలు జరిగాయని అంటున్నారు. మహిళలకు వెయ్యి రూపాయలు ఇస్తే చాలా అంకుల్? తమకు భద్రతే లేదని మహిళలు చెబుతున్న మాటలు మీకు వినపడవా అంకుల్? ఇది చాలక మహిళలంతా మిమ్మల్ని 'డాడీ' అని పిలవాలని చెబుతున్నారే.. వాటీజ్ దిస్ అంకుల్.. దిస్ ఈజ్ వెరీ వెరీ రాంగ్ అంకుల్... మహిళలనే కాదు, ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, రైతులు, మత్స్యకారులను కూడా మాయ మాటలతో మోసగిస్తున్నారే.. వెరీ వెరీ వరస్ట్ అంకుల్' అని వ్యాఖ్యానించారు.

కేంద్రం మెడలు వంచైనా తీసుకొస్తాం

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ... చైనా నుంచి దిగుమతి కావాల్సిన యూరియాను తెప్పించడంలో కేంద్రప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. జియో పాలిటిక్స్ పరిస్థితులు వివరించకుండా కేంద్రం గందరగోళ పరిస్థితులను సృష్టిస్తోందన్నారు. పార్లమెంటు ఆవరణలో కాంగ్రెస్ ఎంపీల ఆందోళనతో రాష్ట్రానికి ఈ వారంలో 50 వేల టన్నుల యూరియా సరఫరా చేయడానికి అంగీకరించిందని తెలిపారు. అదేవిధంగా గత 5నెలల లోటును కూడా భర్తీచేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, కిషన్‌రెడ్డి ఈ విషయంలో చొరవ తీసుకోవాలని కోరారు. దేశవ్యాప్తంగా యూరియా సరఫరాలో సమస్యలుంటే... ఒక్క తెలంగాణలోనే ఉన్నట్లుగా రాష్ట్ర ప్రభుత్వాన్ని బదనాం చేస్తున్నారని తుమ్మల అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు రైతుల సమస్యను రాజకీయానికి వాడుకుంటున్నారని విమర్శించారు. విదేశాల నుంచి ఇంపోర్టెడ్ యూరియా రాలేదని, దేశీయ ఉత్పత్తి కూడా సక్రమంగా లేదని బీజేపీ శ్రేణులు నిజాలు ఒప్పుకోవాలని సూచించారు. యూరియా కొరతపై జరుగుతున్న ఆందోళనల వెనక కొన్ని రాజకీయ పార్టీలు ఉన్నాయని తుమ్మల ఆరోపించారు. అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ పార్టీ నేతలు... ప్రాజెక్టుల గేట్లుఎత్తుతాం! బటన్లు నొక్కుతాం! అని సొల్లు మాటలు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. వ్యవసాయ యంత్రాలు, పనిముట్లపై 12 శాతం జీఎస్టీ విధించడం రైతులకు ఆర్థికభారంగా మారిందని, చిన్న, సన్నకారు రైతులు వ్యవసాయ పనిముట్లు కొనలేకపోతున్నారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. వ్యవసాయ పరికరాలను జీఎస్టీ నుంచి మినహాయించాలని విజ్ఞప్తి చేస్తూ గురువారం ప్రధానమంత్రి మోదీకి లేఖ రాశారు. లేఖ ప్రతులను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌లకు పంపించారు. తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న రైతులకు మేలు కలిగేలా కేంద్రం నిర్ణయం తీసుకోవాలని కోరారు. అదేవిధంగా వ్యవసాయ అధికారులతో మంత్రి తుమ్మల గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. యూరియా నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, రవాణా సమస్యలుంటే కలెక్టర్లతో సమన్వయం చేసుకుని పరిష్కరించాలని ఆదేశించారు. ప్రైవేటు డీలర్లు యూరియాను బ్లాక్ చేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డీలర్లు ఎక్కువ ధరకు యూరియా అమ్మితే కేసులు నమోదుచేస్తామని హెచ్చరించారు. నానో యూరియాను వినియోగించేలా రైతులను ప్రోత్సహించాలని, పట్టాదారు పాసుపుస్తకాల ప్రకారం యూరియా అమ్మే అవకాశాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర వ్యవసాయశాఖ డైరెక్టర్ డాక్టర్ బి.గోపి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

ఎరువు దొరికేదెప్పుడు?

యూరియా దొరక్క అన్నదాతల అవస్థలు.. భారీగా లైన్లు.. రైతుల మధ్య తోపులాటలు

- సిబ్బందిపై ఆగ్రహం.. కేంద్రాల వద్ద ధర్నాలు
- రోడ్ల మీదకొచ్చి రాస్తారోకోలు
- 'ఆంధ్రజ్యోతి' ప్రతిష్ఠ దెబ్బతీసేలా 'బ్లాక్ మార్కెట్‌కు యూరియా' అంటూ తప్పుడు న్యూస్ క్లిప్పింగ్ వైరల్
- ఖమ్మం సీపీకి ఫిర్యాదు చేసిన ఆంధ్రజ్యోతి బృందం.. కేసు నమోదు
- కఠిన చర్యలు తీసుకోవాలన్న మంత్రి తుమ్మల


వరంగల్ జిల్లా చెన్నారావుపేటలో యూరియా కోసం బారులు తీరిన మహిళా రైతులు

మరిపెడ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక దశలోనే యూరియా వేస్తే పంట ఏపుగా ఎదుగుతుంది. ఇప్పుడా యూరియానే బంగారమైపోయింది. తెల్లారకముందే చాంతాడంత క్యూలో నిల్చున్నా బస్తా యూరియా సంపాదించడం కనాకష్టంగా మారింది. ఎరువు లేక పంటల్లో ఎదుగుదల లోపిస్తోందనే ఆవేదన రైతుల్లో వ్యక్తమవుతోంది. ఆ ఆవేదన చాలా చోట్ల ఆగ్రహంగా మారి అన్నదాతలను రోడ్డెక్కేలా చేస్తోంది. గురువారం కూడా చాలాచోట్ల రైతులు.. ఎరువుల కేంద్రాల వద్ద నిరసన వ్యక్తం చేశారు. గుంపులు గుంపులుగా రహదారుల మీద కొచ్చి ధర్నాలు, రాస్తారోకోలు చేశారు. క్యూలైన్లలో తోపులాటలు జరుగుతున్నాయి. కొన్నిచోట్ల సిబ్బందిపై రైతులు తిరగబడుతున్నారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడలో ఓ వృద్ధ రైతు ఎరువుల కేంద్రం వద్ద మెట్లపై నుంచి కిందపడగా తలకు గాయాలయ్యాయి. అక్కడ యూరియా దొరక్కపోవడంతో రైతులు రోడ్డు మీదకొచ్చి ధర్నా చేశారు. ఇరువైపులా వాహనాలు పెద్ద సంఖ్యలో నిలిచిపోయాయి. యూరియా బస్తాలిస్తేనే వెళ్తామని స్పష్టం చేశారు. పోలీసులొచ్చి ఆగ్రోస్ కేంద్రం యజమానిని దుకాణానికి రప్పించి నిల్వ ఉన్న కొంత యూరియాను కొందరు రైతులకు ఇప్పించారు. కురవిలో 444 యూరియా బస్తాలుండగా 1200 మందికి పైగా రైతులొచ్చారు. గార్లలో తెల్లవారుజామునే రైతులు క్యూలో నిల్చున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని సహకార మార్కెటింగ్ సంఘం వద్ద క్యూలైన్‌లో రైతులు చెప్పులు ఉంచారు. జిల్లాలోని హన్వాడ, భూత్పూర్, దేవరకద్ర మండలాల్లో భారీ క్యూలైన్లు కనిపించాయి. పదెకరాలున్న రైతుకు కూడా ఒకే బస్తా యూరియా ఇస్తారా? అంటూ ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం చేగొమ్మ గ్రామంలో రైతులు ఆవేదనగా ప్రశ్నించారు. కొత్తగూడెం జిల్లా పాల్వంచ సొసైటీ వద్ద క్యూలైన్‌లో రైతుల మధ్య తోపులాట జరిగింది. వరంగల్ జిల్లా చెన్నారావుపేటలో 450 బస్తాల యూరియా రాగా.. రైతులకు తలా రెండు బస్తాలిచ్చారు. రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం చేగూరులో తలా రెండు బస్తాలే ఇస్తామని చెప్పడంతో సిబ్బందిపై రైతులు తిరగబడ్డారు. మెదక్ జిల్లా నర్సాపూర్‌లో రైతులు రాస్తారోకో చేశారు. యూరియా కోసం డబ్బులు కట్టి వారం దాటినా పంపిణీ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలోని చిన్నశంకరంపేట మండలంలోని సొసైటీ వద్దకు యూరియా లారీ రావడంతో అప్పటికే పెద్ద సంఖ్యలో వచ్చిన రైతులు టోకెన్ల కోసం ఎగబడ్డారు. సిద్దిపేట జిల్లా తొగుట మండలం లింగాపూర్‌లో పోలీసుల పహారా మధ్య టోకెన్లు పంపిణీ చేశారు.

'ఆంధ్రజ్యోతి' పేరుతో తప్పుడు కథనం

'బ్లాక్ మార్కెట్‌లో తెలంగాణ యూరియా' శీర్షికన ఓ కథనం సోషల్‌మీడియాలో చక్కర్లు కొడుతోంది. అయితే అది 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైనట్టుగా ఉండగా.. అది తప్పుడు కథనమని, దానికి ఆంధ్రజ్యోతి సంస్థకు సంబంధం లేదని, సంస్థ ప్రతిష్ఠ దెబ్బతీసేలా కొందరు తప్పుడు కథనం ప్రచురించారన్న విషయాన్ని ఖమ్మం 'ఆంధ్రజ్యోతి' బృందం పోలీసు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లింది. ఈ మేరకు ఖమ్మం బ్రాంచ్ మేనేజర్ టి. పుల్లారావు, బ్యూరో ఇన్‌చార్జ్ ఎన్.వెంకటరావు, ఎడిషన్ ఇన్‌చార్జ్ కె.రాజేశ్, ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ప్రతినిధి శ్రీధర్, రిపోర్టర్లు బి.రాఘవ, ఎస్.రాము గురువారం సీపీకి ఫిర్యాదు చేశారు. 'బ్లాక్ మార్కెట్‌లో తెలంగాణ యూరియా.. దొడ్డిదారిన వేరే రాష్ట్రాలకు' అంటూ కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఓ కథనం క్లిప్పింగ్‌ను సోషల్‌మీడియాలో పోస్ట్ చేశారు. 'ఖమ్మం అంధజ్యోతి' డేట్‌లైన్‌తో సీఎం రేవంత్‌రెడ్డి యూరియా ఇవ్వడంలో పూర్తిగా విఫలమయ్యారని, ముఖ్యమంత్రితో పాటు వ్యవసాయ శాఖ మంత్రి పతిష్ఠను దెబ్బతీసేలా ఈ కథనం ఉండటంతో సంబంధిత వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకోవాలని, ఈ కథనం 'ఆంధ్రజ్యోతి' కథనంలా ప్రజలను నమ్మించే విధంగా ఉందని, సీపీకి ఇచ్చిన ఫిర్యాదులో వివరించారు. స్పందించిన సీపీ విచారణ జరిపి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాగా తప్పుడు కథనాలను ప్రచారం చేస్తున్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఖమ్మం సీపీని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ అవుతున్న ఈ కథనాన్ని ఎవరు పెట్టారు? ఎందుకు పెట్టారన్న దానిపై ఆరా తీయాలని, పూర్తి విచారణ చేయాలని ఆయన ఖమ్మం సీపీకి సూచించారు. కాగా తప్పుడు కథనం ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆరు నెలలకే పుట్టిన శిశువుకు ప్రాణం పోసి..

- ఐవీఎఫ్ విధానంలో సుడాన్ మహిళ గర్భం.. 3 పిండాలతో అభివృద్ధి
- ఒక పిండం తొలగింపు.. 23 వారాలకే కవలల జననం.. ఒకరి మృతి
- మూడో శిశువుకు 115 రోజుల వైద్యం.. మెడికవర్ వైద్యుల ఘనత

హైదరాబాద్ సిటీ/హైటెక్ సిటీ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఆరు నెలలు కూడా నిండకుండానే భూమ్మీద పడ్డ శిశువు బతుకుతాడా? తనకు తోడుగా ఇద్దరితో తల్లి పొత్తిళ్లలో ఉండాల్సిన స్థితిలో వారిని కోల్పోయి.. తానొక్కడే నెలలు నిండకుండానే అరకిలో బరువుతో పుట్టిన ఆ శిశువుకు హైటెక్‌సిటీలోని మెడికవర్ ఉమెన్ చైల్డ్ ఆస్పత్రి వైద్యుల కృషితో ఊపిరి నిలిచింది. మూడు నెలల పాటు ప్రత్యేక వైద్యంతో 2కిలోల బరువు చేరి పూర్తిగా కోలుకున్నాడు. ఇంత తక్కువ సమయంలో పుట్టిన శిశువులు బతకడం ప్రపంచంలోనే అత్యంత అరుదు అని.. ఇది భారతీయ నియోనాటల్ ఆరోగ్య సంరక్షణలో చరిత్రాత్మక విజయమని ఆస్పత్రి వైద్యులు పేర్కొన్నారు. సూడాన్‌కు చెందిన ఇన్సాఫ్ అనే వ్యక్తి భార్య షాకీర్ ఐవీఎఫ్ పద్ధతిలో గర్భం దాల్చింది. మూడు పిండాలు ప్రాణం పోసుకున్నాయి. ఒక పిండం అభివృద్ధి చెందకపోవడంతో తొలగించారు. గత ఏప్రిల్ 18న 23వారాలకే కవలలు జన్మించారు. ఒక శిశువు పుట్టిన తొమ్మిదో రోజున చనిపోయాడు. కేవలం 565 గ్రాములతో పుట్టిన మూడో శిశువునైనా కాపాడేందుకు నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఎన్ఐసీయూ)కు తరలించి చికిత్స మొదలుపెట్టారు. 115 రోజుల పాటు చికిత్స చేశారు. గుండె, మెదడు, రెటీనా అభివృద్ధిని నిరంతరం పర్యవేక్షించారు. పేటెంట్ డక్టస్ ఆర్టెరియోసస్ అనే గుండె సంబంధిత సమస్యకు మందులతో చికిత్స అందించారు. ఆగస్టు 11నాటికి రెండు కిలోల బరువుతో, స్థిరమైన ఆరోగ్యంతో ఉన్న శిశువును డిశ్చార్జి చేసినట్లు చీఫ్ నియోనాటాలజిస్టు డాక్టర్ రవీందర్‌రెడ్డి చెప్పారు. శిశువు చికిత్సలో వైద్యులు రాధిక, నవిత, వంశీరెడ్డి, ప్రశాంతి కీలకపాత్ర పోషించారు.

డెంగీతో ఇద్దరు బాలికల మృతి

తొర్రూరు రూరల్, స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): డెంగీ జ్వరంతో బాధపడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాలో గురువారం ఇద్దరు బాలికలు మృతి చెందారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం చెర్లపాలెంకి చెందిన బుచ్చిమల్లు, కవిత దంపతుల కుమార్తె సాత్విక (9), జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం కొత్తపల్లికి చెందిన జోగు శంకర్-సంధ్య దంపతుల కుమార్తె జోగు సాన్విక(2)లు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ గురువారం చనిపోయారు.

రివ్యూకు తగిన కారణాలు లేవు!

- హౌసింగ్ సొసైటీలకు భూ కేటాయింపుల రద్దు తీర్పును సమీక్షించడానికి నిరాకరించిన సుప్రీం
- ప్రజాప్రతినిధులు, ఐఏఎస్‌లు, జర్నలిస్టుల రివ్యూ పిటిషన్లను కొట్టేసిన సర్వోన్నత న్యాయస్థానం

న్యూఢిల్లీ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ప్రజాప్రతినిధులు, అఖిల భారత సర్వీసు, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, రాజ్యాంగ కోర్టుల న్యాయమూర్తులు, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపును రద్దు చేస్తూ గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మరోసారి సమీక్షించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. సమీక్షించడానికి తగిన కారణాలేవీ కనిపించడం లేదని వ్యాఖ్యానిస్తూ తీర్పు వెల్లడించింది. భూకేటాయింపులపై కొన్ని విధివిధానాలను నిర్ణయిస్తూ 2010లో ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ వివిధ వర్గాలు సుప్రీంకోర్టును ఆశ్రయించగా, గతేడాది నవంబర్ 25న సీజేఐ, జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం భూముల కేటాయింపు జీవోనే కొట్టేసింది. ఈ నేపథ్యంలో అన్ని పక్షాలు సుప్రీంకోర్టులో సమీక్ష పిటిషన్‌ను దాఖలు చేశాయి. గురువారం జస్టిస్ దీపాంకర్ దత్త, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మాసిహ్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. కరుణ, సమానత్వం ఆధారంగా సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వాలని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు అభ్యర్థించారు. కోర్టు సముచితమని భావించిన మార్కెట్ రేట్లను చెల్లించడానికి కూడా సుముఖంగా ఉన్నట్లు ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఐఏఎస్ అధికారులతో సమానంగా జర్నలిస్టులను పరిగణించడం సరికాదని, జర్నలిస్టులకు నామమాత్రపు జీతాలున్నాయని, పెన్షన్ ప్రయోజనాలు లేవని జర్నలిస్టుల తరఫు న్యాయవాది గుర్తు చేశారు. తీర్పును రివ్యూ చేయడానికి తమకు ఎలాంటి కారణాలు కనిపించడం లేదని చెబుతూ పిటిషన్లను ధర్మాసనం కొట్టివేసింది.

జర్నలిస్టులకు ఇండ్లు కట్టించి ఇస్తాం: బండి సంజయ్

సుప్రీంకోర్టు తీర్పుతో జర్నలిస్టులెవరూ బాధపడొద్దని కేంద్ర మంత్రి బండి సంజయ్ సూచించారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే న్యాయ నిపుణులతో ముందుగానే చర్చించి జర్నలిస్టులందరికీ ఇండ్లను నిర్మించి ఇస్తామని ప్రకటించారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు దక్కకపోవడానికి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల అవకాశవాద రాజకీయాలే కారణమని చెప్పారు. అరుణాచల్ ప్రదేశ్ పర్యటనలో ఉన్న ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. రివ్యూ పిటిషన్లను సుప్రీంకోర్టు డిస్మిస్ చేయడం దురదృష్టకరమని, ఇది ముమ్మాటికీ కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల వైఫల్యమేనని చెప్పారు. చాలీచాలని జీతాలతో అద్దె ఇండ్లలో నివసిస్తూ అనేక ఇబ్బందులు పడుతున్న జర్నలిస్టులకు అండగా నిలవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోకపోతే ఆ బాధ్యత బీజేపీ తీసుకుంటుందని చెప్పారు.

విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించే తెలంగాణకు చెందిన బీసీ విద్యార్థులు మహాత్మా జ్యోతిబా ఫూలే ఓవర్సీస్ విద్యా నిధి పథకంలో స్కాలర్‌షిప్ కోసం సెప్టెంబరు 24వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బి.బాలమాయాదేవి తెలిపారు. మరిన్ని వివరాలకు www.telanganaepass.cg-g.gov.inను సందర్శించాలని సూచించారు. - హైదరాబాద్

డిజిటల్ సంస్థలకు బీఆర్ఎస్ లీగల్ నోటీసులు

హైదరాబాద్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): తమకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్న డిజిటల్ సంస్థలకు, ఇన్‌ఫ్లూయెన్సర్లకు బీఆర్ఎస్ పార్టీ లీగల్ నోటీసులు ఇచ్చింది. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌లను లక్ష్యంగా చేసుకొని కాంగ్రెస్ పార్టీ అండతో ఉద్దేశపూర్వకంగా కొందరు దుష్ప్రచారానికి పాల్పడుతున్నారని బీఆర్ఎస్ ఒక ప్రకటనలో తెలిపింది. వీడియోల్లో ఉన్న తప్పుడు సమాచారాన్ని ఎత్తిచూపడంతో ఇప్పటికే కొన్ని ఛానెళ్లు వీడియోలు తొలగించాయని, మిగతావారు కూడా వీడియోలు తొలగించకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

పాత్రికేయులపై ప్రతాపం

సీనియర్ జర్నలిస్టులు సిద్ధార్థ వరదరాజన్, కరణ్ థాపర్‌ల మీద అసోం పోలీసులు దేశద్రోహం కేసు నమోదుచేయడం అమితాశ్చర్యాన్ని కలిగిస్తోంది. భారతీయ న్యాయసంహితలోని కొత్త దేశద్రోహ చట్టం (సెక్షన్ 152)ను పాత్రికేయులమీద ప్రయోగించే దుస్సంప్రదాయానికి తెరదీయవద్దనీ, ఈ కేసును తక్షణమే ఉపసంహరించుకోవాలనీ గురువారం విపక్షపార్టీలకు చెందిన ఎంపీలు అసోం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆ పార్టీల అధినేతలందరూ సామాజిక మాధ్యమాల్లో అసోం పోలీసుల దూకుడునూ, పత్రికాస్వేచ్ఛను నియంత్రించే ప్రయత్నాన్నీ ప్రశ్నిస్తున్నారు. ఇండియన్ పీనల్ కోడ్ 124ఎ కింద ఇక ఎంత మాత్రం దేశద్రోహం కేసులు కుదరవంటూ సుప్రీంకోర్టు నిలిపివేయడంతో, అంత కంటే కఠినాతికఠినమైన కొత్తచట్టాన్ని తెచ్చి పాత్రికేయులను జీవితపర్యంతం జైల్లో ఉంచేందుకు డబుల్ ఇంజన్ సర్కార్లు ప్రయత్నిస్తున్నాయని వీరంతా విమర్శిస్తున్నారు. సమన్ల జారీమీద ఎడిటర్స్ గిల్డ్ కూడా అభ్యంతరాన్ని ప్రకటిస్తూ, అసోం పోలీసులు దురుద్దేశంతో వ్యవహరిస్తున్నారన్న అపప్రథ మూటగట్టుకోకూడదని వ్యాఖ్యానించింది. ఆగస్టు 22న గువాహతి క్రైమ్‌బ్రాంచ్ ముందు హాజరుకానిపక్షంలో అరెస్టులు తప్పవంటూ అసోం పోలీసులు వీరిని హెచ్చరించారు.

ఆపరేషన్ సిందూర్‌మీద 'ది వైర్' వెబ్‌సైట్‌లో ప్రచురితమైన కథనాలు, విశ్లేషణలు, ఇంటర్వ్యూలు పాలకుల ఆగ్రహాన్ని చవిచూశాయి. కొత్తదేశద్రోహ చట్టం రాజ్యాంగ చెల్లుబాటును సుప్రీంకోర్టులో సవాలు చేస్తూ పిటిషన్ దాఖలు చేయడంతోపాటు, అసోం పోలీసులు తమపై ఎటువంటి నిర్బంధచర్యలకు పాల్పడకుండా ది వైర్ పాత్రికేయులు సర్వోన్నత న్యాయస్థానం నుంచి రక్షణ కూడా సాధించుకున్నారు. వారి పిటిషన్ మీద ఆగస్టు 12న సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసిన వెంటనే, మోరిగావ్ పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసుతో సంబంధం లేకుండా, అదేరోజున ఈ మారు గువాహతి క్రైమ్ బ్రాంచ్ పోలీసులు ఆపరేషన్ సిందూర్ గురించిన వేరొక కథనంపైన మరొక ఎఫ్ఐఆర్‌తో బరిలోకి దిగడం గమనార్హం. ఈ పరిణామాలు గమనించినప్పుడు, సుప్రీంకోర్టు నోటీసులు, ఆదేశాలు అసోం పాలకులను, వారి పోలీసులను ఏమాత్రం అడ్డలేకపోగా, నిర్దిష్టమైన లక్ష్యంతో, కక్షపూరితవైఖరితో ఇదంతా చేస్తున్నారని కూడా అనుకోవాలి. కొద్దిరోజుల తరువాత తమకు అందిన ఈ సమన్లలో కనీసం ఎఫ్ఐఆర్ నమోదు చేసిన తేదీని ప్రస్తావించకపోవడమేకాక, ఏ నేరానికి పాల్పడ్డారో, ఏ కారణంతో వీటిని జారీచేశారో కూడా తెలియజేయలేదని వైర్ అంటోంది. ఎన్నో ప్రయత్నాల తరువాత, మొన్న బుధవారంనాటికి కానీ తమమీద ఉన్న ఆరోపణలు ఏమిటో తెలియలేదనీ, సెక్షన్ 152ను ప్రయోగించారు కానీ, అందులో భాగంగా విధిగా పాటించాల్సిన నిబంధనలను మాత్రం పోలీసులు ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించారని ఆ సంస్థ ఆరోపిస్తోంది. పహల్గాం దాడి, ఆపరేషన్ సిందూర్, ముందూ వెనుకా పరిణామాలమీద వెబ్‌సైట్‌లో సుప్రసిద్ధ పాత్రికేయులు రాసిన పన్నెండు కథనాల శీర్షికలు, దౌత్య, రక్షణరంగ నిపుణులతో పాటు, పొరుగుదేశం నాయకులతో సైతం కరణ్‌థాపర్ నిర్వహించిన ఇంటర్వ్యూల ప్రస్తావనలు ఎఫ్ఐఆర్‌లో ఉన్నట్టు సమాచారం. అసోం పోలీసులు వీరందరి జోలికీ పోకపోవచ్చును కానీ, ది వైర్ సంస్థనీ, ఈ ఇద్దరు పాత్రికేయులనూ సులభంగా వదలకపోవచ్చు.

ఆపరేషన్ సిందూర్‌లో విజయాల గురించే తప్ప, జరిగిన నష్టాలమీద మన ప్రభుత్వం నోరు విప్పనందున, మన సైనికరంగ నిపుణుల వ్యాఖ్యలు, విదేశీ మీడియా కథనాల ఆధారంగా విమానాల నష్టంమీద మీడియాలో కొంత విశ్లేషణ జరగకపోలేదు. ఈ విషయంలో వైర్ మరింత దూకుడుగా ఉండటం మన పాలకులకు నచ్చకపోవడం సహజం. సదరు కథనాలు, ఇంటర్వ్యూలను శుద్ధ అబద్ధాలంటూ ఖండించవచ్చు, సవరణలూ వివరణలూ ప్రచురించని పక్షంలో చట్టప్రకారం దండించవచ్చు. కానీ, పాలకుల అభిప్రాయానికి భిన్నంగా ఒక మీడియా సంస్థ వ్యాఖ్యలు, విశ్లేషణలు చేసినంతమాత్రాన, ఒక జర్నలిస్టు ఏలికలకు నచ్చని రీతిలో తన వృత్తిని నిర్వహించినంతమాత్రాన అది దేశద్రోహమైపోదు. దేశంలో కొన్ని ప్రధాన మీడియా సంస్థలను పాలకులు పలుమార్గాల్లో తమ దారికి తెచ్చుకున్న నేపథ్యంలో, గత పదేళ్ళకాలంలో వైర్ స్వతంత్రంగా వ్యవహరిస్తూ అనేక కథనాలు ప్రచురించిన విషయం తెలిసిందే. మూడేళ్ళక్రితం ఆ సంస్థ ఢిల్లీ కార్యాలయంలో సోదాలు కూడా జరిగాయి. 152వంటి భయానక చట్టంతో పాత్రికేయుల నోరునొక్కే ఈ ప్రయత్నాలను రేపోమాపో దానిని సమీక్షించబోతున్న సుప్రీంకోర్టు దృష్టిలో పెట్టుకోవాలి.

స్పీకర్‌కు 'సుప్రీం' నిర్దేశం!

తెలంగాణలో పార్టీ ఫిరాయించిన పదిమంది ఎమ్మెల్యేలకు తాము ఫిరాయింపు నిరోధక చట్టం ప్రకారం పదవి కోల్పోతామని బాగా తెలుసు. కానీ, 'ఒక ఏడాది హైకోర్టుకు పోదాం, ఆ తరువాత సుప్రీంకోర్టుకు పోదాం, అప్పటికి అయిదేళ్ల పదవీకాలం అయిపోతుంద'ని వారి నమ్మకం. కేవలం కోర్టుల ద్వారా ఆలస్యాలను వాడుకుంటూ పదవిలో కొనసాగాలనే ఆశ, దురాశ.

ప్రభుత్వంలోని మూడు ముఖ్య మూలస్తంభాలలో శాసనవ్యవస్థ ఒకటి. శాసనసభ కొనసాగుతున్నంత వరకు సభాపతి ముఖ్యమంత్రి కన్నా గొప్ప అధికారం కలిగిన 'న్యాయాధికారి'. ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లను నిర్ణయించేటప్పుడు స్పీకర్ ఒక ట్రిబ్యునల్‌గా నిరంతరం పని చేస్తూనే ఉండాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. "ప్రజాస్వామ్యం కోసం, స్పీకర్ దయచేసి ఫైళ్లపై కూర్చోవద్దు," అంటూ పదిమంది ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ జూలై 31, 2025 నుంచి



మూడు నెలల్లోగా విచారణ పూర్తి చేయాలని కోర్టు ఆదేశించింది. జస్టిస్ బి.ఆర్. గవాయ్, ఎ.జి. మసీహ్ ధర్మాసనం తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ ఈ పదిమంది ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లను నిర్ణయించడంలో త్వరగా వ్యవహరించలేదని మెత్తగా మందలించింది. ఈ పదిమంది ఎమ్మెల్యేలు భారత రాష్ట్ర సమితి (BRS) అభ్యర్థులుగా అసెంబ్లీకి ఎన్నికయ్యారు. నాలుగునెలల్లోనే అధికార కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించారు. ఒక అసెంబ్లీ సభ్యుడు తన రాజకీయ పార్టీ సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకున్నట్లయితే తన పదవికి అనర్హుడు అవుతాడని పదవ షెడ్యూల్‌లోని పేరా 2(1) పేర్కొంది. అయితే, ఇది పేరా 4కి లోబడి ఉంటుంది. ఫిరాయించిన ఎమ్మెల్యేలు తమ శాసనసభ పక్షంలో మూడింట రెండు వంతుల కంటే తక్కువ కాకుండా ఉంటే మరొక పార్టీతో విలీనం కావాలి. లేదా కొత్త పార్టీని ఏర్పాటు చేయాలని నిర్ణయించుకుంటే అనర్హత నుంచి మినహాయింపు లభిస్తుంది. కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సంఖ్య అసెంబ్లీలోని మొత్తం బీఆర్ఎస్ బలంలో మూడింట రెండు వంతుల కంటే తక్కువే కాబట్టి, వీరికి పేరా 4 ద్వారా అనర్హత నుంచి రక్షణ (ఇమ్యూనిటీ) లభించలేదు. ఇటువంటి సందర్భాలలో, అనర్హత పిటిషన్లను స్పీకర్ విధిగా నిర్ణయించాలి. కానీ, పదవ షెడ్యూల్ 1985లో అమలులోకి వచ్చినప్పటి నుంచి, స్పీకర్లు (ఎక్కువగా అధికార పార్టీలకు చెందినవారు) అసెంబ్లీల పదవీకాలం ముగిసే వరకు అటువంటి పిటిషన్లపై తమ నిర్ణయాలను విపరీత ఆలస్యం చేసిన సందర్భాలు అనేకం. ఇది రాజ్యాంగ విరుద్ధమని స్పీకర్లకూ తెలుసు.

సెప్టెంబర్ 9, 2024న, తెలంగాణ హైకోర్టు సింగిల్ జడ్జి అసెంబ్లీ కార్యదర్శిని అనర్హత పిటిషన్లను స్పీకర్ ముందు ఉంచి, విచారణకు షెడ్యూల్ నాలుగు వారాల్లోగా నిర్ణయించాలని ఆదేశించారు. అప్పటికీ ఏ జవాబూ రాకపోతే, సుమోటోగా కేసు విచారణ తిరిగి ప్రారంభిస్తామని సింగిల్ జడ్జి పేర్కొన్నారు. శాసనసభ కార్యదర్శి దీనిని హైకోర్టులో సవాలు చేశారు (చేయించారు). నవంబర్ 22, 2024న హైకోర్టు ధర్మాసనం సింగిల్ జడ్జి ఉత్తర్వులను పక్కన పెట్టేసింది. ప్రతివాదులు సుప్రీంకోర్టులో అప్పీల్ చేశారు. నాలుగు వారాల గడువులోగా స్పీకర్ అనర్హత పిటిషన్లను నిర్ణయించేలా ఆదేశించాలని కోరారు. రాజ్యాంగం ప్రకారం న్యాయసమీక్ష అధికారం న్యాయస్థానాలకు ఉంటుంది. అయితే, అనర్హత పిటిషన్‌పై త్వరగా నిర్ణయం తీసుకోవడానికి స్పీకర్/చైర్మన్‌పై న్యాయపరమైన ఆంక్షలు ఉండవు. అనర్హత ప్రశ్నను స్పీకర్ నిర్ణయించకుండా వదిలేస్తే, అది పదవ షెడ్యూల్‌లోని పేరా 6 కవచం కింద పనికి రాదని కోర్టు నిర్ణయించింది. తెలంగాణలో ఫిరాయించిన ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లలో స్పీకర్ ఏడు నెలలకు పైగా నోటీసులు కూడా జారీ చేయలేదు. సుప్రీంకోర్టులో విచారణ మొదలైన తరువాత మాత్రమే నోటీసులు జారీచేశారు. స్పీకర్‌కు రాజ్యాంగం పదో షెడ్యూల్డ్ కవచం లేదనీ, ఒక ట్రిబ్యునల్‌గా పనిచేసే స్పీకర్ త్వరగా వ్యవహరించాలని సుప్రీంకోర్టు పునరుద్ఘాటించింది. స్పష్టమైన గడువు పెట్టింది. ఈ తీర్పు పదవ షెడ్యూల్ అమలును బలపరుస్తుంది. కానీ నిష్క్రియను, దీర్ఘకాలిక ఆలస్యాలను ఒప్పుకోదు. మూడు నెలల్లోగా అనర్హతను నిర్ణయించాలని స్పీకర్‌ను ఆదేశించడం మంచి తీర్పు.

— మాడభూషి శ్రీధర్

ఓట్ల చోరీలో దొరలెవ్వరు.. దొంగలెవ్వరు!

గణితంలో మనం ఘటికులం! ఈ ఘనత ఇప్పటిది కాదు. సున్నాని కనిపెట్టటంతో ఆరంభమై దశాంశ పద్ధతిని ఉపయోగించటంతో వందల ఏళ్ల క్రితమే భారతీయుల ప్రతిభ ప్రపంచానికి వెల్లడైంది. ఇది ఒకవైపు చిత్రం. మరోవైపు చూస్తే లెక్కలను అస్తవ్యస్తంగా నిర్వహించటంలోనూ, అవసరాలకు అనుగుణంగా వాటిని అటూఇటూ చేయటంలో కూడా మనం దిట్టలమే! ప్రభుత్వానికి సంబంధించిన ఏ శాఖను చూసినా ఇప్పటికీ ఈ దృశ్యం కనపడుతుంది. ఓటర్ల జాబితాపై కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ ఎక్కుపెట్టిన విమర్శలతో మన లెక్కలు, సమాచార విశ్వసనీయతపై సందేహాలు ఇంకా ఎక్కువయ్యాయి. మన ఆర్థిక వ్యవస్థకు సంబంధించి కీలక గణాంకాలపై ఇప్పటికే చాలా వివాదాలు ముసురుకున్నాయి. ఇప్పుడు వాటికి ఓటర్ల జాబితా కూడా తోడైంది.

ఓటర్ల జాబితాలో అనర్హులను చేర్చి బీజేపీకి అనుకూలంగా ఓట్లు వేయించటంలో ఎన్నికల కమిషన్ లాలూచీ పడిందన్న రాహుల్‌గాంధీ ఆరోపణలు అసాధారణమైనవి. ఏ ఉద్దేశంతో వాటిని చేసినా, వాటిల్లో సాధికారత ఎంత ఉన్నా ప్రస్తుత సందర్భంలో అవి లేవనెత్తిన సమస్యలు వ్యవస్థల పనితీరును లోతుగా పరిశీలించేటట్లు చేస్తున్నాయి. ఓటర్ల జాబితాలు నూటికినూరుపాళ్లూ పక్కాగా నిర్వహించలేకపోవటంలో పాపం ఎవరిది? ఎన్నికల ముందు ఓటర్ల జాబితాలో పేర్లు చేర్చినంత మాత్రాన అధికారంలో ఉన్న పార్టీ ఫలితాలను నిర్దేశించగలుగుతుందా? విపక్షాలు అధికారంలో ఉన్నచోట్ల రాష్ట్ర ప్రభుత్వాల అదుపు ఆజ్ఞల్లోనే ఉద్యోగ యంత్రాంగమంతా ఉంటుంది. కేంద్ర ఎన్నికల కమిషన్ ఢిల్లీ నుంచి హుకుం జారీ చేస్తే ఓటర్ల జాబితాను అనర్హులతో నింపివేయటానికి అది సాహసిస్తుందా? అన్న కీలక ప్రశ్నలకు జవాబులివ్వటం అంత తేలికకాదు. బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని మహదేవపుర అసెంబ్లీ సెగ్మెంట్‌లో 1,00,250 మంది అనర్హులైన వారిని ఓటర్లుగా చేర్చి ఫలితాన్ని తారుమారు చేయగలిగిందన్న ఆరోపణకు సమర్థనగా రాహుల్‌గాంధీ ఇచ్చిన సమాచారాన్ని పరిశీలిస్తే అది ఏ ఒక్క నియోజకవర్గానికో పరిమితం కాదని సులువుగానే అర్థమవుతుంది. ఒకే ఇంటి నంబరుతో పదులకొద్దీ ఓటర్లు ఉండటం, అసలు అడ్రస్సే లేకుండా ఓటర్లుగా నమోదు కావటం, ఒక వ్యక్తి రెండు మూడు ఓటరు కార్డులు కలిగి ఉండటం, కార్డుల్లో ఉన్న ఫొటోలకు అసలు వ్యక్తులకు పొంతన లేకపోవటం, నియోజకవర్గాన్ని మార్చుకోటానికీ కొత్తగా ఓటర్లుగా నమోదుకావటానికీ వెసులుబాటు కల్పించే ఫామ్–6ను దుర్వినియోగం చేయటం.. ఇట్లా అయిదు అక్రమాలను పేర్కొని మహదేవపురలో భారీగా ఓట్ల చోరీ జరిగిందని రాహుల్‌గాంధీ ఆరోపించారు.

ఆ ఆరోపణలను విచారించి నిజానిజాలను వెల్లడిస్తామని ఎన్నికల కమిషన్ హుందాగా చెప్పి ఉంటే పరిస్థితి వేరేరకంగా ఉండేది. ప్రతి ఆరోపణకూ తగిన ఆధారాలను పొందుపరుస్తూ అఫిడవిట్ దాఖలుచేయాలని ఎన్నికల కమిషన్ రాహుల్ గాంధీపై ఎదురుదాడికి దిగటంతో ఏదో కప్పిపుచ్చటానికి ప్రయత్నిస్తోందన్న భావన ప్రజల్లో బలపడింది. ఒక డోర్ నంబరులో పదులకొద్దీ ఓటర్లు ఎలా ఉంటారన్న విమర్శతో పాటు అసలు అడ్రస్సే లేని వాళ్లకు ఓటరు కార్డులు ఎలా ఇచ్చారన్న ఆరోపణకు కమిషన్ తాపీగా సుదీర్ఘ వివరణ ఇచ్చింది. ఇక ఒక వ్యక్తి రెండు కార్డులు కలిగి ఉండటం అక్రమమేననీ దానిపై మాత్రం దర్యాప్తు చేస్తామని ప్రకటించింది. ఓటర్ల జాబితాలో తప్పులను సరిదిద్దటానికే బిహార్‌లో తీవ్ర ప్రక్షాళనను చేపట్టామని చెప్పింది. దేశవ్యాప్తంగా దాన్ని అమలుచేస్తామనీ పునరుద్ఘాటించింది. గతంలో కూడా ఒకే అడ్రస్‌పై వందల ఓటర్ల కార్డులు ఉన్నాయన్న ఆరోపణలు వస్తే ఎలక్షన్ కమిషన్ ఈ తరహాలో వివరణ ఇచ్చిన సందర్భం లేదు. ఇప్పుడు మాత్రం డోర్ నంబర్ లేని వాళ్లకు సున్నా పేరుతో ఓటరు కార్డులు జారీచేశామని చెప్పుకొచ్చారు. స్థానిక సంస్థలు డోర్ నంబరు కేటాయించని ఇళ్లతో పాటు ఎక్కడో ఒకచోట తలదాచుకునే అనేక కుటుంబాలకు ఓటు హక్కుని నిరాకరించకుండా ఉండటానికే సున్నా అడ్రస్‌తో కార్డులు జారీ చేశామని వివరించారు. అలాగే సమీపంలో ఉన్న డోర్‌నంబర్‌ను పేర్కొని అర్హులకు కార్డులు ఇచ్చామని కూడా చెప్పారు. నగర ప్రాంతాల్లోని బస్తీల్లో, మురికివాడల్లో ఇది సర్వసాధారణం. రాహుల్‌గాంధీ పేర్కొన్న అయిదు అక్రమాల్లో ప్రత్యక్షంగా అడ్రసుకు సంబంధించినవే 50 శాతానికి పైగా ఉన్నాయి. ఇక నియోజకవర్గ అడ్రస్ మార్పిడికి– కొత్త ఓటరు నమోదుకు సంబంధించిన ఫాం–6 అక్రమాన్ని కూడా వీటికి కలిపితే 85 శాతం అవుతాయి. వీటిల్లో కొత్త ఓటర్ల సంఖ్యని తీసివేస్తే అడ్రసు సంబంధిత ఆరోపణలే సింహభాగం ఉంటాయి.



ఓటర్ల జాబితాలు నూటికినూరుపాళ్లూ పక్కాగా నిర్వహించలేకపోవటంలో పాపం ఎవరిది? ఎన్నికల ముందు ఓటర్ల జాబితాలో పేర్లు చేర్చినంత మాత్రాన అధికారంలో ఉన్న పార్టీ ఫలితాలను నిర్దేశించగలుగుతుందా? విపక్షాలు అధికారంలో ఉన్నచోట్ల రాష్ట్ర ప్రభుత్వాల అదుపు ఆజ్ఞల్లోనే ఉద్యోగ యంత్రాంగమంతా ఉంటుంది. కేంద్ర ఎన్నికల కమిషన్ ఢిల్లీ నుంచి హుకుం జారీచేస్తే ఓటర్ల జాబితాను అనర్హులతో నింపివేయటానికి అది సాహసిస్తుందా?

ఢిల్లీ, ముంబయిల్లో 30 శాతంపైగా జనాభా మురికివాడల్లోనే నివసిస్తున్నారు. హైదరాబాద్, చెన్నై, బెంగళూరుల్లోనూ అంతే సంఖ్యలో ఉంటారు. మహదేవపురలో అక్రమ ఓటర్లుగా పేర్కొన్న 1,00,250 మందినీ ఎన్నికలకు ముందుగానే ఓటర్ల జాబితాలో చేర్చారా? లేదా? అన్న విషయం రాహుల్‌గాంధీ స్పష్టంగా చెప్పలేదు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలు 2023 మేలో జరిగాయి. అప్పటికే మహదేవపురలో 6,07,255 మంది ఓటర్లుగా నమోదయ్యారు. 2024 లోక్‌సభ ఎన్నికల నాటికి ఆ సంఖ్య 6,59,826కు పెరిగింది. రెండు ఎన్నికల మధ్య ఏడాది వ్యవధిలో పెరిగిన ఓటర్లు 52,571 మంది మాత్రమే. ఇక 2008లో మహదేవపురలో ఓటర్లు 2,75,299 మంది ఉంటే లోక్‌సభ ఎన్నికల నాటికి ఆ సంఖ్య 6,59,826కు చేరటం అసాధారణంగా రాహుల్ పేర్కొన్నారు. అంటే 140 శాతం పెరుగుదల. బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ నియోజకవర్గంలోని మిగతా అసెంబ్లీ సెగ్మెంట్లలో ఈ పెరుగుదల 26శాతం లోపే ఉంది. మహదేవపురలోనే అది 140 శాతానికి పెరగటం ఓట్లచోరీకి నిదర్శనమని రాహుల్ ఆరోపించారు. ఈ అసాధారణత వెనుక అక్రమాలు ఉన్నాయా? లేవా? అన్నది ఎలక్షన్ కమిషనే తేల్చాలి. అయితే ఇతర మెట్రోనగరాల్లోని కొన్ని నియోజకవర్గాల్లోని పరిస్థితితో పోల్చితే ఈ అసాధారణ పెరుగుదల మరోచోట లేదని చెప్పలేం. ఉపాధి సౌకర్యాలు ఉన్న ప్రాంతాలకు అధిక సంఖ్యలో ప్రజలు వలసలు పోవటం సాధారణంగా జరుగుతుంది. తెలంగాణలోని కుత్బుల్లాపూర్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఈ పరిస్థితి స్పష్టంగా కనపడుతుంది. 2009లో అక్కడ 3,13,160 ఓటర్లు ఉంటే 2024 లోక్‌సభ ఎన్నికల నాటికి 7,25,102 మందికి పెరిగారు. అంటే 131.54 శాతం పెరుగుదల. ఇదే కాలంలో శేరిలింగంపల్లి సెగ్మెంట్‌లో (3,80,856–7,58,160) పెరుగుదల 99.17 శాతం ఉంది. అదే కూకట్‌పల్లి సెగ్మెంట్‌లో ఆ పెరుగుదల (3,85,031–4,82,107) 25.22 శాతానికే పరిమితమైంది. భౌగోళిక సామీప్యత ఉన్న చోట్లే ఈ తేడాలు ఉన్నాయి.

దేశంలోని పది మెట్రో సిటీలతో పాటు 10 లక్షల జనాభా దాటిన 55 నగరాల్లో సైతం.. అనర్హులను ఓటర్ల జాబితాలో కుట్రపూరితంగా ఎన్నికలకు ముందు చేర్చి ఉంటే ప్రజాస్వామ్యంపైనే మనకు అపనమ్మకం కలుగుతుంది. ఈ మొత్తం 65 నగర ప్రాంతాల్లో దాదాపుగా 25 కోట్ల మంది ప్రజలు ఉంటున్నారు. ఇందులో ఓటర్లు 67శాతం అనుకుంటే వాళ్ల సంఖ్య 16.75 కోట్లు ఉంటుంది. అవకతవకలు భారీగా జరిగితే 94 చోట్ల ఫలితాలు ప్రభావితం అవుతాయి. మహదేవపురలో చేర్చినట్లు 20శాతం కాకుండా మిగతా చోట్ల 10శాతం మందిని అక్రమంగా చేర్చినా ఫలితాలను మార్చే అవకాశం అధికార పార్టీకి ఉంటుంది.

నిజానికి వలసలకు అనువైన ప్రాంతాల్లోనే ఓట్ల చేరికలపై ఆరోపణలు ఎక్కువగా ఉంటాయి. గ్రామాల్లో ఈ పరిస్థితి కనిపించదు. అన్ని పార్టీలు వలసజీవులను ఓటర్లుగా చేర్పించటానికి శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తాయి. వలసజీవులు కూడా ఎన్నికలప్పుడు పార్టీలు ఇచ్చే డబ్బు కోసం ఓటర్లుగా నమోదు అవుతారు. అదే కాకుండా ఓటరు కార్డును కలిగి ఉండటంతో సంక్షేమ పథకాల లబ్ధి పొందే అవకాశం కూడా ఉంటుంది. ఇక ఒక పార్టీ ప్రాపకంతో అక్రమంగా ఓటరుగా నమోదయ్యే వ్యక్తి ఆ పార్టీకే ఓటు వేస్తారనే పూచీ ఉండదు. ఎటు మొగ్గుతారో కచ్చితంగా ఎవరూ చెప్పలేరు. ఇక్కడ మరో విశేషం ఉంది. ఓట్ల చోరీతో బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ నియోజకవర్గ ఫలితాన్ని తారుమారు చేశారని కాంగ్రెస్ ఎంత గట్టిగా ఆరోపణలు చేసినా అక్కడ ఆ పార్టీ ఎప్పుడూ గెలవలేదు. మహదేవపుర అసెంబ్లీ సెగ్మెంట్‌లోనూ అదే పరిస్థితి. బెంగళూరు సెంట్రల్ నియోజకవర్గం పరిధిలో 8 అసెంబ్లీ సెగ్మెంట్లు ఉంటే, కాంగ్రెస్‌కు అయిదుచోట్ల మెజారిటీ వస్తే బీజేపీకి మూడు చోట్ల ఆధిక్యత లభించింది. కానీ మహదేవపురలో వచ్చిన 1,14,046 ఓట్ల మెజారిటీ ఫలితాన్ని తారుమారు చేసింది. కిందటి అసెంబ్లీ ఎన్నికల్లో కూడా బీజేపీకి (44,501) అక్కడ ఆధిక్యత వచ్చింది. ఇక పక్కనే ఉన్న సర్వజ్ఞనగర్ సెగ్మెంట్‌లో కాంగ్రెస్‌కు 74,244 ఓట్ల మెజారిటీ (లోక్‌సభ) లభించింది.



■ రాహుల్ కుమార్

పార్టీల ఆరోపణల్లో నిజాలు కొన్నే ఉంటాయి. వ్యవస్థలన్నిటినీ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవటం సర్వసాధారణమైన పరిస్థితుల్లో కొన్ని ఆరోపణలకు విపరీత ప్రాచుర్యం వస్తుంది. వ్యవస్థలను శాసిస్తున్నవారే వాటిపై దర్యాప్తు జరిపి నిజానిజాలను ప్రజల ముందు పెట్టటం కనీస బాధ్యత. ఇదేమీ లేనట్లుగా ఎన్నికల కమిషన్ ఎదురుదాడిని ఎంచుకోవటం, బిహార్ ఓటర్ల జాబితా ప్రక్షాళనకు సంబంధించి దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టులో సైతం అదే ధోరణిలో వాదించటంతో ప్రజల్లో అనుమానాలు ఇంకా బలపడ్డాయి. చివరికి బిహార్‌లో 65లక్షల మంది ఓట్లను ఎందుకు తొలగించారో కారణాలతో సహా ప్రజల ముందు పెట్టి వాళ్ల అభ్యంతరాలను స్వీకరించాలని సుప్రీంకోర్టు ఆదేశించటంతో ఇప్పుడు అసలు చిత్రం వెల్లడయ్యే అవకాశం ఉంది.

నగరాల్లోని ఓటర్ల జాబితాలను నిశితపరిశీలన చేస్తే ఎన్నికల కమిషన్ బోనులో నిలబడి తన రుజువర్తనను నిరూపించుకోక తప్పదు. వ్యవస్థాపరమైన తప్పిదాలనూ, లోపాలనూ అంగీకరించకా తప్పదు.

అందరి దగ్గరా ఉన్న ఆధార్, ఓటర్ గుర్తింపు కార్డులను పరిగణనలోకి తీసుకోకుండా తల్లిదండ్రుల జనన ధ్రువీకరణ పత్రాలు, పదోతరగతి, నివాస, కుల సర్టిఫికెట్లు లాంటివి ఉంటేనే ఓటర్ల జాబితాలో పేర్లను కొనసాగిస్తామనే షరతులను విధించటంతో కలకలం చేలరేగింది. కమిషన్ నిర్దేశించినట్లుగా కింది వర్గాల ప్రజలకు వీటిని సంపాదించటం సాధ్యం కాదనీ ఫలితంగా నష్టపోయేది ఆ వర్గాలేననీ లోక్‌నీతి–సీఎస్‌డీఎస్ సర్వేలో స్పష్టమైంది. ఆధార్ కార్డుల గురించి గొప్పలు చెప్పుకొని ఇప్పుడు వాటికి విలువలేదని అనటం మొత్తం పాలనా వ్యవస్థకే నగుబాటుగా మారింది. అది చాలదన్నట్లుగా తాను స్వయంగా జారీచేసిన ఓటరు గుర్తింపు కార్డులను కూడా పరిగణనలోకి తీసుకోబోమని చెప్పటం కమిషన్ విశ్వసనీయతను దిగజార్చింది. తాను రూపొందించిన చట్టాలను సైతం గట్టిగా అమలుచేయలేని బలహీన ప్రభుత్వ వ్యవస్థ (సాఫ్ట్‌స్టేట్) భారత్‌లో ఉందని 1968లోనే ప్రఖ్యాత ఆర్థికవేత్త గనర్ మిర్డాల్ తన 'ఏషన్ డ్రామా' పుస్తకంలో చేసిన వ్యాఖ్యలు ఈనాటికీ అక్షరసత్యాలే అన్నట్లుగా కమిషన్ వైఖరి ఉంది. ఒకే వ్యక్తి రెండుచోట్ల ఓట్లు కలిగి ఉండటం ఇప్పటికీ ఉంది. ఓటర్ పోర్టల్ ద్వారా పెట్టుకున్న దరఖాస్తులపై నెలల తరబడి తాత్సారం చేయటమూ జరుగుతోంది. చనిపోయిన వాళ్లను జాబితాల నుంచి ఎప్పటికప్పుడు తొలగించలేని అశక్తతా ఉంది. నగరాల్లోని ఓటర్ల జాబితాలను నిశితపరిశీలన చేస్తే ఎన్నికల కమిషన్ బోనులో నిలబడి తన రుజువర్తనను నిరూపించుకోక తప్పదు. వ్యవస్థాపరమైన తప్పిదాలనూ, లోపాలనూ అంగీకరించకా తప్పదు. దొంగలెవరో, దొరలెవరో అప్పుడే తేలుతుంది!

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76
అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70
జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

వీధికుక్కలపై 'సుప్రీం'ది ధర్మాగ్రహమే!

ఢిల్లీలో ఉన్న వీధి కుక్కల్ని తరలించి రక్షిత కేంద్రాల్లో ఉంచాలని సుప్రీంకోర్టు ఇటీవల తీర్పునిచ్చింది. వీధి కుక్కల బారిన పడి గాయాల పాలైన, ప్రాణాలు పోగొట్టుకున్న ఉదంతాల పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి ఈ విధంగా ఆదేశాలిచ్చింది. ఈ తీర్పు పట్ల భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నా, కారణం పరిశీలిస్తే ఇది ధర్మాగ్రహమే అన్న అభిప్రాయం కలుగుతోంది. ఇది ఢిల్లీకి మాత్రమే పరిమితమైన సమస్య కాదు. దేశమంతా ఎదుర్కొంటున్నది. సమస్య ఎంత తీవ్రమైనదంటే తీర్పు వచ్చిన వారంలోనే నాలుగైదు కుక్క కాట్లు, ఒక మరణం సంభవించినట్లు వార్తలొచ్చాయి.

దేశ వ్యాప్తంగా కుక్కల సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. ఒక్క రాజధాని నగరంలోనే అవి పది లక్షలున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం రాబిస్ మరణాల్లో 37 శాతం భారత్‌లోనే ఉన్నాయి. ఒక్క ఏడాదిలో భారత్‌లో నమోదైన కుక్క కాట్ల కేసులు 37 లక్షలంటే, సమస్య తీవ్రత ఎంతలా ఉందో తెలుస్తోంది. ఇవి నమోదైన లెక్కలు మాత్రమే. గ్రామీణ ప్రాంతాల్లో జరిగి, రికార్డ్ కానివి ఇంకా ఎక్కువగా ఉంటాయి. బాధితులు ఎక్కువగా బాలలు, వృద్ధులే.



మనిషికి నేస్తమైన కుక్క... వాటి జనాభా, ఆరోగ్యం విషయాల్లో నిర్వహణా లోపం వల్ల శత్రువుగా పరిణమిస్తోంది. అదుపులేని స్థితికి, ప్రజారోగ్యానికి సవాల్ విసిరే స్థాయికి చేరుకుంటోంది. వీటి జనాభా, ఆరోగ్యం విషయాలు రాష్ట్ర పరిధిలోని అంశాలు. ముఖ్యంగా స్థానిక సంస్థల పాత్ర అధికం. కేంద్రం చట్టాల్ని, కొంత నిధుల సాయాన్ని మాత్రమే చేయగలదు. ఉన్న చట్టాల మేరకు కుక్కల పట్ల కొంత శ్రద్ధ వహించాలి. ఒక ప్రాంతంలో ఉన్న వాటిలో డెబ్బై శాతం వాటిని పట్టుకుని, జనాభా నియంత్రణ శస్త్రచికిత్స చేసి, టీకా వేసి ఆ ప్రాంతంలోనే విడిచి పెట్టాలి. ఈ ప్రక్రియను సరిగా నిర్వహిస్తే వాటి జనాభాతో బాటు, ఆరోగ్యం కుదురుగా ఉంటుంది. అయితే కింది స్థాయిలో సిబ్బంది కొరత, అలసత్వం, నిధుల లేమితో అలా జరగడం లేదు. ప్రమాదకరంగా, వ్యాధిగ్రస్తంగా తయారైన వాటిని వెంటనే గమనించి తగు చర్యలు తీసుకోవాలి. ఇంట్లో పెంచుకునేవారు కూడా, వాటి ఆరోగ్యం పట్ల బాధ్యత వహించాలి. ఒక్క స్థానిక సంస్థలకే కాకుండా, జంతు సంరక్షణ సంస్థలకు, సామాన్య ప్రజలకు కూడా ఇందులో బాధ్యత ఉంది. సక్రమంగా వ్యవహరించని స్థానిక ప్రభుత్వాలని, సంబంధిత అధికారుల్ని జవాబుదారీ చెయ్యాలి.

ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం జంతు సంరక్షణ బోర్డు ద్వారా ఒక్కొక్క కుక్కకు శస్త్రచికిత్సకు 800 రూపాయలు చొప్పున, వెటర్నరీ ఆస్పత్రులలో సౌకర్యాలు సమకూర్చుకోవడానికి వన్ టైమ్ నిధులు విడుదల చేస్తామని రాష్ట్రాలకు తెలియజేసింది. రాష్ట్రాలు కూడా సమగ్ర కార్యాచరణ చేపట్టి, సమస్య పరిష్కారం వైపు ఆలోచించాలి. వీధి కుక్కల కోసం ప్రత్యేక సంరక్షణ కేంద్రాలు నెలకొల్పడం గానీ, నిర్వహించడం గానీ ఆచరణ సాధ్యం కాని విషయం. శాస్త్రీయంగా రుజువైన మార్గాల ద్వారా వాటి జనాభాను అదుపులో ఉంచడం, ఆరోగ్యాన్ని కాపాడడం అవసరం. ఇప్పటికే సమస్య చేయి దాటిపోతున్న కారణంగా అత్యవసరంగా ప్రణాళికల్ని అమలుచేయాలి. విలువైన మానవ ప్రాణాలు వీధి కుక్కల పాలు కాకూడదు. వీటిని సమూలంగా తుడిచిపెట్టేయడం కూడా మానవత్వం కాదు. మచ్చికయిన జంతువుతో సమాజానికి సహాయం జరగాలా, సమస్య రావాలా అన్నది మనిషి చేతిలోనే ఉంది.

— డి.వి.జి. శంకరరావు, మాజీ ఎంపీ

భారత్–చైనా: కరుగుతున్న మంచు

ఫిబ్రవరి 2014లో చైనా అధ్యక్షుడు క్సీ జిన్పింగ్ మళ్ళీ క్రీ.పూ. నాటి 'సిల్క్ రూట్'ను పునరుద్ధరిస్తున్నాం, అని ప్రకటించినప్పుడు చైనాకు అదొక అత్యాశతో కూడిన కల అని ప్రపంచం అనుకుంది. ప్రపంచం అలా అనుకుని వుండొచ్చు, కానీ సరిహద్దున ఉన్న మనమూ అలాగే అనుకుని సరిపెట్టేసుకున్నాం. అప్పటికి ఒబామా రెండవసారి అధ్యక్షుడు కావడంతో ఆసియా–పసిఫిక్ కేంద్రిత అంతర్జాతీయ వ్యవహారాల్లో మనం చురుగ్గా ఉన్నాం. సరిహద్దున చైనాను నిలువరించడానికి మన దేశం 'ఆసియాన్' వాణిజ్య కూటమిలో ఉండడం 'జియో–పొలిటికల్'గా తగిన సమతూకం అని ఎన్డీఏ ప్రభుత్వం భావించింది. రేపు ఆ వెసులుబాటు ఏ కారణం వల్ల నైనా జారిపోతే, అప్పుడు మన వైఖరి ఎలావుండాలి అనే ముందస్తు ఆలోచనను అప్పట్లో మనం చేయలేదు.

ట్రంప్ వచ్చి 23 జనవరి 2017న 'ట్రాన్స్–పసిఫిక్' ఒప్పందంలో ఇకముందు అమెరికా ఉండదని ప్రకటించారు. ట్రంప్ నిర్ణయంతో చైనా తన దక్షిణ సరిహద్దున ఆగ్నేయ ఆసియా దేశాలపై ఆధిక్యత కోసం, ముడుచుకున్న కాళ్ళు కాస్తా బార్లా చాపింది! మారిన ట్రంప్ వ్యూహం వల్ల ఆసియాలో ఏమి జరుగుతోందని ఆరా తీసేంత స్థిమితం అమెరికాకు లేకపోయింది. అదను ఎంచి, మొదట 'సిల్క్ రూట్' ప్రకటించిన చైనా దాన్ని 'వన్ బెల్ట్ – వన్ రోడ్'గా మార్చింది. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ 'సిగ్నేచర్ ప్లాన్'గా ప్రపంచ మీడియా అభివర్ణించిన 'ఓబీఓఆర్' అధికారిక ప్రకటన బీజింగ్‌లో 28 దేశాల అధిపతులు, వంద దేశాలకు చెందిన ప్రతినిధుల మధ్య 2017 మే 14–15 తేదీల్లో ఘనంగా జరిగింది. రష్యా నుంచి వ్లాదిమీర్ పుతిన్, బ్రిటన్ నుంచి తెరిస్సా మే, ఫిలిప్పీన్స్ నుంచి డి రోడ్రిగో, పాక్ నుంచి నవాజ్ షరీఫ్ వంటి వారు వచ్చారు. యూఎన్ సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్, ప్రపంచ బ్యాంక్ ప్రెసిడెంట్ జిం యంగ్ కిం, ఐఎంఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్ క్రిస్టియానా లెగ్రెడ్ ఆ రోజు అక్కడ ఉన్నారు. యాభైకి పైగా వాణిజ్య ఒప్పందాలు జరిగాయి. చివరికి అమెరికా, జపాన్ సైతం చైనాతో ఉన్న వాటి అభ్యంతరాలను పక్కన పెట్టి తమ ప్రతినిధులను బీజింగ్‌కు పంపాయి. అయితే భారత్ దీనికి హాజరు కాలేదు!

జరిగింది ఏమిటి? అని చూసినప్పుడు ప్రపంచీకరణ ప్రభావాన్ని సకాలంలో అంచనా వేసి, ఆసియాలో అందరి కంటే ముందుగా ఆసియా, యూరప్, ఇండో–పసిఫిక్ దేశాలతో చైనా తన వాణిజ్య బంధనాలను ముడివేసుకుంది. ఇంకా అభివృద్ధి చెందని తన మైదాన ప్రాంతానికి 'బెల్ట్' పేరుతో ఉపరితల రవాణా ద్వారా మధ్య ఆసియా దేశాలకు తలుపులు తెరిచింది. 'రోడ్' ద్వారా సముద్ర జలాల నుంచి ఆగ్నేయ ఆసియా దేశాల్లోకి నూతన వాణిజ్య ద్వారాలను తెరిచింది. ఇదిలా ఉంటే, వారం ముందు వరకు ఈ సదస్సుకు హాజరుపై మన నిర్ణయం అసందిగ్ధంగానే మిగిలింది.



సరిహద్దున చైనాను నిలువరించడానికి మన దేశం 'ఆసియాన్' వాణిజ్య కూటమిలో ఉండడం 'జియో–పొలిటికల్'గా తగిన సమతూకం అని ఎన్డీఏ ప్రభుత్వం భావించింది. రేపు ఆ వెసులుబాటు ఏ కారణం వల్లనైనా జారిపోతే, అప్పుడు మన వైఖరి ఎలావుండాలి అనే ముందస్తు ఆలోచనను అప్పట్లో మనం చేయలేదు.

ఇంతకీ ఈ చైనా చొరవపై మోదీ ప్రభుత్వ అభ్యంతరం ఏమిటి? 'బెల్ట్'లో భాగంగా చైనాలోని ఖష్గర్ నుంచి పాక్ పశ్చిమ తీరాన అరేబియన్ సముద్రంలో ఉన్న గ్వాదర్ పోర్టుకు 'చైనా–పాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్' పేరుతో ఒక ప్రత్యేక రోడ్డును నిర్మించింది. ఇది 3 భాగాలుగా వుంది. ఇందులో మొదటిదైన 1300 కి.మీ. కారకోరం హైవే– చైనా నుంచి బయలుదేరి– పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోకి ప్రవేశించి, అక్కణ్ణించి ఇస్లామాబాద్‌లోకి ప్రవేశిస్తుంది. అలా అది పాకిస్థాన్ భూభాగాన్ని తూర్పు నుంచి పడమరకు ఆసాంతం దాటి గ్వాదర్ పోర్ట్ చేరుతుంది. మోదీ ప్రభుత్వం ఇందుకు అభ్యంతరం చెబుతున్నది.

మన సరిహద్దున ఉన్న పొరుగు దేశం మరొక దేశంలో నుంచి తూర్పు పడమరలను కలుపుతూ 3217కి.మీ. హైవే వేసుకుని వ్యాపారం చేసుకుంటుంటే– తన ప్రయోజనం కోసం పాక్ అందుకు అనుమతించింది. అయితే దాన్లో పాక్ ఆక్రమిత కశ్మీర్ ఉండడం, భారత సార్వభౌమ అధికారాన్ని ధిక్కరించడంగా మోదీ ప్రభుత్వం భావించింది. నిజానికి ఇండియా అప్పుడే దాన్ని ఒక అవకాశంగా తీసుకుని 'రికార్డు'లో అది– 'పాక్ ఆక్రమిత కాశ్మీర్' అనే 'క్లాజ్'తో దాన్ని అంగీకరించి ఉంటే, ఎలా ఉండేదో? కానీ అది జరగలేదు.

ఇది జరిగిన నెలలోపే, బీజింగ్‌లో జరగవలసిన తొమ్మిదవ 'బ్రిక్స్' సదస్సు ముందస్తు సన్నాహాలపై జూన్ 10–12న చైనా సభ్యదేశాల ప్రతినిధులను పిలిచింది. ఇండియా అప్పటి బీజేపీ జనరల్ సెక్రటరీ రాంమాధవ్‌ను చైనాకు పంపి, 'వన్ బెల్ట్–వన్ రోడ్' ఆరంభానికి భారత్ గైర్హాజరీపై మన సమర్థనకు ఆయన్ని ప్రతినిధిగా ఎంచుకుంది. ఇది జరిగాక చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ 2019 అక్టోబర్ 11–12న ఇండియాకు సౌహార్ద పర్యటనకు వస్తే, అందుకు తగిన వేదికగా మొదట వారణాసి అనుకొని, ఆ తర్వాత దాన్ని తమిళనాడు మహాబలిపురం సముద్ర తీరానికి మార్చారు. శ్రీలంక తీరంలో చైనా తిష్టవేసుకున్న వేళ, ఎన్డీఏ రాజకీయ అవసరాల కోసం దక్షిణాదిన ఇటువంటి స్థల మార్పు చేశారు.


వరుసగా మోదీ మూడు 'టర్మ్'ల విజయం తర్వాత 2025 నాటికి 'బ్రిక్స్' దేశాల కూటమి బలపడి, 'గ్లోబల్ సౌత్' భావన ముందుకు వచ్చింది. పైగా వచ్చే ఏడాది 'బ్రిక్స్' సదస్సుకు ఇండియా ఆతిథ్యం ఇవ్వాల్సి ఉంది. 'బ్రిక్స్' దేశాల మధ్య 'సౌత్–సౌత్ కోపరేషన్' తప్పనిసరి అయింది. ఈ కాలంలో చైనా–పాక్‌లతో 'ఎన్డీఏ' ప్రభుత్వం అనుసరించిన దౌత్య విధానం మాటేమిటి? సమాధానం చెప్పవలసిన అనివార్యత ఏర్పడడంతో ఆగస్టు 31న మోదీ చైనా వెళుతున్నారు. ఏడేళ్ల తర్వాత మన వైపు నుంచి మొదలైన ఈ కదలికతో, చైనా విదేశాంగ మంత్రి ఇండియాకు వచ్చివెళ్ళారు.

■ జాన్‌సన్ చోరగుడి



అన్నదాతలకు వెన్నుదన్ను

- రైతు విజ్ఞాన కేంద్రాల ఏర్పాటుకు సన్నాహాలు
- ఆధునిక వ్యవసాయ పద్ధతులతో పాటు సాంకేతిక పరిజ్ఞానం అందించమే లక్ష్యం
- స్థల సేకరణకు అధికారుల కసరత్తు
- నాలుగు జిల్లాల రైతులకు మరింత మేలు
- ఆర్‌వీకేలుగా మారనున్న ఏరువాక కేంద్రాలు



హనుమకొండ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులతోపాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా జిల్లాకు ఒకటి చొప్పున రైతు విజ్ఞాన కేంద్రాలను (ఆర్‌వీకే) ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఆచార్య జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం విజ్ఞాన కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేసింది. దీనితో హనుమకొండ, జనగామ, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో కొత్తగా రైతు విజ్ఞాన కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి. వరంగల్ జిల్లాకు సంబంధించి ములుగు రోడ్డులో వ్యవసాయ పరిశోధనా కేంద్రం, మహబూబాబాద్ జిల్లాలోని మల్యాలలో మరో వ్యవసాయ పరిశోధన కేంద్రం ఉన్నందువల్ల ఇక్కడ రైతు విజ్ఞాన కేంద్రాలను ఏర్పాటు చేయరు. ఒక్కో ఆర్‌కేవీని సుమారు 30 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తారు. ఈ మేరకు ఈ నాలుగు జిల్లాల వ్యవసాయ శాఖ అధికారులు స్థలాలను సేకరించే పనిలో ఉన్నారు. హనుమకొండ జిల్లాకు సంబంధించి రైతు విజ్ఞాన కేంద్రం భీమదేవరపల్లి మండలంలో ఏర్పాటు చేసే అవకాశం ఉంది. ఈ మండలంలో ప్రభుత్వ భూమి అందుబాటులో ఉన్నందువల్ల ఇక్కడ స్థల సేకరణకు కసరత్తు జరుగుతోంది. జనగామ, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో రైతు విజ్ఞాన కేంద్రాల ఏర్పాటుకు అనువైన స్థలాల కోసం అన్వేషణ సాగుతోంది.

ఆధునిక శిక్షణ

ఉమ్మడి వరంగల్ జిల్లాలో దేవాదుల, ఎస్‌ఆర్ఎస్‌పీ కాకతీయ కాలువ ద్వారా అందే సాగునీటితో పాటు చెరువులు, కుంటలపైనే ఆధారపడి రైతులు వ్యవసాయం చేస్తున్నారు. అన్నదాతలకు వాతావరణ మార్పులపై అవగాహన, పంటల మార్పిడి పద్ధతి, నేరుగా వరి విత్తడం, పత్తిలో కలుపు మొక్కల నివారణ వంటి వాటిని ప్రోత్సహించాలని ప్రభుత్వం భావిస్తోంది. అంతే కాకుండా డ్రోన్లు, యంత్రాల వినియోగం, కృత్రిమ మేధ, రోబోటిక్స్ వంటి ఆధునిక సాంకేతిక సేవలను ఈ రైతు విజ్ఞాన కేంద్రాల ద్వారా అందించనున్నారు. ఇందుకు సంబంధించిన కసరత్తు జరుగుతున్నది.

ఆధునిక హంగులు

కొత్తగా ఏర్పడే రైతు విజ్ఞాన కేంద్రంలో ఆరుగురు శాస్త్రవేత్తలు, ఇతర సహాయక సిబ్బంది ఉంటారు. ఇప్పటికే ఆధునిక వ్యవసాయం పట్ల రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ, నూతన వ్యవసాయ విధానం, సాంకేతికత, శాస్త్రీయ పద్ధతుల ద్వారా పంట దిగుబడులు పెంచే విధంగా ఈ రైతు విజ్ఞాన కేంద్రాల్లో శిక్షణ ఇస్తారు. సేంద్రియ వ్యవసాయంపై రైతులు మొగ్గు చూపేలా ప్రోత్సహిస్తారు. ఈ కేంద్రంలో ప్రయోగశాల ఏర్పాటు చేయడంతో పాటు వాటికి అనుబంధంగా విత్తన సాగు క్షేత్రాలుంటాయి. వాటిలో డ్రోన్లు, యంత్రాలపై శిక్షణ ఇస్తారు. నిత్యం పరిశోధనలు, ప్రయోగాలు, రైతు శిక్షణ కార్యక్రమాలకు అవకాశం కల్పించనున్నారు. దీంతో సాగు సమస్యల నుంచి రైతులకు చాలా వరకు విముక్తి కలగనున్నది. మొత్తంగా ప్రయోగఫలాలు అన్నదాతలకు చేరేందుకు అవకాశం కలుగుతుంది. రైతు విజ్ఞాన కేంద్రాల ఏర్పాటుతో రైతులకు క్షేత్ర సందర్శనకు మంచి అవకాశం ఏర్పడుతుంది. సాంకేతిక చేరువై రైతులకు మరింత ప్రయోజనం చేకూరనున్నది. పంట సమస్యలు, చీడపీడల నివారణ, నేల రకం, తదితర సమస్యలపై వ్యవసాయ శాస్త్రవేత్తలు నేరుగా రైతులతో మాట్లాడేందుకు ఈ కేంద్రాల వల్ల అవకాశం కలుగుతుంది.

ఏరువాకలు ఇక ఆర్‌కేవీలు

రాష్ట్ర వ్యాప్తంగా 17 ఏరువాక కేంద్రాలు, 8 కృషి విజ్ఞాన కేంద్రాలు (కేవీకే) ప్రస్తుతం పని చేస్తున్నాయి ఇందులో కొంత మంది శాస్త్రవేత్తలే పని చేస్తున్నారు. 15 జిల్లాల్లో శాస్త్రవేత్తలు లేరు. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న ఏరువాక కేంద్రాలు, కేవీకేలకు అదనంగా 15 జిల్లాల్లో కొత్తగా రైతు విజ్ఞాన కేంద్రాలను ఏర్పాటు చేయనుంది. ప్రస్తుతం ఉన్న ఈ 17 ఏరువాక కేంద్రాలను రైతు విజ్ఞాన కేంద్రాలుగా మారుస్తారు. కొత్తగా ప్రారంభమయ్యే అంకుర వ్యవసాయ సంస్థలకు అవసరమైన స్థలాలను కూడా వీటికి అనుబంధంగా అందుబాటులో ఉంచనున్నారు.


ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి జిల్లాలో 75 మండలాలు ఉన్నాయి. 2 పరిశోధనా స్థానాలు రైతులకు సేవలు అందిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో 17.95 లక్షల ఎకరాల సాగుభూమి ఉంది. రైతులు 21.68 లక్షల మంది ఉన్నారు. నేల స్వభావం నల్లరేగడి, ఎర్రచెల్క. పత్తి, వరి, మొక్కజొన్న మిర్చి, కంది, వేరుశనగ ప్రధాన పంటలు.

నాలుగు జిల్లాల్లో ఆర్‌వీకేలు : ఆర్.ఉమారెడ్డి, సహ పరిశోధనా సంచాలకుడు



కృషి విజ్ఞాన కేంద్రాలు (కేవీకే)లు కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చర్ రిసెర్చ్ (ఐసీఏఆర్) నిధులతో నడుస్తాయి. ఏరువాక కేంద్రాలు రాష్ట్ర ప్రభుత్వం నిధులతో పని చేస్తాయి. అయితే ఇవి అన్ని జిల్లాల్లో లేవు. ఈ ఏరువాక కేంద్రాలనే రైతు విజ్ఞాన కేంద్రాలుగా మార్చి 33 జిల్లాలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కృషి విజ్ఞాన కేంద్రాలు ఉన్నచోట కాకుండా మిగతా జిల్లాల్లో వీటిని ఏర్పాటు చేస్తారు. కృషి విజ్ఞాన కేంద్రాలు మధ్య తెలంగాణ మండలంలోని పది జిల్లాల్లో మూడు జిల్లాలు- భద్రాద్రి కొత్తగూడెం, అలాగే ఖమ్మం జిల్లా వైరా, మహబూబాబాద్ జిల్లా మల్యాలలో కేవీకేలు ఉన్నాయి. మిగతా ఏడు జిల్లాల్లో మూడింటిలో ఏరువాక కేంద్రాలు ఇది వరకే ఉన్నాయి. ఇందులో ఒకటి వరంగల్‌లో ఉండగా మిగతా రెండు సిద్దిపేట జిల్లా తోర్నాల, సంగారెడ్డి జిల్లా జోగిపేటలో ఉన్నాయి. హనుమకొండ, జనగామ, ములుగు, జయశంకర్ జిల్లాల్లో కేవీకేలుగానీ, ఏరువాకలు గానీ లేవు కనుక ఇక్కడ కొత్తగా నాలుగు రైతు విజ్ఞాన కేంద్రాలను ఏర్పాటు చేసే అవకాశం ఉంది.



విద్యుత్ వెలుగుల్లో దర్గా పరిసరాలు

సంధల్ సందడి..

- భక్తి ప్రపత్తులతో సాగిన ఊరేగింపు
- ప్రారంభమైన కాజీపేట దర్గా ఉత్సవాలు

6



సంధల్‌ను తీసుకొస్తున్న ఖుస్రుపాషా



కాజీపేట దర్గాలో సంధల్‌ను ఊరేగింపుగా తీసుకొస్తున్న దృశ్యం

పదోన్నతుల పర్వం

- ఉమ్మడి జిల్లాలో 145 మందికి హెచ్‌ఎంలుగా ప్రమోషన్

7

శాస్త్ర, సాంకేతిక ఫలాలు అందరికీ అందాలి



తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ ముగింపు సదస్సులో మాట్లాడుతున్న టీఎస్‌సీ-25 అధ్యక్షుడు ప్రొఫెసర్ సీహెచ్.మోహన్‌రావు

- దేశాభివృద్ధిలో సైన్స్ కీలకం
- తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ సీహెచ్.మోహన్‌రావు
- కేయూలో ముగిసిన సైన్స్ కాంగ్రెస్
- వివిధ విభాగాల్లో విజేతలకు అవార్డులు, ప్రశంసా పత్రాలు

7



ఫలితాల అనంతరం ప్రదీప్‌రావు ప్యానెల్ సంబరాలు

ప్రదీప్‌రావు ప్యానెల్ క్లీన్‌స్వీప్

- రసవత్తరంగా వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ ఎన్నికలు
- మొత్తం ఓట్లు 6,368.. పోలైన ఓట్లు 2,437.. చెల్లని ఓట్లు 355
- పోలింగ్ శాతం 39.34.. 60శాతం మంది ఓటింగ్‌కు దూరం
- ఓటేసిన పలువురు రాజకీయ ప్రముఖులు
- బ్యాంకు సేవలను విస్తరిస్తాం: ప్రదీప్‌రావు

7

'ఐనవోలు' ట్రస్ట్‌బోర్డు నియామకం

- 15 మంది ధర్మకర్తలతో కమిటీ ఏర్పాటు
- నేడు ప్రమాణ స్వీకారం



ఐనవోలు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఐనవోలు మల్లికార్జునస్వామి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు నియామకమైంది. ఈ మేరకు దేవాదాయ, ధర్మదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ నుంచి ట్రస్ట్‌బోర్డు నియామకపు ఉత్తర్వులు అందాయి. ట్రస్ట్‌బోర్డు పదవీకాల ఏడాదిగా ఖరారు చేశారు. ట్రస్ట్‌బోర్డులో 13 సభ్యులు ఉండగా, ఒకరు దాత, మరొకరు ఎక్స్ అఫీషియో సభ్యుడు (అర్చకుడు) ఉంటారు. మొత్తం 15 మంది ధర్మకర్తలతో కమిటీని ఏర్పాటు చేశారు. వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని వర్ధన్నపేట, పర్వతగిరి, ఐనవోలు మండలాలకు చెందిన వారికి ధర్మకర్తల కమిటీలో చోటు కల్పించారు. శుక్రవారం 15 మంది ట్రస్ట్‌బోర్డు (ధర్మకర్తల) సభ్యులతో ఎండోమెంట్ అధికారి ప్రమాణస్వీకారం చేయించాక సభ్యులు చైర్మన్‌ను ఎన్నుకుంటారు. ఈ ప్రమాణస్వీకారానికి ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరుకానున్నారు.

ట్రస్ట్‌బోర్డు సభ్యులు వీరే..

కమ్మగోని ప్రభాకర్‌గౌడ్ (కొత్తపల్లి), కూస చిరంజీవి (పెరుమాండ్లగూడెం), గడ్డం రేణుక(ఐనవోలు), బరిగెల ఆనందం (ఐనవోలు), నూనువత్ కీమా (డీసీ తండా), గుంటి కుమారస్వామి (ఇల్లంద), దరం పూర్ణచందర్ (పర్వతగిరి), బండెల వెంకన్న (దౌలత్‌నగర్), బోయిని మహేందర్ (వెంకటాపూర్), బాలబోయిన రాజయ్య (గర్మిళ్లపల్లి), మండల నర్సింహరెడ్డి (కొండపర్తి), మదూరి రాజు (పంథిని), పాలేపల్లి బుచ్చిరెడ్డి (నర్సింహుల గూడెం), సిరిమళ్ల వెంకటలక్ష్మి (హైదరాబాద్ దాత), పాతర్లపాటి రవీందర్ (ఆలయ ఉప ప్రధాన అర్చకుడు).

స్పీడ్, బ్రేక్ కంట్రోల్ తప్పి...

ప్రహరీని ఢీకొన్న గూడ్స్ వ్యాగన్

- షంటింగ్ చేస్తుండగా పట్టాలు తప్పిన చివరి వ్యాగన్
- ధ్వంసమైన యార్డు రక్షణ గోడ, రైల్వేస్టేషన్ ప్రహరీ
- వరంగల్ రైల్వే గూడ్స్ యార్డులో ఘటన



పట్టాలు తప్పిన గూడ్స్ చివరి వ్యాగన్ ఢీకొనడంతో ధ్వంసమైన రైల్వేస్టేషన్ ప్రహరీ

గిర్మాజీపేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వరంగల్ రైల్వేస్టేషన్‌లో ఓ గూడ్స్ రైలు వెనక్కి వెళ్తూ ప్రహరి గోడను ఢీకొట్టింది. ఎరువుల లోడుతో కూడిన గూడ్స్ రైలును యార్డులో ప్లేస్‌మెంట్ కోసం షంటింగ్ చేస్తుండగా గూడ్స్ చివరి వ్యాగన్ పట్టాలు తప్పడంతో ఈ సంఘటన జరిగింది. రైల్వేస్టేషన్ మెయిన్ ఎంట్రన్స్ సమీపంలో ఈ సంఘటన జరిగినప్పటికీ ఎలాంటి ప్రమాదం జరుగలేదు. రైల్వే వర్గాల సమాచారం మేరకు ఘటన వివరాలిలా ఉన్నాయి... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కాకినాడ నుంచి 58 వ్యాగన్‌లతో కూడిన గూడ్స్ రైలు గురువారం ఉదయం వరంగల్ రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. గూడ్స్‌లోని 58 వ్యాగన్‌లలో 52 వ్యాగన్‌లలో ఎరువులు ఉండగా, చివరి 6 వ్యాగన్‌లు ఖాళీగా ఉన్నాయి. రైల్వేస్టేషన్ మొదటి ప్లాట్‌ఫారం నుంచి గూడ్స్‌ను ప్లాట్‌ఫారంకు ఆనుకుని ఉన్న రైల్వే గూడ్స్ యార్డుకు తరలించారు. అయితే వ్యాగన్‌లలోని ఎరువులను అన్‌లోడింగ్ చేసేందుకు అనువుగా గూడ్స్ రైలును యార్డు ప్లాట్‌ఫారం పట్టాలపై ఉదయం 9.50 గంటలకు ప్లేస్‌మెంట్ కోసం పెడుతున్న క్రమంలో లోకోపైలట్ వెనుకకు నడుపుతుండగా స్పీడ్, బ్రేక్ కంట్రోల్ తప్పి చివరి ఖాళీ (మిగతా 6లో...)

పేదలకు మౌలిక సదుపాయాలు

- రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి సురేఖ

కరీమాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రభుత్వంలో పేద ప్రజలకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తామని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో గురువారం రూ.5.87కోట్లతో పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. మంత్రి వెంట జిల్లా కలెక్టర్ సత్యశారద, జాయింట్ కలెక్టర్ సంధ్యారాణి, నగర మేయర్ గుండు సుధారాణి, గ్రేటర్ వరంగల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయిలు పాల్గొన్నారు. ఈ అభివృద్ధి పనుల్లో భాగంగా 32వ డివిజన్ బీఆర్‌నగర్‌లో బస్తీ దవాఖాన, గ్రావెల్, మెటల్ రోడ్డు, ఎస్ఎన్‌నగర్‌లో సీసీ రోడ్డు, జ్యోతి కాలనీలో గ్రావెల్ వర్క్, గద్దె గుండ్లు, వడ్డెర కాలనీలో సీసీ రోడ్డు, కనకదుర్గమ్మ ఆలయం వీధిలో సీసీ, డ్రైనేజీ, కొండ కాలనీలో పైప్‌లైన్, డ్రైనేజీ, అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్, బీరన్నకుంట కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం కరీమాబాద్ ఆదర్శ పరపతి సంఘం భవనంలో లబ్ధిదారులకు నూతన రేషన్‌కార్డులను మంత్రి సురేఖ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధి పనులపై దృష్టిసారించి సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నగరంలో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు నవీన్‌రాజ్, మీసాల ప్రకాష్, 32వ డివిజన్ కార్పొరేటర్ పల్లం పద్మ రవి, బల్దియా అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామేశ్వరాచారి

మార్వాడీలతో దివాళా తీస్తున్న స్వర్ణకారులు

విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు నారోజు రామేశ్వరాచారి

జనగామ కల్చరల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మార్వాడీ షాపుల మూలంగా స్వర్ణకారులు దివాళా తీస్తున్నారని విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు నారోజు రామేశ్వరాచారి ఆరోపించారు. గురువారం జనగామలో స్వర్ణకారుల సంఘం ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. జనగామ పట్టణ అధ్యక్షుడు వలభోజు చక్రపాణి అధ్యక్షత వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మార్వాడీ షాపుల మూలంగా చేతివృత్తులను నమ్ముకొని జీవిస్తున్న స్వర్ణకారులకు పని లేకుండా పోయి, కుటుంబం గడవక, షాపుల కిరాయిలు కట్టలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ఎప్పుడో బతుకుదెరువు కొరకు ఒక్క మార్వాడీ కుటుంబం వలసవాదిగా వచ్చి చేరి ఇప్పుడు పూర్తి స్థాయిలో విస్తరించిపోయారన్నారు. బతుకులు ఆగమైతున్న తాము 'మార్వాడీ గో బ్యాక్ నినాదాన్ని ముందుకు తెస్తున్నామని, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి స్వర్ణకారులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సరాభోజు ఆంజనేయులు, ఎర్రోజు శ్రవణ్, సంతోష్, కనకాచారి తదితరులు పాల్గొన్నారు.

మార్వాడీలు తెలంగాణ నుంచి వెళ్లిపోవాలి

సెల్ షాప్ నిర్వాహకుల డిమాండ్



తొర్రూరులో మాట్లాడుతన్న షాపుల నిర్వాహకులు

తొర్రూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): తొర్రూరు పట్టణంలో నాసిరకం వస్తువులు విక్రయిస్తూ జీరో దందా నడుపుతున్న మార్వాడీలను వెళ్లగొట్టాలని సెల్ షాప్ నిర్వాహకులు, ఇతర వ్యాపారులు కోరారు. తొర్రూరులో గురువారం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కల్తీమాయ చేస్తున్న మార్వాడీలు వెంటనే తెలంగాణను ఖాళీ చేసి గుజరాత్‌కు వెళ్లాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా మాట్లాడుతున్న మార్వాడీలు గోబ్యాక్ అని డిమాండ్ చేశారు. తెలంగాణ అస్తిత్వాన్ని దెబ్బతీస్తూ సంస్కృతిని గౌరవించకుండా ఇక్కడ ప్రజలకు ఉపాధి కల్పించకుండా మనోభావాలు దెబ్బతీస్తున్నారని విమర్శించారు. వెంటనే ప్రభుత్వం తనిఖీలు చేపట్టి మార్వాడీలపై కేసులు నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా షాపుల నిర్వాహకులు శ్రీకాంత్, సత్యనారాయణ, రమేష్, రవి, కిరణ్, జగన్, శోభన్, కృష్ణ, రాజ్‌కుమార్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

వరంగల్ -1 డిపోలో నేడు డయల్ యువర్ డీఎం

హనుమకొండ టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ వరంగల్-1 డిపోలో శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ పి.అర్పిత గురువారం ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్, నిజామాబాద్, సిద్ధిపేట, పాలకుర్తి, తరిగొప్పుల రూట్లల్లో ప్రయాణించే ప్రయాణికులు డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో పాల్గొని తగిన సలహాలు, సూచనలు తెలపాలని కోరారు. శుక్రవారం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సెల్ నంబర్ 9959226047కు సంప్రదించాలని తెలిపారు.

గణపతి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

పోస్టర్ ఆవిష్కరణలో సీపీ సన్‌ప్రీత్‌సింగ్



గణపతి నవరాత్రి ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీ

వరంగల్ కల్చరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): దేశభక్తి, దైవభక్తితో భారతీయ సంస్కృతి సంప్రదాయాలను అనుసరించి యువత గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని వరంగల్ పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ అన్నారు. విశ్వహిందూ పరిషత్ వరంగల్ మహానగర్ గణపతి నవరాత్రి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో గురువారం సీపీని కమిషనరేట్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఉత్సవాల నిర్వహణ ఏర్పాట్లపై గణేష్ ఉత్సవ సమితి సీపీతో చర్చించారు. ఈ సందర్భంగా మండపాల కమిటీ సభ్యులు అనుసరించాల్సిన ముఖ్యమైన సూచనలు, భద్రతా చర్యలు, నిబంధనలతో కూడిన కరపత్రాన్ని సీపీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహానగర్ కోకన్వీనర్ శ్రీరాం ఉదయ్‌కుమార్ మండపాలలో శాంతిభద్రతల చర్యలు పాటించాలని, సౌండ్ సిస్టం పరిమితి, రాత్రి ఆలస్యంగా శబ్ద కాలుష్యం జరుగకుండా చూడాలని, నిమజ్జన సమయంలో పోలీసు శాఖ మండపాల కమిటీలను సమన్వయం చేసుకోవడం, ట్రాఫిక్ నియంత్రణ, ఆరోగ్య, పారిశుధ్య చర్యలు ఖచ్చితంగా పాటించాలని నిర్వాహకులను కోరారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ జితేందర్ రెడ్డి, గణపతి నవరాత్రి ఉత్సవ కన్వీనర్ న్యాలకొండ భాస్కర్‌రావు, కోకన్వీనర్లు కేశిరెడ్డి జయపాల్‌రెడ్డి, శ్రీరాం ఉదయ్‌కుమార్, సభ్యులు ఎడెల్లి సందీప్‌రెడ్డి, బండి రోహిత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా నిలవాలి..

వరంగల్ క్రైం: బాధితుల పక్షాన నిలబడి న్యాయం చేసేలా విధి నిర్వహణ ఉండాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ పదోన్నతి పొందిన సిబ్బందికి సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో విధులు నిర్వర్తిస్తూ కానిస్టేబుళ్ల నుంచి హెడ్‌కానిస్టేబుళ్లుగా పదోన్నతి పొందిన సుధాకర్, సంపత్‌కుమార్, రవీందర్, కిరణ్‌కుమార్, శ్రీనువాస్, జె.శ్రీనివాసరావు, రమేశ్, ప్రభాకర్, కిషన్‌రావు, రవీందర్, ప్రభాకర్, కీర్తినాగరాజు, నరేందర్, వెంకటస్వామిలు గురువారం సీపీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా పదోన్నతి పొందిన సిబ్బంది భుజాలపై పట్టీలను అలంకరించి అభినందించారు.

సైబర్ నేరస్తుడికి జైలు శిక్ష

వరంగల్ క్రైం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలకు పాల్పడుతున్న బిదూర్ మహా అనే వ్యక్తిని కేయూ పోలీసులు బుధవారం కోర్టులో హాజరుపరచగా జేఎఫ్‌సీఎం కోర్టు 13 నెలల జైలు శిక్షతో పాటు రూ.5,000 జరిమానా విధించినట్లు వరంగల్ సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్ డీఎస్పీ కలకోట గిరికుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన బిదూర్ మాహాతో నిత్యం ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతుండగా అతడిపై వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో పరిధిలోని కేయూ పీఎస్‌లో రెండు కేసులు, సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలో 2 కేసులు, మిల్స్‌కాలనీ పీఎస్ పరిధిలో ఒక కేసు నమోదైంది. మరొకసారి జూపాక అర్చన అనే మహిళకు ఫోన్‌చేసి ఎస్‌బీఐ క్రెడిట్ అధికారినంటూ నమ్మించి రూ.63,837 మోసం చేశాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో కేయూ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని పీటీ వారెంట్ మీద కోర్టులో హాజరుపరిచి చార్జిషీట్ దాఖలు చేశారు. మూడో అదనపు జేఎఫ్‌సీఎం కోర్టు 13 నెలల పాటు జైలు శిక్ష విధించారన్నారు. కాగా, సైబర్ నేరం జరిగినట్లయితే బాధితులు వెంటనే 1930 నెంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. దీంతో డబ్బులను తిరిగి పొందడమే కాకుండా వారికి శిక్షలు విధించవచ్చన్నారు.

సంధల్ సందడి

భక్తి ప్రపత్తులతో సాగిన ఊరేగింపు

ప్రారంభమైన కాజీపేట దర్గా ఉత్సవాలు

కాజీపేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కాజీపేట హజరత్ సయ్యద్ షా అఫ్జల్ బియాబాని దర్గా ఉర్సు ఉత్సవాలు గురువారం సందడిగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవంలో ప్రధాన ఘట్టమైన సంధల్‌ను చూసేందుకు రాత్రి భక్తులు పోటీపడ్డారు. దర్గా పీఠాధిపతి ఖుస్రు పాషా బడే ఘర్‌లో గంధంను వెండి పాత్రలో భద్రపరిచి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వెండిగిన్నె (పాత్ర)ను ఖుస్రుపాషా బయటకు తీసుకువచ్చారు. ఈ దృశ్యాన్ని చూడటానికి భక్తులు పోటీపడ్డారు. సంధల్ బయటకు తీసుకురాగానే భక్తులు దానిని తాకి తరించిపోయారు. ఊరేగింపులో ఏర్పాటు చేసిన పరదాల కిందనుంచి భక్తులు ఒకరి తర్వాత ఒకరు వెళ్లి భక్తిని చాటుకున్నారు. రాత్రి 12.15 గంటలకు బడే ఘర్‌నుంచి ప్రారంభమైన సంధల్ యాత్ర దర్గా చౌరస్తామీదుగా రాత్రి 1.30 గంటలకు బియాబాని సమాధి దర్గాకు చేరుకుంది. వెండి గిన్నెలో తెచ్చిన సుగంధ ద్రవ్యాలను బియాబాని సమాధికి పూసి లేపనం చేశారు. కుల, మత, ప్రాంతాలకు అతీతంగా సమాధిని సందర్శించి చాదర్ కప్పి మొక్కులు చెల్లించారు. ఈ ఉత్సవాలు చూసేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున దర్గాకు చేరుకున్నారు. శాంతి భద్రతలకు ఎలాంటి ఇబ్బందులు జరుగకుండా ఇన్‌స్పెక్టర్ సుధాకర్ రెడ్డి భారీ పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

వరంగల్‌లో ఎగ్జిబిషన్ ప్రారంభం



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కొండా సురేఖ

వరంగల్ టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ 23వ డివిజన్‌లోని ఇస్లామియా కళాశాల గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ.. నిత్యం వృత్తి, ఉద్యోగాలతో సతమతమవుతూ ఒత్తిడికి గురయ్యేవాళ్లు మానసిక ఉల్లాసాన్ని పొందడానికి ఎగ్జిబిషన్ ఎంతో దోహదపడుతుందని అన్నారు. పిల్లలకు ప్రత్యేకంగా విజ్ఞానం, వినోదాన్ని పంచే పరికరాలు ఈ ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ఎగ్జిబిషన్‌లో ఇతర దేశాల్లో పర్యటించిన అనుభూతిని కలిగించే సెట్టింగ్స్ ఏర్పాటు చేశారని, స్త్రీ అలంకరణ వస్తువులు, ఇతర రకాల 100కు పైగా స్టాల్స్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎగ్జిబిషన్ ముఖద్వారంలో విమానం సెట్టింగ్ చాలా ఆకట్టుకుందని ఎగ్జిబిషన్ నిర్వాహకులను మంత్రి అభినందించారు.

ఈ సందర్భంగా ఎగ్జిబిషన్ నిర్వాహకుడు అస్లాం మాట్లాడుతూ.. పిల్లలను, పెద్దలను ఉల్లాసపరిచేందుకు అనేక రకాల ఐటమ్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ఎగ్జిబిషన్ ప్రతీరోజు సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు శ్రీకాంత్, మీర్జా రఫిక్ బేగ్, మేనేజర్ ఫిరోజ్, డేవిడ్, శ్రీపాల్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు నవీన్‌రాజ్, చిప్ప వెంకటేశ్వర్లు, గొండ శ్రీనివాస్, లీలావతి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచాలి

- ఒలంపిక్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అజీజ్‌ఖాన్
- జేఎన్‌ఎస్‌లో సందడిగా ప్రో కబడ్డీ చాంపియన్‌షిప్ క్యాంపు ప్రారంభం



తెలంగాణ ప్రో కబడ్డీ చాంపియన్‌షిప్‌కు ఎంపికైన కాకతీయ నైట్స్ జట్టుతో అతిథులు

వరంగల్ స్పోర్ట్స్ ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రో కబడ్డీ టోర్నీలో అత్యుత్తమ ప్రతిభతో విజయం సాధించి జిల్లాకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఒలంపిక్ అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు, కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ అజీజ్‌ఖాన్ ఆశాభావం వ్యక్తం చేశారు. గురువారం తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ జేఎన్ఎస్‌లోని కబడ్డీ కోర్టులో ఏర్పాటుచేసిన తెలంగాణ ప్రో కబడ్డీ చాంపియన్‌షిప్‌లో పాల్గొనున్న కాకతీయ నైట్స్ జట్టు క్యాంపును అజీజ్‌ఖాన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా కబడ్డీ క్రీడను అభివృద్ధి చేయడంతో పాటు ప్రతిభ కలిగిన క్రీడాకారులకు వెలికి తీసేందుకు ఈ నెల 28 నుంచి సెప్టెంబర్ 4వరకు హైదరాబాద్‌లో నిర్వహించనున్న తెలంగాణ ప్రో కబడ్డీ లీగ్ మ్యాచ్‌ల్లో పాల్గొనేందుకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి 8కబడ్డీ జట్లను ఎంపిక చేశామన్నారు. ఇందులో భాగంగా హనుమకొండ జేఎన్ఎస్‌లో కాకతీయ నైట్స్ జట్టులో ఉన్న క్రీడాకారులకు ఇండియా రైల్వే చీఫ్ కోచ్ గట్టయ్య యాదవ్ పర్యవేక్షణలో ఈ నెల 26వరకు శిక్షణ అందిస్తామన్నారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో అశోక్‌కుమార్, కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.డి. అబ్దుల్లాఖాన్, జిల్లా చైర్మన్ సోదా రామకృష్ణ, కార్యదర్శి సారంగపాణి, సభ్యులు బిన్ని లక్ష్మణ్, సృజన్‌కాంత్, తదితరులు పాల్గొన్నారు.

సబ్ జైలులో మహిళా ఖైదీ మృతి

రెండు రోజులుగా అస్వస్థత

ఆస్పత్రికి తరలించేటప్పటికే కన్నుమూత



పెండ్యాల సుచరిత(ఫైల్)

నర్సంపేట టౌన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): రిమాండ్‌లో ఉన్న ఓ మహిళా ఖైదీ అనుమానస్పదంగా మృతి చెందింది. ఈ సంఘటన వరంగల్ జిల్లా నర్సంపేట మహిళా సబ్ జైలులో గురువారం జరిగింది. జైలు సూపరింటెండెంట్ లక్ష్మీశృతి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... నర్సంపేట పట్టణంలోని గాంధీ నగర్ ప్రాంతానికి చెందిన పెండ్యాల సుచరిత (36) ఈ నెల 13న హనుమకొండలోని సుబేదారి పోలీస్‌స్టేషన్ నుంచి ఓ కేసులో రిమాండ్‌పై నర్సంపేట మహిళా సబ్ జైలుకు వచ్చింది.

ఈ క్రమంలో బుధవారం సుచరిత కడుపునొప్పితో అస్వస్థతకు గురికాగా జైలు సిబ్బంది నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం అదే రోజు సుచరితను సిబ్బంది సబ్‌జైలుకు తీసుకెళ్లారు. మరుసటి రోజైన గురువారం ఉదయం సబ్ జైలులో ఉన్న సుచరిత.. వాంతులు, విరేచనాలతో తీవ్ర అస్వస్థతకు గురై కుప్పకూలింది. వెంటనే జైలు సిబ్బంది మళ్లీ నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సుచరితను ఆస్పత్రిలోని డ్యూటీ డాక్టర్ అనూష పరీక్షించి మార్గంమధ్యలోనే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ విషయంపై సబ్ జైలు సూపరింటెండెంట్ లక్ష్మీశృతి మాట్లాడుతూ వాంతులు, విరేచనాలు కావడంతోనే తాము ఆస్పత్రికి తీసుకొచ్చామని, అప్పటికే మృతిచెందడం జరిగిందని తెలిపారు. ఇదిలావుండగా ఆరోగ్యంగా ఉన్న మహిళా ఖైదీ అకస్మాత్తుగా అనారోగ్యానికి గురై మృతి చెందడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోస్టుమార్టం అనంతరం పోలీసు విచారణలోనే మృతికి గల అసలు కారణాలు తెలియనున్నది. ఖైదీ మృతిపై జైలు సూపరింటెండెంట్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్సై రవికుమార్ తెలిపారు.

ఐనవోలు దేవస్థానం అదనపు ఇన్‌చార్జి ఈవోగా సుధాకర్



ఈవోగా బాధ్యతలు స్వీకరిస్తున్న సుధాకర్

ఐనవోలు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఐనవోలు మల్లికార్జునస్వామి దేవస్థానం అదనపు ఇన్‌చార్జి గ్రేడ్-1 ఈవోగా కె.సుధాకర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ గ్రేడ్-2 ఇన్‌చార్జి ఈవోగా విధులు నిర్వహించిన అద్దంకి నాగేశ్వర్‌రావు అదనపు బాధ్యతల నుంచి తప్పుకున్నారు. ప్రస్తుతం మల్లికుదుర్ల శ్రీగట్టు మల్లికార్జునస్వామి దేవస్థానం ఈవోగా పనిచేస్తున్న ఈయనకు హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో 6 ఆలయాలకు అదనపు ఇన్‌చార్జి ఈవోగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అదనపు ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తప్పించాలని 4 మాసాల కిందట ఎండోమెంట్ కమిషనర్‌కు దరఖాస్తుచేసుకోగా, ఐనవోలు ఆలయం అదనపు బాధ్యతలను ఎట్టకేలకు తగ్గించారు. ఐనవోలు దేవస్థానం అదనపు ఇన్‌చార్జి బాధ్యతలు తీసుకున్న ఈవోది కరీంనగర్ వేపంకటేశ్వరస్వామి ఆలయ రెగ్యులర్ పోస్టింగ్. ఈయన కరీంనగర్ ఉమ్మడి జిల్లాల్లో 4 ఆలయాలకు ఇన్‌చార్జి ఈవోగా కొనసాగుతున్నారు. ఈసందర్భంగా కొత్తగా వచ్చిన ఈవో సుదాకర్‌కు ఆలయ అర్చకులు, ఉద్యోగులు, సిబ్బందితో కలిసి వేద ఆశీర్వచనాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతల నుంచి తప్పుకున్న నాగేశ్వర్‌రావును అర్చకులు, ఉద్యోగులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఎస్సై పస్తం శ్రీనివాస్ సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

'ఈ- సైన్'తో పారదర్శక సేవలు

వరంగల్ రూరల్ సబ్‌రిజిస్ట్రార్ భూక్య సైదులునాయక్

ఉమ్మడి జిల్లాలో తొలిసారిగా రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అమలు

పోచమ్మమైదాన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ శాఖలు ప్రజలకు పారదర్శక సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'ఈ- సైన్' సేవలు అమలు చేసిందని వరంగల్ రూరల్ సబ్‌రిజిస్ట్రార్ భూక్య సైదులునాయక్ అన్నారు. వరంగల్ పోచమ్మమైదాన్‌లోని రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో గురువారం 'ఈ- సైన్' సేవలను ఘనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరంగల్ రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో 'ఈ- సైన్' సేవలు అందుబాటులోకి వచ్చాయని, దీని ద్వారా దస్తావేజులో ఎవరి సంతకాలు ఉండవని, కేవలం డిజిటల్ ద్వారానే సంతకాలు ముద్రించబడుతాయని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్మూర్, కుసుమంచిలో మాత్రమే 'ఈ- సైన్' సేవలు అందుబాటులో ఉండగా, ప్రస్తుతం వరంగల్ ఉమ్మడి జిల్లాలో కేవలం రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలోనే ప్రారంభమైనట్లు వెల్లడించారు. ప్రస్తుత స్లాట్ బుకింగ్ పద్ధతి ద్వారా ప్రజలకు త్వరితగతిన సేవలు అందుతున్నాయని, 'ఇ సైన్' సేవలతో మరింత మెరుగైన సేవలు లభించనున్నట్లు తెలిపారు. ఎలాంటి అవకతవకలకు చోటు లేకుండా కొనసాగేందుకు 'ఈ- సైన్' సేవలు ఉపయోగపడుతాయన్నారు. అనంతరం రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్న వారికి దస్తావేజులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్‌లు మునుకుంట్ల భానుప్రకాష్, సాత్విక తదితరులు పాల్గొన్నారు.

స్పీడ్, బ్రేక్ కంట్రోల్ తప్పి...

(5వ పేజీ తరువాయి)



పట్టాలు తప్పిన గూడ్స్ రైలు చివరి వ్యాగన్

వ్యాగన్ యార్డు రక్షణ గోడను ఢీకొని పట్టాలు తప్పింది.

పట్టాలు తప్పిన వ్యాగన్ చివరి చక్రాలు యార్డు రక్షణ గోడను చేధించుకుంటూ కొద్ది దూరంలో ఉన్న రైల్వేస్టేషన్ ప్రహరీ గోడను కూడా ఢీకొంది. అదే సమయంలో లోకోపైలట్ బ్రేక్ వేయడంతో వ్యాగన్ ప్రహరీ వద్దనే నిలిచిపోయింది. గూడ్స్ వ్యాగన్ ఢీకొనడంతో ఈ యార్డు రక్షణ గోడ, రైల్వేస్టేషన్ ప్రహరీ గోడ పూర్తిగా ధ్వంసం కావడంతోపాటు ప్రహరీ వద్ద ఉన్న డిజిటల్ డిస్‌ప్లే బోర్డు స్వల్పంగా ధ్వంసమైంది. ఆ గోడకు ఆనుకుని బ్యాంకుల ఏటీఎంలు ఉండటం, రైల్వేస్టేషన్ ప్రయాణికుల మెయిన్ ఎంట్రన్స్ సమీపంలో ఈ సంఘటన జరగడంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు.

అయితే ఈ సంఘటన జరిగిన ప్రహరీగోడ, ఏటీఎంల వద్ద ప్రయాణికులెవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరుగలేదు. సమాచారం అందుకున్న రైల్వేస్టేషన్ ఇన్‌చార్జి మేనేజర్ సారయ్య, కాజీపేట రైల్వేట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్, సంబంధిత ఇంజనీరింగ్ విభాగాల అధికారులు సంఘటనా స్థలాన్ని సందర్శించి లోకోపైలట్, గార్డు, పాయింట్‌మెన్‌లతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. రైల్వే సిబ్బంది పట్టాలు తప్పిన చివరి వ్యాగన్‌ను మధ్యాహ్నం 3.53 గంటలకు పట్టాలపైకి తీసుకురావడంతో ఎరువుల అన్‌లోడింగ్ సాఫీగా జరిగింది. గూడ్స్ రైలును యార్డులో ప్లేస్‌మెంట్ కోసం షంటింగ్ చేస్తున్న క్రమంలో లోకోపైలట్, పాయింట్‌మెన్, గార్డుల మధ్య సమన్వయం లోపించడంతో పాటుగా గూడ్స్ రైలు స్పీడ్, బ్రేక్ అదుపు తప్పడం వల్లనే ప్రమాదం జరిగి ఉండవచ్చని రైల్వే వర్గాలు భావిస్తున్నాయి. ఈ ఘటన గూడ్స్ యార్డులో జరగడంతో రైళ్ల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలుగలేదు.

ఘనంగా శరణ్య ఆస్పత్రి వార్షికోత్సవం

వరంగల్ మెడికల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ నయీంనగర్‌లోని శ్రీ శరణ్య హాస్పిటల్ 20వ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించి రోగులను మందులను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ కె.ప్రశాంత, డాక్టర్ నాగార్జునరెడ్డి, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.



వార్షికోత్సవ వేడుకల్లో యాజమాన్యం

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	7660	5300
మక్కలు	2051	1521
కందులు	5883	3022
పెసళ్లు	7022	3022
పల్లికాయ (సూక)	6000	3450
పల్లికాయ (పచ్చిది)	5020	1575
పసుపు (కాడి)	10666	9534
పసుపు (గోల)	10259	8700
తేజ మిర్చి	12000	8500
తేజ ఏసీ	14400	11500
వండర్‌హాట్	11500	6000
వండర్‌హాట్ ఏసీ	15500	11500
యూఎస్341ఏసీ	14500	7000
దీపిక	9000	8000
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6000	3000

- వరంగల్ వ్యవసాయం

శాస్త్ర, సాంకేతిక

ఫలాలు అందరికీ అందాలి



- దేశాభివృద్ధిలో సైన్స్ కీలకం
- తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ సిహెచ్. మోహన్‌రావు
- కేయూలో ముగిసిన సైన్స్ కాంగ్రెస్ సదస్సు
- వివిధ విభాగాల్లో విజేతలకు అవార్డులు, ప్రశంసాపత్రాలు

విద్యార్థికి ప్రశంసా పత్రాన్ని ఇస్తున్న కేయూ వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, సీహెచ్ మోహన్‌రావు తదితరులు

కేయూ క్యాంపస్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రతీ ఒక్కరికి శాస్త్ర, సాంకేతిక ఫలాలు అందాలని, దేశాభివృద్ధిలో సైన్స్ కీలకమని తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ అధ్యక్షుడు, హైదరాబాద్ సీసీఎంబీ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ సీహెచ్.మోహర్‌రావు ఆకాంక్షించారు. మూడు రోజులుగా కాకతీయ యూనివర్సిటీలో నిర్వహిస్తున్న తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ ప్లీనరీలు, సదస్సులు, టెక్నికల్స్ సెషన్లు ముగిశాయి. ఈ సందర్భంగా గురువారం సాయంత్రం కేయూ ఆడిటోరియంలో వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ముగింప సమావేశంలో తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ సీహెచ్. మోహన్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొని కీలక ప్రసంగం చేశారు.

దేశ సర్వోతోముఖాభివృద్ధిలో సాంకేతిక రంగం ప్రధానమన్నారు. ఏఐ, ఎంఎల్, స్పేస్ రీసెర్చ్, బయోటెక్నాలజీ రంగాలపై పలవంతమైన చర్యలు జరిగాయని అన్నారు. అలాగే మిగతా రంగాల్లోనూ మంచి పరిశోధనలు వచ్చాయని అభినందించారు. కాకతీయ యూనివర్సిటీ స్వర్ణోత్సవ సంబురాల వేళ వర్సిటీలో తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ ప్రారంభంగా సదస్సు నిర్వహించడం ప్రత్యేకమని కొనియాడారు. సదస్సుకు అధ్యక్షుడిగా వ్యవహరించిన కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. లర్నింగ్, షేరింగ్, డిస్కషన్స్‌తో పరిశోధనల్లో నాణ్యమైన పురోగతి సాధిస్తామని చెప్పారు. 3 రోజుల కేయూలో ఆరోగ్య పరిరక్షణ, స్పేస్, క్వాంటం వంటి అనేక అంశాల్లో పరిశోధనలపై కీలక చర్చలు జరిగాయని చెప్పారు. భవిష్యత్‌తో వాటి ఫలితాలు వస్తాయని ఆకాంక్షించారు. కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం మాట్లాడుతూ.. శాస్త్రవేత్తలు నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించి సమాజ అవసరాలకు అనుగుణంగా పరిశోధనలను వెలువరించాలని అన్నారు. టీసీఎస్-25 జనరల్ సెక్రటరీ, ఓయూ మాజీ వీసీ ప్రొఫెసర్ ఎస్.సత్యనారాయణ మాట్లాడుతూ.. తెలంగాణ సైన్స్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ శాస్త్ర, సాంకేతిక రంగాల పురోగతికి పనిచేస్తోందన్నారు. వర్సిటీలు, పరిశోధనలు, పారిశ్రామిక రంగాలకు అనువర్తనాలుగా సాగాలని అన్నారు.

కేయూ యూజీసీ కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి, టీపీసీ, టీఎస్‌సీ-25 చైర్మన్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, టీసీఎస్-25 సెషన్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ వడ్డె రవీందర్, టీఏఎస్ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ సీహెచ్.సంజీవరెడ్డి, నిట్ ప్రొఫెసర్ కె.లక్ష్మారెడ్డి, సోషల్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, సదస్సు ఉద్దేశాలను.. కేయూ సైన్స్ డీన్ ప్రొఫెసర్ జి.హన్మంతు, కేయూ ఫార్మసీ డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య సదస్సు ఫీడ్‌బ్యాక్‌ను వివరించారు. తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ ప్రొఫెసర్ బైరు వెంకట్రా మిరెడ్డి మూడు రోజుల సదస్సు నివేదికను ప్రవేశపెట్టారు. ఓరల్ ప్రజంటేషన్ ప్రైజ్ డిస్టిబ్యూషన్ ఇంజనీరింగ్ విభాగాల డీన్ ప్రొఫెసర్ మంచాల సదానందం, పోస్టర్ ప్రజంటేషన్ ప్రైజ్ డిస్టిబ్యూషన్ కేయూ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ తాళ్ళపల్లి మనో హర్‌ల నేతృత్వంలో నిర్వహించారు. ముగింపు సదస్సుకు స్వాగతం డాక్టర్ బి.దీపాజ్యోతి పలుకగా సభికులకు కృతజ్ఞతలను కేయూ ఫార్మసీ ప్రొఫెసర్ ఎన్.ప్రసాద్ చెప్పారు. అంతకుముందు కేయూ ఆడిటోరియంలో వినూత్న శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానంతో దేశా నికి వికసిత్ భారత్‌లో ముందుకు తీసుకెళ్లే రూపశిల్పులు అనే ప్యానల్ చర్చ జరిగింది.

ఈ సందర్భంగా టీసీఎస్-25 అధ్యక్షుడు ప్రొఫెసర్ సీహెచ్.మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన చర్చల్లో వక్తలు ప్రొఫెసర్ రాంరెడ్డి, సారంగపాణి, దత్తాలు మాట్లాడుతూ.. దేశం లో యువత ఎక్కువగా ఉందని చెప్పారు. దేశానికి అభివృద్ధిపరంగా ముందుకు తీసుకు పోయేందుకు నూతన ఆవిష్కరణలు అవసరమన్నారు. శాస్త్రీయ, సాంకేతిక మార్పుల కు అనుగుణంగా యువత పరిశోధనలు ఉండాలని సూచించారు. జాతీయ విద్య విధా నం-2020లో నైపుణ్య శిక్షణను ప్రోత్సహించే ప్రణాళికలు రూపొందించారని చెప్పారు.

సైన్స్ కాంగ్రెస్ అవార్డుల విజేతలు వీరే..

కేయూలో జరిగిన తెలంగాణ అకాడమీ సైన్స్ కాంగ్రెస్ ఉత్తమ అవార్డులను ప్రదానం చేశారు. ఉత్తమ ప్రజంటేషన్ అవార్డు ఫిజికల్ సైన్స్‌లో వెంకటరమణ సాధించారు. అలాగే గణితంలో బెస్ట్ ఓరల్ అభిలాష్, బెస్ట్ పోస్టర్ రాజ్‌కుమార్‌లు సాధించారు. కెమికల్ సైన్స్‌లో బెస్ట్ ఓరల్ నాగరాజు, బెస్ట్ పోస్టర్ విక్రమ్‌లు సాధించారు. ఇంజనీరింగ్, టెక్నాలజీలో బెస్ట్ ఓరల్ సతీశ్‌కుమార్, బెస్ట్ పోస్టర్ పారిన్ పాతిమాలు సాధించారు. ఫార్మసీలో బెస్ట్ ఓరల్ శిరీష, బెస్ట్ పోస్టర్ ప్రసాద్‌లు సాధించారు. ఎర్త్ సైన్సెస్‌లో బెస్ట్ ఓరల్ శ్రీధర్, బెస్ట్ పోస్టర్ సతీశ్‌లు సాధించారు. లైఫ్‌సైన్స్‌లో బెస్ట్ ఓరల్ డాక్టర్ బి.అనేదా, బెస్ట్ పోస్టర్ లక్ష్మీపునీతలు సాధించారు.

ఆసక్తి రేపిన సైన్స్ కాంగ్రెస్ చర్చాగోష్ఠులు

నూతన శాస్త్ర, సాంకేతిక అంశాలపై నిపుణుల ప్రసంగాలు



ప్లీనరీలో మాట్లాడుతున్న ప్రొఫెసర్లు రఘురాం, చలపతి, శాస్త్రవేత్త మృత్యంజయనేయ రెడ్డి



ప్లీనరీలో మాట్లాడుతున్న ప్రొఫెసర్లు నారాయణరావు, రాంబాను దేవ్‌రాజ్, సైంటిస్టు విద్యాసాగర్

కేయూ క్యాంపస్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలో తెలంగాణ అకాడమీ సైన్స్ కాంగ్రెస్ ప్లీనరీలు, సదస్సులు, చర్చాగోష్ఠులు మూడో రోజు గురువారం జరిగాయి. ఈ సందర్భంగా కేయూ ఆడిటోరియంలో 'సైన్స్ లీడ్ ఇన్నోవేషన్ ఫర్ సస్టెన బుల్ న్యూటెంట్స్ మేనేజ్‌మెంట్ : ఏ సర్క్యూలర్ ఎకానమీ అప్రోచ్' అనే అంశంపై న్యూఢిల్లీ ఇంద్రాప్రస్తా వర్సిటీ ప్రొఫెసర్ ఎస్.రఘురామ్ పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌లో ప్రసంగించారు. దేశంలో వ్యవసాయ రంగం అభివృద్ధికి కీలక ప్రతిపాదనలు చేశారు. పంటల తీరు, భూసారం, ప్రభుత్వ విధానాలు, రైతుల స్థితిగతులపై అనేక అంశాలను ప్రస్తావించారు. దేశంలో యూరియా డిమాండ్ పెరిగిన నేపథ్యంలో దీనికి ప్రత్యామ్నాయ ఎరువులున్నాయని, వాటిని వాడుకోవాలని సూచించారు.

కేరళలోని తిరువనంతపురం ప్రొఫెసర్ వీఏన్ చలపతి 'డైమండ్స్ : ఫ్రం థెయిర్ బర్త్ టూ ఇంటర్నిటీ' అనే అంశంపై ప్రసంగిస్తూ.. ప్రాచీన భారతీయ జ్ఞానం గొప్పదన్నారు. సహజ సిద్ధమైన డైమండ్, కృత్రిమ డైమండ్‌ల మధ్య భేదాన్ని విశ్లేషించారు. భూగోళశాస్త్రంలో అనేక మార్మాలున్నాయని పేర్కొన్నారు.

అర్కిటెక్ట్స్ ఆఫ్ ప్రోగ్రామ్ - ఇండియా యూత్ విత్ ఇన్నోవేటివ్ సైన్స్, టెక్నాలజీ ఫర్ ఎ వికసిత్ భారత్ ప్లానల్ డిస్కషన్ ప్రొఫెసర్ ఎ.సదానందం నేతృత్వంలో జరిగింది. ఫిజికల్ సైన్స్ సెమినార్ హాల్‌లో 'హైపర్‌ఫైన్ ఇంట్రాక్షన్స్: టూల్ టూ స్టడీ మ్యాగ్నటిక్స్, ఫెర్రోఎలక్ట్రిక్స్ మెటీరియల్' అనే అంశంపై యూజీసీ డీఏఈ సీఎస్ఆర్ ఇండోర్ ప్రొఫెసర్ వి.రఘవేంద్రరెడ్డి ప్రసంగించారు. అలాగే 'రేడియోలజికల్ ఎనర్జీ అండ్ ప్రీఫరెండెనెస్ ఇన్ న్యూక్లీస్ మెడిసిన్' అనే అంశంపై ముంబయి బార్క్ సైంటిస్టు డాక్టర్ డి.విద్యాసాగర్ ప్రసంగించారు. 'డిరిచ్‌లేట్ బౌండరీ ఆప్టికల్ కంట్రోల్ ప్లాబ్లమ్స్' అనే అంశంపై బెంగళూరు ఐఐఎస్‌సీ ప్రొఫెసర్ తిరుపతి గుడి ప్రసంగించారు. విభిన్న సమీకరణలు, ప్రవేశ విలువలు, షరతులు, మానవ శరీరంలోంచి వివరించారు. కెమిస్ట్రీ సెమినార్ హాల్‌లో హైదరాబాద్ ఐఐటీ ప్రొఫెసర్ కిశోర్ నట్టే రసాయన, ఔషధ పరిశ్రమలలో ఉపయోగించే ఉత్ప్రేరక సమ్మేళనాల ప్రభావం, పర్యావరణ పరిరక్షణలో పాత్రను విశ్లేషించారు. ప్రొఫెసర్లు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. జువాలజీ సెమినార్ హాల్‌లో 'క్లైమెంట్ రిసిలియంట్ ఇంటిగ్రేటెడ్ వెట్ మేనేజ్‌మెంట్' అనే అంశంపై ఐసీఆర్ఐఎస్ఏటీ హైదరాబాద్ ప్రొఫెసర్ ఎ. నారాయణరావు ప్రసంగించారు. పంటల్లో కలుపు నివారణకు సాంకేతిక పద్ధతులను అవలంబించాలని చెప్పారు.

కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ సెమినార్ హాల్‌లో 'స్పేస్ టెక్నాలజీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్' అనే అంశంపై జీపీ బిర్లా ఇన్స్టిట్యూట్ శాస్త్రవేత్త డాక్టర్ కె.మృత్యుంజయనేయరెడ్డి ప్రసంగించారు. స్పేస్ టెక్నాలజీలో ఇటీవల చోటు చేసుకున్న మార్పులను వివరించారు. 'సూరోగేట్స్ అండ్ అప్రోచ్‌మేషన్స్ ఫర్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ' అనే అంశంపై హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీ ప్రొఫెసర్ సి.రాఘవేంద్రరావు ప్రసంగించారు. ఇంజనీరింగ్, టెక్నాలజీలో వస్తున్న నూతన మార్పులపై అధ్యయనం చేసి వినూత్న ఆలోచనలు చేయాలన్నారు. ఫార్మసీ సెమినార్ హాల్‌లో 'ఫ్యూరిస్టిక్ మెడిసిన్: ఎక్స్‌పెక్టెషన్స్ ఆఫ్ ఇన్నోవేషన్ ఇన్ డ్రగ్స్ డిస్కవరీ' అనే అంశంపై పూణేలోని పల్స్ ఫార్మసిటికల్ ఇన్సిస్టిట్యూట్ ప్రొఫెసర్ రాంబాను దేవ్‌రాజ్ ప్రసంగించారు. ఫార్మసీ మీని సెమినార్ హాల్‌లో 'పెట్రోజనిక్ ఎవల్యూవేషన్ ఆఫ్ నీయోచరమ్ హైదరాబాద్ బాతోలిత్' అనే అంశంపై హైదరాబాద్ సీఎస్ఆర్ -ఎన్‌జీఆర్ఐ శాస్త్రవేత్త రాం బహు ప్రసంగించారు. క్యాన్సర్ నివారణకు ఇటీవల విడుదలైన ఔషధాలు నూతన పుంతలు తొక్కుతున్నాయని మంచి రిజల్ట్ వస్తోందని పేర్కొన్నారు.

వరంగల్‌లో వెల్‌నెస్ సెంటర్ ప్రారంభించాలి

కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రికి ఎంపీ కావ్య వినతి

హనుమకొండ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో ఇప్పటికే ఆమోదం పొందిన సీజీహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్‌ను త్వరితగతిన ప్రారంభించాలని వరంగల్ ఎంపీ కడియం కావ్య కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాను కోరారు. ఎంపీ కావ్య గురువారం ఢిల్లీలో కేంద్ర మంత్రి నడ్డాను మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కావ్య మాట్లాడుతూ.. వరంగల్‌లో వేలాదిమంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబసభ్యులు ఉన్నారని, వరంగల్‌లో సీజీహెచ్ఎస్ సౌకర్యం లేకపోవడం వల్ల వారు హైదరాబాద్ లేదా ఇతర నగరాలకు వెళ్లి చికిత్స పొందాల్సి వస్తోందని తెలిపారు.

దీంతో వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే వరంగల్‌లో సీజీహెచ్ఎస్ సెంటర్‌కు ఆమోదం తెలిపిందని, కానీ ఇంకా ప్రారంభం కానందువల్ల ఉద్యోగులు, పెన్షనర్లు నష్టపోతున్నారని అన్నారు. వెంటనే వరంగల్ సీజీహెచ్ఎస్‌లో వైద్యసిబ్బంది నియామకం చేపట్టి, శాశ్వత భవనం కేటాయించి సెంటర్‌ను ప్రారంభించాలని ఎంపీ కేంద్ర మంత్రిని కోరారు. కేంద్ర మంత్రి ఇందుకు సానుకూలంగా స్పందించారు.

ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పాటు చేయాలి

ఉమ్మడి వరంగల్ జిల్లాలో సూక్ష్మ చిన్న తరహా పరిశ్రమల స్థాపనకు, వ్యాపారావకాశాల మెరుగుకు అవసరమైన ఇన్నోవేషన్ కోసం ఇంక్యుబేషన్ సెంటర్ లేకపోవడంపై వరంగల్ ఎంపీ కడియం కావ్య నిరాశ వ్యక్తం చేశారు. వరంగల్‌లో ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని గ్రామీణ యువత, ముఖ్యంగా ఎస్సీ యువతీ, యువకులకు వ్యాపారావకాశాలు కల్పించాలని కావ్య కోరారు. గురువారం ఎంపీ ఈ అంశాన్ని పార్లమెంట్‌లో లేవనెత్తారు. ఈ ప్రశ్నకు కేంద్ర మంత్రి శోభా కరంద్లాజే స్పందించారు. ప్రధాని ముద్రా యోజన (పీఎంఎంవై) పథకం ద్వారా వడ్డీ లేకుండా రూ.20లక్షల వరకు రుణాలు లభ్యమవుతున్నాయని లిఖిత పూర్వకంగా తెలిపారు.

పదోన్నతుల పర్వం

ఉమ్మడి జిల్లాలో

145 మందికి హెచ్‌ఎంలుగా ప్రమోషన్

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ వరంగల్ ఆర్జేడీ పరిధిలోని 19 జిల్లాల్లో మొత్తం 492 మంది స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు.. పీజీ హెచ్‌ఎంలుగా పదోన్నతులు పొందారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 145 మందికి లబ్ధి చేకూరింది. పదోన్నతులపై స్టేను బుధవారం హైకోర్టు తొలగించడంతో గతంలో నిలిపివేసిన ఆప్షన్ల ఎంపికకు గురువారం అవకాశం ఇచ్చారు. దీంతో ప్రభుత్వ యాజమాన్యంలో 54 మంది హెచ్‌ఎంలుగా పదోన్నతులు పొందగా, లోకల్‌బాడీ యాజమాన్యాల్లో 438 మంది హెడ్మాస్టర్లుగా పదోన్నతులు సాధించారు. వరంగల్ జిల్లాలో 37 మంది, హనుమకొండలో 80, జనగామలో 11, ములుగులో 3, జయశంకర్ భూపాలపల్లిలో 2, మహబూబాబాద్ జిల్లాలో 12 మంది హెడ్మాస్టర్లుగా పదోన్నతులు సాధించారు. పదోన్నతి పొందిన వారు శుక్రవారం కొత్త స్థానాల్లో చేరనున్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సీబీసీ సంఘం బాధ్యులు

క్రైస్తవ మిషనరీ ఆస్తుల విక్రయాలు చెల్లవు

- మద్రాసు హైకోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చింది..
- ఆస్తులపై ఏబీఎఫ్ఎంఎస్‌కు ఎలాంటి హక్కులు లేవు
- కోర్టు తీర్పుతో చట్టపరంగా ఆస్తులను స్వాధీనం చేసుకుంటాం..
- హనుమకొండ సీబీసీ సంఘం అధ్యక్షుడు టి.విజయ్ స్వరూప్

హనుమకొండ సిటీ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అక్రమంగా జరిగిన క్రైస్తవ మిషనరీ ఆస్తుల విక్రయాలు చెల్లవని హనుమకొండ సెంటినరీ బాపిస్టు చర్చి సంఘం అధ్యక్షుడు తాళ్లపల్లి విజయ్ స్వరూప్ వెల్లడించారు. మద్రాసు హైకోర్టు ఈ మేరకు స్పష్టమైన తీర్పు ఇచ్చినట్లు చెప్పారు. డిసెంబర్ 19, 2024, సీఎస్ నెం.124/1994 ప్రకారం మద్రాసు హై కోర్టు తీర్పు వెల్లడించినట్లు పేర్కొన్నారు. గురువారం హనుమకొండలోని మిషన్ ఆస్పత్రి ప్రాంగణంలో జరిగిన మీడియా సమావేశంలో న్యాయవాదులు ఎన్.క్రిష్ణకుమార్, పి.రామ్‌గోపాల్‌రావు, డి.అనిల్‌రాజ్, డి.సునిల్‌రాజ్‌తో కలిసి ఆయన వివరాలను వెల్లడించారు. కోర్టు ప్రకటించిన తీర్పు ప్రకారంగా 1979నుంచి అక్రమ మార్గాల్లో విక్రయించిన ఆస్తు లు చెల్లవని పునరుద్ఘాటించారు. తీర్పు ఆధారంగా అన్యాక్రాంతమైన హనుమకొండ సెంటినరీ బాప్టిస్టు చర్చితో పాటు రాష్ట్రంలోని అన్ని మిషనరీ ఆస్తుల పరిరక్షణకు బలం ఏర్పడిందన్నారు. అన్యాక్రాంతమైన ఆస్తులను స్వాధీనం చేసుకునే అవకాశం దక్కిందన్నారు. బ్రిటీష్ కాలంలో అమెరికన్ బాప్టిస్టు ఫారిన్ మిషన్ సొసైటీ దక్షిణ భారతదేశంలో సేవా కార్యక్రమాల నిమిత్తం ఆస్తులను సమకూర్చుకుందన్నారు. అపై సేవా కార్యక్రమాల నిర్వహణ, ఆస్తుల పరిరక్షణ బాధ్యతలను పీఏబీసీ, ఎస్‌టీబీసీ సంస్థలకు అమెరికన్ బాప్టిస్టు ఫారిన్ మిషన్ సొసైటీ అప్పగించిందన్నారు. అయితే పీఏబీసీ, ఎస్‌టీబీసీ తమ బాధ్యతలు సక్రమంగా నిర్వహించలేదని తెలిపారు. ఆస్తులను పరిరక్షించాల్సి ఉండగా, ఇందుకు విరుద్ధంగా అక్రమంగా విక్రయాలు జరిపాయని ఆరోపించారు. ఈ క్రమంలో తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో వేల కోట్ల మిషనరీ ఆస్తులు అన్యాక్రాంతం అయినట్లు తెలిపారు.

ఎమ్మెల్యే సహకారం మరువలేనిది

హనుమకొండ సెంటినరీ బాప్టిస్టు చర్చి ఆస్తుల పరిరక్షణలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సహకారం మరువలేనిదని స్వరూప్ చెప్పారు. తొలి నుంచి ఆయన సీబీసీ సంఘానికే కాకుండా అన్ని క్రైస్తవ సంఘాలకు రక్షణగా నిలిచారన్నారు. ఎమ్మెల్యే సహకారంతోనే ఆస్తులను కాపాడుకుంటున్నట్లు చెప్పారు. హనుమకొండ సీబీసీ డాక్టర్ టి. క్రిష్టఫర్, కోశాధికారి విల్సన్ వినయ్‌కుమార్, ఉపాధ్యక్షులు ఎన్.జాన్సన్ ప్రసాద్, జె.డానియేల్, జాయింట్ సెక్రెటరీ కె.విద్యాకర్, ఎన్.సునీల్‌కుమార్‌తో పాటు జనగామ, నల్లగొండ. హనుమకొండ ఫీల్డ్ అసోసియేషన్ ప్రతినిధులు కేఎం జాన్, టీఎస్ క్రిష్టఫర్, మార్టిన్ లూథర్ తదితర క్రైస్తవ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

న్యాయం జరిగింది..

ఆస్తుల విక్రయాలు జరుగుతున్న సమయంలో పీఏబీసీ తీరును ఖండిస్తూ క్రైస్తవ సంఘ ప్రతినిధులు మద్రాసు కోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. సుమారు నాలుగు దశాబ్దాల పోరాటం అనంతరం తమ న్యాయ పోరాటం ఫలితాన్ని ఇచ్చిందన్నారు. పీఏబీసీ, ఎస్‌టీబీసీ అమ్మిన ఆస్తులు చెల్లవని కోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. ఈ క్రమంలో 1979 నుంచి 2000 వరకు జరిగిన మిషనరీ ఆస్తుల విక్రయాలు చెల్లవని, వాటిని స్వాధీనం చేసుకునే అధికారం దక్కినట్లు వివరించారు. ఇదే క్రమంలో పీఏబీసీ సంస్థను ట్రస్టీషిప్ నుంచి తొలగించడం జరిగినట్లు తెలిపారు. అదేవిధంగా ఆస్తులపై ఏబీఎఫ్ఎంఎస్‌కి కూడా విక్రయ అధికారాలు లేవని వెల్లడించారు. ఇక కొత్త ట్రస్టీని ఎన్నుకునేందుకు కోర్టు తీర్పు అవకాశం కల్పించిందన్నారు. దేవుడి దయతో ఆస్తుల పరిరక్షణకు తీర్పు రావడంతో ఇక మిగిలిన ప్రక్రియ పూర్తిపై దృష్టి సారించనున్నట్లు చెప్పారు.

ప్రదీప్‌రావు ప్యానెల్ క్లీన్‌స్వీప్



ఓటు వేసేందుకు వచ్చిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్, ప్రదీప్‌రావు తదితరులు

- రసవత్తరంగా వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ ఎన్నికలు
- మొత్తం ఓట్లు 6,368... పోలైన ఓట్లు 2,437

వరంగల్ సిటీ/మట్టెవాడ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ ఎన్నికల్లో ఎర్రబెల్లి ప్రదీప్‌రావు ప్యానెల్ ఘన విజయం సాధించింది. నగరంలోని ఎస్‌వీఎన్ రోడ్‌లో గల ఏవీవీ కళాశాలలో గురువారం ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ఎన్నికల పోలింగ్ మధ్యాహ్నం 2 గంటల వరకు ఎన్నికల అధికారి ఎం.వాల్యా నాయక్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ ఎన్నికల్లో మొత్తం 6,368 ఓట్లకు గాను 2,437 ఓట్లు పోలయ్యాయి. చెల్లిన ఓట్లు 2,082, చెల్లని ఓట్లు 355 ఉన్నాయి. దీంతో 39.34 శాతం పోలైనట్లు ఎన్నికల అధికారి వాల్యా నాయక్ తెలిపారు. ఈ ఎన్నికలలో ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు, వ్యాపార వర్గాల ప్రతినిధులు, మేధావులు పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మండలి వైస్ చైర్మన్ బండా ప్రకాష్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్, హస్తకళల బోర్డు మాజీ చైర్మన్ బొల్లం సంపత్, వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, చాంబర్ మాజీ అధ్యక్షుడు దిడ్డి కుమారస్వామి తదితరులు పాల్గొని ఓటు హక్కును వినియోగించుకున్నారు.

గత 25 ఏళ్లుగా అర్బన్ బ్యాంకు చైర్మన్‌గా కొనసాగుతున్న ప్రదీప్‌రావు ప్యానెల్‌కే ఓటర్లు జైకొట్టారు. రాజకీయాలు పక్కనపెట్టి ప్రదీప్‌రావుకు ప్రత్యక్షంగాను, పరోక్షంగాను మద్దతు తెలిపారు. సీక్రెట్ ఓటింగ్ కావడంతో ప్రత్యర్థి పార్టీల నాయకులు, కార్యకర్తలు సైతం ప్రదీప్‌రావుకు, ఆయన ప్యానెల్ అభ్యర్థులకే ఓటు వేసి వారి గెలుపునకు దోహదపడ్డారు. కాగా, ఎన్నికలలో ఎలాంటి గొడవలు జరగకుండా వరంగల్ ఏసీపీ శుభం ప్రకాష్ ముందస్తు చర్యల్లో భాగంగా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఓటింగ్ కోసం లోపలికి వెళ్లే వ్యక్తుల గుర్తింపు కార్డులను పరిశీలించి పంపారు. దీంతో ఎక్కడా ఎలాంటి గొడవలు లేకుండా ఎన్నికలు సజావుగా సాగాయి.

బ్యాంకు సేవలను రాష్ట్రం మొత్తం విస్తరిస్తాం..

ఎన్నికల్లో ఘన విజయం సాధించిన సందర్భంగా ఎర్రబెల్లి ప్రదీప్‌రావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వరంగల్ అర్బన్ బ్యాంక్ శాఖలను విస్తరిస్తామన్నారు. అర్బన్ బ్యాంక్ అభివృద్ధిని చూసి ఓర్వలేని కొంతమంది బురద చల్లే ప్రయత్నం చేశారని, ఈ గెలుపుతో వారికి తగిన గుణపాఠం చెప్పారని తెలిపారు. తాను ఒక రాజకీయ పార్టీకి చెందిన వాడినైనప్పటికీ తమ ప్యానెల్‌కు అన్ని వర్గాలు, పార్టీల వారు పూర్తి మద్దతును తెలిపారని, వారందరికీ కృతజ్ఞతలు చెబుతున్నట్టు తెలిపారు. నష్టాల్లో ఉన్న బ్యాంక్‌ను లాభాల బాటలో నడిపించామని, ప్రస్తుతం రూ.400 కోట్ల టర్నోవర్‌తో ముందుకు సాగుతుందన్నారు. కాగా, ప్రదీప్‌రావు, ఆయన ప్యానెల్ సభ్యులందరు గెలుపొందడంతో రంగులు పూసుకున్నారు. స్వీట్లు పంచి, టపాసులు కాల్చి అభిమానులు సంబురాలు చేసుకున్నారు. ఎన్నికల్లో ఎర్రబెల్లి ప్రదీప్‌రావు ప్యానెల్ క్లీన్ స్వీప్ చేసింది. ప్యానెల్‌లోని 12 మంది అభ్యర్థులు గెలుపొందారు. మిగతా 13 మంది అభ్యర్థులు ఓటమి పాలయ్యారు.

ధ్రువీకరణ పత్రాలు అందజేత

ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులకు ఎన్నికల అధికారి ఎం.వాల్యా నాయక్ ఎన్నికైనట్లు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. అలాగే సంఘం ఆఫీస్ బేరర్స్ ఎన్నిక నిమిత్తం ఎన్నికైన పాలక వర్గ సభ్యుల సమావేశం శుక్రవారం(తేది.22-8-2025) ఉదయం 9 గంటలకు కాశిబుగ్గ ఓసిటీ రోడ్‌లోని వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేయాలని ప్రతిపాదించడం జరిగింది. పాలకవర్గ సభ్యులందరు నిర్ణీత తేది, సమయానికి హాజరుకావాలని ఎన్నికల అధికారి ఎం.వాల్యా నాయక్ తెలిపారు.



ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న ఎన్నికల అధికారి వాల్యా నాయక్

విజేతలు - పోలైన ఓట్లు

1. ఎర్రబెల్లి ప్రదీప్‌రావు (2166)
2. నీలం మల్లేశం(1992)
3. చకిలం ఉపేందర్ (1987)
4. తోట జగన్నాథం (1976)
5. కూరపాటి చంద్రమౌళి (1887)
6. మంద స్వప్న (1804)
7. ఐనవోలు వెంకట సత్యమోహన్ (1801)
8. వొడ్నాల సదానందం (1709)
9. ముందాడ వేణుగోపాల్ (1661)
10. బానోతు సీతామహాలక్ష్మి (1576)
11. మహ్మద్ సర్వర్ అహ్మద్ పాషా (1281)
12. పత్తి క్రిష్ణ (1461)

గడువులోపు అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి సురేఖ

హనుమకొండ టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. గురువారం హనుమకొండ ఆర్అండ్‌బీ అతిథి గృహంలో హనుమకొండ, వరంగల్ జిల్లాలోని వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇటీవల కురిసిన భారీవర్షాల వల్ల తీసుకోవాల్సిన చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. మామునూరు ఎయిర్ పోర్టు భూ సేకరణ ప్రక్రియ, రైతులకు పరిహారం చెల్లింపులు, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు, భద్రకాళి చెరువు పూడికతీత పనులు, ఇన్నర్ రింగు రోడ్డు, వరంగల్ బస్‌స్టేషన్ నిర్మాణ పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇండ్లు, నూతనంగా నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, జీడబ్ల్యుఎంసీ ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించి వాటి వివరాలను వివరించారు. వర్షాల కారణంగా దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలన్నారు.

వరంగల్ ముంపు నివారణకు శాశ్వత చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. అభివృద్ధి పనులకు సంబంధించి డీపీఆర్ సిద్ధం చేసి టెండర్ పనులు ప్రారంభించాలన్నారు. మామునూరు ఎయిర్ పోర్టు భూ సేకరణకు రూ.205కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. రూ.4170కోట్లతో వరంగల్ పట్టణంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని, దశల వారిగా పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. భద్రకాళి ఆలయ అభివృద్ధి పనులు దసరా నాటికి పూర్తి చేయాలన్నారు. కాకతీయుల కాలం నాటి దేవాలయాలు నిరాదరణకు గురయ్యాయని, పూర్వ వైభవం కోసం పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా వరంగల్, హనుమకొండ జిల్లాలో అభివృద్ధి పనులపై అధికారులు పురోగతిపై మంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు స్నేహ శబరీష్, సత్యశారద, జీడబ్ల్యుఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, సాగునీటి పారుదల శాఖ డీఈ వెంకటేశ్వర్లు, ఎస్ఈ రాంప్రసాద్, కుడా సీఈఓ అజిత్‌రెడ్డి, ఇతర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

వరంగల్ క్రైం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : మానవ అక్రమ రవాణా పట్ల అప్రమత్తంగా ఉండాలని మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం ఇన్‌స్పెక్టర్ శ్యాంసుందర్ అన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం భీమారంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, జూనియర్ కళాశాలలో మానవ అక్రమ రవాణా, బాలల సంక్షేమంపై ప్రిన్సిపాల్ స్వప్న అధ్యక్షతన అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ శ్యాంసుందర్ మాట్లాడుతూ.. 10 నుంచి 19 ఏళ్ల వయస్సు చాలా కీలకమని, ఇలాంటి కిషోర దశలోనే ప్రలోభాలకు గురై ఇతరుల చేతుల్లో మోసపోయే అవకాశం ఉందన్నారు. ఈ వయస్సులో అప్రమత్తండా ఉండి ఏ విషయమైనా తల్లితండ్రులతో పంచుకునే స్నేహపూర్వక వాతావరణం ఏర్పాటు చేసుకోవాలన్నారు. మొబైల్ వాడకం తగ్గించి జీవితంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించుకునే నైపుణ్యాలను అలవర్చుకోవాలన్నారు. బాల్య వివాహాలు తమ దృష్టికి వస్తే 1098 కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. అదే విధంగా 100, 1930 నెంబర్‌లపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏహెచ్‌టీయూ సబ్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, ఏఎస్సై భాగ్యలక్ష్మీ, కానిస్టేబుల్ రామారావు, హోంగార్డు పాషా పాల్గొన్నారు.

హాస్టల్‌లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

- కలెక్టర్ స్నేహ శబరీష్
- మడికొండ బాలుర గురుకులం తనిఖీ

మడికొండ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గురుకుల హాస్టల్‌లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. మడికొండలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల/కళాశాల, హాస్టల్‌ను గురువారం కలెక్టర్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా హాస్టల్‌లోని డైనింగ్ హాల్, ప్రాంగణం, స్టోర్ రూమ్, తరగతి గదులను పరిశీలించారు. హాస్టల్ నిర్వహణకు సంబంధించిన పలు రికార్డులను తనిఖీ చేశారు. కిచెన్‌లో కూరగాయలు, పప్పులు, వంటనూనెలు తదితర నిత్యావసర వస్తువులను కలెక్టర్ తనిఖీ చేశారు. తాజా కూరగాయలు, నాణ్యమైన వంట పదార్థాలను వంటల్లో వినియోగించాలన్నారు. డైనింగ్ హాల్, వాష్ ఏరియా ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలన్నారు. తరగతి గదులను పరిశీలించారు. అనంతరం ఇంటర్మీడియట్ విద్యార్థులతో మాట్లాడారు. ఎంసెట్, నీట్ వంటి పోటీ పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ఈసందర్భంగా విద్యార్థులు తమకు పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు కావాలని కలెక్టర్‌ను కోరగా వెంటనే స్పందించి పుస్తకాలు అందజేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఆర్ట్ రూమ్‌కు వెళ్ళి విద్యార్థులు వేసిన పెయింటింగ్స్ చూసి చాలా బాగున్నాయంటూ అభినందించారు. కార్యక్రమంలో డీసీవో దాసరి ఉమామహేశ్వరి, ప్రిన్సిపాల్ బత్తుల కుమారస్వామి, కాజీపేట తహసీల్దార్ బావుసింగ్, అధికారులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ స్నేహ శబరీష్

పనుల జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

హనుమకొండ కలెక్టరేట్ (ఆంధ్రజ్యోతి): ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించి గ్రామాల అభివృద్ధి దిశగా ముందుకు సాగేందుకు చేపట్టిన పనుల జాతర - 2025కు అన్ని ఏర్పాటు పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. హనుమకొండ కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం రాత్రి ఆగస్టు 22న నిర్వహించనున్న పనుల జాతర - 2025 కార్యక్రమంపై ఎంపీడీవోలు, ఎంపీవోలు, డీపీవో, పీఆర్ ఇంజనీర్లు, ఏపీవోలతో కలెక్టర్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రజల భాగస్వామ్యంతో చేపడుతున్న అభివృద్ధి పనులు మరింత పారదర్శకంగా, ఫలప్రదంగా ఉండే విధంగా అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్‌డీవో పీడీ మేన శ్రీను, ఇతర శాఖ అధికారులు పాల్గొన్నారు.



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న డాక్టర్ అంపశయ్య నవీన్

బహుముఖ ప్రజ్ఞాశాలి సారంగపాణి

అంపశయ్య నవీన్

హనుమకొండ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పరికిపండ్ల సారంగపాణి బహుముఖ ప్రజ్ఞాశాలి అని, తన రచనల ద్వారా నిత్యం సత్యాన్వేషణ చేసిన గొప్ప ఆధ్యాత్మిక వేత్త అని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ అంపశయ్య నవీన్ అన్నారు. సారంగపాణి ఆంధ్రజ్యోతి దిన పత్రికలో పరంజ్యోతి శీర్షికన మూడేళ్లపాటు ప్రతీవారం రాసిన ఆధ్యాత్మిక వ్యాసాల సంకలనం, జీవత సత్యాలు, మహనీయుల వాక్కులు, మీ కోసం అనే మూడు పుస్తకాలను డాక్టర్ నవీన్ గురువారం సారంగపాణి మొదటి సంవత్సరీకాన్ని పురస్కరించుకొని హనుమకొండ ఎన్‌జీవోస్ కాలనీలోని ఆయన స్వగృహంలో ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సారంగపాణి ఆరు పీజీలు, రెండు పీహెచ్‌డీలు, న్యాయశాస్త్రంలో కూడా పట్టా పొందిన విద్యావేత్త అని, వివిధ అంశాలపై ఆయన 18 పుస్తకాలు రాసిన గొప్ప రచయిత అని కొనియాడారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు డాక్టర్ పరికిపండ్ల ఆశోక్ మాట్లాడుతూ.. డాక్టర్ సారంగపాణి సైకాలజిస్టుగా రాష్ట్ర వ్యాప్తంగా 30 ఏళ్లుగా నిరంతరం ప్రజలకు ఉచిత సేవలు అందించారని, కొన్ని వేల కుటుంబాలకు కౌన్సెలింగ్ ఇచ్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ అవార్డు గ్రహీత పరికిపండ్ల వేణు, తాళ్ల విజయ్, మండల శేఖరయ్య, తుమ్మ సాంబయ్య, బొల్లు రాజేష్, సరికిపండ్ల భరత్, గాజుల సంపత్, కవిత, సౌభాగ్య, సుజాత, సువర్ణలతో పాటు కుటుంబసభ్యులు పరికిపండ్ల సుదర్శన్, సురేష్, వేణు, దామోదర్, ఏకాంతం, నవీన్, హరినాథ్, సంపత్, శ్రీధర్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎంజీఎంలో 'హెల్పింగ్ హ్యాండ్' సేవలు

వరంగల్ మెడికల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఎంజీఎం ఆస్పత్రిలో హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ సేవలు ప్రారంభమయ్యాయి. జిల్లా కలెక్టర్ సత్యశారద అనుమతితో ఫౌండేషన్ వారు స్వచ్ఛందంగా సేవలు అందించనున్నారు. తొలి విడతగా ఆరుగురిని నియమించారు. వీరిలో క్యాజువాలిటీ దగ్గర ఒకరు, ఓపీ విభాగంలో మరొకరు ఉంటూ రోగులకు సహాయ సహకారాలు అందించనున్నారు. మరో నలుగురు రోగులను వైద్యులు సూచించిన వార్డులకు, వివిధ వ్యాధి పరీక్షలకు వెళ్లేందుకు రోగులకు సహకరించనున్నారు. ఈ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఇప్పటికే 13మంది ఆస్పత్రిలో సేవలు కొనసాగుతున్నాయి. రోగులకు వైద్యులకు సిబ్బందికి మధ్య సమన్వయం పరుస్తూ వైద్య సేవలు త్వరితగతిన అందే విధంగా ఈ సిబ్బంది సహకరించనున్నారు. వీరి జీత భత్యాలను హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ చెల్లించనుంది. ఒంటరిగా వచ్చే రోగులతో పాటు వృద్ధ రోగులకు వీరి సేవలు అమూల్యంగా మారనున్నాయి.

బాధితులకు ఎర్రబెల్లి పరామర్శ



మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

హసన్‌పర్తి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బైరాన్‌పల్లి, సీతంపేట గ్రామాలలో పలుకారణాలతో మరణించిన మృతుల కుటుంబాలను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు గురువారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా బైరాన్‌పల్లిలో బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బండి సాంబయ్య, సీతంపేటకు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ యూత్ అధ్యక్షులు సురేష్ తండ్రి సీనియర్ నాయకులు బోయిన ఓదేలు కుటుంబాలను పరామర్శించి వారి చిత్ర పటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్, సోషల్ మీడియా నాయకులు ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే గోపీనాథ్ కుటుంబ సభ్యులకు..

హనుమకొండ టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ శాసన సభ్యుడు మాగంటి గోపీనాథ్ అకాల మరణం చెందగా, గురువారం హనుమకొండ బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ వారి నివాసంలో కుటుంబసభ్యులను కలిశారు. గోపీనాథ్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

హసన్‌పర్తి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మడిపల్లిలో చేపట్టిన అభివృద్ధి పనులను జిల్లా ముఖ్య కార్యనిర్వహణాధికారి విద్యాలత గురువారం పరిశీలించారు. గ్రామంలో ఆకస్మికంగా పర్యటించి ఇందిరమ్మ ఇళ్లు, గ్రామ పంచాయతీ భవన నిర్మాణం, నర్సరీ పనులను, కమ్యూనిటీ ప్లాంటేషన్‌తో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం, వంటగదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె వెంట ఎంపీడీవో రవి, ఏపీవో విజయలక్ష్మి, పంచాయతీ సెక్రటరి తిరుపతి, ఉపాధ్యాయులు, ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులున్నారు.

అక్రమ కట్టడాల కూల్చివేత

హసన్‌పర్తి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతగట్టు క్యాంపు కెనాల్ సమీపంలో కొన్నేళ్లుగా ఎస్సారెస్పీ భూములను కబ్జా చేసి అక్రమంగా నిర్మించిన కట్టడాలపై గురువారం సంబంధిత శాఖ అధికారులు సీరియస్ అయ్యారు. ఏఈ నాగవల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కేయూ పోలీసు సిబ్బంది సహకారంతో చింతగట్టు క్యాంపులోని కెనాల్ సమీపంలో ఇటుకబట్టి యజమాని అక్రమంగా నిర్మించిన గోడను జేసీబీ సహాయంతో యుద్ధ ప్రాతిపదికన కూల్చివేశారు. అనంతరం మెయిన్ రోడ్డు పక్కనే ఏర్పాటు చేసిన ఇసుక డంపును, అనుమతి లేకుండా నిర్వహిస్తున్న ఇసుక లారీ అడ్డాను తక్షణమే ఖాళీ చేయాలని ఏఈ శ్రీనివాస్ ఆదేశించారు. లేని పక్షంలో సంబంధిత లారీ యజమానులతో పాటు ఇసుక డంపు నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఫొటోలు సామాజిక ధృక్పథం కలిగి ఉండాలి

శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్



ఫొటో జర్నలిస్టులతో బండా ప్రకాష్

వడ్డెపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సామాజిక ధృక్పథం ఉన్న ఫొటోలు సమాజాన్ని మేల్కొల్పుతాయని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ అన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని బాలసముద్రంలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫొటో కంటెస్ట్ విజేతలకు గురువారం బహుమతి ప్రదానోత్సవాన్ని నిర్వహించారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ప్రకాష్ మాట్లాడుతూ.. ప్రెస్‌క్లబ్ అభివృద్ధికి తన సహకారం ఎల్లప్పుడు ఉంటుందని అన్నారు. ప్రభుత్వం నుంచి సీడీఎఫ్ నిధులు తనకు విడుదలైన మొదటి విడత నిధులను ప్రెస్‌క్లబ్ అభివృద్ధి పనులకు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రథమ విజేత పెద్దపల్లి వరప్రసాద్‌కు రూ.10 వేలు, ద్వితీయ బహుమతి కింద షెర్పొద్దీన్ మాషుక్‌కు రూ.5వే లు, తృతీయ బహుమతి కింద మేరుగు ప్రతాప్‌కు రూ.3వేలు అందించారు. కన్సోలేషన్ బహుమతుల కింద గోవర్ధనం వేణుగోపాల్, సంపెట సుధాకర్, వీరగోని హరీష్, పాలకుర్తి మధు, ఆవుల సంపత్‌లకు ఒక్కొక్కరికి రూ.2వేల చొప్పున చెక్కులతో పాటు మెమెంటో, ప్రశంసాపత్రాలను అందజేసి శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోళ్ల అమర్, ఫొటో, వీడియో జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు సంపెట సుధాకర్, సీనియర్ జర్నలిస్టులు గాడిపెల్లి మధు, గడ్డం కేశవమూర్తి, గోకారపు శ్యామ్, అల్లం రాజేష్‌వర్మ పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్టులకు ప్రశంసాపత్రాలు ఇస్తున్న ప్రకాష్

కేఎంసీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

హెచ్‌ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదానాయక్

వరంగల్ మెడికల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కాకతీయ మెడికల్ కలాశాల మెన్స్ ఉమెన్స్ హాస్టళ్లలో పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించడంతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.యాదానాయక్ డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న నిరవధిక సమ్మె గురువారం నాటికి పదో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా యాదనాయక్ మాట్లాడుతూ.. సుమారు 8నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో వర్కర్ల కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. గత్యంతరం లేకనే నిరవధిక సమ్మెకు వెళ్లామని, ఈ సమ్మెకు పూర్తి బాధ్యత ప్రభుత్వం, అధికారులు వహించాల్సి వస్తుందన్నారు.

ఇప్పటికైనా వేతనాలు చెల్లించి సమస్యలు పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి జే.సుధాకర్, అల్లం రమేశ్, రాణి, రాజకుమారి, ఎండి.తిలక్, రవి, బాబు, కవిత తదితరులు పాల్గొన్నారు.

బార్ షాపునకు అనుమతివ్వొద్దు

వడ్డెపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వడ్డెపల్లి చర్చి జంక్షన్‌లో నూతన బార్ షాపునకు అనుమతి ఇవ్వవద్దని వడ్డెపల్లి దళిత వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడు తాళ్లపల్లి రవీందర్, జై భీం జిల్లా కన్వీనర్ తాళ్లపెల్లి విజయ్‌లు డిమాండ్ చేశారు. గురువారం హనుమకొండలోని ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ కార్యాలయంలో సీఐ దుర్గాభవానిని మర్యాదపూర్వకంగా కలిసి బార్ పెట్టుకోవడానికి అనుమతి ఇవ్వవద్దని వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా దుర్గాభవాని మాట్లాడుతూ.. వడ్డెపల్లి చర్చి జంక్షన్‌లో బార్‌షాపు ఏర్పాటు విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. వినతి పత్రం సమర్పించిన వారిలో వడ్డెపల్లి దళిత వెల్ఫేర్ సొసైటీ సెక్రటరి తాళ్లపెల్లి ప్రవీణ్‌కుమార్, కోశాధికారి నల్ల ఆశీర్వాదం తదితరులు ఉన్నారు.

కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల ధర్నా

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు21(ఆంధ్రజ్యోతి) : ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు ధర్నా చేశారు. సుబేదారిలోని ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వచ్చిన అంగన్‌వాడీ కార్యకర్తలు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మీ మాట్లాడుతూ.. ప్రీ ప్రైమరీ, పీఎం శ్రీ విద్యను అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించాలని, విద్యా బోధనా బాధ్యతను అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లుకు ఇవ్వాలన్నారు. ఈ ధర్నాలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా నాయకులు నిడిగొండ రజిత, పి. రమాదేవి, శోభారాణి, కే. జమున, జ్యోత్స్న ప్రసన్న, రమాదేవి, రాజేశ్వరి, హైమావతి, శోభారాణి, వసంత, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన తీజ్ సంబరాలు

- ముగిసిన నవరాత్రి ఉత్సవాలు
- భక్తిశ్రద్ధలతో నిమజ్జనోత్సవం



తీజ్ బుట్టలను నిమజ్జనానికి సిద్ధం చేసిన బంజారా నేతలు

వడ్డెపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని వివిధ డివిజన్లలో బంజారాలు నిర్వహించిన తీజ్ ఉత్సవాలు అంబరాన్నంటాయి. తీజ్ బుట్టలను మంచెపై పెట్టి నవరాత్రులు బంజారాల ఆరాధ్యదైవాలు మేరా మాయాడీ , సంత్ సేవాలాల్ మహరాజ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నైవేద్యం సమర్పించుకొని కొలిచారు. హనుమకొండలోని గిరిజన భవన్‌లో గ్రేటర్ వరంగల్ గోర్ బంజారా తీజ్ ఉత్సవ కమిటీ కన్వీనర్ ఆంగోత్ వినోద్ లోక్‌నాయక్, ప్రతినిధులు డాక్టర్ గుగులోత్ రాజు నాయక్, బాదావత్ బాలాజీ ఆధ్వర్యంలో తీజ్ ఉత్సవాలను 9 రోజుల పాటు నయనానందకరణంగా కొలిచారు. హనుమకొండ 57వ డివిజన్ వికాస్ నగర్‌లో తీజ్ ఉత్సవ కమిటీ కన్వీనర్లు పోరిక వీరన్న నాయక్, భానోత్ వెంకన్న నాయక్, వాంకుడోత్ వీరన్న నాయక్ ఆధ్వర్యంలో హనుమకొండ డిపో రోడ్డులోని బంజారా కాలనీలో తీజ్ ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు ధరావత్ భాను నాయక్, భూక్య బాలు నాయక్, డాక్టర్ రమేష్ తదితరుల ఆధ్వర్యంలో తీజ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. తీజ్ బుట్టలను మహిళలు నెత్తిన ఎత్తుకొని ఆట పాటలు, డప్పు చప్పుళ్లతో ఊరి పొలిమేరలోని చెరువులు, కుంటల్లో గురువారం రాత్రి నిమజ్జనం చేశారు. గిరిజన భవన్‌లో నిర్వహించిన తీజ్ నిమజ్జన కార్యక్రమంలో మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్, హనుమకొండ ఆర్డీవో రమేష్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

గుండ్ల సింగారంలో..

వరంగల్ కార్పొరేషన్: గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ 2వ డివిజన్ గుండ్లసింగారంలో తీజ్ ఉత్సవాలు గురువారం రాత్రి ఘనంగా జరిగాయి. సంత్‌సేవాలాల్ సేవా సమితి ఆధ్వర్యంలో తీజ్ నవరాత్రి ఉత్సవాలు కన్నుల పండువగా నిర్వహించినట్టు నిర్వాహకులు తెలిపారు. ముందుగా వివాహం కాని యువతులు గోధుమ నారుతో నృత్యాలు చేసి అలరించారు. ఆటా పాటలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తీజ్ ఉత్సవ కమిటీ నాయకులు పాల్గొన్నారు.



పోచమ్మ తల్లికి వెండి తొడుగు బహూకరించిన ఎమ్మెల్సీ సారయ్య, కార్పొరేటర్ శ్రీమాన్ దంపతులు

న్యూశాయంపేటలో బోనాలు

పోచమ్మ తల్లికి వెండి తొడుగు బహూకరించిన ఎమ్మెల్సీ సారయ్య

న్యూశాయంపేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ మహానగరపాలక సంస్థ పరిధిలోని 31వ డివిజన్ న్యూశాయంపేటలో గురువారం ఊరంతా ఒకేరోజు ఘనంగా పోచమ్మ బోనాలు చేశారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు గ్రామ ప్రజలంతా వచ్చి పోచమ్మ తల్లికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. న్యూశాయంపేట జంక్షన్ నుంచి మేకపోతులతో ప్రత్యేకంగా తయారుచేసిన రథంపై పోచమ్మ తల్లి విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లారు. స్థానిక కార్పొరేటర్ మామిండ్ల రాజు యాదవ్ ఆధ్వర్యంలో బోనాల పండుగను గ్రామ ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు.

5 కిలోల 250 గ్రాముల వెండి తొడుగు బహూకరణ

మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజు లక్ష్మీ సారయ్య దంపతులు, 25వ డివిజన్ కార్పొరేటర్ బస్వరాజు శిరీష శ్రీమాన్‌లు పోచమ్మ తల్లికి ప్రత్యేకంగా 5కిలోల 250 గ్రాముల వెండి తొడుగు చేయించి బహూకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య మాట్లాడుతూ.. పోచమ్మ తల్లికి వెండితొడుగు బహూకరించడం సంతోషంగా ఉందన్నారు. ఎమ్మెల్సీ వెంట మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, మాజీ కార్పొరేటర్ వేల్పుల మోహన్‌రావు తదితరులు ఉన్నారు.

'రచయిత అనిశెట్టి రజిత.. అభినవ మొల్ల'

రాంనగర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రచయిత అనిశెట్టి రజిత.. అభినవ మొల్ల అని పలువురు వక్తలు పేర్కొన్నారు. బహుజన రాజ్యాధికారం సాధించాలని 20 ఏళ్ల కిందటే ఆమె గళమెత్తారని, ఆమె ఆశయ సాధన కోసం తెలంగాణ రాష్ట్ర సగర సంఘం కృషి చేయాలని సూచించారు. కాకతీయ యూనివర్సిటీలో ఆమె విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. గురువారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో తెలంగాణ సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాగర్ సగర, సగర మేధావుల ఫోరం అధ్యక్షుడు మారుతిసాగర్ సగర ఆధ్వర్యంలో కవి, రచయిత్రి, తెలంగాణ ఉద్యమకారురాలు, బీసీ ఉద్యమ నాయకురాలు అనిశెట్టి రజిత సగర యాది సభ జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, తెలంగాణ సాహితీ సంస్థ మాజీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్, సీనియర్ జర్నలిస్టు, విశ్లేషకులు బుచ్చన్న హాజరై ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సగర సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి సత్యం సగర, సలహాదారులు ఆర్.బి.ఆంజనేయులు, కోశాధికారి కుమారస్వామి, మహిళా, యువజన సంఘం అధ్యక్షులు శ్రావంతి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల కమిటీ ఎన్నిక



ఎన్నికైన భవన నిర్మాణ రంగ కార్మికుల మండల కమిటీ సభ్యులు

మడికొండ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): జీడబ్ల్యుఎంసీ 45వ డివిజన్ తరాలపల్లిలో భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం(బీఎన్‌ఆర్‌కెఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి కాశేశ్వరపు రాజేందర్ అధ్యక్షతన గురువారం కార్మికుల సమావేశం జరిగింది. ఈసందర్భంగా బీఎన్‌ఆర్‌కెఎస్ కాజీపేట మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చిక్కుడు సాయిలు, ప్రధాన కార్యదర్శిగా దాడబోయిన కొమురయ్య, ఉపాధ్యక్షులుగా గోనెల సతీష్, దాడబోయిన సమ్మయ్య, కోశాధికారిగా ఎర్ర చిరంజీవి, కార్యదర్శులుగా అల్లం రాజయ్య, బోల రాజయ్య, ప్రచార కార్యదర్శిగా చెంబల ఎన్నికయ్యారని రాజేందర్ తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి, కార్మికులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి పెట్రోలింగ్ విధుల్లో మహిళా పోలీస్ సిబ్బంది

వరంగల్ క్రైం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఇంతకాలం రాణాల్లోనే విధులకే పరిమితమైన మహిళా పోలీసులు వరంగల్ పోలీస్ కమిషనర్ ఆదేశాలతో అర్ధరాత్రి విధులు నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. బుధవారం రాత్రి హనుమకొండ పీఎస్ పరిధిలో మహిళా ఏఎస్సై, మహిళా కానిస్టేబుల్ పెట్రోలింగ్ విధులు నిర్వర్తించారు. లాడ్జిలు, వాహనాలు తనిఖీలు చేసి ఉన్నతాధికారులు ఏ పని అప్పగించిన చేసేందుకు సిద్ధమని నిరూపించారు.

కేబుల్స్‌ను సరి చేయాలి

రాంనగర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్తంభాలపై ప్రమాదకరంగా గుత్తులు, గుత్తులుగా కనిపిస్తున్న కేబుల్ వైర్లను వెంటనే సరి చేసుకోవాలని విద్యుత్ అధికారులు సూచించారు. రానున్న గణపతి ఉత్సవాలతోపాటు ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన దుర్ఘటన నేపథ్యంలో ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 సర్కిళ్లలో ఆయా సర్కిళ్ల అధికారులు కేబుల్ ఆపరేటర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హనుమకొండ సర్కిల్ సూపరింటెండెంట్ కార్యాలయంలో జరిగిన కేబుల్ ఆపరేటర్స్ సమావేశంలో ఎస్ఈ మధుసూదన్‌రావు మాట్లాడుతూ.. విద్యుత్ స్తంభం పొడుగూత కేబుల్స్ చిందర వందరగా ఉండటంతో మరమ్మతులు చేసేటప్పుడు సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రధానంగా ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఉందన్నారు. రాను న్న గణపతి నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో చిందర వందరంగా ఉన్న కేబుల్ వైర్లను సరిచేసుకోవాలని లేకుంటే విద్యుత్‌శాఖ స్వయంగా తొలగిస్తుందని హెచ్చరించారు.

బంకుల్లో పంక్చర్ షాపులను నిర్వహించొద్దు

వడ్డెపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పెట్రోల్ బంకుల్లో పంక్చర్ షాపులను నిర్వహించొద్దని కాకతీయ టైర్ ఫైటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (కేటీఎఫ్‌డబ్ల్యూఏ) జిల్లా అధ్యక్షుడు కె.నగేష్, అధికార ప్రతినిధి ఆరెల్లి సంపత్, వైస్ ప్రెసిడెంట్ ఎం.డి. ఖలీం మాట్లాడారు. తాము గ్రేటర్ వరంగల్ పరిధిలో 40 ఏళ్ల నుంచి పంక్చర్ షాపులు లైసెన్స్‌తో నడుపుతూ పన్నులు చెల్లిస్తూ జీవిస్తున్నామని అన్నారు. పెట్రోల్ బంకుల్లో ఫ్రీ ఎయిర్ చెకప్ పేరుతో పంక్చర్ షాపులను నిర్వహిస్తూ తమ ఉపాధిని దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. బిహార్, తదితర రాష్ట్రాల నుంచి వచ్చిన వారితో పెట్రోల్ బంకుల యజమానులు పంక్చర్ షాపులను నిర్వహిస్తూ తమ ఉపాధిని దెబ్బతీస్తూ కుటుంబాలను బజారున పడేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్, పోలీసు కమిషనర్, ఆర్టీవో, తదితర ఉన్నతాధికారులు స్పందించి పెట్రోల్ బంకుల్లో పంక్చర్ షాపులను నిర్వహించకుండా తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ సమావేశంలో కేటీఎఫ్‌డబ్ల్యూఏ జిల్లా నాయకులు సీహెచ్. భిక్షపతి, రాంచందర్, జుబేర్, రవి, జాఫర్ పాల్గొన్నారు.



పర్వదినం

గణేశ వ్రత కథ మర్మం ఇదీ!

ఎన్నో ఏళ్ళ నుంచి వినాయక చవితి రోజున మనం పూజ చేసుకొని, చివర్లో వ్రత కథలు వింటున్నాం. కానీ ఆ వ్రత కథలను సరిగ్గా అర్థం చేసుకోలేదేమో అనిపిస్తుంది. ఆ కథల్లో తెలుసుకోదగిన అంతరార్థాలు అనేకం ఉన్నాయి. ఆ విశేషాలన్నీ... లోతుగా పరిశీలించినప్పుడే తెలుస్తాయి.

గజుడు అనేవాడు ఒక రాక్షసుడు. అతను శివుడి కోసం తపస్సు చేశాడు. ఆ బేల శంకరుడు (అమాయకుడైన వాడు... బోళా శంకరుడు కాదు) ప్రత్యక్షమై... "ఏ వరం కావాలి?" అని అడిగాడు. అప్పుడు గజుడు తన రాక్షస బుద్ధితో "నువ్వు నా పొట్టలో లింగ రూపంలో ఉండిపోవాలి" అని కోరాడు. శివుడు సరేనని అలాగే ఉండిపోయాడు. పార్వతీదేవి తన భర్త జాడ గురించి విష్ణువును ఆశ్రయించింది. తన భర్తను తనకు ఇప్పించవలసిందిగా కోరింది. శ్రీహరి దేవతలందరినీ పిలిచి... తలొక వాద్యాన్నీ ఇచ్చాడు. ఒకరు వేణువు ఊదేవారుగా, మరొకరు మద్దెల మోగించేవారుగా, నందీశ్వరుణ్ణి నృత్యం చేసేవాడిగా... ఇలా వేషాలు వేయించాడు. గజుడు ఉండే నగరానికి వారిని తనతో పాటు తీసుకువెళ్ళి, నృత్య గీత వినోదాన్ని ప్రదర్శించాడు. గజుణ్ణి మెప్పించి... అతని ఉదరంలో ఉన్న శంకరుణ్ణి బయటకు తెచ్చుకున్నాడు. శంకరుడు కైలాసానికి వస్తూనే... తనను కైలాస ముఖద్వారం వద్ద నిరోధించిన వినాయకుడి శిరస్సును శూలంతో ఖండించాడు. దుఃఖించిన పార్వతికి ఆనందాన్ని కలిగిస్తూ... ఆ గజుడి శిరస్సుని తెచ్చి... శిరస్సు లేని వినాయకుడికి అతికించాడు. ఆ కారణంగా... వినాయకుడి శిరస్సు గజాసురుడి శిరస్సే అవుతోంది కదా! దానికే మనం పూజ చేస్తున్నాం!

ఎన్నెన్నో సందేహాలు...

ఊరకే కథ విని అక్షతలను తలపైన ధరించడం కాదు, కథలో విశేషాన్ని గమనించాలి. గజుడు రాక్షసుడు. అతను తపస్సు చేస్తే... దేవతా విరోధి అయిన అతనికి శివుడు ప్రత్యక్షం కావడం దేనికి? పోనీ ప్రత్యక్షమైనా... తన ఉదరంలో ఆత్మ లింగరూపంలో ఉండిపోవాలని ఆ రాక్షసుడు కోరినంత మాత్రాన... దానికి అంగీకరించడం దేనికి? 'లయం' అనే బాధ్యతను నిర్వర్తించేవాడు శివుడు. మరి ఆ బాధ్యతను మరెవరికైనా అప్పగించాలి కదా! భార్యకు కూడా ఒక్క మాట చెప్పకుండా... ఎంతకాలం గజుడి ఉదరంలో ఉండాలని కనీసం అడగనక్కరలేదా? తనకు లయం అనే బాధ్యతను అప్పగించిన ఆది పరాశక్తికైనా చెప్పి, అనుమతి పొందనక్కరలేదా? పైగా... లోకాలన్నిటినీ పరిపాలించే పార్వతీదేవికి తన భర్త జాడ తెలియలేదా? విష్ణువును ఆశ్రయించి ఆయనను ఇప్పించవలసిందిగా ఎందుకు కోరాలి? సరే... విష్ణువు సుదర్శన చక్రాన్ని పంపి ఉంటే... గజరాజు తల తెగి, శంకరుడు బయటకు రాగలిగేవాడు కదా! దేవతలందరితోనూ శ్రీహరి విచిత్ర వేషాలు వేయించడం ఏమిటి? వాళ్ళతో తనూ వెళ్ళడం ఏమిటి? నృత్యోత్సవం ఏమిటి? ఇలా ఆలోచించే కొద్దీ అసంబద్ధంగా అనిపించడం లేదూ? ఈ కథను తరచి తరచి చూస్తే... లోపలి విషయం అర్థమవుతుంది.

> గజాసురుడు మాత్రమే కాదు... మనం అందరం జనన మరణ చక్రంలో తిరుగాడుతూ ఉండే లక్షణం ఉన్న వారిమే. రాక్షసుడైన అతనికి... తన జీవిత లక్ష్యం ఏమిటనే పరివర్తన కలిగినట్టు... మనకు కూడా పుట్టడం, చావడం అనే చక్రంలో ఉండిపోకుండా... అంతకన్నా ఉన్నత స్థితి కలిగేలా ఆధ్యాత్మికంగా ఎదగాలనే భావన కలగాలి.

గజుడి తపశ్శక్తి...

ఆ రాక్షసుడి పేరు గజుడు కాదు గ-జుడు. 'గ' అంటే గతించడం. 'జ' అంటే జన్మించడం. చాలామంది చావడం, పుట్టడం అనే జనన మరణ చక్రంలో పడిపోతూ ఉంటే... ఇతనికి తన జన్మను శాశ్వతం చేసుకోవాలని, పునర్జన్మ లేకుండా చేసుకోవాలని ఆలోచన కలిగింది. దాంతో అతను శంకరుడి గురించి తపస్సు చేశాడు. శంకరుడు అతని తపశ్శక్తి స్థాయిని గమనించాడు. తాను ప్రత్యక్షం అయి తీరాల్సినంత తపస్సు చేశాడని గుర్తించాడు. ఆయన పరమ ధర్మమూర్తి కాబట్టి... ఆత్మ లింగ రూపంలో తన ఉదరంలో ఉండాలని గజుడు కోరగానే... అతని తపశ్శక్తి స్థాయి కారణంగా... తప్పనిసరి పరిస్థితుల్లో గజుడి ఉదరంలో ఉండిపోయాడు. శంకరుడు లింగరూపంలో తన ఉదరంలో ఉండిపోగానే... ఆ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనుకున్న గజుడు నిత్యం రుద్రాభిషేకాన్ని, మంత్ర సాధనను మరింత తీవ్ర నిష్ఠతో కొనసాగించాడు. పార్వతీదేవి ప్రార్థన మేరకు... 'శంకరుడు ఎక్కడ ఉన్నాడా?' అని శ్రీహరి దివ్య దృష్టితో గమనించి నివ్వెరపోయాడు. గజుడిది తాను సుదర్శనాన్ని పంపినా తల తెగిపడనంత తపశ్శక్తి అని తెలుసుకున్నాడు. అంతే కాదు... అంతకుముందు శంకరుణ్ణి మాత్రమే దర్శించగలిగే తపశ్శక్తి కాస్తా... శంకరుడు అతని ఉదరంలో ఉన్న సమయంలో చేసిన రుద్రాభిషేక, మంత్ర సాధనల కారణంగా దేవతలందరినీ దర్శించగలిగే స్థాయికి పెరిగిందని శ్రీహరి గ్రహించాడు. అందుకే దేవతలందరినీ వాద్యకారుల్ని చేశాడు. జన్మలక్షణం ప్రకారం గజుడు అహంకారి. తమోగుణం ఉండేవాడు. కాబట్టి అతణ్ణి ఎదిరించి, భయపెట్టడం వల్ల ప్రయోజనం ఉండదని, అతణ్ణి ఆనందపరచి, ఆ ఆనంద సమయంలో శంకరుణ్ణి బయటకు రప్పించాలని ప్రణాళిక వేశాడు. దేవతలందరూ అత్యద్భుతంగా నృత్య గీత వాద్య వినోదాల్ని ప్రదర్శించగానే... ఆ ఆనందంలో ఒళ్ళు మరచిన గజుడు ఏ వరం కావాలని అడిగాడు. విష్ణువు కోరాడు. ఆ తరువాత నందీశ్వరుడు తన కొమ్ములతో గజుడి ఉదరాన్ని చీల్చి... శంకరుణ్ణి బయటకు తెచ్చి, తన మీద ఎక్కించుకున్నాడు, కైలాసానికి చేర్చాడు. చివరకు గజుని తల వినాయకుడి ముఖం (గజముఖం) అయింది.

ఆ భావన కలగాలి...

శ్రీహరిని పార్వతి ఆశ్రయించడానికి కారణం... సృష్టి స్థితి లయాలనే మూడిటిలో స్థితి (దేవతా సమూహానికి ఏదైనా రక్షణ) విషయంలో ఇబ్బంది ఏర్పడితే... ఆశ్రయించాల్సింది శ్రీహరినే కాబట్టి! ఇక... కార్యాలయాల్లో అహంకారి, నిరంకుశుడు, పెద్దలతో బాగా పరిచయాలు ఉన్నవాడు మనకు అధికారిగా (అధిక=గొప్ప, అరి= శత్రువులా ప్రతిదానికీ 'కాదు, కూడదు, కుదరదు' అంటూ ఉండేవాడు) ఉంటే అతణ్ణి తోవలోకి తెచ్చుకొనే విధానాన్ని ఈ కథ చెబుతోంది. అతణ్ణి ఎదిరించి, బెదిరిస్తూ, లేఖలను పంపి, పై అధికారులకు చెప్పి ఏమాత్రమూ తోవలోకి తెచ్చుకోలేమట! అతణ్ణి విపరీతంగా ఆనందించేలా పొగిడి లేదా ఉబ్బిపోయేలా చేసి మాత్రమే కార్యసాధన చేసుకోగలమట! ఈ కథలో ఉన్న మరో అంతరార్థం ఇది. గజుడి తపశ్శక్తి ఎంతటిదంటే... తన ఉదరంలో ఉన్న శివలింగాన్ని ఆరాధిస్తున్న కారణంగా... గజాసురపురంలో ఉన్నవారందరికీ శివదర్శనంతో పాటు సర్వదేవతా దర్శనాన్ని కూడా చేయించగలిగాడు. కానీ అందరు దేవతల దర్శనం అయినప్పటికీ... అమ్మవారి దర్శనం మాత్రం అతనికి కాలేదు. ఎందుకంటే... శివారాధన వల్ల శివుడు వశుడు కావచ్చు, శ్రీహరితో సహా మొత్తం దేవతాగణం లొంగిపోవచ్చు. కానీ పార్వతీదేవి దర్శనానికి ఆ మాత్రపు తపస్సు సరిపోదు. ఎంతో చిక్కగా ఉండే చక్కటి కథ ఇది. వినాయకునికి నవరాత్రుల పేరిట ఉత్సవాలు చేస్తూ... తొమ్మిదిరోజుల పాటు తొమ్మిది రహస్యాలు తెలుసుకోవాలనేది పెద్దల మాట.


● డాక్టర్ మైలవరపు శ్రీనివాసరావు, 9866700425

సహజయోగ

హిందూ ధర్మంలో గణేశుడికి మహోన్నతమైన స్థానం ఉంది. ప్రతి శుభకార్యం ఆయన ప్రార్థనతో ప్రారంభమవుతుంది. ఎందుకంటే ఆయనే ప్రారంభకర్త, జీవితంలోని అన్ని దశల్లో విఘ్నాలను తొలగించేవాడు. భౌతిక, మానసిక, జ్ఞాన సంబంధమైన ఆటంకాలను తొలగించే శక్తి. ఆయన అనుగ్రహంతో బుద్ధిని, వికాసాన్ని, సరైన మార్గదర్శనాన్ని పొందగలుగుతాం.

అంతటా ఆయనే!

మనలో ఉండే ఏడుచక్రాలలో మొట్టమొదటి శక్తి కేంద్రం... మూలాధార చక్రం. అదే గణేశుడి నివాస స్థానం. ఆ చక్రానికి ఆయన అధిష్ఠాన దేవత. ఆయ చక్రం పృధ్వీతత్త్వంతో రూపొంది ఉంటుంది. గణేశుణ్ణి కూడా ఆయన తల్లి అయిన గౌరీమాత భూతత్త్వంతోనే తయారు చేసింది. మన షట్ చక్రాలలోనూ గణేశ తత్త్వం నిండి ఉంటుంది. అంటే అంతటా ఆయనే. మూలాధార చక్రంలో ఉండే ఆయన మనల్ని సదా రక్షిస్తూ ఉంటాడు. ఆత్మసాక్షాత్కారాన్ని పొందడానికి మూలమైన కుండలినీ శక్తి మేలుకొని.. ఊర్ధ్వముఖంగా పయనిస్తున్నప్పుడు... ఆ శక్తిని సదా కాపాడేది ఆయన. ఆయన ప్రమేయం లేకుండా కుండలినీ శక్తి జాగృతం కాదు. అది జాగృతం కాకపోతే మనకు ఆత్మసాక్షాత్కారం అసాధ్యం. కుండలినీ మాతయే గణేశుని తల్లి అయిన గౌరీమాతగా... మన మూలాధారంలో మూడున్నర చుట్లతో నిద్రాణ స్థితిలో ఉంటుంది. వినాయకుణ్ణి ప్రసన్నం చేసుకోవాలంటే... ఆయన గుణగణాలు, లక్షణాలు, శక్తులు మనలో స్థిరపరుచుకోవాలి.




అవి నేర్చుకోవాలి...

గణేశునిలో ప్రప్రథమంగా చెప్పుకోవలసిన ముఖ్యమైన గుణం... అమాయకత్వం. దాన్నే ఆధ్యాత్మికంగా 'అభోదిత తత్త్వం' అంటారు. అది మనలో ఉంటే... మనల్ని ఎవరూ మోసం చేయలేరు. ఎవరూ హాని కలిగించలేరు. అటువంటి అమాయకత్వాన్ని మనలో స్థిరపరుచుకుంటే ఎలాంటి సమస్యలనైనా సునాయాసంగా పరిష్కరించుకోగలుగుతాం. ప్రజల దృష్టిలో అమాయకత్వం అంటే చేతకానితనం. అమాయకత్వంతో ఉంటే ఇతరుల చేతిలో మోసపోతామనే అపోహ వారిలో ఉంటుంది. కానీ వాస్తవానికి అమాయకత్వం అంటే విచక్షణ, వివేకంతో కూడిన గణేశుని శక్తి. ఆ లక్షణం ఉన్నవారికి సదా గణేశుని రక్షణ ఉంటుంది. ఇక... ఆయన శరీరం మానవుల మాదిరిగా ఉన్నప్పటికీ... శిరస్సు ఏనుగు శిరస్సు. ఏనుగు జంతు ప్రపంచంలో అత్యంత తెలివైనది. దాని చెవులు ఎంత దూరంలోని శబ్దాన్నైనా వినగలవు, కళ్ళు చాలా దూరం చూడగలవు. నైపుణ్యం, నేర్పరితనం గణేశుని గుణాలు. ఆయన వివేకాన్ని, విచక్షణను అనుగ్రహిస్తాడు. ఆయన ఎంత మహోన్నతుడో అంత సూక్ష్మరూపుడు. పెద్ద పొట్టతో ఉన్నప్పటికీ ఎంతో తేలికగా ఉంటాడు. అందుకే అతి చిన్నదైన ఎలుక మీద కూర్చోగలుగుతాడు. ఆయన నిరాండబరతకు చిహ్నమే ఎలుక వాహనం. ఆయనకు ఉన్న గుణగణాలలో మరొకటి... తల్లిపట్ల శరణాగతి. ఎల్లప్పుడూ తల్లిని ప్రసన్నం చేసుకొనే ప్రయత్నంలో ఉంటాడు. అతనిలోని సమస్త జ్ఞానానికి, ఆనందానికి ఆ తల్లే మూలం. తల్లి పట్ల ఉండవలసిన వినయవిధేయతలు, గౌరవం ఆయన నుంచి నేర్చుకోవాలి.

ఆ శక్తిని పెంపొందించుకుందాం...

మనలో గణేశతత్త్వాన్ని సంరక్షించుకొని, అంతర్గతంగా మనల్ని మనం పరిశుద్ధంగా, కల్మషరహితంగా ఉంచుకోవాలి. తోటివారితో నిర్మలమైన సత్సంబంధాలు అభివృద్ధి చేసుకుంటే ఎలాంటి సమస్యలూ రావు. గణేశుడు బ్రహ్మాండాన్ని పవిత్రపరిచే శక్తి కలిగినవాడు. ఆ శక్తి దేనివల్లా మలినం కాదు. మీలో గణేశ శక్తిని పెంపొందించుకుంటే మీ కళ్ళు ప్రకాశిస్తూ ఉంటాయి. సచ్ఛీలమే ప్రధాన లక్షణంగా ఉన్నవారిని ఆయన ఎంతగానో ఇష్టపడతాడు. భూమాతకు ఉన్న అయస్కాంత శక్తి ఆయనలో ఉంది. ఆ శక్తితోనే అందరినీ తనవైపు ఆయన ఆకర్షిస్తాడు. మనలో అంతర్గతంగా ఉన్న గణేశ శక్తిని, తత్త్వాన్ని మేలుకొలిపాలి. తద్వారా ఆయన గుణగణాలు మనలో వాటంతట అవే స్థిరపడతాయి. అప్పుడు మనం ఆయన కృపకు పాత్రులం అవుతాం. మనలో ఉన్న నిద్రాణ స్థితిలో ఉన్న కుండలినీ శక్తిని జాగృతం చేసి... ఆత్మసాక్షాత్కారం పొంది, సహజయోగ సాధన ద్వారా శ్రీగణేశ తత్త్వాన్ని, గుణగణాలను మనలో స్థిరపరచుకోవచ్చు.



డాక్టర్ పి. రాకేష్, 8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ

దైవమార్గం

ఏలియా ప్రవక్త

దేవునికి, మానవులకు మధ్యవర్తిత్వం జరిపిన ప్రవక్తలు బైబిల్‌లో దర్శనమిస్తారు. వారు ఎప్పటికప్పుడు కొన్ని హెచ్చరికలు చేస్తూ, దైవభీతిని కలిగిస్తూ, సమాజాన్ని వెలుతురు వైపు నడిపించే వ్యక్తులుగా కనిపిస్తారు. వారిలో ఏలియా ఒకరు. అది ఇశ్రాయేలీయ దైవభూమి. క్రీస్తుపూర్వం 900 ముందటికాలం అది. అక్కడ మూఢనమ్మకం బాగా పెరిగిపోయింది. ప్రజలలో దురాచారాలు పెరిగిపోయాయి. అంతటా అంధకారం అలముకుంది. రాజును, ప్రజలను అప్రమత్తం చేయడం కోసం ఏలియా ప్రవక్తను దేవుడు ఈ భూమిపైకి పంపించాడు. ఏలియా ప్రవక్త తిష్బీయుడు... అంటే తిష్బీ ప్రాంతం వాడు. గిలాదు కుటుంబానికి చెందినవాడు. దైవభక్తుడు. ఆ ఆహాబు రాజ్యంలో పాపం పెరిగింది కాబట్టి మంచు కానీ, వర్షం కానీ పడదని ఏలియా స్వయంగా రాజు కోటకు వెళ్ళి ప్రకటించాడు. ఆ విధంగానే మంచు కురవలేదు.



తరువాత... కార్మేల్ పర్వతం దగ్గర ప్రజలను, ఉభయ మతాల ప్రవక్తలను ఏలియా సమావేశపరచాడు. ఏ దేవుని ద్వారా అగ్ని దిగి వచ్చి, కొండ పీఠం మీద నిలబెట్టిన ఎద్దును దహనం చేసే అద్భుతాన్ని నిర్వహిస్తుందో... ఆ దేవుడే నిజమైన దేవుడనీ, ఆ దేవుణ్ణే అందరూ ఆరాధించాలని వారందరూ ఏకగ్రీవంగా ఒక అంగీకారానికి వస్తారు. వారి బైలు దేవత నుంచి ఎలాంటి స్పందనా రాదు. యెహోవాను ఏలియా ప్రవక్త ప్రార్థిస్తాడు. అగ్ని దిగివస్తుంది. ఎద్దును దహించేస్తుంది. బైలు దేవతను నమ్మినవారు అవమానితులయ్యారు. వధకు గురయ్యారు. ఆహాబు రాజు భార్య ఎజిబేలు పంతం ఓటమి పాలైంది. ఆమెకు ఏలియాపై కక్ష పెరిగింది. దుష్టపాలకుడైన ఆహాబు కుక్క చావు చస్తాడని, ఆయనను దుర్మార్గాల వైపు నడిపించిన అతని భార్యకు కూడా అదే దుస్థితి దాపురిస్తుందనీ ఏలియా సూచన చేసినట్టే... వారు కుక్కల చేతిలో మరణిస్తారు. ఏలియా ఎన్నో కష్టాలను ఎదుర్కొని... దేవుని పట్ల, దేవుని మాట పట్ల గొప్ప విధేయతను ప్రకటించడం వల్ల... అతని వృద్ధాప్యంలో ఒక రథాన్ని దేవుడు పంపించాడని, ఆ మహా ప్రవక్తను సశరీరుడిగా మోక్ష పథానికి తీసుకువెళ్ళాడని బైబిల్ చెబుతోంది.

● డాక్టర్ యం. సోహినీ బెర్నార్డ్, 9866755024

స్థపతి... స్థాపత్య వేదం

తెలుసుకుందాం

'దేవాలయం వినాయత్ర ఏకకాలం నవాసయేత్... దేవాలయం లేని చోట ఒక్క క్షణం కూడా ఉండకూడదని 'కారణాగమం' చెబుతోంది. కాబట్టి అలాంటి ఆలయాలను, అందులోని విగ్రహాలను నిర్మించడానికి సాక్షాత్తూ భగవంతుడే మహర్షులకు శిల్పశాస్త్రాన్ని ఉపదేశించాడు. కాగా పరమశివుడు కాశ్యపునికి శిల్పశాస్త్రాన్ని ఉపదేశించాడని 'కాశ్యప శిల్పశాస్త్రం' చెబుతోంది. ఈ శిల్పశాస్త్రాలను కలిపి 'స్థాపత్యవేదం' అని అంటారు. ఆలయాల నిర్మాణం గురించి తెలిపిన ఆ భగవంతుడే ఆలయాలలోని అర్చనా విధానాలను, ఉత్సవ విధానాలను తెలిపే ఆగమశాస్త్రాలను అనుగ్రహించాడు. పరమేశ్వరునిద్వారా శివాగమాలు, మహావిష్ణువు ద్వారా వైష్ణవాగమాలు, శక్తినుంచి శాక్త్యాగమాల బోధన జరిగింది. ఈ స్థాపత్య వేదాన్ని అభ్యసించినవారినే 'స్థపతి' అంటారు.



నలుగురు ముఖ్యులు...

దేవాలయాలను శిల్ప శాస్త్ర ప్రకారంగా స్థపతి ద్వారా నిర్మించాలి. ప్రజలందరూ పూజించే దేవుని విగ్రహాలు, ఆలయాలతో పాటు గ్రామాలను, నగరాలను కోటలను... వీటన్నిటినీ నిర్మించడానికి విశ్వకర్మ జన్మించాడు. సృష్టి ప్రారంభం నుంచి నేటి దాకా ప్రతి నిర్మాణానికి విశ్వకర్మ ఆశీస్సులు ఉన్నాయి. ఇంద్రుని అమరావతి పట్టణం, శ్రీకృష్ణుని ద్వారకాపట్టణం లాంటివి ఎన్నో ఆయన సృష్టించాడు. ఆయనకు మను, మయ, త్వష్ట, శిల్పి, విశ్వజ్ఞ అనే అయిదుగురు కుమారులు ఉన్నారు. కమ్మరం (ఇనుప పని), వడ్రంగం, లోహపు పని (కంచరం), శిల్పం (శిలా విగ్రహాలు నిర్మించడం), స్వర్ణం (బంగారు ఆభరణాలు తయారు చేసే పని) అనే అయిదు పనులను వారికి ఆయన అప్పగించాడు. వారిలో నాలుగో కుమారుడైన శిల్పికి శిలావృత్తిని అప్పగించి... ప్రపంచంలో సుందరమైన ఆలయాలను, విగ్రహాలను నిర్మించడం ద్వారా ప్రజలను భక్తిభావం వైపు నడిపించాలని ఆదేశించాడు. ఈ శిల్పులలో నాలుగు రకాలైన వారు ఉన్నారు. వారు స్థపతి, వర్ధకి, తక్షకుడు, సూత్రగ్రాహి.

స్థపతి: స్థపతి అంటే 'స్థాపన చేయడంలో నేర్పరి ' అని అర్థం. అతను సర్వ శాస్త్ర విశారదుడిగా, వేదాధ్యాయన పరుడిగా ఉండాలని, అన్ని శిల్ప శాస్త్రాలను ఆపోశన పట్టి ఉండాలని, వాస్తు విద్యా సముద్రాన్ని ఆకళింపు చేసుకోవాలని శాస్త్రాలు చెబుతున్నాయి. అంతేకాకుండా అతను వాస్తు, జ్యోతిషం, తత్త్వశాస్త్రం, ఖగోళ శాస్త్రం తదితర 64 కళలలో ప్రవీణుడై ఉండాలని, తన వృత్తి పట్ల మిక్కిలి శ్రద్ధ కలిగి, శీలవంతుడై, ఇతరుల పట్ల ద్వేషభావం, అసూయ లేకుండా ధార్మిక బుద్ధి కలిగినవాడై ఉండాలని' విశ్వకర్మీయం' అనే ప్రాచీన శిల్ప శాస్త్ర గ్రంథం స్పష్టం చేసింది.

వర్ధకి: ఇతను స్థపతి కుమారుడు కానీ, శిష్యుడు కానీ అయి ఉండాలి. శాంతచిత్తుడై, యంత్రకళలో ప్రవీణుడై ఉండాలి. విగ్రహ నైపుణ్యాన్ని వృద్ధి చేసేవాడు కనుక 'వర్ధకి' అని పిలుస్తారు.

తక్షకుడు: ఇతను చెక్కడంలో నేర్పరి. స్థపతి చెప్పిన పనులను తు.చ. తప్పకుండా నెరవేర్చేవాడు. ఇతనికి రేఖాశాస్త్రంలో నేర్పు ఉండాలి.

సూత్రగ్రాహి: ఇతను సూత్రాలతో విగ్రహాల కొలతలు నిర్ణయించేవాడు. ఇతను కూడా స్థపతి ఆజ్ఞాబద్ధుడే. ఇతను గణితంలో ప్రవీణుడై ఉండాలి.

ఇలా నాలుగురకాలైన వీరిని 'విశ్వకర్మలు' అని పిలుస్తారని 'మయమతం' చెబుతోంది. వీరు లేకుండా దేవాలయ నిర్మాణం కానీ, మరే ఇతర పుణ్యకార్యం కానీ జరగదు.

● దగ్గుపాటి నాగవరప్రసాద్ స్థపతి
9440525788

సందేశం

ముందే మేలుకోవాలి

పూర్వం మక్కా పట్టణం దగ్గర ఒక చిన్న గ్రామంలో ఇబ్రహీం అనే యువకుడు వృద్ధురాలైన తన తల్లితో కలిసి ఉండేవాడు. చిన్నప్పుడే అతని తండ్రి మరణించాడు. తల్లి ఫాతిమా ఎంతో కష్టపడి అతణ్ణి పెంచింది. వయసు మీదపడ్డాక... ఆమె చూపు మందగించింది. శరీరం బలహీనమైపోయింది. ఇబ్రహీం రోజూ నమాజ్ చేసేవాడు, మంచి పనులు చేసేవాడు. కానీ తల్లి విషయంలో కొంత అసహనంగా ఉండేవాడు. ఆమె చెప్పినమాట సరిగ్గా వినేవాడు కాదు.

ఒకసారి ఇబ్రహీం తన స్నేహితుడితో మాట్లాడుతూ "నా తల్లి ఎప్పుడూ మంచంలోనే ఉంటుంది. నీరు కావాలని, పాలు కావాలని, అన్నం కావాలని... ఇలా ఏదో ఒకటి అడుగుతూనే ఉంటుంది. రాత్రంతా దగ్గుతుంది. దానివల్ల నాకు నిద్ర సరిగ్గా పట్టడం లేదు" అన్నాడు. అప్పుడు ఆ స్నేహితుడు 'తల్లి పాదాల కింద స్వర్గం ఉంది' అనే అంతిమ దైవప్రవక్త మహమ్మద్ ఉపదేశాన్ని గుర్తు చేస్తూ "నువ్వు ఎన్ని నమాజులు చేసినా, దివ్య ఖుర్ఆన్ ఎన్నిసార్లు పఠించినా, దానధర్మాలు చేసినా, ఉపవాసాలు పాటించినా, హజ్ యాత్ర చేసినా, ఉమ్రా యాత్ర చేసినా... అవన్నీ వృథా. కన్న తల్లిని సరిగ్గా పట్టించుకోని వ్యక్తిని చూసి అల్లాహ్ ముఖం తిప్పుకుంటాడు. అతనికి పరలోకంలో కఠినమైన శిక్ష సిద్ధంగా ఉంటుంది" అని హెచ్చరించాడు.



ఇబ్రహీం భయంతో వణికిపోయాడు. తల్లిపట్ల తన ప్రవర్తనకు సిగ్గుపడ్డాడు. తన తప్పును తెలుసుకున్నాడు. వెంటనే తల్లి దగ్గరకు వెళ్ళి, తనను క్షమించాలని కోరాడు. సంతోషంతో... అతని శ్రేయస్సుకోసం అల్లాహ్‌ను ఆమె ప్రార్థించింది. ఆ రాత్రి ఇబ్రహీంకు కలలో ఒక మత గురువు కనిపించి... "ఈ ఏడాదే నీ తల్లితో కలిసి హజ్ యాత్ర చెయ్యి" అని ఆదేశించాడు. ఆ ప్రకారం... తన భుజాలపై తల్లిని కూర్చోబెట్టుకొని... హజ్ యాత్రకు ఇబ్రహీం బయలుదేరాడు. దారంతా ఆమెకు సేవలు చేశాడు. ఆరాధనలు పూర్తి చేసి, ఆమెను మోసుకుంటూ ఇంటికి చేరుకున్నాడు.

మరునాడు తల్లికి పాలు అందించడానికి వెళ్ళిన ఇబ్రహీం ఆమెను తట్టి లేపాడు. కానీ అప్పటికే ఆమె ఇహలోకం వదిలి వెళ్ళిపోయింది. ఇబ్రహీం భోరున విలపించాడు. 'కొన్నాళ్ళ క్రితం వరకూ తను ఆమె పట్ల ప్రవర్తించిన తీరునే చివరి రోజుల్లో కూడా కొనసాగించి, ఆమెను హజ్ యాత్రకు తీసుకువెళ్ళకపోతే... ఎంతో పాపం మూటగట్టుకొనేవాడినో' అనుకున్నాడు. ఆఖరి రోజుల్లో ఆమెకు సంతృప్తి కలిగించాలనే జ్ఞానాన్ని ప్రసాదించినందుకు అల్లాహ్‌కు, తన స్నేహితుడికి కృతజ్ఞతలు తెలుపుకొన్నాడు.

"మానవుడు తన తల్లితండ్రుల హక్కును గుర్తించాలని స్వయంగా అతనికి నిర్దేశించాం. తల్లితండ్రులతో మంచిగా వ్యవహరించాలి. వారిద్దరూ లేదా వారిలో ఒకరు వృద్ధులై ఉంటే వారిని విసుక్కోవద్దు. వారితో మర్యాదగా మాట్లాడండి. మృదుత్వం, దయాభావం కలిగి ఉండండి, వారి ముందు వినమ్రులై ఉండండి" అని దివ్య ఖుర్ఆన్‌లో అల్లాహ్ స్పష్టం చేశాడు. కాబట్టి ఆలస్యం కాకముందే మేలుకోవాలి.

● మహమ్మద్ వహీదుద్దీన్

గీతాసారం


వ్యక్తావ్యక్తాలు



ప్రాథమిక విద్యను అభ్యసించే వారి నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదివేవారి వరకూ ఆత్మజ్ఞానం కోసం అధ్యయనం చేయాల్సిన శాశ్వతమైన పాఠ్యపుస్తకం... భగవద్గీత. దాన్ని మొదటిసారి చదివినప్పుడు చాలా తక్కువ అంశాలు అర్థమవుతాయి. కానీ 'వ్యక్తం', 'అవ్యక్తం' అనే దృష్టికోణం నుంచి సులభంగా అర్థం చేసుకోవచ్చు.

మన ఇంద్రియాల పరిధిలోకి వచ్చేవి వ్యక్తమైనవి, ఇంద్రియాలకు అతీతమైనవి అవ్యక్తమైనవి. 'బిగ్ బ్యాంగ్' (బృహత్ ప్రళయం) మొదలు నక్షత్రాల పుట్టుక, ఆ నక్షత్రాల్లోని కీలకమైన భాగాల్లో అత్యున్నత రసాయనిక మూలకాలు కలిగిన అణువుల నిర్మాణం, నక్షత్రాలు విచ్ఛిత్తికి గురైనప్పుడు ఆ మూలకాలు చెల్లాచెదురు అయ్యే తీరు, గ్రహమండలం ఏర్పాటు, భూమి మీద బౌద్ధిక జీవితం ఆరంభం లాంటి అనేక అంశాలను వ్యక్తమయ్యే వాటి కథలు వివరిస్తాయి. ఈ వ్యక్తమైన జీవరూపాలు, గ్రహాలు, నక్షత్రాలు, చివరకు ఈ విశ్వం కూడా ఒక నిర్దిష్టమైన కాలపరిమితిని కలిగి ఉన్నాయనేది శాస్త్రీయ సమాజం అంగీకరించిన సంగతే. అయితే అంచనా వేసిన కాల పరిమితుల్లో తేడా రావచ్చు. వ్యక్తమయ్యే వాటి దృక్కోణంలో మనం పుట్టినప్పటి నుంచి మరణించేవరకూ మనుగడ కలిగి ఉంటామనేది వాస్తవం.

అవ్యక్తమైన వాటి దృక్కోణంలో చూసినట్టయితే... భగవద్గీత చెప్పిన ప్రకారం,... మనం పుట్టుకకు ముందు, మరణం తరువాత కూడా మనుగడ కలిగి ఉంటాం. ఈ స్పష్టతను దృష్టిలో ఉంచుకున్నట్టయితే... 'భగవద్గీత'లో వివరించినట్టు మనం వ్యక్తం, అవ్యక్తాల అనుబంధాన్ని సులభంగా అర్థం చేసుకోగలుగుతాం. అవ్యక్తమైన లక్ష్యాన్ని (మోక్షాన్ని) గుర్తించి, దాన్ని పొందగలుగుతాం. కానీ అహంకారం ఈ మార్గంలో ప్రయాణానికి అవరోధంగా ఉంటుంది. అయితే బయటి ప్రపంచంలోని సుఖదుఃఖాలకు అతీతంగా, మనలో నిండి ఉన్న ఆనందమే.. అవ్యక్తమైన అంతరాత్మ వైపు సాగే ప్రయాణంలో మనం సాధించిన పురోగతికి సూచిక.



కె.శివప్రసాద్

రక్షకుడు వచ్చేశాడు!



మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా ఆయన నటిస్తున్న 'విశ్వంభర' చిత్రం గ్లింప్స్‌ను టీమ్ గురువారం విడుదల చేసింది. ఈ సినిమా విడుదల ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న అభిమానులకు క్లారిటీ ఇస్తూ వచ్చే ఏడాది వేసవికి ఈ సినిమా రిలీజ్ అవుతుందని ఈ సందర్భంగా మేకర్స్ స్పష్టం చేశారు. వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్న ఈ సోషియో ఫాంటసీ చిత్రాన్ని విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు.

' ఈ విశ్వంభరలో అసలు ఏం జరిగిందో చెబుతావా మురా' అని ఓ బాలుడి ప్రశ్నతో గ్లింప్స్ మొదలైంది. 'సంహారం.. దాని తాలుకు యుద్ధం. కొన ఊపిరితో ఒక సమూహం తాలుకు నమ్మకం.. అలసి పోని ఆశయానికి ఊపిరి పోసే వాడు వస్తాడు.. ఆగని యుద్ధాన్ని యుగాల పాటు పిడికిలి బిగించి చెప్పుకొనేలా ముగిస్తాడు..' లాంటి డైలాగ్స్‌తో ఆసక్తికరంగా గ్లింప్స్ సాగింది. ఇందులో రక్షకుడిగా చిరంజీవి ఎంట్రీ అదిరింది. ఇంతకుముందు విడుదల చేసిన గ్లింప్స్‌లో సీజీ వర్క్ క్వాలిటీ సరిగ్గా లేదని విమర్శలు రావడంతో ఈసారి జాగ్రత్త వహించి, అందరినీ ఆకట్టుకొనే విధంగా గ్లింప్స్ సిద్ధం చేసి టీమ్ వదిలింది. చిరంజీవి బర్త్ డే గిఫ్ట్ అదిరిపోయిందని అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఈ చిత్రంలో త్రిష కథానాయిక కాగా, ఆషికా రంగనాథ్, కునాల్ కపూర్ కీలక పాత్రధారులు. వచ్చే ఏడాది వేసవికి తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో 'విశ్వంభర' విడుదల కానుంది.

నవంబర్‌లో విడుదల



రామ్ కథానాయకుడిగా మహేశ్‌బాబు పి. దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'ఆంధ్రాకింగ్ తాలూకా'. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు ఆకట్టుకున్నాయి. మేకర్స్ గురువారం విడుదల తేదీని ప్రకటించారు. 'ఆంధ్రా కింగ్ తాలూకా' నవంబర్ 28న ప్రపంచవ్యాప్తంగా విడుదలవనుంది. ఈ సందర్భంగా విడుదల చేసిన రిలీజ్ డేట్ పోస్టర్‌లో రామ్ స్టైలిష్ లుక్‌లో ఆకట్టుకున్నారు. ఈ చిత్రంలో రామ్‌కు జోడీగా భాగ్యశ్రీ బోర్సే నటిస్తున్నారు. ఉపేంద్ర కీలకపాత్ర పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: వివేక్, మెర్విన్, సినిమాటోగ్రఫీ: సిద్ధార్థ నుని.

ఉత్కంఠకు తెర.. నేటి నుంచి మళ్లీ షూటింగ్స్!



రెండు వారాలకు పైగా కొనసాగుతున్న కార్మికుల సమ్మెకు గురువారం శుభం కార్డు పడింది. నేటి నుంచి షూటింగ్స్ పునఃప్రారంభం కానున్నాయి. 30 శాతం వేతన పెంపు డిమాండ్‌తో మొదలైన ఈ సమ్మె.. చివరికి 22.5 శాతం వేతన పెంపు అంగీకారంతో ముగిసింది. గురువారం కార్మిక భవనంలో అదనపు కమిషనర్ గంగాధర్ ఆధ్వర్యంలో నిర్మాతలు, ఫెడరేషన్ నాయకుల మధ్య సుదీర్ఘంగా చర్చలు జరిగాయి. ఈ సమావేశం తర్వాత దిల్ రాజు మాట్లాడుతూ "ఫెడరేషన్ నాయకులూ.. నిర్మాతలూ.. ఒకరి సమస్యలను ఒకరు అర్థం చేసుకోవడం శుభ పరిణామం. ఫెడరేషన్ వారు నిర్మాతలు కోరింది చేయడానికి ముందుకు వచ్చారు. నిర్మాతలు కూడా కార్మికులు అడిగింది ఇవ్వడానికి ముందడుగు వేశారు. ఈ విషయంలో చొరవ తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి ఫిల్మ్ ఇండస్ట్రీ తరపున కృతజ్ఞతలు. హైదరాబాద్‌ను ఫిల్మ్ హబ్‌గా చేయాలనేది ఆయన ఆశయం. ఆ దిశగా చిత్ర పరిశ్రమ ముందుకు వెళ్తుంది' అని అన్నారు. కార్మిక శాఖ అదనపు కమిషనర్ గంగాధర్ మాట్లాడుతూ "సమ్మె మొదలైన 18 రోజులకు నిర్మాతలు.. ఫెడరేషన్ నాయకుల మధ్య ఒప్పందం కుదిరింది. ఈ సమావేశంలో ప్రధానంగా నాలుగు డిమాండ్స్‌పై సుదీర్ఘ చర్చ సాగింది. చివరకు 22.5 శాతం వేతన పెంపునకు నిర్మాతలు అంగీకరించారు. రూ.రెండు వేల లోపు వేతనాలు తీసుకునే వారికి తొలి ఏడాది 15 శాతం, రెండో ఏడాది రెండున్నర శాతం, మూడో ఏడాది ఐదు శాతం పెంచేందుకు అంగీకారం తెలిపారు. 24 యూనియన్లలో 13 యూనియన్ల వర్కర్లు ఈ వేతనాల్లోకి వస్తారు. రూ.రెండు వేల నుంచి రూ.ఐదు వేలు తీసుకుంటున్న కార్మికులకు తొలి ఏడాది ఏడున్నర శాతం, రెండో ఏడాది 5 శాతం, మూడో ఏడాది 5 శాతం పెంచనున్నారు. ఐదు వేల దినసరి వేతనం దాటిన కార్మికులకు ఎలాంటి పెంపు లేదు. కార్మిక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్ పర్యవేక్షణలో ఒక కమిటీ వేస్తున్నాం. మిగిలిపోయిన చిన్న చిన్న సమస్యల పరిష్కారం కోసం ఈ కమిటీ పని చేస్తుంది. నెల రోజుల్లో నివేదిక ఇస్తుంది. నిర్మాతలు అడిగిన 9 టు 9 కాల్షీట్‌కు ఫెడరేషన్ అంగీకరించింది. ఆదివారం పని చేస్తే ఇచ్చే డబుల్ కాల్షీట్‌ను ఇకపై ఒకటిన్నర కాల్షీట్‌గా లెక్కించనున్నారు' అని తెలిపారు. ఫెడరేషన్ అధ్యక్షుడు వల్లభనేని అనిల్ మాట్లాడుతూ 'ఎప్పుడూ మాలో మేమే చర్చించుకుని సమ్మె ముగిస్తాం. ఈ సారి సమస్యను పరిష్కరించేందుకు చొరవ తీసుకున్న ప్రభుత్వం, కార్మిక శాఖకు కృతజ్ఞతలు' అని చెప్పారు.

చిరంజీవి హర్షం

సినీ కార్మికులు సమ్మె ముగించినందుకు చిరంజీవి హర్షం వ్యక్తం చేశారు. ఈ విషయంలో చొరవ చూపించిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఇలానే నిర్మాతలు, సినీ కార్మికులు కలసిమెలసి పనిచేయాలని ఆయన కోరారు.

అన్నయ్య "విశ్వంభరుడు"



తన అన్నయ్య చిరంజీవికి జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రేమపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన జారీ చేశారు. "ఆయన తమ్ముడిగా పుట్టడం ఒక అదృష్టమైతే ఆయన కష్టాన్ని చిన్నప్పటి నుంచి చూస్తూ పెరగడం ఒక గొప్ప అనుభవం. వెల కట్టలేని జీవిత పాఠం. ఒక సాదాసీదా కుటుంబం నుంచి వచ్చిన చిరంజీవి ఒక అసాధారణ వ్యక్తిగా విజయాలు సాధించి ఎల్లలు దాటి కీర్తిప్రతిష్ఠలు సాధించి, నాలాంటి ఎందరికో స్ఫూర్తి ప్రదాతగా నిలిచారు. చిరంజీవి కీర్తికి పొంగిపోలేదు, కువిమర్శలకు కుంగిపోనూ లేదు. విజయాన్ని వినమ్రతతోనూ, అపజయాన్ని సవాలుగా స్వీకరించే పట్టుదల ఆయన నుంచే నేను నేర్చుకున్నాను. అన్నింటిని భరించే శక్తి ఆయన నైజం. అందుకే ఆయన విశ్వంభరుడు అయ్యారు. పితృ సమానుడైన అన్నయ్యకు, మాతృ సమానురాలైన వదినకు ఆ భగవంతుడు సంపూర్ణ ఆయుష్షుతో కూడిన ఆరోగ్య సంపదను ప్రసాదించాలని మనసారా కోరుకుంటున్నాను. -అమరావతి (ఆంధ్రజ్యోతి)

కాలే కడుపుతో చేసేదే అసలైన యుద్ధం



విజయ రామరాజు టైటిల్ రోల్ పోషించిన స్పోర్ట్స్ డ్రామా 'అర్జున్ చక్రవర్తి'. విక్రాంత్ రుద్ర దర్శకత్వంలో శ్రీని గుబ్బల నిర్మించారు. ఈనెల 29న ప్రేక్షకుల ముందుకు రానుంది. గురువారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ని లాంచ్ చేసింది. ట్రైలర్ ఆద్యంతం ఆకట్టుకుంది. 'ఖాళీ చేతులతో...కాలే కడుపుతో చేసేదే అసలైన యుద్ధం' అనే డైలాగ్‌తో కథా నేపథ్యాన్ని ఆవిష్కరించిన తీరు ఆసక్తికరంగా ఉంది. ఈ సందర్భంగా హీరో విజయ రామరాజు మాట్లాడుతూ 'ఈ సినిమా కోసం ఎంతో కష్టపడ్డా. సిక్స్ ప్యాక్‌లో షూట్ చేసినప్పుడు రెండు రోజులపాటు ఏమీ తినలేదు. ఈ సినిమానే మమ్మల్ని ముందుకు తీసుకెళ్లింది. నా కెరీర్‌లో బెస్ట్ మూవీ చేశానని అనుకుంటున్నా' అని అన్నారు. దర్శకుడు విక్రాంత్ రుద్ర మాట్లాడుతూ 'అర్జున్ చక్రవర్తి' కేవలం సినిమానే కాదు. నా తొమ్మిది సంవత్సరాల కల. హీరో విజయ్ ఈ సినిమా కోసం ప్రాణం పెట్టి పనిచేశారు. చాలా రిస్కులు తీసుకున్నారు. అర్జున్ చక్రవర్తిగా కనిపించడానికి వంద శాతం ఎఫర్ట్ పెట్టాడు. కశ్మీర్‌లో గడ్డ కట్టే చలిలో షర్టు లేకుండా చిత్రీకరణలో పాల్గొన్నారు' అని చెప్పారు.

ఇలాంటి కథలు చాలా అరుదు

- అనుపమ పరమేశ్వరన్

"పరదా' చాలా కొత్త కథ. ఇలాంటి కథలు తెలుగు సినిమాలోనే కాదు భారతీయ చిత్రాల్లో చాలా అరుదు. ఇలాంటి ప్రాజెక్టు నా దగ్గరికి ఎప్పుడూ రాలేదు' అని అన్నారు కథానాయిక అనుపమ పరమేశ్వరన్. ఆమె ప్రధాన పాత్రలో ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వంలో తెరకెక్కిన సినిమా 'పరదా' ఈ శుక్రవారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఆమె మీడియాతో చిత్ర విశేషాలు పంచుకున్నారు.



- డైరెక్టర్ ప్రవీణ్ నాకు కథ చెప్పినప్పుడు పరదాలోనే నా క్యారెక్టర్ ఎక్కువగా కనిపించింది. ఈ పాత్రను ఒక ఛాలెంజింగ్‌గా తీసుకొని నటించాను. ఇందులో సన్నివేశాలు నిశ్శబ్దంగా ఉండొచ్చు. కానీ నా పాత్రలో భావోద్వేగం ఉంటుంది. ప్రీమియర్స్ చూసిన చాలా మంది ప్రేక్షకులు నేను కేవలం కళ్లతోనే కాదు, బాడీ లాంగ్వేజ్, వాయిస్‌తో కూడా నటించగలను అని చెప్తుంటే చాలా ఆనందంగా అనిపించింది.
- ఈ కథకి నేను చాలా కనెక్ట్ అయ్యాను. ఇందులోని భావోద్వేగాలను ఒక అమ్మాయి మాత్రమే అర్థం చేసుకోగలదు. చాలా నిజాయితీగా తీసిన సినిమా ఇది. కచ్చితంగా ప్రేక్షకులు పాత్రలతో మమేకం అవుతారు.
- ప్రేక్షకులను ఆలోచింపజేసే చిత్రమిది. మా మంచి ప్రయత్నాన్ని గుర్తిస్తారనే నమ్మకం ఉంది. సినిమా చూస్తున్నప్పుడు ప్రేక్షకులు ఒక్క క్షణం ఆలోచించగలిగినా అది మా విజయంగా భావిస్తాం.
- సినిమాలో ఆత్మాహుతి సన్నివేశం ఉంటుంది. ఆ సందర్భంలో వచ్చే సంగీతం నన్ను కదిలించింది. కారులో కూర్చొని నాలో నేనే ఏడ్చేశాను. గోపీ సుందర్ అద్భుతమైన సంగీతం ఇచ్చారు. ఇందులో ప్రతీ పాట అర్థవంతంగానే ఉంటుంది.

సందేశాత్మకంగా నేనెవరు?




రాజేంద్ర ప్రసాద్ ప్రధాన పాత్రధారిగా తెరకెక్కిన చిత్రం 'నేనెవరు?'. చిరంజీవి తన్నీరు దర్శకత్వంలో అండేకర్ జగదీశ్ బాబు, భూలక్ష్మి నిర్మించారు. అభిలాష్, సాయిచెర్రీ హీరోలుగా పరిచయమవుతున్నారు. బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో నిర్మాతల మండలి అధ్యక్షుడు కే.ఎల్ దామోదర్ ప్రసాద్ టైటిల్ లోగోను ఆవిష్కరించారు. నూతన నటీనటులతో సరికొత్త తరహాలో రూపొందించిన వినోదాత్మక చిత్రమిదని దర్శకుడు చెప్పారు. సమకాలీన సమాజంలో చర్చనీయాంశంగా మారిన ఓ ముఖ్యమైన పాయింట్‌ను తీసుకొని ఈ సినిమా చేస్తున్నామని నిర్మాతలు తెలిపారు. సంగీతం: చిన్ని కృష్ణ. సినిమాటోగ్రఫీ: నాయుడు ప్రసాద్ కొల్లి.

'జానీ ఎల్ఎల్‌బీ 3' మేకర్స్‌కు కోర్టు సమన్లు



'జానీ ఎల్ఎల్‌బీ 3' చిత్రం మేకర్స్, నటులు అక్షయ్‌కుమార్, అర్షద్ వర్సీలకు పూణే కోర్టు సమన్లు పంపింది. ఇటీవలె విడుదలైన ఈ సినిమా ట్రైలర్ న్యాయ వ్యవస్థతో పాటూ జడ్జీలను, లాయర్లను కించపరిచేలా ఉందని కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు న్యాయవాది వాజిద్ ఖాన్. ఈ విషయంపై అక్టోబరు 28లోపు వివరణ ఇవ్వాలని చిత్ర దర్శకుడు సుభాశ్ కపూర్‌కు, నటులు అక్షయ్‌కుమార్, అర్షద్ వర్సీకి ఈ నెల 18న సమన్లు పంపింది. కాగా, 'జాలీ ఎల్ఎల్‌బీ 2'కు కొనసాగింపుగా తెరకెక్కించిన ఈ చిత్రం సెప్టెంబరులో విడుదలకానుంది.



తెరపై మరో ప్రేమ కథ



పవన్ కేసరి, కావ్య కల్యాణ్ రామ్ జంటగా నటిస్తోన్న కొత్త సినిమా పూజా కార్యక్రమాలతో గురువారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సినిమాను కుంచం శంకర్ దర్శకత్వంలో టీడీఆర్ సినిమాస్ బేనర్‌పై తలారి దినకరణ్ రెడ్డి నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి రామ్ అబ్బరాజు క్లాప్ కొట్టగా, ప్రశాంత్ కుమార్ దిమ్మల కెమెరా స్విచ్చాన్ చేసి గౌరవ దర్శకత్వం వహించారు. ఈ చిత్రానికి విజయ్ బుల్గానిన్ సంగీతాన్ని అందించనుండగా, కెమెరామెన్‌గా సాయి వ్యవహరించనున్నారు. ప్రేమ కథగా తెరకెక్కనున్న ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్‌ని త్వరలోనే ప్రారంభిస్తామని చిత్రబృందం పేర్కొంది.

అనుబంధాలను ఆవిష్కరించే చిత్రం



నేటి సామాజిక పరిస్థితులకు అద్దం పట్టే కథతో తెరకెక్కుతోన్న చిత్రం 'బ్యాడ్ గాళ్స్'. మున్నా ధులిపూడి దర్శకత్వంలో శశిధర్ నల్లా నిర్మిస్తున్నారు. 'ఇలా చూసుకుంటానే' అంటూ సాగే గీతాన్ని చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. చంద్రబోస్ సాహిత్యం అందించగా, అనూప్ రూబెన్స్ స్వరాలు సమకూర్చారు. సిద్ శ్రీరామ్ ఆలపించారు. ఈ సందర్భంగా మున్నా మాట్లాడుతూ 'ఇదొక కొత్తదనమున్న కథతో తెరకెక్కుతోన్న ప్రేమకథా చిత్రం. సహజత్వానికి దగ్గరగా ఉంటుంది. అనుబంధాలు, ఆప్యాయతల కలబోతగా సాగుతుంది' అని చెప్పారు.

'ఆత్మకథ' ఆరంభం



జెమినీ సురేశ్, అఖిల నాయర్ జంటగా 'ఆత్మకథ' అనే సినిమా గురువారం ప్రారంభమైంది. శ్రీనివాస్ గుండ్రెడ్డి దర్శకత్వంలో వారాహి ఎంటర్‌టైన్‌మెంట్ బేనర్‌పై సోమేశ్వరరావు నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి జెమిని సురేశ్ తల్లి జెమిని సుబ్బలక్ష్మీ క్లాప్ కొట్టారు. ఈ సందర్భంగా జెమిని సురేశ్ మాట్లాడుతూ 'ఈ చిత్రానికి మా అమ్మ క్లాప్ కొట్టడం చాలా సంతోషంగా ఉంది' అని అన్నారు. చిత్ర దర్శకుడు శ్రీనివాస్ గుండ్రెడ్డి మాట్లాడుతూ 'కథనే హీరో అనుకొని 'ఆత్మకథ' అనే చిత్రాన్ని రచించాను' అని చెప్పారు.

మెగా అభిమానులను అలరించేలా



సురేశ్ కొండేటి ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'వీరాభిమాని'. రాంబాబు దోమకొండ దర్శకత్వంలో ఎస్కే రహ్మాన్, కే. సాంబశివరావు నిర్మించారు. నేడు ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో సురేశ్ కొండేటి మాట్లాడుతూ 'చిరంజీవి అభిమాని పాత్ర పోషించాను. తన అభిమాన హీరో కోసం కథానాయకుడు ఎలాంటి సాహసాలు చేశాడనేది మెగాస్టార్ అభిమానులను ఆకట్టుకుంటుంది' అని అన్నారు. చిరంజీవి గారి పుట్టిన రోజు సందర్భంగా 70 థియేటర్లలో 'వీరాభిమాని' చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శిస్తున్నాం అని దర్శకుడు తెలిపారు.





ఆరోగ్య శాఖలో
మళ్లీ కొలువుల జాతర
1,623 స్పెషలిస్టు డాక్టర్ల భర్తీకి నేడు నోటిఫికేషన్

హైదరాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖలో మరోసారి కొలువుల జాతర జరగబోతోంది. ఏకంగా 1,623 స్పెషలిస్టు డాక్టర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం అంతా సిద్ధం చేసింది. వైద్యుల భర్తీ ప్రక్రియలో ఇది రాష్ట్ర చరిత్ర లోనే అతి పెద్దదని వైద్య వర్గాలు తెలిపాయి. ఈ మేరకు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ గురువారం వైద్య ఆరోగ్య సేవల రిక్రూట్‌మెంట్ బోర్డును ఆదేశించారు. బోర్డు శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేయనుంది. ఈ నియామకాలు పూర్తయితే జిల్లా, ఏరియా ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో పల్లెలకు ప్రత్యేక వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి. ఇటీవలే 8 వేల వివిధ రకాల పోస్టులను భర్తీ చేశారు. మరో 7 వేల పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది.

నీటి పారుదల గౌరవ సలహాదారుగా లెఫ్టినెంట్ జనరల్ హర్పాల్ సింగ్



హైదరాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): నీటిపారుదల శాఖ గౌరవ సలహాదారుడిగా లెఫ్టినెంట్ జనరల్ హర్పాల్‌సింగ్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దేశ సరిహద్దు రహదారుల సంస్థ డైరెక్టర్ జనరల్‌గానూ, భారతసైన్యంలో ఇంజనీరింగ్ విభాగంలో ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ)గా కీలక భూమిక పోషించిన ఆయన... పదవీ విరమణ తర్వాత వేతనం, పారితోషికం తీసుకోకుండా రెండేళ్లపాటు తెలంగాణకు సేవలందించనున్నారు. ఈ మేరకు సీఎస్ కె.రామకృష్ణారావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. టన్నెల్ నిర్మాణంలో అపార అనుభవం ఉన్న ఆయన సేవలను శ్రీశైలం ఎడమ కాలువ (ఎస్ఎల్‌బీసీ) టన్నెల్ నిర్మాణంలో వినియోగించుకోనున్నారు. సాంకేతిక పరిజ్ఞానం భద్రతకు ఈ నియామకం దోహదపడుతుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

అమెరికాలో స్థిరపడేందుకు
ఈబీ-5 వీసా దోహదం
భారతీయ పెట్టుబడిదారులకు ఇదో సువర్ణావకాశం
అమెరికా ఇమ్మిగ్రేషన్ అటార్నీ నాదదూర్ కుమార్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): అమెరికాలో పారిశ్రామికంగా స్థిరపడాలనుకునే వారికి ఈబీ-5 వీసా దోహదపడుతుందని, ఇది భారతీయ పెట్టుబడిదారులకు సువర్ణావకాశం కల్పిస్తోందని ఆ దేశ ఇమ్మిగ్రేషన్ అటార్నీ నాదదూర్ కుమార్ పేర్కొన్నారు. హైదరాబాద్‌లో గురువారం ఆయన ఈబీ-5 వీసాపై మీడియాతో మాట్లాడారు. పెట్టుబడులకు 'వైట్ పాస్‌పోర్ట్' (రీ-ఎంట్రీ పర్మిట్) లభిస్తుందని, తద్వారా రెండేళ్లపాటు (పరిమితిని పొడిగించుకోవచ్చు) అమెరికాలో ఉండవచ్చన్నారు. భారతీయులు ఈబీ-5 వీసా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అమెరికా ఇమ్మిగ్రేషన్ చట్టం ప్రకారం.. ప్రతి దేశానికి 7% కంటే ఎక్కువ గ్రీన్ కార్డులు ఇవ్వరని, భారత్ నుంచి ఇప్పటికే ఎఫ్-1, హెచ్-1బీ, ఈబీ-5కి డిమాండ్ ఉండడంతో భవిష్యత్తులో మరింత వెయిటింగ్ పెరిగే అవకాశం ఉన్నందున ఈబీ-5ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గతంలో ఈబీ-5కు ప్రాధాన్యం ఉండేది కాదని, ఇటీవల రియల్ ఎస్టేట్ ఆధారిత సంపద పెరగడంతో అనేక మంది భారతీయులు పెట్టుబడి పెట్టగలుగుతున్నారన్నారు. ప్రస్తుతం వివిధ వీసా విభాగాల్లో భారతీయులు ఎక్కువ కాలం వేచి ఉండాల్సిన పరిస్థితి ఉందని, డిమాండ్ కోటా సంఖ్యను మించి ఉండడంతోనే ఈ పరిస్థితి నెలకొందన్నారు. ఈబీ-5 కింద కనీస పెట్టుబడి రూ.6-7 కోట్లు ఉందని, అమెరికాలోని కార్మికులకు ఉపాధి కల్పించేందుకు తాము పెట్టుబడి పెడుతున్నట్లు ప్రకటిస్తే అక్కడి పౌరసత్వం సులువుగా లభిస్తోందని చెప్పారు. తద్వారా భర్త, భార్యతోపాటు 20 ఏళ్లలోపు పిల్లలు అమెరికా వెళ్లవచ్చన్నారు. అలాగే అక్కడి నుంచి ఎలాంటి ఆంక్షలు లేకుండా ఎప్పుడైనా రాకపోకలు సాగించవచ్చని, జీవితాంతం అక్కడ స్థిరపడవచ్చన్నారు. దేశవ్యాప్తంగా ఈబీ-5 వీసాపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు.

ఈ-గరుడ బస్సుల్లో 26% రాయితీ

హైదరాబాద్-విజయవాడ మార్గంలో ప్రయాణికులకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఆర్టీసీ) బంపర్ ఆఫర్ ప్రకటించింది. ఈ మార్గంలో ఈ-గరుడ బస్సుల్లో ప్రయాణించే వారికి టిక్కెట్ ధరపై 26% రాయితీ ప్రకటించింది. ఈ-గరుడ బస్సులు కాలుష్య రహితమైనవని, పర్యావరణహితమైనవని, 100% సౌకర్యవంతంగా ప్రయాణించవచ్చని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈ మార్గంలో ఆర్టీసీ 10 ఈ-గరుడ బస్సుల్ని నడుపుతోంది.

తనఖా బంగారంతో చెక్కేశాడు
చెన్నూరు ఎస్‌బీఐలో క్యాషియర్ చేతివాటం!
నాలుగు కిలోల బంగారం, కోటి నగదు మాయం
క్యాషియర్ రవీందర్‌పై
ఆరోపణలు, కొనసాగుతున్న దర్యాప్తు

చెన్నూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంక్-2లో ఓ క్యాషియర్ చేతివాటం ప్రదర్శించాడనే వార్తలు దుమారం రేపుతున్నాయి. ఆన్‌లైన్ బెట్టింగ్ ఆడే అలవాటున్న సదరు క్యాషియర్.. ఖాతాదారులకు చెందిన 4 కిలోల బంగారం, రూ.కోటి వరకు నగదు మాయం చేసి పరారయ్యాడని ప్రచారం జరుగుతోంది. బ్యాంకు లావాదేవీలపై ఆడిటింగ్ నిర్వహిస్తున్న బ్యాంకు ఉన్నతాధికారులు.. ఈ ఘటనపై పోలీసులకూ ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంలో రవీందర్ అనే క్యాషియర్‌పై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గోల్డ్ లోన్ బంగారంతోపాటు నగదు నిల్వల్లో తేడాలను గమనించిన సదరు బ్యాంకు శాఖ మేనేజర్ మనోహర్‌రెడ్డి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో శుక్రవారం ఎస్‌బీఐ బ్యాంక్-2కు చేరుకున్న బ్యాంకు ఉన్నతాధికారులు ఆడిటింగ్ ప్రారంభించారు. సుమారు 330 మంది గోల్డ్‌లోన్ ఖాతాదారులకు చెందిన దాదాపు 4 కిలోల బంగారం, డిపాజిట్లకు సంబంధించిన రూ.కోటి వరకు నగదు తేడా ఉన్నట్టు ప్రాథమికంగా తేలడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝా, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు బ్యాంకుకు చేరుకుని విచారణ ప్రారంభించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న క్యాషియర్ రవీందర్ స్వస్థలం జైపూర్ మండలంలోని శెట్‌పల్లి కాగా రెండ్రోజులుగా అతను విధులకు హాజరు కావడం లేదు. అతని సెల్‌ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ వస్తుండడంతో రవీందర్‌పై అనుమానాలు అధికమవుతున్నాయి. రవీందర్ ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్‌లకు పాల్పడతాడని ప్రాథమిక విచారణలో తేలింది. కాగా, బ్యాంకులో జరుగుతున్న ఆడిటింగ్ శుక్రవారానికి పూర్తవుతుందని, ఆ తర్వాతే పూర్తి వివరాలు వెల్లడిస్తామని సీపీ అంబర్ కిశోర్ ఝా విలేకరులకు వెల్లడించారు.

కాళేశ్వరం కమిషన్
నివేదిక పరిస్థితి ఏంటి?
అసెంబ్లీలో పెట్టిన తర్వాత చర్యలు తీసుకుంటారా?.. చర్యలు తీసుకున్న తర్వాత అసెంబ్లీలో పెడతారా?

- నివేదికపై ఏంచేశారన్నదీ తెలియాలి కదా?
- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ప్రశ్న

హైదరాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదిక పరిస్థితి ఏంటని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. "నివేదికను అసెంబ్లీలో పెట్టడానికి ముందే చర్యలు తీసుకుంటారా? అసెంబ్లీలో చర్చించిన తర్వాత తీసుకుంటారా? కమిషన్ నివేదికపై ఏంచేశారన్న వివరాలు కూడా ఉండాలి కదా? వాటిని కూడా అసెంబ్లీలో పెడతారా? కమిషన్ నివేదిక ఇచ్చిన 6 నెలల్లో చర్యలు తీసుకోవాలని చట్టంలో ఉంది" అని పేర్కొంది. తమకు అత్యవసరం ఉందని.. మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని పిటిషనర్లు పేర్కొంటున్న నేపథ్యంలో ఈ సమాచారం తమకు కీలకమని చీఫ్‌జస్టిస్ ఏకే సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం వ్యాఖ్యానించింది. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి సమాధానమిస్తూ.. తన వద్ద సమాచారం లేదని, శుక్రవారం తెలియజేస్తానన్నారు.

కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారు..

కాళేశ్వరం ప్రాజెక్టులో అక్రమాలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను కొట్టేయాలని విజ్ఞప్తి చేస్తూ మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు దాఖలు చేసిన రెండు వేర్వేరు పిటిషన్లపై చీఫ్ జస్టిస్ ఏకే సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. కేసీఆర్, హరీశ్ తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు ఆర్యమ సుందరం, దామ శేషాద్రినాయుడు వాదనలు వినిపించారు. "కాళేశ్వరం కమిషన్ నివేదికను అడ్డంపెట్టుకుని మా ప్రతిష్ఠను దెబ్బతీసేలా వ్యతిరేక ప్రచారం చేయాలని చూస్తున్నారు. నివేదిక కాపీ మాకు ఇవ్వకుండానే దానిపై సీఎం, మంత్రులు మీడియా సమావేశం నిర్వహించడంతోపాటు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. నివేదికను అదేరోజు మీడియా మొత్తానికి ఇచ్చేశారు. పత్రికల్లో పూర్తివివరాలు బహిర్గతమవడంతోపాటు దాదాపు 100 వెబ్‌సైట్లలో సమాచారం ఉంది. మేం కూడా ప్రభుత్వ వెబ్‌సైట్ నుంచే డౌన్‌లోడ్ చేసుకున్నాం. ప్రత్యేక రాష్ట్రం కోసం నా ప్రాణాలు పణంగా పెట్టాను. రాజకీయ నేతలకు పేరు ప్రఖ్యాతులు, కీర్తి ప్రతిష్ఠలు ముఖ్యం. వాటిపై దాడి చేసి, చెడుగా చిత్రీకరించేలా కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పుడు కూడా నివేదికను అసెంబ్లీలో పెట్టి, విమర్శలు చేయాలనేది ప్రభుత్వ ఉద్దేశం. ఒక వ్యక్తి ప్రతిష్ఠ దెబ్బతినే విధంగా నివేదిక ఇవ్వాల్సి వస్తే కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ యాక్ట్ సెక్షన్ 8బీ, 8సీ ప్రకారం నోటీసులిచ్చి.. సదరు వ్యక్తికి వాదనలు వినిపించుకునే అవకాశమివ్వడంతోపాటు సాక్షులను క్రాస్‌ఎగ్జామినేషన్ చేసే అవకాశమివ్వాలి. ప్రస్తుత కేసులో మమ్మల్ని సాక్షులుగా పిలిచి.. పూర్తి బాధ్యత మాదే అన్నట్లు నివేదిక ఇచ్చారు. కమిషన్ నివేదికలో మాకు వ్యతిరేకంగా ఉన్న విషయాలకు.. మమ్మల్ని అడిగిన వాటికి పొంతనే లేదు. ఎవరో ఇచ్చిన తప్పుడు సాక్ష్యాలకు మా వాదన వినకుండా మమ్మల్ని ఎలా బాధ్యులను చేస్తారు? అలాంటి నివేదిక న్యాయసమీక్షకు నిలవదు. ఇందుకు సుప్రీంకోర్టు ఇచ్చిన 'లాల్‌కృష్ణ అడ్వాణీ', 'కిరణ్‌బేడీ', ఇదే హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన 'విజయభాస్కర్‌రెడ్డి' తీర్పులే ఉదాహరణ. ఆ నివేదికను కొట్టేయకపోతే మాకు తీవ్ర నష్టం జరుగుతుంది. నివేదికను అసెంబ్లీలో పెట్టకముందే మధ్యంతర ఉత్తర్వులివ్వాలి" అని పేర్కొన్నారు.



పిటిషనర్లకు ఇచ్చింది 8బీ నోటీసులే

రాష్ట్ర ప్రభుత్వం, కాళేశ్వరం కమిషన్ తరఫున ఏజీ సుదర్శన్‌రెడ్డి, సీనియర్ న్యాయవాది నిరంజన్‌రెడ్డి వాదనలు కొనసాగించారు. "కాళేశ్వరం కమిషన్ ఇచ్చిన నివేదికకు మంత్రిమండలి ఆమోదముద్ర వేసింది. నివేదికను అసెంబ్లీ ముందుంచి, దానిపై పూర్తిస్థాయిలో చర్చించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అప్పటివరకు కమిషన్ నివేదికను బయటపెట్టబోం. కమిషన్ నివేదిక 650 పేజీలు ఉన్నందున.. క్యాబినెట్‌కు సహాయం చేయడానికి ముగ్గురు అధికారులతో కమిటీ వేసి, దానిపై 60 పేజీల సంక్షిప్త నివేదిక తయారు చేశారు. అంతేతప్ప కమిషన్ నివేదికను బయటపెట్టలేదు. నివేదిక కాపీ ఇవ్వలేదని ఆరోపిస్తున్న పిటిషనర్లు ఇద్దరూ ఎమ్మెల్యేలే. వారిద్దరూ అసెంబ్లీకి వచ్చి పూర్తిస్థాయిలో చర్చించవచ్చు. పిటిషనర్లకు ఇచ్చింది సమన్లు కాదు. కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ యాక్ట్ సెక్షన్ 8బీ నోటీసులే. అది కేసీఆర్, హరీశ్‌కూ స్పష్టంగా తెలుసు. అందుకే అన్ని పత్రాలు అడిగారు. ఏయే పత్రాలు రికార్డుల్లోకి తీసుకోవాలో చెప్పారు. వారు పేర్కొన్న గత తీర్పులు ప్రస్తుత సందర్భానికి వర్తించవు. కమిషన్ నివేదిక అడ్వైజరీ లక్షణం కలిగి ఉండి మార్గదర్శనం చేస్తుంది. దాని ఆధారంగా నిర్ణయాలు తీసుకుంటారే తప్ప ఇప్పటికిప్పుడు ఏదో అవుతుందని తొందర అవసరం లేదు" అని తెలిపారు.

నివేదిక ఎక్కడి నుంచి వచ్చింది?

వాదనల సందర్భంగా నివేదికలోని వివరాలు ఎక్కడి నుంచి వచ్చాయని కోర్టు ప్రశ్నించింది. పిటిషనర్ల న్యాయవాదులు సమాధానమిస్తూ.. ఈనెల 4న సర్కారు మీడియా సమావేశం నిర్వహించి, విలేకరులకు నివేదిక ఇచ్చిందని తెలిపారు. తాము కూడా ప్రభుత్వ వెబ్‌సైట్ నుంచే డౌన్‌లోడ్ చేసుకున్నామని, కావాలంటే ఆన్‌లైన్‌లో చూడవచ్చన్నారు. ఏజీ వాదిస్తూ.. నివేదికను బయటపెట్టలేదని, అవి అధికారులు తయారుచేసిన సమ్మరీ అని పేర్కొన్నారు. నివేదికను నేరుగా అసెంబ్లీకి సమర్పిస్తామన్నారు. మరోవైపు పిటిషనర్లు సమర్పించిన కాపీల్లో స్పష్టత లేదని, కొన్ని పేజీలు కనిపించడం లేదని కోర్టు అసహనం వ్యక్తం చేసింది. స్పష్టంగా ఉండేలా కాపీలు ఇవ్వాలని ఆదేశిస్తూ.. విచారణను శుక్రవారానికి వాయిదావేసింది.

40 ఏళ్ల అజ్ఞాతం వీడి.. లొంగిపోయిన కాకరాల సునీత
అగ్రనేతలకు సేవలందించిన హరీశ్ కూడా..
ఇద్దరికీ చెక్కులు అందించిన రాచకొండ సీపీ

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): నాలుగు దశాబ్దాల అజ్ఞాతాన్ని వీడి.. జనజీవన స్రవంతిలో కలిసిన మావోయిస్టులు కాకరాల సునీత, చెన్నూరి హరీశ్‌లకు రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్‌బాబు గురువారం చెక్కులను అందజేశారు. సునీతకు రూ.20 లక్షలు, హరీశ్‌కు రూ.4 లక్షల చెక్కులను ఇచ్చిన సీపీ.. వీరికి ఇందిరమ్మ ఇళ్లను ఇప్పించేందుకు కృషిచేస్తానన్నారు. ఇప్పటివరకు తెలంగాణ పోలీసుల ఎదుట 387 మంది నక్సలైట్లు లొంగిపోయారని గుర్తుచేశారు. మావోయిజం సిద్ధాంతానికి కాలం చెల్లిందని వ్యాఖ్యానించారు. గురువారం విలేకరుల సమావేశంలో సీపీ పలు అంశాలపై మాట్లాడారు. "మావోయిస్టు అగ్రనేత, ఎన్‌కౌంటర్‌లో మరణించిన సుధాకర్ జీవిత సహచరిణి సునీత. అప్పట్లో సరైన ఆదాయ వనరుల్లేక చాలా మంది నక్సలిజం వైపు ఆకర్షితులయ్యారు. ఇప్పుడు పరిస్థితులు మారాయి. కొంతకాలంగా నక్సల్స్ రిక్రూట్‌మెంట్లు నిలిచిపోయాయి. ఒకవేళ యువత అటువైపు ఆకర్షితులైనా.. భావజాలం నచ్చక తిరిగి వస్తున్నారు" అని సీపీ వ్యాఖ్యానించారు. సునీత సోదరి మాదవి ఇంకా మావోయిస్టు పార్టీలోనే ఉన్నారని చెప్పారు.

ఇదీ సునీత నేపథ్యం..

సునీత అసలు పేరు గురుస్మృతి. ఆమె తండ్రి కాకరాల సత్యనారాయణ విప్లవ రచయితల సంఘం(విరసం) సభ్యుడు. 200కు పైగా సినిమాల్లో నటించారు. సునీత 1985లో ఇంటర్ చదువుతూనే.. ర్యాడికల్ విద్యార్థి సంఘం(ఆర్ఎస్‌యూ)లో చేరారు. 1986లో పీపుల్స్ వార్ గ్రూప్(పీడబ్ల్యూజీ)లో చేరి, అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. అదే ఏడాది టీఎల్ఎన్ చలం అలియాస్ గౌతమ్‌ను పెళ్లిచేసుకున్నారు. సునీత విజయవాడ సెంట్రల్ ఆర్గనైజర్‌గా.. ఆ తర్వాత గుంటూరు సెంట్రల్ ఆర్గనైజర్‌గా, ఆపై నల్లమల డివిజన్ కమిటీ, అనంతరం ఏవోబీలో చలంతో కలిసి పనిచేశారు. జూన్ 5న అన్నపురం ఎన్‌కౌంటర్‌లో టీఎల్ఎన్ చలం మరణించారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

రాజ్యాంగ సంస్థలను నీరుగార్చిన బీజేపీ

- అధికారాన్ని కేంద్రీకృతం చేసే యత్నాలు
- తెలంగాణలో కాంగ్రెస్‌తో పొత్తు ఉన్నా సర్కారు ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలి
- సీపీఐ 4వ రాష్ట్ర మహాసభలో కె.నారాయణ

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ/గాజులరామారం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రధాని కార్యాలయం ఏది చెబితే.. రాష్ట్రపతి భవన్ అది చేసే స్థాయికి పరిస్థితి దిగజారిందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ అన్నారు. స్వయం ప్రతిపత్తిగల రాజ్యాంగబద్ధ సంస్థలను బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసి అధికారాన్ని కేంద్రీకృతం చేసేందుకు యత్నిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మేడ్చల్ జిల్లా గాజులరామారంలో నిర్వహిస్తున్న సీపీఐ రాష్ట్ర నాలుగో మహాసభ రెండో రోజు గురువారం నారాయణ ప్రసంగించారు. సీబీఐ, ఈడీ, నీతి ఆయోగ్, న్యాయ వ్యవస్థలను బీజేపీ ప్రభుత్వం స్వతంత్రంగా పనిచేయనివ్వడం లేదని మండిపడ్డారు. 30 రోజులు జైల్లో ఉన్న చట్టసభల సభ్యుల పదవులను రద్దు చేసేందుకు బీజేపీ చట్టం తేవాలనుకుంటే.. రెండేళ్లు జైల్లో ఉన్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పదవినే తొలుత రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వెనుకబడిన తరగతులకు 42 శాతం రిజర్వేషన్ల కోసం సాగుతున్న బీసీల పోరాటానికి సీపీఐ మద్దతు ఉంటుందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్‌తో సీపీఐకి పొత్తు ఉన్నప్పటికీ రేవంత్ సర్కారు అవలంబించే ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. సమాజంలో పెద్ద సంఖ్యలో ఉన్న ట్రాన్స్‌జెండర్లకు కూడా కమ్యూనిస్టు పార్టీలో సభ్యత్వం కల్పించాలని, వారి సమస్యలపై దృష్టి సారించాలని సూచించారు. సమావేశంలో సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతో పాటు జాతీయ, రాష్ట్ర స్థాయి నేతలు పాల్గొన్నారు.

పరిహారమా నువ్వురాక చావునిచ్చావా!
సిద్దిపేట కలెక్టరేట్‌లో గుండెపోటుతో బడుగు రైతు మృతి
మల్లన్నసాగర్ అదనపు కాల్వలో 2.22 ఎకరాల ముంపు
దీనికి సంబంధించి రావాల్సిన పరిహారం రూ.42 లక్షలు

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రాజెక్టు కాల్వలో ముంపునకు గురైన భూమికి ప్రతిగా నష్టపరిహారం కోసం అధికారుల చుట్టూ రెండేళ్లుగా తిరుగుతున్న ఆ రైతు గుండె అలిసిపోయిందేమో! అధికారులను కలిసేందుకు వచ్చి.. ఎదురు చూస్తూ కలెక్టర్ కార్యాలయం సాక్షిగా కుప్పకూలి మృతిచెందాడు. మల్లన్నసాగర్ అదనపు కాల్వ నిర్మాణంలో భూమి కోల్పోయిన, సిద్దిపేట రూరల్ వెంకటాపూర్ గ్రామానికి చెందిన గుండాల బాలకిట్టు (57) అనే రైతు విషాదాంతమిది. బాలకిట్టుకు చెందిన 2.22 ఎకరాల సాగుభూమి కాల్వ నిర్మాణంలో పోయింది. అతడికి.. పొలం, బోరు, బావి, చెట్లు తదితరాలకు నష్టపరిహారంగా రూ.42 లక్షల వరకు రావాల్సి ఉందని తెలుస్తోంది. ఇందుకు అతడు కార్యాలయాల చుట్టూ రెండేళ్లుగా తిరుగుతూనే ఉన్నాడు. బాలకిట్టు భార్య 6నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందింది. అతడికి కుమారుడు, కూతురు ఉన్నారు. పరిహారం కోసం అధికారులను కలిసేందుకు బాలకిట్టు గురువారం ఉదయం సిద్దిపేట కలెక్టర్ కార్యాలయానికి వచ్చాడు. అక్కడ సంబంధిత అధికారులు సమయం ఇవ్వకపోవడంతో సాయంత్రం వరకు అక్కడే నిల్చున్నాడు. చివరికి ఆ ఆవరణలోనే గుండెపోటుతో మృతిచెందాడు. ఈ విషయమై అధికారులను సంప్రదించగా.. బాలకిట్టు ఉదయం 11 గంటలకు కార్యాలయానికి వచ్చాడని, అప్పటికి అధికారులు ఆయా మండలాల పర్యటనకు వెళ్లారని.. తిరిగి సాయంత్రం 4:30 గంటలకు తిరిగొచ్చేసరికి చనిపోయాడని చెప్పారు. పరిహారం తాలూకు చెక్కు పరిశీలనలో ఉందన్నారు. పరిహారం రావడం లేదన్న దిగులుతోనే బాలకిట్టు మృతిచెందాడని, అతడి కుటుంబానికి వెంటనే పరిహారం తాలూకు చెక్కును అందజేయాలని కుటుంబసభ్యులు, బంధువులు డిమాండ్ చేశారు.

హైటెక్ ట్రాఫిక్ పోలీస్!

- బండి దిగకుండానే.. ఉల్లంఘనలను రికార్డు చేసి చలానాలు వేయనున్న పోలీసులు
- హైదరాబాద్‌లో వినూత్న ప్రయోగం
- అత్యాధునిక సౌకర్యాలున్న 50 ట్రాఫిక్ వాహనాలను ప్రారంభించిన నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్



వాహనంలోని అత్యాధునిక పరికరాల గురించి వివరిస్తున్న జాయింట్ సీపీ జోయల్ డేవిస్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ రూల్స్‌ను పట్టించుకోకుండా రోడ్ల మీద ఇష్టారాజ్యంగా వాహనాలు నడుపుతూ.. నిబంధనలను యదేచ్ఛగా ఉల్లంఘించే ఆకతాయిలకు అడ్డుకట్ట వేసే ప్రత్యేక కార్యక్రమానికి సిటీ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ శ్రీకారం చుట్టారు. ట్రాఫిక్ పోలీసులు బండి మీద నుంచి కిందకి దిగకుండానే.. ట్రాఫిక్ ఉల్లంఘనలను నేరుగా రికార్డు చేసి, చలానాలు విధించేందుకు వీలుగా సెక్యూరిటీ కౌన్సిల్-సిటీ పోలీస్ సంయుక్త భాగస్వామ్యంతో 50 ట్రాఫిక్ గస్తీ వాహనాలను (అవెంజర్ క్రూయిజ్ 220) రంగంలోకి దింపారు. బంజారాహిల్స్‌లోని ఐసీసీసీ (ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్)లో గురువారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ వాహనాలను సీపీ సీవీ ఆనంద్ జెండావూపి ప్రారంభించారు. రాబోయే రోజుల్లో.. ట్రాఫిక్‌ను ఉల్లంఘించిన వాహనాలను ఏఐను వినియోగించి గుర్తించడంతో పాటు.. ఆ వాహనంపై ఉన్న పెండింగ్ చలానాలు చూపిస్తూ.. ఆటోమేటిగ్గా కొత్త చలానా జనరేట్ అయ్యే విధంగా టెక్నాలజీ వినియోగించనున్నట్లు సీపీ వెల్లడించారు. అలాగే.. పెండింగ్ చలానాలు ఎక్కువగా ఉన్న వాహనాలను గుర్తించి, వాటిని నడిపేవారిని తరచూ ఉల్లంఘనలకు పాల్పడేవారిగా గుర్తించి.. చలానాలు వసూలు చేస్తామని ఆయన చెప్పారు. ట్రాఫిక్ ఉల్లంఘనలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక శిక్షణ ఇచ్చిన 50 మంది ట్రాఫిక్ పోలీసులకు ఆ వాహనాలను కేటాయించారు. ఆ వాహనాలతోపాటు.. ట్రాఫిక్ కానిస్టేబుళ్ల దుస్తులకు కూడా అత్యంత అధునాతన సాంకేతిక పరికరాలను అమర్చారు. అవేంటంటే..

పీఏ సిస్టమ్.. బాడీవోన్ కెమెరా

ఈ మైక్రో ఫోన్‌ను కానిస్టేబుల్ కాలర్‌కు అమర్చుతారు. పెట్రోలింగ్ చేస్తున్న క్రమంలో ఎక్కడైనా రాంగ్ పార్కింగ్ వాహనాలు కనిపించినా, రోడ్డుకు అడ్డంగా ఏదైనా వాహనం ఆగినా, ఎవరైనా ట్రాఫిక్ జామ్‌కు కారణమవుతున్నట్లు అనిపించినా.. ట్రాఫిక్ పోలీస్ తన వాహనానికి అమర్చిన పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్ ద్వారా ఆ వాహనాన్ని తొలగించాల్సిందిగా ఆదేశిస్తాడు. పోలీసులు చెప్పిన వెంటనే వాహనదారుడు తన వాహనాన్ని అక్కడి నుంచి తరలించాల్సి ఉంటుంది. కొన్ని సందర్భాల్లో విధుల్లో ఉన్న ట్రాఫిక్ పోలీసుల పట్ల కొంతమంది పోకిరీలు, ఆకతాయిలు దురుసుగా ప్రవర్తిస్తుంటారు. అలాంటి సందర్భాల్లో కానిస్టేబుల్ డ్రస్‌కు అమర్చిన బాడీవోన్ కెమెరా.. ఎదుటి వ్యక్తి మాట్లాడే అన్ని విషయాలనూ క్యాప్చర్ చేస్తుంది. వీడియో రికార్డు చేస్తుంది. దీని ఆధారంగా పోలీస్ స్టేషన్‌లో కంప్లైంట్ ఫైల్ చేస్తారు. బాడీవోన్ కెమెరాలో రికార్డయిన వీడియోలను సాక్ష్యంగా చూపించి నిందితులను కోర్టుబోనులో నిలబెడతారు.

యూహెచ్ఎఫ్ హ్యాండ్‌హెల్డ్ సెట్..

రోడ్డుపై పెట్రోలింగ్ చేస్తున్న క్రమంలో ఎక్కడైనా ఎక్కువగా ట్రాఫిక్ జామ్ అయినా, ఇతర ట్రాఫిక్ ఇబ్బందులున్నా.. కానిస్టేబుల్స్ తమ వద్ద ఉన్న యూహెచ్ఎఫ్ హ్యాండ్ హెల్డ్ సెట్ ద్వారా ఆ వివరాలను ట్రాఫిక్ కంట్రోల్ రూమ్‌కు తెలుపుతారు. దీంతో ఆ పరిధిలోని ట్రాఫిక్ సిబ్బంది, అధికారులు అప్రమత్తమై సమస్య పరిష్కారానికి కృషిచేస్తారు. ఇక ఎక్కడైనా ట్రాఫిక్ జామ్ అయినప్పుడు.. సిగ్నల్స్ లేని ప్రాంతంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరిస్తున్నప్పుడు ఎల్ఈడీ బ్యాటన్‌ను రెడ్, గ్రీన్ సిగ్నల్స్ ఇవ్వడానికి చూపుతారు.

డ్యాష్‌బోర్డు కెమెరా.. వీల్‌క్లాంప్

డ్యాష్‌బోర్డు కెమెరాను ట్రాఫిక్ పోలీస్ భుజానికి అమర్చుతారు. వాహనదారులు ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడినా, రాంగ్‌రూట్లో వస్తున్నా ఈ కెమెరా ఆ వాహనాలను క్యాప్చర్ చేస్తుంది. ఆ వాహనాలకు వెంటనే చలానా వేస్తారు.. ట్రాఫిక్ పెట్రోలింగ్ వాహనాలు సిటీలో ఎక్కడెక్కడ తిరుగుతున్నాయి.. సిబ్బంది పనితీరు ఎలా ఉంది తెలుసుకోవడానికి, వాహనాల పర్యవేక్షణకు జీపీఎస్ సిస్టంను వాహనానికి అమర్చినట్లు సీపీ తెలిపారు. ఇటు రోడ్డుమీద ఎక్కడైనా వాహనం అనధికారికంగా పార్కింగ్ చేస్తే ఆ వాహనానికి వీల్‌క్లాంప్ వేసి ట్రాఫిక్ క్రేన్ వాహనంలో తరలిస్తారు.

ప్రథమచికిత్స కిట్.. రెయిన్ కోట్లు, బూట్లు

ట్రాఫిక్ పెట్రోలింగ్ వాహనంలో ప్రథమ చికిత్స కిట్‌ను అధికారులు ఏర్పాటు చేశారు. రోడ్డుపై ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు అందుబాటులో ఉన్న పెట్రోలింగ్ వాహనం ఘటనా స్థలానికి చేరుకుంటుంది. క్షతగాత్రులకు ఈ కిట్‌తో ప్రాథమిక చికిత్స చేసి ఆసుపత్రికి తరలిస్తారు. అలాగే వాన వచ్చినప్పుడు ట్రాఫిక్ సిబ్బంది ధరించడానికి రెయిన్ కోట్లు, బూట్లు, ఇతర పరికరాలను వాహనంలో సిద్ధంగా ఉంచుతారు. వర్షం మొదలవుతుందని తెలియగానే వాటర్ లాగింగ్, ట్రాఫిక్ జామ్ అయ్యే ప్రాంతాలకు వెళ్లిపోతారు. ఇక ట్యాబ్ ద్వారా పెండింగ్ చలానాలు చెక్ చేసి చలానాలు కట్టించడం, కొత్త చలానాలు వేయడం వంటి విధులను నిర్వహిస్తారు.

శాంతిస్తున్న ఉగ్ర గోదావరి

- భద్రాచలం వద్ద 51.9 నుంచి 51.4 అడుగులకు తగ్గిన నీటిమట్టం
- కొనసాగుతున్న 2వ ప్రమాద హెచ్చరిక
- తెలంగాణ-ఏపీ సరిహద్దులో రాయని పేట వద్ద రహదారిపైకి వరద

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

ఎగువన కురిసిన భారీ వర్షాలు, వస్తున్న వరదతో ఉగ్రరూపం దాల్చిన గోదావరి క్రమంగా తగ్గుముఖం పడుతోంది. గురువారం రాత్రి 8 గంటలకు భద్రాచలం వద్ద నీటిమట్టం 51.9 అడుగులు ఉండగా వరద ప్రవాహం 13.66 లక్షల క్యూసెక్కులుగా నమోదైంది. రాత్రి 11 గంటలకు నీటిమట్టం తగ్గుముఖం పట్టి 51.4 అడుగులకు చేరింది. బుధవారం అర్ధరాత్రి 12 గంటలకు 48.6 అడుగులు ఉండగా గురువారం తెల్లవారుజామున 3 గంటలకు 49.5 అడుగులకు పెరిగింది. ఉదయం 6 గంటలకు 50.3, 9 గంటలకు 50.9, మధ్యాహ్నం 12 గంటలకు 51.4, 3 గంటలకు 51.9 అడుగులకు చేరింది. 5 గంటల పాటు అదేస్థాయిలో నిలకడగా కొనసాగింది. రాత్రి 9 గంటలకు 51.7, 10 గంటలకు 51.5, 11 గంటలకు 51.4 అడుగులకు తగ్గింది. శుక్రవారం తెల్లవారుజాముకల్లా ఈ ప్రవాహం మరింత తగ్గే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. వివిధ ప్రాజెక్టులకు వరద ప్రవాహం కొనసాగుతోంది. గురువారం దుమ్ముగూడెం (సీతమ్మసాగర్)కు 13.23 లక్షల క్యూసెక్కుల వరద వచ్చి చేరింది. సమ్మక్క సాగర్ (తుపాకులగూడెం) బ్యారేజీకి 8.26 లక్షలు, మేడిగడ్డకు 7.40 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. వచ్చింది వచ్చినట్లే దిగువకు వదిలిపెట్టారు. గోదావరి ఉధృతితో తెలంగాణ-ఏపీ సరిహద్దులోని అల్లూరి జిల్లా యటపాక మండలం రాయనిపేట వద్ద జాతీయ రహదారిపై వరద నీరు వచ్చి చేరింది. ముందు జాగ్రత్తగా వాహనాల రాకపోకలను నిలిపివేశారు. భద్రాచలం-చర్ల మార్గంలో కూడా రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గోదావరి ఉగ్రరూపంతో ఏపీలోని ఏలూరు జిల్లా వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో 29 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ రెండు మండలాల్లో లోతట్టు ప్రాంతాలు, రహదారులపైకి వరద చేరుకోవడంతో బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. శబరి నది ఉధృతి కారణంగా వేలేరుపాడు మండలంలోకి వరద అంతకంతకు పెరుగుతూనే ఉంది. భద్రాచలం నుంచి దిగువకు 13.60 లక్షల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తుండటంతో వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లోని గ్రామాలను వరద చుట్టుముట్టింది. కుక్కునూరు మండలంలో 1,222 కుటుంబాలు, వేలేరుపాడు మండలంలో 2,468 కుటుంబాలు ముంపు బారిన పడ్డాయి.

కృష్ణా నదికి పెరుగుతున్న వరద

కర్ణాటకలో కురుస్తున్న వర్షాలతో కృష్ణా, భీమా, తుంగభద్ర నదులకు వరద పెరుగుతోంది. గురువారం శ్రీశైలం ప్రాజెక్టుకు 5.40 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు అధికారులు పది గేట్లు ఎత్తి 4.20 లక్షల క్యూసెక్కులను నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు 4.32 లక్షల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. 26 క్రస్ట్ గేట్ల నుంచి 3.81 లక్షల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. జల విద్యుత్ కేంద్రాల్లో జోరుగా ఉత్పత్తి జరుగుతోంది.

హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో..
100 మంది ట్రాఫిక్ మార్షల్స్
రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణే వారి పని
శిక్షణ ఇచ్చి విధుల్లోకి తీసుకున్న సిటీ పోలీసులు
సీఎస్ఆర్‌లో భాగంగా సంస్థల నుంచి జీతం..
వినూత్న ప్రయోగానికి సీపీ సీవీ ఆనంద్ శ్రీకారం.. త్వరలో వీరి సంఖ్య 500కు పెంచుతామని వెల్లడి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వాహనాల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు 100 మంది ట్రాఫిక్ మార్షల్స్‌ను.. నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ రంగంలోకి దింపారు. సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బిలిటీ) పాలసీలో భాగంగా ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యంతో ఒక సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. ట్రాఫిక్ విధులు, వాహనాల క్రమబద్ధీకరణపై శిక్షణ పొందిన ఆ మార్షల్స్‌కు.. ట్రాఫిక్ పోలీస్ హోంగార్డులు ధరించే యూనిఫాంనే కేటాయించినట్లు సీపీ తెలిపారు. వారికి రూ.20 వేలు జీతంగా నిర్ణయించామని.. కార్పొరేట్ సంస్థలే వారికి ఆ జీతాన్ని చెల్లిస్తాయని ఆయన పేర్కొన్నారు. మార్షల్స్ అందరూ ట్రాఫిక్ ఎస్‌హెచ్‌వో పర్యవేక్షణ, సూచనలకు లోబడి పనిచేయాల్సి ఉంటుందని.. తమకు అప్పగించిన విధులు మాత్రమే నిర్వర్తించాలని.. పోలీస్ డిపార్ట్‌మెంట్ విధుల్లో జోక్యం చేసుకోరాదని స్పష్టం చేశారు. అపోలో హాస్పిటల్స్, యశోద హాస్పిటల్స్, ఎంజే స్కూల్, నిలోఫర్ కేఫ్, సిద్ధార్థ జువెలర్స్, ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్, షా గౌస్ కేఫ్, మహవీర్ ఎస్టేట్స్ వంటి సంస్థల నుండి ఈ కార్యక్రమానికి బలమైన మద్దతు లభించిందన్నారు. మరిన్ని సంస్థలు ముందుకొచ్చి ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో భాగస్వాములు కావాలని కోరారు. తద్వారా ట్రాఫిక్ మార్షల్స్ సంఖ్య 500 వరకు పెంచే అవకాశం ఉందని పేర్కొన్నారు.

ప్రీ-ఐపీఓ ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్

- ప్రవేశపెట్టే ఆలోచనలో సెబీ
- ఐపీఓ షేర్ల కేటాయింపు, లిస్టింగ్‌కు మధ్య 3 రోజుల్లో ట్రేడింగ్‌కు చాన్స్
- గ్రే మార్కెట్ కార్యకలాపాలకు చెక్



ముంబై: కంపెనీల పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) ప్రక్రియల్లో అనధికారిక లేదా అనియంత్రిత (గ్రే మార్కెట్) కార్యకలాపాలకు చెక్ పెట్టేందుకు క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రీ-ఐపీఓ షేర్ ట్రేడింగ్ కోసం నియంత్రిత ప్లాట్‌ఫామ్‌ను ప్రవేశపెట్టే ఆలోచనలో ఉన్నట్లు సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే సంకేతాలిచ్చారు. ఫిక్కీ ఆధ్వర్యంలో గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. ఐపీఓ షేర్ల కేటాయింపు, లిస్టింగ్‌కు మధ్య మూడు రోజుల సమయంలో నియంత్రిత వాతావరణంలో కంపెనీ షేర్లలో ట్రేడింగ్ నెరిపేందుకు ఈ కొత్త ప్లాట్‌ఫామ్ వీలు కల్పించనుంది. ప్రస్తుతం ఈ మూడు రోజుల సమయంలో జరిగే గ్రే మార్కెట్ లావాదేవీలను కొత్త వేదిక భర్తీ చేయనుంది.

"ఏదైనా కంపెనీ స్టాక్ మార్కెట్లో షేర్లను నమోదు చేసే ముందు వెల్లడించిన సమాచారం ఆ కంపెనీలో పెట్టుబడులపై నిర్ణయం తీసుకునేందుకు సరిపోదు. క్యాపిటల్ మార్కెట్‌ను మరింత విస్తృతం చేయడంతో పాటు ఇన్వెస్టర్ల ప్రయోజనాలను రక్షించేందుకు ప్రీ-ఐపీఓ షేర్ ట్రేడింగ్‌కు నియంత్రిత వేదికను పైలట్ పద్ధతిన ప్రవేశపెట్టాలనుకుంటున్నాం. ప్రీ-ఐపీఓ కంపెనీలు నిర్దేశిత సమాచారం వెల్లడించడం ద్వారా ఈ ప్లాట్‌ఫామ్‌లో షేర్ల ట్రేడింగ్ అవకాశాన్ని ఎంచుకోవచ్చ"ని పాండే అన్నారు. ఈ ప్లాట్‌ఫామ్ అందుబాటులోకి వస్తే అనియంత్రిత వేదికలపై అన్ లిస్టెడ్ షేర్ల ట్రేడింగ్‌కు అడ్డుకట్ట పడనుందన్నారు. ప్రస్తుతం ఏదైనా కంపెనీ ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ గడువు ముగిసిన తర్వాత స్టాక్ ఎక్స్ఛేంజీల్లో షేర్ల నమోదుకు కనీసం 3 రోజులు పడుతుంది. ఈ సమయంలో గ్రే మార్కెట్‌లో ఆ కంపెనీ షేర్ల అనధికారిక ట్రేడింగ్ జరుగుతోంది. ఇందులో నష్ట అవకాశాలున్నప్పటికీ, ఇన్వెస్టర్లు ప్రీ-లిస్టింగ్ షేర్లను చేజిక్కించుకునేందుకు ఎగబడుతున్న నేపథ్యంలో సెబీ ఇందుకోసం నియంత్రిత వేదికను అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తోంది.

ఈక్విటీ డెరివేటివ్‌ల గడువు పెంపు

ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్ అండ్ ఓ) ట్రేడింగ్‌లో చిన్న మదుపరుల పాత్రను తగ్గించేందుకు సెబీ మరో చర్య చేపట్టబోతోంది. హెడ్జింగ్ అవసరాలకు, దీర్ఘకాలిక పెట్టుబడుల రక్షణకు మాత్రమే ఉపయోగపడేలా ఈక్విటీ డెరివేటివ్ కాంట్రాక్టుల కాలపరిమితిని క్రమపద్ధతిలో పెంచాలనుకుంటున్నట్లు సెబీ చైర్మన్ పాండే ఫిక్కీ సదస్సులో తెలిపారు. "దీర్ఘకాలిక సాధనాల ద్వారా డెరివేటివ్‌ల నాణ్యతను పెంచుతూనే క్యాష్ ఈక్విటీ మార్కెట్‌ను మరింత విస్తృతం చేసేందుకు సెబీ మార్గాలను అన్వేషిస్తోంది. డెరివేటివ్ సాధనాల గడువు పెంపుపై మార్కెట్ సంబంధిత వర్గాలతో సంప్రదింపులు జరపనున్న"ట్లు పాండే చెప్పారు.

కార్వీ ఇన్వెస్టర్ల క్లెయిమ్‌లకు డిసెంబరు వరకు గడువు

ముంబై: కార్వీ స్టాక్ బ్రోకింగ్ లిమిటెడ్ (కేఎస్‌బీఎల్) చేతుల్లో మోసపోయిన ఇన్వెస్టర్లు తమ సొమ్మును క్లెయిమ్ చేసుకునేందుకు గడువును డిసెంబరు 31 వరకు పొడిగిస్తున్నట్లు మార్కెట్ల నియంత్రణ మండలి సెబీ గురువారం తెలిపింది. గతంలో ప్రకటించిన గడువు ఈ జూన్ 2 తోనే ముగిసింది. 2020 నవంబరు 23న నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ కార్వీని డిఫాల్టర్‌గా ప్రకటించింది. సొమ్ము క్లెయిమ్ చేసుకునేందుకు ఇన్వెస్టర్లు 1800 266 0050 టోల్‌ఫ్రీ నంబరుకు కాల్ చేయడం లేదా defaultisc@nse.co.in కు మెయిల్ చేయడం ద్వారా ఎన్ఎస్ఈని సంప్రదించవచ్చని పేర్కొంది. ఇన్వెస్టర్ల నిధులను దుర్వినియోగం చేసినందుకు గాను కేఎస్‌బీఎల్ చైర్మన్, ఎండీ పార్థసారథిని సెక్యూరిటీస్ మార్కెట్ నుంచి 7 ఏళ్ల పాటు నిషేధించడంతో పాటు ఆయనపై రూ.21 కోట్ల జరిమానా విధిస్తూ సెబీ 2023 ఏప్రిల్‌లో ఆదేశాలు జారీ చేసింది.

'బీఎఫ్ఎస్ఐ'లో కొలువుల జోరు

2030 నాటికి అదనంగా 2.5 లక్షల ఉద్యోగాలు

ముంబై: ప్రస్తుతం ఐటీ రంగం అంత ఆకర్షణీయంగా లేకపోయినా బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా (బీఎఫ్ఎస్ఐ) కంపెనీల్లో మాత్రం నియామకాలు జోరందుకున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలలతో పోలిస్తే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లో ఈ కంపెనీల నియామకాలు 27 శాతం పెరిగాయి. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరంలో ఈ కంపెనీల్లో నియామకాలు 8.7 శాతం పెరగనున్నాయని నియామకాల సేవలందించే అడెకో ఇండియా గురువారం విడుదల చేసిన ఒక నివేదికలో ఈ విషయం వెల్లడించింది. 2030 నాటికి ఈ కంపెనీల్లో నియామకాలు 10 శాతం చొప్పున పెరిగి కొత్తగా 2.5 లక్షల మందికి పర్మినెంట్ ఉద్యోగాలు కల్పిస్తాయని పేర్కొంది.

నివేదిక ముఖ్యాంశాలు

- మెట్రో నగరాలతో పోలిస్తే ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లోనే ఎక్కువ కొలువులు
- డిజిటల్, కంప్లయెన్స్ విధుల్లో అధికంగా ఉద్యోగాలు
- స్థానిక భాషల్లో ప్రావీణ్యత, క్షేత్రస్థాయి అమ్మకాల్లో అనుభవం ఉన్న వారికి 15 శాతం వరకు అదనపు జీతాలు
- సంప్రదాయ ఆస్తుల నుంచి మార్కెట్ ఆధారిత యూలిప్స్, మ్యూచువల్ ఫండ్స్, పెన్షన్ ఫండ్ల వైపు మళ్లుతున్న మదుపరులు
- రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్‌లు, డిజిటల్ ప్రొడక్ట్ మేనేజర్లు, క్రెడిట్ రిస్క్ అనలిస్టులకు పెరుగుతున్న గిరాకీ
- ఫైనాన్షియల్ ప్లానర్లు, ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్లు, క్లెయిమ్స్ ఆటోమేషన్ స్పెషలిస్టుల కోసం చూస్తున్న వెల్త్, ఇన్సూరెన్స్ కంపెనీలు
- నైపుణ్యాల అభివృద్ధితో బీమా కంపెనీల్లో 30 శాతం పెరిగిన క్లెయిమ్స్ సెటిల్‌మెంట్

లారస్ ల్యాబ్స్ పునర్ వ్యవస్థీకరణ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): లారస్ లేబొరేటరీస్ తన వ్యాపారాలను పునర్‌వ్యవస్థీకరిస్తోంది. ఇందులో భాగంగా అనుబంధ సంస్థ లారస్ సింథసిస్ కంపెనీకి చెందిన ఒక యూనిట్‌ను మరో అనుబంధ సంస్థ శ్రియమ్ ల్యాబ్స్‌లో, మిగతా యూనిట్లను లారస్ ల్యాబ్స్‌లో విలీనం చేయాలని నిర్ణయించింది. దీనికి సంబంధించిన తీర్మానానికి గురువారం జరిగిన భేటీలో లారస్ ల్యాబ్స్ బోర్డు ఆమోదం తెలిపింది. ఎన్‌సీఎల్‌టీ ఆమోదానికి లోబడి వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి ఈ పునర్ వ్యవస్థీకరణ అమల్లోకి వస్తుందని తెలిపింది.

రక్షణ రంగంలోకి బొండాడ ఇంజనీరింగ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): బొండాడ ఇంజనీరింగ్ లిమిటెడ్ (బీఈఎల్) రక్షణ రంగ విభాగంలోకి ప్రవేశించింది. బొండాడ డైనమిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ప్రత్యేకంగా అనుబంధ సంస్థను ఏర్పాటు చేసింది. దేశ వ్యూహాత్మక రక్షణ రంగంలో ఉన్న అద్భుత వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఈ సంస్థ తోడ్పడుతుందని బీఈఎల్ సీఎండీ బొండాడ రాఘవేంద్ర రావు తెలిపారు.

సరసమైన ధరల్లో క్యాన్సర్ బీమా

పార్లమెంటరీ ప్యానెల్ సిఫారసు

న్యూఢిల్లీ: ప్రభుత్వ నియంత్రిత ఆరోగ్య బీమా పథకాలు మరింత ఎక్కువ మందికి ప్రయోజనం చేకూర్చేందుకు వీలుగా వాటిలో ప్రామాణిక ధరలతో క్యాన్సర్ డయాగ్నోస్టిక్ ప్యాకేజీలు ప్రవేశపెట్టాలని పార్లమెంటరీ ప్యానెల్ ప్రభుత్వానికి సిఫారసు చేసింది. జాతీయ ఫార్మాస్యూటికల్ ధరల సంస్థ (ఎన్‌పీపీఏ) కింద 42 అత్యవసర క్యాన్సర్ ఔషధాలకు అందిస్తున్న 30% వాణిజ్య మార్జిన్ పరిమితిని క్యాన్సర్ వ్యాక్సిన్లు, ఇమ్యునోథెరపీ, ఓరల్ కీమో థెరపీలకు వర్తింప చేయాలని సూచించింది.

మళ్లీ 82,000పైకి సెన్సెక్స్

ఆరో రోజూ లాభాల్లోనే సూచీలు

ముంబై: స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వరుసగా ఆరో రోజూ లాభాల్లో పయనించాయి. గురువారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ ఒక దశలో 373.33 పాయింట్లు ఎగబాకి 82,231.17 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి సూచీ 142.87 పాయింట్ల లాభంతో 82,000.71 వద్ద ముగిసింది. నిఫ్టీ 33.20 పాయింట్ల వృద్ధితో 25,083.75 వద్ద స్థిరపడింది. మార్కెట్ దిగ్గజాలైన రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లలో కొనుగోళ్లు ఇందుకు దోహదపడ్డాయి. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 13 రాణించాయి. బజాజ్ ఫిన్‌సర్వ్, ఐసీఐసీఐ స్టాక్స్ ఒక శాతానికి పైగా లాభపడ్డాయి. బజాజ్ ఫైనాన్స్, రిలయన్స్ 0.90 శాతం వరకు పెరిగాయి.

జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ రూ.5,000 కోట్ల సమీకరణ: సెక్యూరిటీల జారీ ద్వారా ఒకేసారి లేదా పలు విడతల్లో రూ.5,000 కోట్ల వరకు సమీకరించే ప్రతిపాదనకు జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ బోర్డు ఆమోదం తెలిపింది. అలాగే, ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలోని 50.5 ఎకరాల స్థలంలో కార్గో సిటీ ప్రాజెక్టును అభివృద్ధి చేసేందుకు కంపెనీకి పూర్తి అనుబంధ విభాగంగా ఒక స్పెషల్ పర్పస్ వెహికిల్ (ఎస్‌పీవీ)ను ఏర్పాటు చేసేందుకూ బోర్డు అంగీకరించింది.

- అన్ని వాతావరణ పరిస్థితుల్లోనూ అన్ని రకాల రోడ్లపై నడిచే టీఎక్స్ రేంజి వాహనాల తయారీ కోసం అమెరికాకు చెందిన టామ్‌కార్ కంపెనీతో జేఎస్‌డబ్ల్యూ సార్ట్‌లో మోటార్స్ జాయింట్ వెంచర్ ఏర్పాటు చేసింది. అరిజోనాకు చెందిన టామ్‌కార్ ఎలాంటి రోడ్లపై అయినా తిరిగే అధిక సామర్థ్యం గల వాహనాలు తయారుచేస్తుంది.
- ఎలక్ట్రానిక్స్ దిగ్గజం శాంసంగ్ అనుబంధ సంస్థ హర్మన్‌కు చెందిన డిజిటల్ పరివర్తన సొల్యూషన్ల (డీటీఎస్) విభాగంలో 100% వాటాల కొనుగోలుకు ఐటీ దిగ్గజం విప్రో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ డీల్ విలువ 37.5 కోట్ల డాలర్లు (రూ.3,270 కోట్లు).

అపోలో హాస్పిటల్స్‌లో బల్క్ డీల్

రూ.1,395 కోట్ల విలువైన షేర్లు విక్రయించనున్న ఎండీ సునీతా రెడ్డి

ముంబై: అపోలో హాస్పిటల్స్ ప్రమోటర్, ఎండీ సునీతా రెడ్డి కంపెనీలో 1.25 శాతం వరకు వాటాను శుక్రవారం బ్లాక్ డీల్స్ ద్వారా విక్రయించనున్నట్లు తెలిసింది. షేరు కనీస ధరను రూ.7,747గా నిర్ణయించినట్టు సమాచారం. బీఎస్ఈలో గురువారం అపోలో హాస్పిటల్స్ షేరు ముగింపు ధర రూ.7,920తో పోలిస్తే 2 శాతం తక్కువిది. కాగా ఈ వాటా విక్రయం ద్వారా రూ.1,395 కోట్ల వరకు సమకూరే అవకాశం ఉంది. ప్రస్తుతం సునీతా రెడ్డికి అపోలో హాస్పిటల్స్‌లో 3.36 శాతం వాటా ఉంది.

అవగాహనా లోపమే బీమాకు సమస్య

ఐఏసీ-లైఫ్ కో చైర్‌పర్సన్ వెంకటాచలం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దేశంలో జీవిత బీమా విస్తరణకు ప్రజల అవగాహనా లోపం పెద్ద సమస్యగా మారిందని ఇన్సూరెన్స్ అవేర్‌నెస్ కమిటీ (ఐఏసీ-లైఫ్) కో చైర్‌పర్సన్ వెంకటాచలం అన్నారు. ఇప్పటికీ మన జనాభాలో 83 శాతం మందికి సరైన బీమా రక్షణ లేని విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుంటే బీమా కంపెనీలకు 17 లక్షల కోట్ల డాలర్ల (సుమారు రూ.1,483.25 లక్షల కోట్లు) విలువైన అదనపు వ్యాపార అవకాశం ఏర్పడుతుందన్నారు. ప్రస్తుతం జీవిత బీమా తీసుకుంటున్న వారిలోనూ ఎక్కువ మంది సేవింగ్స్, చైల్డ్ పాలసీలపై ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారే తప్ప, రిటైర్మెంట్ పాలసీలపై పెద్దగా ఆసక్తి చూపడం లేదన్నారు. తెలంగాణలో మాత్రం ఇప్పుడిప్పుడే రిటైర్మెంట్ పాలసీలపై ఆసక్తి పెరుగుతోందన్నారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

22 తేదీ			
హైదరాబాద్	495	విజయవాడ	525
వరంగల్	497	గోదావరి	520
చిత్తూరు	553	విశాఖపట్నం	520
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	97	విజయవాడ	114
వరంగల్	97	గుంటూరు	111
కరీంనగర్	97	ఒంగోలు	111
మహబూబ్‌నగర్	97	చిత్తూరు	85
కర్నూలు	97	నెల్లూరు	90
విశాఖపట్నం	110	అనంతపురం	90
గోదావరి	114		

'వెగోవీ' పేటెంట్‌పై నోవో నార్డిస్క్ మౌనం

న్యాయస్థానం ఆదేశాలపైనా నిర్లక్ష్యం
కోర్టుకు విన్నవించిన నాట్కో ఫార్మా

న్యూఢిల్లీ: బరువు తగ్గించే (వెయిట్ లాస్) బ్లాక్‌బస్టర్ ఔషధం 'వెగోవీ' పేటెంట్ హక్కులపై డెన్మార్క్ ఫార్మా కంపెనీ నోవో నార్డిస్క్ ఏ మాత్రం నోరు మెదపడం లేదు. వెగోవీ జెనరిక్ వెర్షన్ తయారు చేయడం నోవో నార్డిస్క్ పేటెంట్ హక్కులకు ఏ మాత్రం భంగం కాదని నాట్కో ఫార్మా ఇప్పటికే ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. దీంతో దీనికి సమాధానం ఇవ్వాలని కోర్టు.. నోవో నార్డిస్క్‌ను ఆదేశించింది. కొన్ని నెలలుగా దీనికి సమాధానం ఇవ్వాలని కోరుతున్నా ఈ డెన్మార్క్ కంపెనీ నుంచి ఉలుకూపలుకూ లేదని నాట్కో ఫార్మా న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. ఈ విషయంలో నోవో నార్డిస్క్ కావాలనే జాప్యం చేస్తోందని భావిస్తున్నారు.

ఎందుకంటే ?

నోవో నార్డిస్క్‌తో పాటు అమెరికా ఫార్మా దిగ్గజం ఎలీ లిల్లీ.. భారత మార్కెట్లోకి తమ పేటెంటెడ్ వెయిట్ లాస్ ఔషధాలను ఇటీవలే విడుదల చేశాయి. నెలకు రూ.17,000 నుంచి రూ.26,000 ఖర్చవుతున్నా, సంపన్న వర్గాల నుంచి వీటికి మంచి డిమాండ్ ఉంది. అయితే మన దేశంలో ఈ ఔషధాల పేటెంట్ వచ్చే ఏడాది మార్చితో తీరిపోనుంది. దీంతో జెనరిక్ వెర్షన్‌లో ఈ వెయిట్ లాస్ ఔషధాన్ని మార్కెట్లోకి విడుదల చేసేందుకు నాట్కో ఫార్మా, డాక్టర్ రెడ్డీస్‌తో సహా ఏడు దేశీయ ఫార్మా కంపెనీలు సిద్ధమవుతున్నాయి. ఈ కంపెనీల ప్రయత్నాలను ఆలస్యం చేసేందుకు నోవో నార్డిస్క్ ఇలా మౌనం పాటిస్తోందని భావిస్తున్నారు. ప్రస్తుతం రూ.700 కోట్లుగా ఉన్న భారత ఒబేసిటీ ఔషధ మార్కెట్ 2030 నాటికి రూ.8,000 కోట్లకు చేరుకుంటుందని అంచనా.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,00,750 ▲	92,300 ▲	1,26,000 ▲
విజయవాడ	1,02,150 ▼	96,000 ▼	1,15,800 ▲
విశాఖపట్నం	1,02,420 ▲	92,350 ▲	1,26,000 ▲
రాజమండ్రి	1,00,690 ▲	92,300 ▲	1,15,000 ▲
ప్రొద్దుటూరు	1,00,600 ▲	92,550 ▲	1,16,200 ▲
ముంబై	99,147 ▲	90,819 ▲	1,12,690 ▲

టీమిండియాకు గ్రీన్‌సిగ్నల్

ఆసియాకప్‌లో ఆడేందుకు అనుమతి
భారత్-పాక్ మ్యాచ్‌కు మార్గం సుగమం
ద్వైపాక్షిక సిరీస్‌లకు అవకాశం లేదు



న్యూఢిల్లీ: భారత-పాకిస్థాన్ క్రికెట్ జట్ల మధ్య ద్వైపాక్షిక సిరీస్‌లు ఎట్టి పరిస్థితుల్లోనూ జరగవని కేంద్ర ప్రభుత్వం మరోసారి స్పష్టం చేసింది. అయితే వచ్చే నెల 9 నుంచి జరిగే ఆసియాకప్‌లో పాల్గొనకుండా భారత జట్టును అడ్డుకోలేమని తెలిపింది. దీంతో సెప్టెంబరు 14న దుబాయ్‌లో జరిగే దాయాదుల పోరుకు అడ్డంకి తొలగినట్టయింది. ఇటీవలే పార్లమెంట్‌లో సరికొత్త జాతీయ క్రీడా బిల్లు ఆమోదం పొందిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో ఏ క్రీడలోనైనా ఇకపై భారత్‌కు చెందిన అథ్లెట్లు పాక్‌లో.. పాక్ ఆటగాళ్లు భారత్‌లోగానీ పర్యటించడం కుదరదని తేల్చింది. అంతేకాకుండా ఈ రెండు దేశాల జట్ల ద్వైపాక్షిక సిరీస్‌లు తటస్థ వేదికలపైనా జరగబోవని స్పష్టం చేసింది. అయితే ఒలింపిక్ చార్టర్‌ను అనుసరించి ఐసీసీ వరల్డ్‌కప్, ఆసియాకప్‌లాంటి మెగా టోర్నీల్లో పాక్‌తో తలపడేందుకు ఎలాంటి అభ్యంతరమూ ఉండదని క్రీడాశాఖ పేర్కొంది. వీటికి పాకిస్థాన్ ఆతిథ్యమిస్తే మాత్రం జోక్యం చేసుకోవాల్సి ఉంటుందని చెప్పింది. మరోవైపు భవిష్యత్‌లో ఇరు దేశాల మధ్య సంబంధాలు మెరుగైతే ఈ నిర్ణయంలో మార్పు ఉంటుందా? అనే ప్రశ్నకు సమాధానంగా.. ప్రస్తుతానికైతే అలాంటి ఆలోచన లేదని క్రీడా శాఖ వర్గాలు తెలిపాయి.

దేశవ్యాప్తంగా క్రీడా ఉత్సవాలు: ఈనెల 29న జరిగే జాతీయ క్రీడా దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా ఘనంగా జరిపేందుకు కేంద్రం నిర్ణయించింది. హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా ఈ వేడుకలు నిర్వహిస్తుంటారు. అయితే దేశంలో క్రీడా సంస్కృతిని చాటేందుకు ప్రతీ గ్రామం, జిల్లా, పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూళ్లు, యూనివర్సిటీల్లో ఆటల పోటీలు, ఫిట్‌నెస్ కార్యక్రమాలను నిర్వహిస్తామని క్రీడా మంత్రి మాన్సుక్ మాండవీయ తెలిపారు.

కొత్త చట్టం ప్రకారం బీసీసీఐ ఎన్నికలు..

వచ్చే నెల చివరి వారంలో బీసీసీఐ ఎన్నికలు జరుగనున్నాయి. అయితే వాటిని నూతన జాతీయ క్రీడా చట్టం ప్రకారమే జరపాలని క్రీడా శాఖ భావిస్తోంది. కానీ ఆ సమయానికి కొత్త చట్టం నియమ నిబంధనలు కార్యరూపం దాల్చాల్సి ఉంటుంది. లేని పక్షంలో సుప్రీం కోర్టు నియమిత జస్టిస్ లోధా కమిటీ మార్గదర్శకాలను అనుసరించే జరిగే అవకాశం ఉంది. దీని ప్రకారం బోర్డు అధ్యక్షుడి గరిష్ఠ వయస్సు 70 ఏళ్ల లోపే ఉండాలి. కానీ జాతీయ క్రీడా చట్టం ప్రకారం 75 ఏళ్లన్నా పోటీ చేసేందుకు అవకాశం ఉంది. ప్రస్తుత అధ్యక్షుడు రోజర్ బిన్నీ వయస్సు 70 దాటినప్పటికీ.. అతడు తాత్కాలిక చీఫ్‌గా కొనసాగుతున్నాడు.

సలీమాకే పగ్గాలు

ఆసియా కప్ మహిళల హాకీ



న్యూఢిల్లీ: ఆసియా కప్ హాకీ టోర్నమెంట్‌లో పాల్గొనే భారత మహిళల జట్టును గురువారం ప్రకటించారు. 20 మంది సభ్యుల జట్టుకు ప్రస్తుత సారథి, మిడ్‌ఫీల్డర్ సలీమా టేటెనే కెప్టెన్‌గా ఎంపిక చేశారు. ఈ టోర్నీ వచ్చేనెల ఐదు నుంచి 14 వరకు చైనాలోని హాంగ్జౌలో జరగనుంది. టోర్నమెంట్ విజేత 2026 ప్రపంచ కప్‌నకు నేరుగా అర్హత సాధించనుండడంతో ఆసియా కప్ ఎంతో ప్రాధాన్యం సంతరించుకుంది. జపాన్, థాయ్‌లాండ్, సింగపూర్‌తో కలిసి గ్రూప్ 'బి'లో భారత్ తలపడనుంది.

ఏపీఎల్ ఫైనల్లో అమరావతి

విశాఖపట్నం-స్పోర్ట్సు (ఆంధ్రజ్యోతి): హనుమ విహారి (54 నాటౌట్, 3/19) ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టడంతో.. అమరావతి రాయల్స్ ఏపీఎల్ సీజన్-4 ఫైనల్‌కు దూసుకెళ్లింది. గురువారం జరిగిన క్వాలిఫయర్-1లో అమరావతి 8 వికెట్లతో తుంగభద్ర వారియర్స్‌ను చిత్తు చేసింది. తొలుత తుంగభద్ర 20 ఓవర్లలో 8 వికెట్లకు 136 పరుగులు చేసింది. కెప్టెన్ మహీప్(56) అర్ధ శతకం నమోదు చేయగా.. చివర్లో శశికాంత్ (41) మెరుపులు మెరిపించాడు. హనుమ విహారి మూడు, వినయ్‌కుమార్ రెండు వికెట్లు పడగొట్టారు. ఛేదనలో అమరావతి 14.2 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 137 పరుగులు చేసి గెలిచింది.. కాగా, ఎలిమినేటర్ మ్యాచ్‌లో భీమవరం బుల్స్ 6 వికెట్ల తేడాతో విజయవాడ సన్‌షైనర్స్‌పై గెలిచింది. తొలుత విజయవాడ 160/8 స్కోరు చేసింది. ఛేదనలో బుల్స్ 19.2 ఓవర్లలో 166/4 స్కోరు చేసి నెగ్గింది. కెప్టెన్ హేమంత్ (71 నాటౌట్) తుదికంటా క్రీజులో నిలిచి జట్టును గెలిపించాడు.

ఒక్కరోజే నాలుగు స్వర్ణాలు

ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్స్

షిమ్‌కెంట్ (కజకిస్థాన్): ఆసియా చాంపియన్‌షిప్స్‌లో భారత షూటర్లు గురువారంనాటి పోటీలలో ఐదు స్వర్ణాలకు గాను నాలుగు పసిడి పతకాలు కొల్లగొట్టారు. దాంతో మొత్తం 26 పతకాలతో (14-6-6) పట్టికలో భారత్ టాప్‌లో ఉంది. మహిళల జూనియర్ స్కీట్ విభాగంలో మాన్సీ రఘువంశీ స్వర్ణం నెగ్గగా, యశస్వీ రాథోడ్ కాంస్యం గెలుపొందింది. పురుషుల 10 మీ. ఎయిర్ రైఫిల్ టీమ్ పసిడి పతకం దక్కించుకుంది. జూనియర్ పురుషుల 10 మీ. ఎయిర్ రైఫిల్‌లో అభినవ్ షా స్వర్ణంతో మెరిశాడు. జూనియర్ పురుషుల 10 మీ.ఎయిర్ రైఫిల్ టీమ్ విభాగంలో వరల్డ్, ఆసియా రికార్డు స్కోరుతో పసిడి పతకం చేజిక్కించుకుంది. జూనియర్ పురుషుల స్కీట్ టీమ్ విభాగంలోనూ భారత్ స్వర్ణం అందుకుంది.

ముంబై కెప్టెన్సీకి రహానె గుడ్‌బై

ముంబై: సీనియర్ క్రికెటర్ అజింక్యా రహానె సంచలన నిర్ణయం తీసుకున్నాడు. గత రంజీ సీజన్‌లో ముంబై జట్టును చాంపియన్‌గా నిలిపిన తను కెప్టెన్సీ నుంచి వైదొలుగుతున్నట్టు ప్రకటించాడు. మరోవైపు రహానె స్థానంలో ముంబై నూతన కెప్టెన్‌గా శార్దూల్ ఠాకూర్‌ను ఎంపిక చేశారు.

భారత్ 'ఎ' 93/5

బ్రిస్బేన్: ఆస్ట్రేలియా 'ఎ' జట్టుతో గురువారం ప్రారంభమైన నాలుగు రోజుల అనధికార టెస్ట్‌లో భారత్ 'ఎ' తొలిరోజే ఇక్కట్లలో పడింది. టాస్ కోల్పోయి బ్యాటింగ్ చేపట్టిన మన మహిళలు ఆట ముగిసే సరికి మొదటి ఇన్నింగ్స్‌లో కేవలం 93 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయారు. షఫాలీ వర్మ (35) ఫర్వాలేదనిపించింది. వర్షం వల్ల మొత్తం 23.2 ఓవర్ల ఆటే సాధ్యమైంది.

స్వర్ణ పోరుకు కాజల్

సమోకోవ్ (బల్గేరియా): మహిళల అండర్-20 వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో భారత రెజ్లర్ కాజల్ ఫైనల్‌కు చేరుకొని స్వర్ణంపై ఆశలు నిలిపింది. 72 కిలోల సెమీస్‌లో కాజల్ 13-6తో జాస్మిన్‌ను మట్టికరిపించింది. అయితే, రీనా (55 కి), ప్రియ (76 కి) ఫైనల్లో ఓడి రజతాలు దక్కించుకొన్నారు. సెమీస్‌లో ఓడిన శ్రుతి, సారిక కాంస్యం కోసం ఆడనున్నారు.

స్పోర్ట్స్



ఆటగాళ్లకు అగ్నిపరీక్ష 'బ్రాంకో' టెస్ట్


- ఫిట్‌నెస్‌ను కొలిచేందుకు సరికొత్త ప్రమాణం
- రగ్బీ తరహా పరీక్షను ప్రవేశపెట్టిన బీసీసీఐ

న్యూఢిల్లీ: ఆటగాళ్ల ఫిట్‌నెస్ సమస్య టీమిండియాను వెంటాడుతోంది. ఎవరు ఎంత ఫిట్‌గా ఉన్నారో కచ్చితంగా తెలుసుకోలేకపోతున్నారు. కొందరైతే పెయిన్‌కిల్లర్లు తీసుకొని మ్యాచ్‌లో బరిలోకి దిగుతున్నారని వార్తలు కూడా వచ్చాయి. తాజా ఇంగ్లండ్ టూర్‌ని గమనిస్తే..మనోళ్ల ఫిట్‌నెస్ ఎంత తక్కువ స్థాయిలో ఉందో అందరికీ తెలిసిందే. దీనికి బుమ్రానే ఉదాహరణ. ఈ నేపథ్యంలో భారత జట్టు ఫిట్‌నెస్ విషయంలో బీసీసీఐ సరికొత్త ప్రమాణాలు నెలకొల్పాలనుకొంటోంది. ఇందులో భాగంగా రగ్బీ ఆటగాళ్లను పరీక్షించే బ్రాంకో టెస్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. టీమిండియా కొత్త ఫిట్‌నెస్, కండీషనింగ్ కోచ్ అడ్రియన్ లే రూ ఈ టెస్ట్‌ను ప్రవేశపెట్టగా..చీఫ్‌కోచ్ గౌతమ్ గంభీర్ దానికి మద్దతు ప్రకటించాడు. తాజాగా జరిగే ఫిట్‌నెస్ టెస్ట్‌లో యో-యో టెస్ట్‌తోపాటు బ్రాంకో టెస్ట్ కూడా పాస్ కావాలి. దీంతోపాటు 2 కిలోమీటర్ల టైమ్ ట్రయల్‌ను అధిగమించాలి.

ఏమిటీ బ్రాంకో టెస్ట్?

ప్లేయర్ల సత్తువ, వేగంతోపాటు కార్డియో వాస్క్యులర్ కండిషన్‌ను కొలిచేందుకు రూపొందించిన తీవ్రమైన రన్నింగ్ డ్రిల్ ఇది. ఆటగాళ్ల శరీరానికి, మైండ్‌కు సవాళ్లు విసురుతుంది. క్రికెటర్ ఫిట్‌నెస్‌లోని సూక్ష్మమైన లోపాలు కూడా ఈ టెస్ట్‌లో బయటపడతాయి. బ్రాంకో టెస్ట్‌లో 20, 40, 60 మీటర్ల షటిల్స్ ఉంటాయి. ప్రతి దూరాన్ని ఐదు సెట్లపాటు విరామం తీసుకోకుండా పూర్తి చేయాలి. అంటే ఒక్కోటి ఐదుసార్ల చొప్పున మొత్తం 15 సార్లు... 1200 మీటర్ల దూరాన్ని ఆగకుండా పరిగెత్తాలి. దాన్ని ఆరు నిమిషాల్లోనే పూర్తి చేయాలి. కాగా రెండు కిలోమీటర్ల టైమ్ ట్రయల్‌ను బీసీసీఐ కొనసాగించనుంది.


అడ్రియన్ లే రూ



మహిళా బాక్సర్లకు లింగత్వ పరీక్షలు తప్పనిసరి

ప్రపంచ చాంపియన్‌షిప్స్ ఎంట్రీపై వరల్డ్ బాక్సింగ్

లాస్‌ఏంజిల్స్: బాక్సింగ్‌లో లింగత్వ వివాదం ఏళ్లుగా నెలకొంది. పారిస్ ఒలింపిక్స్‌లో స్వర్ణం నెగ్గిన అల్జీరియా బాక్సర్ ఇమానె ఖెలిఫ్ మహిళ కాదనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇలాంటి వాటికి చెక్ చెప్పేందుకు 'వరల్డ్ బాక్సింగ్' నడుం కట్టింది. వచ్చే నెలలో జరిగే వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో బరిలోకి దిగేందుకు మహిళా బాక్సర్లు తప్పని సరిగా లింగత్వ పరీక్షలు చేయించుకోవాలని ఆదేశించింది. పాలిమెరైజ్ చైన్ రియాక్షన్ లేదా దీనికి సమమైన జెనెటిక్ స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా జన్మతహ లింగత్వాన్ని నిర్ధారించుకోవాలని తెలిపింది.

మరో పది నెలలు.. అగార్కర్ పదవీకాలం పొడిగింపు



న్యూఢిల్లీ: జాతీయ సీనియర్ సెలెక్షన్ కమిటీ చైర్మన్ అజిత్ అగార్కర్ పదవీ కాలాన్ని బీసీసీఐ పొడిగించింది. 2026 జూన్ వరకు అగార్కర్ చైర్మన్‌గా కొనసాగుతాడని బోర్డు గురువారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొంది. 2023 జూలైలో అగార్కర్ చైర్మన్‌గా నియమితుడయ్యాడు. అతడి పదవీ కాలంలో భారత జట్టు 2023 వన్డే వరల్డ్ కప్‌లో రన్నరప్‌గా నిలవడంతోపాటు, 2024లో టీ20 ప్రపంచ కప్, చాంపియన్స్ ట్రోఫీలలో విజేతగా ఆవిర్భవించింది. అగార్కర్ నేతృత్వంలోని కమిటీలో ఎస్ఎస్ దాస్, సుబ్రతో బెనర్జీ, అజయ్ రాత్రా, ఎస్.శరత్ సభ్యులుగా కొనసాగుతున్నారు. వచ్చే నెలలో జరిగే బీసీసీఐ ఏజీఎంలో కమిటీలో మార్పు చేర్పులపై నిర్ణయం తీసుకోనున్నారు. ఏజీఎం తర్వాత సెలెక్షన్ కమిటీ సభ్యుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానించనున్నట్టు తెలిసింది.

ఎరాని జోడీ.. వన్స్‌మోర్

ఫైనల్లో స్వియటెక్ జంటపై గెలుపు
యూఎస్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్



న్యూయార్క్: డిఫెండింగ్ చాంప్ సారా ఎరాని జోడీ పునర్ వ్యవస్థీకరించిన యూఎస్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్‌ను నిలబెట్టుకొంది. గురువారం జరిగిన ఫైనల్లో ఇటలీ జంట ఎరాని-ఆండ్రియా వవస్సోరి జోడీ 6-3, 5-7, 10-6తో మూడో సీడ్ ఇగా స్వియటెక్-కాస్పర్ రూడ్ జంటపై గెలిచింది. తుది పోరును మాత్రం రెగ్యులర్ ఫార్మాట్‌లో నిర్వహించారు. సింగిల్స్ స్టార్లతో డ్రాను నింపేసినా అంతిమంగా డబుల్స్ స్పెషలిస్టులకే టైటిల్ దక్కింది. అంతకుముందు జరిగిన సెమీస్‌లో ఎరాని-వవస్సోరి జంట 4-2, 4-2తో డేనియల్ కొలిన్స్-క్రిస్టియన్ హ్యారిసన్‌ను చిత్తు చేసింది. మరో మ్యాచ్‌లో స్వియటెక్-రూడ్ ద్వయం 3-5, 5-3, 10-8తో టాప్ సీడ్ జెస్సికా పెగులా-జేక్ డ్రేపర్‌పై పోరాడి నెగ్గింది.

6 అంశాల ఆధారంగా ఫీజులు

(మొదటిపేజీ తరువాయి)

పెంచాల్సి ఉండగా.. వచ్చే ఏడాదికి వాయిదా వేసిన సర్కారు, ఫీజుల నిర్ధారణలో కొత్త విధానం అమల్లోకి తెచ్చింది. దీనిపై తెలంగాణ ఉన్నత విద్యా మండలి అధ్యక్షుడు ఆచార్య బాలకిష్టారెడ్డి నేతృత్వంలో ఏర్పాటైన ఉన్నతస్థాయి కమిటీ తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. దీని ఆధారంగా విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా గురువారం కొత్త మార్గదర్శకాలను విడుదల చేశారు. ఫీజు నియంత్రణ కమిషన్ (ఎఫ్ఆర్సీ) పరిగణనలోకి తీసుకునే అంశాలను సమూలంగా మార్చివేశారు. ఇప్పటివరకు కాలేజీలు సమర్పించిన నిర్వహణ వ్యయం, ఆడిట్ నివేదికల ఆధారంగా ఫీజులను ఖరారు చేస్తుండగా.. ఇకపై ఆరు అంశాల ఆధారంగా ఖరారు చేయనున్నారు. కొత్త నిబంధనల ప్రకారం కాలేజీలు కోరిన ఫీజుల్లో మార్పులు చేసే అధికారం ఎఫ్ఆర్సీకి ఉంటుంది.

- ఇంజనీరింగ్ విద్య బోధనలో నాణ్యతను ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకుంటారు. ఇప్పటివరకూ అర్హులైన బోధనా సిబ్బంది నియామకంపై దృష్టిపెట్టిన ఎఫ్ఆర్సీ.. ఇకపై విద్యార్థులకు అందుతున్న నాణ్యమైన విద్యనూ బేరీజు వేయనుంది. విద్యార్థుల హాజరు, సామర్థ్యం, ప్రాంగణ నియామకాలు, కొలువులను పరిగణనలోకి తీసుకోనుంది.
- విద్యార్థులకు ముఖ గుర్తింపు హాజరు (ఎఫ్ఆర్ఎస్), ఫీజుల స్వీకరణ, చెల్లింపుల్లో పారదర్శకత పాటించేందుకు ఆధార్ ఆధారిత చెల్లింపుల విధానం లాంటివి అమలు చేయాలి.
- పరిశోధనలను ప్రోత్సహించడం, జాతీయ, అంతర్జాతీయ ప్రచురణల్లో వ్యాసాలు ప్రచురితమవడం, అవార్డులు, వినూత్న ఆవిష్కరణలు, స్టార్టప్‌లను ప్రోత్సహించాలి.
- జాతీయ, అంతర్జాతీయ ర్యాంకింగుల్లో సత్తా చాటాలి.
- రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని సాంకేతిక విద్యాశాఖ కోరిన ప్రణాళికలు అమలు చేయాలి.

25 నుంచి మళ్లీ దరఖాస్తుల స్వీకరణ..

ఫీజుల పెంపుపై ప్రభుత్వం కొత్త నిబంధనలు తీసుకురావడంతో ఫీజుల అంశం మళ్లీ మొదటి నుంచి ప్రారంభం కానుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 160 ఇంజనీరింగ్ కాలేజీలు కొత్త నిబంధనల ప్రకారం.. తమ ఎదుట హాజరై వివరాలు సమర్పించాలని ఎఫ్ఆర్సీ అన్ని కాలేజీలకు పంపిన లేఖల్లో కోరింది. ఈ నెల 25 నుంచి సెప్టెంబరు 3 వరకు కాలేజీల నుంచి ఎఫ్ఆర్సీ దరఖాస్తులు స్వీకరించనుంది. దీనిపై గురువారం ఎఫ్ఆర్సీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఎఫ్ఆర్సీ చైర్మన్ జస్టిస్ గోపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, ఉన్నత విద్యామండలి అధ్యక్షుడు ఆచార్య బాలకిష్టారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. కొత్తగా ఖరారు చేసే ఫీజులు వచ్చే విద్యా సంవత్సరం నుంచి మూడేళ్ల అమల్లో ఉంటాయి.

ఇండీ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి నామినేషన్

వెంట వచ్చిన సోనియా, రాహుల్, పవార్.. కేజ్రీవాల్ ఇంటికి వెళ్లి కలిసిన సుదర్శన్‌రెడ్డి

న్యూఢిల్లీ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి నామినేషన్ వేశారు. గురువారం ఉదయం 11.30 గంటలకు రిటర్నింగ్ అధికారి, రాజ్యసభ సెక్రటరీ జనరల్ పీసీ మోడీకి తన నామినేషన్ పత్రాలు సమర్పించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, ఎన్సీపీ నేత శరద్ పవార్, సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ రాంగోపాల్ యాదవ్, డీఎంకే ఎంపి తిరుచ్చి శివ, శివసేన(యుబిటి) ఎంపీ సంజయ్ రావత్, డీఎంకే ఎంపీ తిరుచ్చి శివ, టీఎంసీ ఎంపీ శతాబ్ది రాయ్, సీపీఎం ఎంపీ జాన్ బ్రిటాస్, ఆప్ ఎంపీ సంజయ్ సింగ్, ఇతర ప్రతిపక్ష నేతలు ఇండీ కూటమి అభ్యర్థి నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. పార్లమెంట్ ఆవరణలో మహాత్మాగాంధీ, జ్యోతిబాఫూలే, అంబేద్కర్ విగ్రహాలకు నివాళులు అర్పించిన తర్వాత జస్టిస్ సుదర్శన్‌రెడ్డి తన నామినేషన్ పత్రాలను సమర్పించారు. నాలుగు సెట్లుగా సమర్పించిన నామినేషన్ పత్రాల్లో 200 మంది ఎంపీలు సంతకాలు చేశారు.


ఉపరాష్ట్రపతి పదవికి నామినేషన్ దాఖలు చేస్తున్న సుదర్శన్‌రెడ్డి చిత్రంలో సోనియా, శరద్ పవార్ తదితరులు

కేసీఆర్‌తో మాట్లాడతా: కేజ్రీవాల్

జస్టిస్ సుదర్శన్‌రెడ్డి గురువారం సాయంత్రం ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆమ్‌ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌ను ఆయన ఇంటికి వెళ్లి కలుసుకుని తనకు మద్దతు ప్రకటించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయనను గెలిపించేందుకు తాను శాయశక్తులా ప్రయత్నిస్తానని కేజ్రీవాల్ చెప్పారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో మాట్లాడతానని ఆయన సుదర్శన్‌రెడ్డికి చెప్పినట్లు తెలిసింది. తాను కూడా రాష్ట్రాలకు వెళ్లి జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని గెలిపించేందుకు ప్రయత్నిస్తానని కేజ్రీవాల్ అన్నారు. తృణమూల్ నేత కల్యాణ్ బెనర్జీ, కాంగ్రెస్ నేత ప్రమోద్ తివారీ సుదర్శన్‌రెడ్డితో పాటు కేజ్రీవాల్‌ను కలుసుకున్నారు. కేజ్రీవాల్ తన ఇంటి బయట మీడియాతో మాట్లాడుతూ, విప్ లేకుండా సీక్రెట్ బ్యాలట్ ద్వారా జరుగుతున్న ఎన్నికల్లో అన్ని పార్టీల ఎంపీలు నిర్భయంగా ఓటు వేయాలని పిలుపునిచ్చారు. న్యాయమూర్తిగా దేశానికి అద్భుతమైన సేవ చేసిన జస్టిస్ సుదర్శన్‌రెడ్డి లాంటి వ్యక్తిని ఎన్నుకుంటే ఉప రాష్ట్రపతి పదవికే వన్నె తెచ్చినట్లు అవుతుందని చెప్పారు. సుదర్శన్‌రెడ్డి కేవలం ప్రతిపక్షాల అభ్యర్థి కాదని, ఈ దేశ అభ్యర్థిగా భావించాలని పిలుపునిచ్చారు. ఆంధ్రుల ఆత్మగౌరవం నినాదానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ప్రాధాన్యం ఉన్నందువల్ల రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీల నేతలను జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి ఓటు వేయాలని కోరతానని చెప్పారు. తాను ఏ రాజకీయ పార్టీ సభ్యుడిని కాదని, ఉప రాష్ట్రపతి బాధ్యత రాజకీయ బాధ్యత కాదని సుదర్శన్‌రెడ్డి అన్నారు. స్వతంత్రంగా, నిష్పాక్షికంగా నిర్వహించాల్సిన రాజ్యాంగ బాధ్యతను న్యాయమూర్తిగా కూడా నెరవేర్చానని చెప్పారు. ఉపరాష్ట్రపతిగా ఎన్నికైతే అదే బాధ్యతను నెరవేరుస్తానని చెప్పారు.

త్వరలో అఖిలేష్, మమత, సోరేన్‌లతో భేటీ

కేజ్రీవాల్‌ను కలిసిన అనంతరం జస్టిస్ సుదర్శన్‌రెడ్డి హైదరాబాద్ బయలుదేరి వెళ్లారు. శుక్రవారం సీనియర్ న్యాయవాది ప్రతాప్‌రెడ్డి అంత్యక్రియల్లో పాల్గొన్న తర్వాత ఆయన సాయంత్రానికి ఢిల్లీ తిరిగి వస్తారు. ఢిల్లీ చేరుకున్న తర్వాత అన్ని పార్టీల ఎంపీలకు తనను గెలిపించాలని కోరుతూ లేఖలు పంపాలని ఆయన నిర్ణయించారు. ఈ నెల 26న సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేష్ యాదవ్‌ను కలుసుకునేందుకు జస్టిస్ సుదర్శన్‌రెడ్డి లక్నో వెళుతున్నారు. బెంగాల్‌కు వెళ్లి మమతా బెనర్జీని, జార్ఖండ్‌కు వెళ్లి హేమంత్ సోరెన్‌ను కూడా ఆయన కలుసుకోనున్నారు. తన పర్యటన కార్యక్రమాలను, ఇతర వ్యూహాలను ఇండియా కూటమికి చెందిన కోర్ కమిటీ సభ్యులు నిర్ణయిస్తున్నారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తో సహా ఎన్డీఏ ముఖ్యమంత్రులను కలిసేందుకు కూడా ప్రయత్నించాలని సుదర్శన్‌రెడ్డి భావిస్తున్నారు. కేసీఆర్‌ను కూడా కలుసుకునేందుకు ప్రయత్నిస్తానని ఆయన సన్నిహిత వర్గాలకు తెలిపారు.

ఇది సైద్ధాంతిక పోరు

జస్టిస్ సుదర్శన్‌రెడ్డి మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. రాజ్యాంగ విలువల పట్ల బాధ్యతతో, అచంచలమైన నిబద్ధతతో ప్రతిపక్ష ఉమ్మడి అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశానని తెలిపారు. ఈ పోటీ ఒక వ్యక్తికి సంబంధించింది కాదని, పార్లమెంట్ పరస్పర గౌరవంతో నడిచేందుకు, అసమ్మతిని కూడా గౌరవించేందుకు, దేశంలో వ్యవస్థలు స్వతంత్రంగా ప్రజలకు సేవ చేసేందుకు జరుగుతున్న సైద్ధాంతిక పోరుగా దీన్ని భావించాలని, అది భారతీయ దృక్పథాన్ని ప్రతిబింబించాలని అన్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా, లా విద్యార్థిగా, భారత రిపబ్లిక్ ప్రజాస్వామిక సంప్రదాయాలను జీర్ణించుకున్న పౌరుడిగా భారతదేశ నిజమైన శక్తి ఏమిటో తన జీవితంలో తెలుసుకున్నానని చెప్పారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ఉన్నత సంప్రదాయాలను పరిరక్షించే బాధ్యత రాజ్యసభ చైర్మన్‌గా ఉప రాష్ట్రపతికి ఉన్నదని, నిష్పాక్షికంగా, హుందాగా, పరస్పర చర్చలు, విలువల పట్ల మొక్కవోని అంకితభావంతో విధిని నిర్వహిస్తానని చెప్పారు. రాజ్యాంగం పట్ల గౌరవం, ప్రజల పట్ల విశ్వాసంతోనే ఈ ప్రయాణం ప్రారంభించానని తెలిపారు.

పార్టీలో చర్చించి రాజధానిపై నిర్ణయం

వినాయక చవితి తర్వాతే మిథున్‌రెడ్డితో జగన్ ములాఖత్: బొత్స

రాజమహేంద్రవరం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : రాజధాని అమరావతా.. మూడు రాజధానులా అనేది తమ పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని శాసనమండలిలో ప్రతిపక్ష నేత, వైసీపీ రాష్ట్ర సమన్వయ కర్త బొత్స సత్యనారాయణ చెప్పారు. గురువారం రాజమండ్రిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వాననీరు రెండు అడుగుల వరకూ ఉన్నందునే అమరావతి మునిగిందని చెప్పామని.. దీనిపై కేసులు పెడతామంటున్నారని.. ఎలా పెడతారని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో వానవచ్చినప్పుడు ఫ్లైఓవర్లపైనా నీరు నిలిచిన విషయాన్ని ప్రస్తావించగా.. ఆయన పై విధంగా అన్నారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని.. దానిని రక్షించడం కోసం ఉద్యమిస్తున్నామన్న జనసేన.. ఈనెల 30న విశాఖలో జరిగే విస్తృత స్థాయి సమావేశంలో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. 'రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న ఎంపీ మిథున్‌రెడ్డిని కలవడానికి జగన్ 25న రావాలనుకున్నారు. కానీ వినాయక చవితి వెళ్లిన తర్వాత వస్తారు' అని చెప్పారు.

ఎన్డీఏ అభ్యర్థికే మద్దతు

ఉపరాష్ట్రపతి పదవి రాజ్యాంగ పదవి అని, నంబర్ గేమ్ ఉండకూడదనే ఎన్డీఏ అభ్యర్థికి మద్దతిస్తున్నామని బొత్స తెలిపారు. గతంలో కాంగ్రెస్ నుంచి ప్రణబ్ ముఖర్జీ రాష్ట్రపతి అభ్యర్థిగా ఉన్నప్పుడు కూడా జగన్ మద్దతిచ్చారని.. కోడెల శివప్రసాద్ స్పీకర్‌గా ఎన్నికయ్యేటప్పుడూ తాము పోటీ పెట్టలేదని చెప్పారు.

జైలు భయంతోనే బీజేపీకి బీఆర్ఎస్ మద్దతు

ఆ రెండూ ఒకే తానుముక్కలు: మంత్రి పొంగులేటి



కూసుమంచి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): జైలుకెళ్లాల్సి వస్తుందన్న భయంతోనే ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో బీజేపీకి బీఆర్ఎస్ మద్దతు ఇస్తోందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. 2లక్షల టన్నుల యూరియా ఇచ్చిన వారికే తమ మద్దతు ఉంటుందని ఇటీవల కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై స్పందించిన ఆయన.. అవన్నీ కుంటి సాకులంటూ కొట్టిపారేశారు. ఖమ్మంజిల్లా కూసుమంచిలోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం సమావేశంలో మంత్రి మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పులకు ఏడు చువ్వలు లెక్కపెట్టకుండా ఉండాలంటే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంతో సఖ్యతగా ఉండాలని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒకే తాను ముక్కలని తాము మొదటి నుంచీ చెపుతూ ఉన్నామని అన్నారు.

జువెనైల్ హోంలు పరివర్తన కేంద్రాలు

బాలలు ఉన్నత పౌరులుగా ఎదగాలి: సీతక్క

హైదరాబాద్/సైదాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): జువెనైల్ హోంలు పరివర్తన కేంద్రాలని, ఇక్కడ ఉండే బాలలు సత్ప్రవర్తనతో బయటకు వెళ్లి ఉన్నత పౌరులుగా ఎదగాలని మంత్రి సీతక్క అన్నారు. గురువారం సైదాబాద్‌లోని జువెనైల్ హోంను మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క సందర్శించారు. ఇక్కడ హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ 9వ తరగతి విద్యార్థిని ఆకర్షణ ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. చిన్నారులు క్షణికావేశంలో తప్పులు చేయకుండా సన్మార్గంలో నడవాలని సూచించారు. రాష్ట్రంలో మరో ఐదు అబ్జర్వేషన్ హోంల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు.

నేటి నుంచి పల్లెల్లో పనుల జాతర

పల్లెల్లో ఉపాధి కల్పనతోపాటు వివిధ రంగాల్లో అభివృద్ధికి శుక్రవారం నుంచి పల్లెల్లో పనుల జాతర కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని మంత్రి సీతక్క ప్రకటించారు. పనుల జాతర పోస్టర్‌ను మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌తో కలిసి ఆమె గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం ద్వారా రూ.2,199కోట్లతో 1,01,589 పనులను చేపట్టనున్నామని చెప్పారు. వచ్చేఏడాది జనవరిలో జరిగే మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు ప్రభుత్వం రూ.150కోట్లు విడుదల చేసిందని చెప్పారు. కాగా, మంత్రి కొండా సురేఖతో తనకు ఎలాంటి విభేదాల్లేవని సీతక్క స్పష్టం చేశారు. సమ్మక్క, సారలమ్మలా తాము అక్కాచెల్లెళ్లలా సఖ్యతతో ఉన్నామన్నారు.

హ్యామ్ విధానంలో నాణ్యమైన రోడ్లు

కేంద్రం నుంచి అనుమతులపై దృష్టి: మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): హ్యామ్ విధానంలో రాష్ట్రంలో నాణ్యమైన రోడ్లు అతిత్వరలో వేయబోతున్నామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. టెండరు ప్రక్రియ పూర్తిచేసి, వర్షాలు తగ్గుముఖం పట్టగానే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. గురువారం సచివాలయంలో ఆర్అండ్‌బీ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. కేంద్రం నుంచి రావాల్సిన అనుమతులపై దృష్టిసారించాలని అధికారులను ఆదేశించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో రూ.1,000కోట్ల విలువైన ఆర్అండ్ బీ రోడ్లు దెబ్బతిన్నాయని తెలిపారు. పూర్తిగా శిథిలమైనచోట్ల కొత్త రోడ్లు నిర్మించాలని, ఇతరచోట్ల మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. కాగా, ఖానాపూర్ నుంచి బెల్లాం, ఉట్నూర్ నుంచి గుడిహత్నూర్ వరకు రోడ్ల నిర్మాణం చేపట్టాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు.. మంత్రి కోమటిరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. కాగా, హైదరాబాద్‌లో 8న నిర్వహించనున్న సీఎస్ఆర్ సమ్మిట్ పోస్టర్‌ను మంత్రి కోమటిరెడ్డి ఆవిష్కరించారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత సదస్సులో కార్పొరేట్, సీఎస్ఆర్ నిపుణులు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

బీసీలకు నిరాశ మిగిల్చిన పార్లమెంటు సమావేశాలు

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల

హైదరాబాద్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల అంశంపై పార్లమెంట్ సమావేశాలలో కనీసం చర్చ జరగకపోవడం బాధాకరమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. రిజర్వేషన్ల పెంపుపై ప్రశ్నించకుండా ఇండియా కూటమి అన్యాయం చేస్తే, బాధ్యతతో స్పందించాల్సిన ఎన్డీఏ కూటమి స్పందించకుండా తీవ్ర నిరాశకు గురి చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం సచివాలయం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీలకు బీసీల పట్ల చిత్తశుద్ధి లేదని స్పష్టమవుతోందన్నారు.

31 అర్ధరాత్రి నుంచి ఆరోగ్యశ్రీ సేవలు బంద్

ఆరోగ్యశ్రీ ట్రస్టు సీఈవోకు నెట్‌వర్క్ ఆస్పత్రుల లేఖ

హైదరాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్యశ్రీ, జర్నలిస్టు, ఉద్యోగుల ఆరోగ్య పథకం వైద్య సేవలను ఈ నెల 31 అర్ధరాత్రి నుంచి నిలిపి వేయనున్నట్లు తెలంగాణ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్(టీఏఎన్‌హెచ్‌ఏ) ప్రకటించింది. బకాయిల చెల్లింపులో జాప్యం, ఆర్థిక భారం పెరగడంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు టీఏఎన్‌హెచ్‌ఏ తెలిపింది. ఈ మేరకు గురువారం ఆరోగ్యశ్రీ సీఈవోకు లేఖ రాసిన టీఏఎన్‌హెచ్‌ఏ... జనవరిలో ప్రభుత్వంతో జరిగిన చర్చల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.1,300-1,400 కోట్ల బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేసింది. బకాయిలు గణనీయంగా పెరగడంతో చిన్న, మధ్య తరగతి ఆస్పత్రులను మూసివేసుకునే పరిస్థితి నెలకొందని టీఏఎన్‌హెచ్‌ఏ అధ్యక్షుడు వడ్డిరాజు రాకేష్ ఆవేదన వ్యక్తం చేశారు. బకాయిలను 4-5 నెలల్లో చెల్లిస్తామని, ప్యాకేజీలను సవరిస్తామని మంత్రి ఇచ్చిన హామీ, ఆరు నెలలు గడిచినా అమలుకు నోచుకోలేదని లేఖలో పేర్కొన్నారు.

ఉద్యోగుల క్రమశిక్షణ కేసుల పరిష్కారానికి గడువు

హైదరాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులపై వివిధ సందర్భాల్లో నమోదైన క్రమశిక్షణ కేసులపై సర్కారు దృష్టిసారించింది. కొన్ని సందర్భాల్లో ఉద్యోగులు పదవీ విరమణ పొందినా.. క్రమ శిక్షణ కేసులు పెండింగ్‌లో ఉండడాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. దీంతో.. వేగంగా వాటిని పరిష్కరించేందుకు గడువును విధిస్తూ.. గురువారం ఉత్తర్వులను విడుదల చేసింది. చిన్నచిన్న కేసులకు మూణ్నెల్లు, తీవ్రమైన కేసులను ఐదారు నెలల్లో పరిష్కరించాలని తాజా ఉత్తర్వులు స్పష్టం చేస్తున్నాయి. ఈ కేసులను ఆయా శాఖల ముఖ్య కార్యదర్శులు పరిశీలించాలని, ఆ తర్వాత నిర్ణీత గడువులోగా పూర్తికాని కేసుపై నోట్‌ను తయారు చేసి.. సీఎం, సీఎస్‌లకు పంపాలని ప్రభుత్వం తాజా ఉత్తర్వుల్లో పేర్కొంది. విచారణాధికారి నోట్ తయారు చేయడానికి రెండు వారాలు, నివేదిక సమర్పణకు మరో రెండు వారాలు, క్రమశిక్షణ అథారిటీ పరిశీలనకు వారం చొప్పున గడువు విధిస్తున్నట్లు తెలిపింది. పదవీ విరమణకు దగ్గర్లో ఉన్న ఉద్యోగులు, అధికారుల అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాలని పేర్కొంది.

ఫాల్కన్ స్కామ్‌లో సీఏ శరత్‌చంద్ర అరెస్ట్

792 కోట్ల కుంభకోణం కేసులో అదుపులోకి తీసుకున్న ఈడీ

హైదరాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఫాల్కన్ ఇన్‌వాయిస్ డిస్కౌంటింగ్ కుంభకోణం కేసులో చార్టర్డ్ అకౌంటెంట్(సీఏ) శరత్‌చంద్ర తోష్నివాల్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు అరెస్టు చేశారు. క్యాపిటల్ ప్రొటెక్షన్ ఫోర్స్ పేరిట కంపెనీ పెట్టి ఇన్‌వాయిస్ డిస్కౌంటింగ్ ద్వారా భారీ లాభాలు వస్తాయని చిన్న, మధ్య తరగతి మదుపరులను నమ్మించి రూ.792 కోట్ల మోసానికి పాల్పడిన కేసులో కంపెనీ సీఏ శరత్‌చంద్రను అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి ఇటీవలే కంపెనీ ఎండీ అమర్‌దీప్ కుమార్ సోదరుడు సందీప్ కుమార్‌ను అరెస్టు చేశారు. మొత్తం కుంభకోణానికి సూత్రధారి అమర్‌దీప్ కాగా, ఆయన మోసాలకు శరత్‌చంద్ర సహకరించినట్లు తమ దర్యాప్తులో వెల్లడైందని ఈడీ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఫాల్కన్ ఇన్‌వాయిస్‌కు వచ్చిన డబ్బును రెహత్ హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్, రెహత్ హెర్బల్ ప్రైవేట్ లిమిటెడ్, ఆర్‌డీపీ వర్క్ స్టేషన్స్ స్వస్తిక్ ఫీ కంపెనీలకు మళ్లించడంలో శరత్‌చంద్ర ప్రధాన పాత్ర పోషించారని వెల్లడించారు. ఆయా కంపెనీల్లో శరత్‌చంద్ర తన బంధువులు, బినామీల పేరిట షేర్లు తీసుకున్నారని వివరించారు.

ప్రశ్నించడమే తప్పన్నట్టుగా..

నాపై కక్ష గట్టారు

(మొదటిపేజీ తరువాయి)

తాను బావిస్తున్నట్టు పేర్కొన్నారు. సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం పోరాడుతున్న తనపై కొందరు కుట్రలు పన్నుతున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌లో కొన్నేళ్లుగా జరుగుతున్న పరిణామాలు కార్మిక వర్గానికి తెలుసని పేర్కొన్నారు. పార్టీ రజతోత్సవ సభలో కేసీఆర్ ప్రసంగంపై వివిధ వర్గాలు వ్యక్తం చేసిన అభిప్రాయాలను ఓ లేఖ ద్వారా తెలియజేశానని, గతంలోనూ ఇలాంటివి ఎన్నో లేఖలు కేసీఆర్‌కు రాశానని గుర్తు చేశారు. తాను అమెరికా వెళ్లిన సందర్భంలో ఆ లేఖను లీక్ చేశారని ప్రస్తావిస్తూ.. తనపై కుట్రలకు పాల్పడుతున్న వారెవరో బయట పెట్టాలని డిమాండ్ చేశారు. టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలిగా పదేళ్ల పాటు సేవ చేసుకునే అవకాశం దక్కడం అదృష్టంగా భావిస్తున్నట్టు కవిత తెలిపారు. ప్రతి కార్మిక కుటుంబంలో ఒక సోదరిగా సేవలందించానని గుర్తు చేశారు. కార్మికుల శ్రేయస్సు కోసం కృషి చేస్తున్న తనను టీబీజీకేఎస్ నుంచి గౌరవ అధ్యక్షురాలిగా తొలగించి కార్మికుల ఐక్యతను దెబ్బతీయడమే లక్ష్యంగా కొందరు పని చేస్తున్నారని పేర్కొన్నారు. తాను పదవిలో ఉన్నా, లేకున్నా ప్రతి కార్మిక కుటుంబంలో సభ్యురాలిగా మీ వెంటనే ఉంటానని కవిత ఆ బహిరంగ లేఖలో కార్మికులకు స్పష్టం చేశారు. గౌరవ అధ్యక్షురాలిగా, ఉద్యమ నాయకురాలిగా గతంలో ఎలాంటి సేవలందించానో ఇకపై కూడా గని కార్మికుల కోసం అలాగే పని చేస్తానని, కార్మికులకు ఏ కష్టం వచ్చినా మీ వెంటే ఉంటానని ఆమె ఆ లేఖలో పేర్కొన్నారు.

రేవంత్ దరిద్రపు పాలనకు

అసమర్థ ఆస్కార్ అవార్డు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): అన్నదాతను అప్పుల పాల్జేసిన పాలకులను చూశాం కానీ, ఇప్పుడు వారిని చెప్పుల పాల్జేసిన చెత్త రికార్డు మాత్రం సీఎం రేవంత్‌రెడ్డిదేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఆయన దరిద్రపుగొట్టు పాలనకు అసమర్థ ఆస్కార్ అవార్డు ఇవ్వాల్సిందేనని పేర్కొన్నారు. యూరియా బస్తా కోసం చెప్పుల లైన్ వద్ద పడుకున్న ఫొటోను ఎక్స్ వేదికగా గురువారం పోస్టు చేసిన కేటీఆర్.. 'దీన్ని ఫ్రేమ్ కట్టించుకుంటావో.. మెడలో వేసుకుని ఊరేగుతావో నీఇష్టం' అని ఎద్దేవా చేశారు. 'బస్తా యూరియా కోసం రైతు బతుకును బజారున పడేశావ్. అందరి కడుపునింపే అన్నదాతను పాదరక్షల పాల్జేసిన పాపం ఊరికే పోదు' అని సీఎంను ఉద్దేశించి కేటీఆర్ హెచ్చరించారు. మూసీనది ప్రక్షాళన, సుందరీకరణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలసొమ్మును దోచుకోవడానికి సిద్ధమవుతోందని ఆరోపించారు. తమ ప్రభుత్వం మూసీ అభివృద్ధికి రూ.16 వేలకోట్లతో మాస్టర్‌ప్లాన్ తయారుచేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం దాని అంచనాలను రూ.1.50లక్షల కోట్లకు పెంచి భారీ దోపిడీకి తెర లేపిందన్నారు. ఈ ప్రజాధనం దోపిడీని ముమ్మాటికీ ఎండగట్టి, ఖచ్చితంగా అడ్డుకుంటామని హెచ్చరించారు.

రాష్ట్రాల ఆదాయాలు క్షీణించకుండా చూడాలి

వాటాకు తగినట్టు దక్షిణాది రాష్ట్రాలకు నిధులివ్వాలి.. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

న్యూఢిల్లీ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): దేశ భవిష్యత్తుకు రాష్ట్రాలే పట్టుగొమ్మలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్రాల ఆదాయాలు క్షీణించకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. జీఎస్టీ పన్ను శ్లాబుల సవరణ, పన్ను రేట్ల మార్పులపై సిఫారసుల కోసం ఏర్పాటు చేసిన మంత్రుల బృందం గురువారం ఢిల్లీలో సమావేశమైంది. ఈ సమావేశానికి ప్రత్యేక ఆహ్వానితుడిగా హాజరైన భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. జీఎస్టీ ప్రవేశపెట్టిన సమయంలో రాష్ట్రాల వార్షిక వృద్ధి రేటు 14 శాతంగా ఉండడంతో, వార్షికంగా 14% వృద్ధి కలుగుతుందని కేంద్రం హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. వృద్ధి రేటులో లోటును పూరించడానికి, రాష్ట్రాలు స్థిరంగా 14% వృద్ధిని సాధించేందుకు, మొదటి ఐదు సంవత్సరాలపాటు జీఎస్టీ పరిహారం అందించే విధానం అమలులోకి వచ్చిందని పేర్కొన్నారు. అయితే, ఇప్పటి వరకు 14% వృద్ధి స్థిరపడలేదని, ప్రస్తుతం రాష్ట్రాల వార్షిక వృద్ధి కేవలం 8 నుంచి 9% మధ్యలోనే ఉందని తెలిపారు. జీఎస్టీ రేట్ల సరళీకరణ, పన్ను భారం తగ్గించడం ఆహ్వానించతగినదే అయినప్పటికీ, రాష్ట్రాల ఆదాయాలు క్షీణించకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో పేద, మధ్య తరగతి ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, రాష్ట్ర ప్రజల కోసం చేపడుతున్న మౌలిక వసతుల ప్రాజెక్టులు దెబ్బతింటాయని హెచ్చరించారు. అలాగే, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు వంటి దక్షిణాది రాష్ట్రాలు దేశ ఆదాయానికి గణనీయంగా సహకరిస్తున్నాయని, కానీ జాతీయ ఆదాయంలో వాటి వాటాకు తగిన విధంగా నిధుల పంపిణీ జరగడం లేదని పేర్కొన్నారు. వాటాకు తగిన విధంగా నిధులివ్వాలని కోరారు. పన్ను హేతుబద్ధీకరణ ప్రతిపాదనకు మద్దతు తెలిపితే.. దానికి సరైన పరిహారం ఉండాలన్నారు. అందుకు, ప్రస్తుతం అమలులో ఉన్న పరిహార సెస్సు విధానాన్ని కొనసాగించి, దానివల్ల సమకూరే మొత్తాన్ని పూర్తిగా ఆయా రాష్ట్రాలకు ఇవ్వాలని ప్రతిపాదించారు. లేకపోతే, పరిహార సెస్సును రద్దు చేసి, సిగరెట్లు, మద్యం, విలాస వస్తువుల వంటి 'సిన్' లేదా లగ్జరీ ఉత్పత్తులపై జీఎస్టీ రేట్లను ప్రస్తుత స్థాయికి పెంచి, అదనంగా లభించే ఆదాయాన్ని రాష్ట్రాలకు కేటాయించాలని సూచించారు.తెలంగాణలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లకు ఆర్థికసాయం అందించాలని నిర్మలా సీతారామన్‌కు భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు. గురువారం పార్లమెంట్‌లో కేంద్రమంత్రిని ఆమె కార్యాలయంలో భట్టి కలిశారు.


కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలను కలిసిన డిప్యూటీ సీఎం భట్టి, ఎంపీలు మల్లు రవి, బలరాం నాయక్, రఘురాంరెడ్డి

486 మందికి నేడు నియామక పత్రాలు

హైదరాబాద్: యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ భూసేకరణలో నిర్వాసితులైన కుటుంబాల్లోని 335 మందితోపాటు కారుణ్య నియామకాల కింద 151 మందికి జెన్‌కోలో ఉద్యోగాలు ఇవ్వనున్నారు. డిప్యూటీ సీఎం భట్టి శుక్రవారం వారికి నియామక పత్రాలు అందించనున్నారు.

కేటీఆర్‌ను మద్దతు ఎవరడిగారు?

(మొదటిపేజీ తరువాయి)

అభ్యర్థికే ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో బీఆర్ఎస్ మద్దతిస్తుందన్న కేటీఆర్ వ్యాఖ్యలను ప్రస్తావించగా.. "మాకు కేటీఆర్ మద్దతు అవసరం లేదు. అసలు కేటీఆర్‌ను ఎవరు అడిగారు? రైతుల పట్ల కేటీఆర్‌కే ప్రేమంతా ఉన్నట్టు మాట్లాడితే ఏట్లా? ఆయనకు ఏం ఉంది? కేంద్రంలో ఉన్నాడా? రాష్ట్రంలో ఉన్నాడా? అయనకేంది ఉలుకుపలుకు?" అని కిషన్‌రెడ్డి మండిపడ్డారు. ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో అన్ని పార్టీల తరహాలోనే బీఆర్ఎస్ మద్దతు కోరుతామని.. కానీ యూరియా ఇస్తే మద్దతిస్తామంటూ చిన్నపిల్లల ఆటలా కేటీఆర్ తీరు ఉందని వ్యాఖ్యానించారు. యూరియా దిగుమతుల విషయంలో అంతర్జాతీయంగా కాస్త ఇబ్బందులు ఉన్నాయని, అయినా ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచేందుకు ప్రయత్నిస్తున్నామని కిషన్‌రెడ్డి చెప్పారు. అందరూ సహకరించాలని కోరారు. కాంగ్రెస్ హయాంలో దేశంలోని యూరియా కంపెనీలను మూసేశారని, తాము వాటిని తెరిపించి ఉత్పత్తి చేపడుతున్నామని చెప్పారు. నిజానికి రాష్ట్ర ప్రభుత్వం వద్ద యూరియా స్టాక్ పెట్టామని, అదేమైందో తెలియదని వ్యాఖ్యానించారు. తెలంగాణ మంత్రులు రోజూ యూరియా లేదంటూ మాట్లాడుతుండటంతో.. కొందరు దొరికిన చోటల్లా నిల్వ చేసుకోవడంతో కృత్రిమ కొరత ఏర్పడిందని పేర్కొన్నారు. రైతుల్లో ఆందోళన రేకెత్తించడం సరికాదని పేర్కొన్నారు. యూరియా దుర్వినియోగం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం చూడాలన్నారు. రాష్ట్రానికి వివిధ మార్గాల్లో 50వేల టన్నుల యూరియా రవాణా అవుతోందని చెప్పారు. అరెస్టయి జైల్లో ఉన్న పీఎం, సీఎం, మంత్రులను పదవీచ్యుతులను చేసే బిల్లులపై కాంగ్రెస్ వ్యవహరించిన తీరు దారుణమని పేర్కొన్నారు. గుమ్మడికాయల దొంగ అంటే భుజాలు తడుముకున్నట్టు కాంగ్రెస్ తీరు ఉందని విమర్శించారు. ఆప్ అధినేత కేజ్రీవాల్ ఆరు నెలలు జైల్లో ఉండి సీఎంగా కొనసాగారాని, ఇంత దిగజారుడు రాజకీయాలు ఎక్కడైనా ఉంటాయా?అని ప్రశ్నించారు. దొంగ ఓట్లతో అధికారంలోకి రావాలనుకునే వారికి ఇలాంటి చట్టాలు రుచించవని ఆరోపించారు. గతంలో ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా వెంకయ్యను నిలిపితే కాంగ్రెస్ పోటీగా అభ్యర్థిని నిలబెట్టిందని, అప్పుడు తెలుగు గౌరవం గుర్తురాలేదా? అని రేవంత్‌ను ప్రశ్నించారు.

తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్.. థర్డ్ క్లాస్ పార్టీనా?

సోనియాతో ఫొటో మరిచావా?..కేటీఆర్‌పై కోమటిరెడ్డి ధ్వజం

కేటీఆర్ మైండ్ ఖరాబైంది : మంత్రి సీతక్క

రాజ్యాంగ పరిరక్షకుడిగా ఉంటారనే సుదర్శన్‌రెడ్డి ఎంపిక

కరీంనగర్/హుస్నాబాద్/హైదరాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ నీకు థర్డ్ గ్రేడ్ పార్టీనా? అంటూ కేటీఆర్‌పై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఫైరయ్యారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన కాంగ్రెస్ పార్టీపై విమర్శలు చేయటం కేటీఆర్ అహంకారానికి నిదర్శనమన్నారు. ఢిల్లీకి పోయి సోనియాగాంధీతో గ్రూప్ ఫొటో దిగన విషయాన్ని మరిచిపోయావా? అని నిలదీశారు. ఇప్పటికైనా అహంకారం తగ్గించుకోవాలని సూచించారు. తెలంగాణ బిడ్డ సుదర్శన్‌రెడ్డి ఉపరాష్ట్రపతి అవ్వడం బీఆర్ఎస్‌కు ఇష్టం లేదంటే.. వారి తెలంగాణవాదంపై సందేహాలు తలెత్తుతున్నాయన్నారు. జగదీశ్‌రెడ్డి గురించి మాట్లాడి తన స్థాయిని తగ్గించుకోనని కోమటిరెడ్డి పేర్కొన్నారు. సొంత చెల్లెలే తనని వ్యతిరేకిస్తుండడంతో కేటీఆర్ మైండ్ ఖరాబైందని మంత్రి సీతక్క ఎద్దేవా చేశారు. సీఎంను, ప్రభుత్వాన్ని నోటికొచ్చినట్లు విమర్శించడం తగదని, థర్డ్‌క్లాస్ అంటే తాను చేసిన అవినీతా ? తనకున్న అహంకారమా? కేటీఆరే చెప్పాలన్నారు. ప్రభుత్వంపై విమర్శలు చేయడం కాదని, తన ఫోన్ ట్యాప్ చేసి సొంత పార్టీ నేతలే తనను వేధిస్తున్నారంటూ కవిత రాసిన లేఖకు కేటీఆర్ ముందు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ బీజేపీకి మద్దతు ఇస్తుందనే విషయాన్ని కేటీఆర్ దాచలేకపోయారని, డొంకతిరుగుడు మాటలాపి బీజేపీకి మద్దతిచ్చే ఉద్దేశాన్ని ప్రకటించాలన్నారు. న్యాయ కోవిదుడు రాజ్యసభ చైర్మన్ అయితే రాజ్యాంగ పరిరక్షకుడిగా ఉంటారనే ఉద్దేశంతోనే ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని ఎంపిక చేసిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గోడ మీద ఉన్న బీఆర్ఎస్ ఈ ఎన్నికల్లో బీజేపీ వెంట వెళ్తుందా? తెలంగాణ బిడ్డను ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా నిలిపిన ఇండియా కూటమి వెంట వస్తుందా.. అన్నది వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు.

మార్వాడీ, అగర్వాల్‌లకు రక్షణ కల్పించండి

- విద్వేష ప్రసంగాలు, ఘటనలపై చర్యలు తీసుకోండి
- డీజీపీకి అగర్వాల్ సమాజ్ ప్రతినిధుల వినతి

హైదరాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): అమన్‌గల్‌లో మార్వాడీ సమాజంపై విద్వేష ప్రసంగాలు, రెచ్చగొట్టే ఘటనలపై తక్షణమే పోలీసు శాఖ చర్యలు తీసుకోవాలని డీజీపీ జితేందర్‌ను తెలంగాణ అగర్వాల్ సమాజ్ అధ్యక్షుడు అనిరుధ్ గుప్తా కోరారు. మార్వాడీ జనాభా అధికంగా ఉన్న ప్రాంతాల్లో పెట్రోలింగ్ పెంచి, రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని అగర్వాల్, మార్వాడీ సమాజానికి ప్రాతినిధ్యం వహిస్తున్న అగర్వాల్ సమాజ్ ప్రతినిధులు గురువారం డీజీపీని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఇటీవల తమ సమాజంలోని సభ్యులను లక్ష్యం చేసుకుని కొన్ని విద్వేషపూరిత ఘటనలు జరిగిన విషయాన్ని ఆయన డీజీపీ దృష్టికి తీసుకొచ్చారు. సికింద్రాబాద్ మోండా మార్కెట్‌లో కొంతమంది మార్వాడీ గోబ్యాక్ అంటూ రెచ్చగొట్టే నినాదాలు చేశారని, అమన్‌గల్‌లోనూ అదే విధంగా జరిగిందని, ఇక్కడ వీడియోలను వైరల్ చేస్తూ ఆందోళన కలిగిస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి శక్తులను శిక్షించకుండా వదిలివేస్తే దేశీయ, అంతర్జాతీయ పెట్టుబడిదారులకు ప్రతికూల సందేశం వెళ్తుందన్న విషయాన్ని గమనించాలని కోరారు. రెచ్చగొట్టే కంటెంట్‌ను సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల నుంచి తక్షణమే తొలగించాలని కోరారు.

నాపై దాడికి మార్వాడీలకు సంబంధం లేదు

- సికింద్రాబాద్ పాట్ మార్కెట్ ఘటన బాధితుడు సాయి

రెజిమెంటల్ బజార్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 'మార్వాడీ గో బ్యాక్' ఉద్యమం తీవ్రమవ్వడానికి కారణమైన సికింద్రాబాద్ పాట్ మార్కెట్ దాడి ఘటనలో బాధితుడు సాయి గురువారం మీడియా ముందుకు వచ్చారు. తనపై జరిగిన దాడికి మార్వాడీలకు ఎలాంటి సంబంధం లేదని, స్పష్టం చేశారు. సికింద్రాబాద్ పాట్ మార్కెట్‌లో సాయిపై జరిగిన దాడి అంశం సోషల్ మీడియాలో వైరలైన సంగతి తెలిసిందే. ఈ దాడిని ఖండిస్తూ వివిధ సంఘాలు మార్వాడీలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మార్వాడీ అసోసియేషన్ సభ్యులతో కలిసి సాయి గురువారం విలేకరులతో మాట్లాడారు. జూలై 31న పాట్‌మార్కెట్‌లో జరిగిన గొడవ తనకు, ఎస్‌కే జువెలరీకి మధ్య మాత్రమేనని స్పష్టం చేశారు. ఈ గొడవతో మార్వాడీలకు ఎలాంటి సంబంధం లేదని, దాడి జరిగిన రోజు తనని ఆస్పత్రికి తరలించి మార్వాడీ సమాజం తనకు అండగా నిలిచిందని తెలిపారు. రోడ్డు మీద వాహనం అడ్డంగా ఉండడంతో హారన్ కొట్టగా.. ఎస్‌కే జువెలరీ యజమాని అల్లుడు అభిషేక్‌తో జరిగిన గొడవ అట్రాసిటీ కేసు వరకు వెళ్లిందని చెప్పారు. గొడవ జరుగుతుండగా బయటకు వచ్చిన ఎస్‌కే జువెలరి యజమాని తనపై దాడి చేశారని వివరించారు. ఈ విషయమై మార్కెట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని, దానిని వెనక్కి తీసుకునేది లేదని స్పష్టంచేశారు. పాట్ మార్కెట్ జువెలరీ అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్ శర్మల్‌జైన్ మాట్లాడుతూ ఈ గొడవకు అసోషియేషన్‌కు సంబంధం లేదన్నారు.

నేడు తెలంగాణ బంద్‌కు ఓయూ జేఏసీ పిలుపు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మార్వాడీల ఆగడాలు ఎక్కువ అవుతున్నాయని ఆరోపిస్తూ శుక్రవారం తెలంగాణ బంద్‌కు ఓయూ జేఏసీ పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా టీఎస్ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి, వైస్ చైర్మన్ సాగబోయిన పాపారావు తదితరులు గో బ్యాక్ మార్వాడీ, గో బ్యాక్ రాజస్థానీ, గో బ్యాక్ గుజరాతి అని నినదించారు. సికింద్రాబాద్ మోండా మార్కెట్‌లో దళితుడైన సాయికుమార్‌పై దాడిని వారు ఖండించారు.

రైతుల పిల్లలకు25%.. రైతు కూలీల పిల్లలకు 15%!

- అగ్రికల్చర్ బీఎస్సీ సీట్ల కోటాలో మార్పులు

హైదరాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఆచార్య జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు డిగ్రీ కోర్సుల సీట్ల కేటాయింపుల్లో అధికారులు కొన్ని మార్పులు చేశారు. గతంలో రైతు కుటుంబాలకు చెందిన పిల్లలకు ఉన్న 40 శాతం ప్రత్యేక కోటాను విభజించారు. ఇప్పుడు రైతుల పిల్లలకు 25 శాతం, రైతు కూలీల పిల్లలకు 15 శాతం కోటాను కేటాయించారు. ఈ విద్యా సంవత్సరం నుంచే ఈ నిబంధనను అమలుచేస్తూ అడ్మిషన్లు ఇస్తున్నారు. గతంలో ఉన్న నిబంధన ప్రకారం బీఎస్సీ (అగ్రికల్చర్), బీఎస్సీ (ఫుడ్ టెక్నాలజీ) కోర్సుల్లో ఉన్న మొత్తం సీట్లలో 40శాతం సీట్లను రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రాతిపాదికన రైతు కుటుంబాలకు ఇచ్చేవారు. ప్రస్తుతం రైతు కుటుంబాలకు కేటాయించిన 25 శాతం కోటాలో, వ్యవసాయ కూలీలకు కేటాయించిన 15 శాతం కోటాలో కూడా రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను పాటిస్తారు. ఈ కోటాలో సీట్లు పొందే విద్యార్థులు 4-12వ తరగతి వరకు కనీసం నాలుగేళ్లు గ్రామీణ ప్రాంతాల్లో చదివి ఉండాలనే నిబంధన పెట్టారు.

ఐటీబీపీ జవాన్లూ.. మీ త్యాగాలు సజీవం

- కేంద్ర మంత్రి బండి సంజయ్
- అరుణాచల్ సీఎం ఖండూతో భేటీ



హైదరాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): 'ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ) జవాన్ల ధైర్య సాహసాలు మరువలేం. వారి కష్టాలను విస్మరించలేం' అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. దేశాన్ని కంటికి రెప్పలా కాపాడుకునే జవాన్లకు గౌరవ మర్యాదలతోపాటు సౌకర్యాలతో జీవించేందుకు కేంద్రం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈశాన్య రాష్ట్రాల పర్యటనలో భాగంగా సంజయ్.. గురువారం అరుణాచల్ ప్రదేశ్ రాజధాని ఇటానగర్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆ రాష్ట్ర సీఎం పెమాఖండూతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఖండూకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. అక్కడి నుండి నేరుగా పపుంపుర జిల్లాలోని యుపియా గ్రామం వద్దనున్న ఐటీబీపీ 31వ బెటాలియన్ హెడ్‌క్వార్టర్స్‌ను సందర్శించారు. తొలుత అమరవీరుల ఘాట్ వద్ద పూలమాల వేసి వీరమరణం పొందిన ఐటీబీపీ జవాన్లకు నివాళి అర్పించారు. అనంతరం 31వ బటాలియన్ ఐటీబీపీకి సంబంధించి కొత్తగా నిర్మించిన పరిపాలన భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంజయ్ ప్రసంగించారు.

సర్కారు నిర్లక్ష్యం వల్లే గ్రామీణ రోడ్లు అధ్వానం

- 'పల్లె పల్లెకు బీజేపీ'లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

చేవెళ్ల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే గ్రామీణ రోడ్లు ధ్వంసమై నిత్యం రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ఆరోపించారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం చన్వెల్లి గ్రామంలో గురువారం 'పల్లె పల్లెకు బీజేపీ (ప్రవాస యోజన) కార్యక్రమాన్ని ప్రారంభించిన రాంచందర్‌రావు రైతులతో ముఖాముఖీ నిర్వహించారు. ఖానాపూర్ గేట్ వద్ద జరిగిన యువ సమ్మేళనం కార్యక్రమంలో పాల్గొన్నారు. అదే గ్రామ దళిత రైతు ఇంట్లో భోజనం చేసి బస చేశారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ.. ప్రధానమంత్రి సడక్ యోజన కింద దేశవ్యాప్తంగా ప్రతి గ్రామానికి పక్కా రోడ్ల నిర్మాణానికి కేంద్రం రూ.60 వేల కోట్ల నిధులు కేటాయించిందన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలు, రైతులకు కేంద్ర సంక్షేమ పథకాలు చేరవేస్తే కేంద్రానికి పేరొస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం ఆయా పథకాలను ప్రజల దరి చేరనివ్వడం లేదన్నారు. సాగునీటి విషయమై ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు పేరుతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం అరచేతిలో వైకుంఠం చూపి మరిచిపోయిందని రాంచందర్‌రావు ఆరోపించారు. ఇక తెలంగాణలోని కాంగ్రెస్ సర్కారు ప్రజలకు హామీ ఇచ్చిందే తప్ప అమలు చేయట్లేదన్నారు.

ఏఐతో 'స్మార్ట్'గా ఇంటర్ విద్య!

చాట్‌జీపీటీ, జెమిని, కోపైలట్ వంటి కృత్రిమ మేధ యాప్స్‌తో బోధన

- ప్రత్యేకంగా పాఠ్యాంశాల రూపకల్పన
- వీటిపై అవగాహన ఉన్న లెక్చరర్లతో 'ఏఐ చాంపియన్స్'
- అన్ని ప్రభుత్వ కాలేజీల్లో స్మార్ట్ బోర్డులు
- విద్యార్థులకు ముఖ గుర్తింపు హాజరు
- రేపటి నుంచే అన్ని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో అమలు



ఏఐ చాంప్స్ సమావేశంలో విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా

హైదరాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా కృత్రిమ మేధ యుగం మొదలైన నేపథ్యంలో.. ఇంటర్మీడియట్ విద్యలో కృత్రిమ మేధ పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని రాష్ట్ర ఇంటర్ బోర్డు నిర్ణయించింది. విద్యలో నాణ్యత పెంపు, విద్యార్థుల్లో నైపుణ్యాల అభివృద్ధి, సరికొత్త సాంకేతికతల పరిచయం కోసం ఏఐని వినియోగించేందుకు సిద్ధమైంది. రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ కాలేజీల్లో కృత్రిమ మేధ సాంకేతికతపై పట్టున్న బోధనా సిబ్బందిని గుర్తించిన ఇంటర్ బోర్డు.. వారిని 'ఏఐ చాంపియన్స్' ఎంపిక చేసింది. ఈ ఏఐ చాంపియన్స్‌తోపాటు జిల్లా విద్యా పర్యవేక్షణ అధికారులందరికీ గురువారం ఇంటర్ బోర్డు కార్యాలయంలో ఏఐ వినియోగంపై ఒకరోజు రాష్ట్రస్థాయి శిక్షణ శిబిరం నిర్వహించింది. ప్రభుత్వ కాలేజీల్లో ఏఐ పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవడంపై విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, ఇంటర్ విద్య కార్యదర్శి కృష్ణ ఆదిత్య దిశానిర్దేశం చేశారు.

రేపటినుంచి ఏఐ ఆధారిత హాజరు..

ప్రస్తుతం ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో విద్యార్థుల హాజరును రిజిస్టర్‌లో నమోదు చేస్తుండగా.. శనివారం (ఈ నెల 23) నుంచి ఏఐ ఆధారిత ముఖ గుర్తింపు (ఫేషియల్ రికగ్నిషన్ సిస్టం - ఎఫ్ఆర్ఎస్) హాజరును అమల్లోకి తెస్తున్నారు. ఇందు కోసం సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ) సాంకేతిక సహకారంతో.. 'టీజీబీఐఈ-ఎఫ్ఆర్ఎస్' యాప్‌ను ఇప్పటికే సిద్ధం చేశారు. రోజూ ఉదయం, మధ్యాహ్నం కాలేజీ సిబ్బంది తమ ఫోన్లతో విద్యార్థుల హాజరును నమోదుచేస్తారు. ఇప్పటికే కాలేజీల్లో చేరిన విద్యార్థుల ముఖ హాజరు రిజిస్ట్రేషన్ ప్రక్రియను శుక్రవారం చేపట్టనున్నారు. విద్యార్థి హాజరుకాకుంటే.. వారి తల్లిదండ్రుల ఫోన్‌కు సందేశం వెళ్తుంది. ప్రతిరోజు విద్యార్థుల హాజరును జిల్లా, రాష్ట్రస్థాయి అధికారులు పర్యవేక్షించనున్నారు. సాధారణంగా తరగతులకు గైర్హాజరవడమే ఇంటర్ పరీక్షల్లో ఎక్కువ మంది ఫెయిలవడానికి కారణమని, ఎఫ్ఆర్ఎస్ హాజరుతో విద్యార్థులపై పర్యవేక్షణ సులభం అవుతుందని అధికారులు తెలిపారు. తరచూ గైర్హాజరయ్యే విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రిన్సిపాళ్లు ప్రతినెలా మాట్లాడనున్నారు. అలాంటి విద్యార్థులకు అదనపు తరగతులు చెప్పే ఆలోచన కూడా ఉన్నట్టు తెలిసింది.

కృత్రిమ మేధతో బోధన

పుస్తకాల్లో ఉన్న పాఠాలు చదువుకుంటూ పోవడం కాకుండా.. విద్యార్థులకు బాగా అర్థమయ్యేలా, ఆకట్టుకునేలా బోధించడంపై అధికారులు దృష్టి సారించారు. దీనిపై గురువారం శిక్షణలో జిల్లా ప్రతినిధులకు అవగాహన కల్పించారు. జిల్లా ప్రతినిధులు అన్ని కాలేజీల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులకు శిక్షణ ఇస్తారు. చాట్‌జీపీటీ, గూగుల్ జెమిని, మైక్రోసాఫ్ట్ కోపైలట్ వంటి ఏఐ యాప్స్ సహాయంతో 'స్మార్ట్' బోధన చేపట్టనున్నారు. ఇందుకోసం పాఠ్యాంశాల వారీగా పీడీఎఫ్, పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఫైళ్లను రూపొందిస్తున్నారు. వీటితో బోధనకు వీలుగా తరగతి గదుల్లో స్మార్ట్ బోర్డులు ఏర్పాటు చేయనున్నారు. మరో ఆరు వారాల్లో అన్ని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో స్మార్ట్ బోర్డులు ఏర్పాటు చేస్తామని ఇంటర్ విద్య కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలిపారు. ఏఐ పరిజ్ఞానంతో సానుకూల ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నట్టు చెప్పారు.

ఇంట్లో ఐదుగురి అనుమానాస్పద మృతి

(మొదటిపేజీ తరువాయి)

ఒకే ఇంట్లో ఉన్నారు. మొదటి కూతురు లక్ష్మి, మూడో కూతురు సవిత తమ భర్త, పిల్లలతో కలిసి మియాపూర్, లింగంపల్లిలో వేరుగా ఉంటున్నారు. లక్షప్ప సమీపంలోని ఓ పాఠశాలలో వాచ్‌మన్‌గా, అదే పాఠశాలలో వెంకటమ్మ ఆయాగా పనిచేస్తున్నారు. లక్షప్ప కాలికి గాయమవ్వడంతో కొన్నిరోజులుగా ఇంట్లోనే ఉంటున్నాడు. బుధవారం రాత్రి 9గంటలకు పెద్ద కుమార్తె లక్ష్మి.. తాను ఇంటివద్ద తయారు చేసుకున్న గుంత పొంగునాలు తీసుకొచ్చింది. అవి ఇంట్లోని ఐదుగురు తిన్నాకే ఆమె వెళ్లిపోయింది. రాత్రి 10 గంటలకు లక్ష్మికి తల్లి వెంకటమ్మ ఫోన్ చేసి.. తనకు కళ్లు తిరుగుతున్నాయని చెప్పినట్లు సమాచారం. లక్ష్మి వచ్చేసరికి వెంకటమ్మ వాంతులు చేసుకొని పడుకుంది. అదేరాత్రి లక్ష్మి తన ఇంటికి వెళ్లిపోయింది. గురువారం ఉదయం ఇంట్లోంచి ఎవ్వరూ బయటకు రాకపోవడంతో స్థానికులు కిటికీలోంచి చూడగా అంతా అచేతనంగా పడి ఉన్నారు. తలుపులు బద్దలు కొట్టి వెళ్లి పరిశీలించగా అప్పటికే లక్షప్ప, వెంకటమ్మ, కవిత, అనిల్, యువాన్ష్ చనిపోయారు. లక్ష్మి, సవిత ప్రేమ వివాహం చేసుకోవడం.. రెండో కూతురైన కవిత పెద్దలు కుదిర్చిన సంబంధం చేసుకోవడంతో తమ పేరిట ఉన్న రెండు ఎకరాల భూమిని కుమారుడైన భగవత్‌కు, కుమార్తె కవితకే రాసి ఇస్తామని తల్లిదండ్రులు తరచూ చెప్పేవారని తెలుస్తోంది. ఆస్తి కోసమే లక్ష్మి ఈ ఘాతుకానికి పాల్పడిందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

తాతను ఏం 'మాయ' చేశావే!

- 81 ఏళ్ల వృద్ధుడిపై వలపువల
- 7.11 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కు చెందిన ఓ 81 ఏళ్ల వృద్ధుడు సైబర్ నేరగాళ్లు వేసిన వలపు వల 'మాయ'లో పడి రూ.7.11 లక్షలు పోగొట్టుకున్నాడు. గుర్తు తెలియని నంబర్ నుంచి వాట్సాప్ కాల్ చేసి తన పేరు మాయ అని పరిచయం చేసుకున్న యువతి తియ్యటి మాటలకు బోల్తా పడి జేబులు ఖాళీ చేసుకున్నాడు. ఇందుకు సంబంధించి హైదరాబాద్ సిటీ సైబర్ క్రైమ్ డీసీపీ ధార కవిత తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌లోని అమీర్‌పేటకు చెందిన వృద్ధుడి(81) వాట్సాప్‌కు జూన్ మొదటి వారంలో గుర్తు తెలియని నంబర్ నుంచి కాల్, మెసేజ్‌లు వచ్చాయి. వృద్ధుడు ఆ కాల్‌కు స్పందించగా.. అవతలి వైపు ఓ అమ్మాయి మాట్లాడింది. మృదువైన గొంతు, తియ్యటి మాటలతో వృద్ధుడిని ఆకట్టుకుంది. తన పేరు మాయా రాజ్‌పుత్ అని పరిచయం చేసుకున్న ఆ యువతి.. ప్రేమగా మాట్లాడుతూ వృద్ధుడిని తన మాయలో పడేసింది. కొద్దిరోజుల తర్వాత తన కష్టాలు చెప్పుకుని బాధపడుతూ వృద్ధుడిని ఆర్థిక సాయం అడగడం ప్రారంభించింది. ఆస్పత్రి ఖర్చులు, తనఖా పెట్టిన ఆభరణాలు విడిపించడం, ప్లాట్ రిజిస్ట్రేషన్, గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు కొనుగోలు ఇలా రకరకాల కారణాలు చెప్పి వృద్ధుడి నుంచి విడతల వారీగా రూ.7.11 లక్షలు తీసుకుంది. వృద్ధుడు ఆ డబ్బులు తిరిగి వసూలు చేసే ప్రయత్నం చేయగా.. 'మాయ రాజ్‌పుత్' మాయమైపోయింది. దీంతో మోసపోయానని ఆలస్యంగా గ్రహించిన బాధిత వృద్ధుడు పోలీసులను ఆశ్రయించాడు. కేసు దర్యాప్తులో ఉంది.

880 మంది హెచ్‌ఎంలకు పదోన్నతులు పూర్తి

హైదరాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖలో 880 మంది గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ పూర్తయింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ గురువారం ఉత్తర్వులు జారీచేసింది. అయితే పదోన్నతుల అనంతరం ఏర్పడ్డ ఖాళీల భర్తీకి గురువారం షెడ్యూల్ విడుదల చేశారు. ఇందులో 2,324 స్కూల్ అసిస్టెంట్ పోస్టులుండగా, 640 ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులున్నారు. సీనియార్టీ ఆధారంగా ఈ పోస్టుల భర్తీ ప్రక్రియ ఈనెల 26లోగా పూర్తిచేయనున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.